ఈనాడు

విజయవాడ 25-8-2025 సోమవారం సిటీ సంపుటి 52 . సంచిక 16

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఒడిశా తీరంలో దేశ తొలి సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ పరీక్ష

మన గగనతలం శత్రు దుర్భేద్యం!


సమీకృత రక్షణ వ్యవస్థ పరీక్ష విజయవంతం

దిల్లీ: భారత గగనతలానికి దుర్భేద్య కవచాన్ని ఏర్పాటు చేసే దిశగా ముందడుగు పడింది. దేశ తొలి సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ (ఐఏడీడబ్ల్యూఎస్) పరీక్ష విజయవంతమైంది. శనివారం మధ్యాహ్నం ఒడిశా తీరానికి చేరువలో ఇది జరిగినట్లు రక్షణశాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది.

ఏమిటీ ఏఐడీడబ్ల్యూఎస్?

ఇది శత్రు క్షిపణులు, యుద్ధవిమానాలు, డ్రోన్ల నుంచి రక్షణ కల్పించే బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థ. ఇందులో మూడు భిన్న ఆయుధాలు ఉన్నాయి.

ఉపరితలం నుంచి గగనతలంలోకి వేగంగా దూసుకెళ్లే క్షిపణి (క్యూఆర్‌శామ్): ఇది 3-30 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదు. ఇందులో పూర్తిగా ఆటోమేటెడ్ ఆదేశిక, నియంత్రణ వ్యవస్థ, రెండు రాడార్లు, ఒక లాంచర్ ఉంటాయి. (మిగతా 2లో)



మొదటి మెట్టుపై సగర్వంగా..

గగన్‌యాన్ ఎయిర్ డ్రాప్ పరీక్ష ఫలవంతం

న్యూస్‌టుడే - శ్రీహరికోట

గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా వ్యోమగాములను సురక్షితంగా తీసుకొచ్చే పారాచూట్ వ్యవస్థను పరీక్షించడానికి ఇస్రో చేపట్టిన మొదటి సమీకృత ఎయిర్‌డ్రాప్ పరీక్ష (ఐఏడీటీ-1) విజయవంతమైంది. శ్రీహరికోటలోని షార్ నుంచి సుమారు 5 టన్నుల బరువున్న డమ్మీ క్రూ మాడ్యూల్‌ను చినూక్ హెలికాప్టర్ ద్వారా ఆదివారం గగనతలంలోకి తీసుకెళ్లారు. తీరానికి 35 కి.మీ. దూరంలో మూడు కి.మీ. ఎత్తు నుంచి సముద్రంలో జారవిడిచారు. తొలుత మాడ్యూల్‌కు అమర్చిన రెండు డ్రోగ్ పారాచూట్లు విచ్చుకుని వేగాన్ని నియంత్రించగా.. ఆ తర్వాత పైలట్ చూట్లు, మరో మూడు ప్రధాన పారాచూట్లు (మిగతా 2లో)

ఆటకు పుజారా టాటా



భారత క్రికెట్లో ఓ గొప్ప ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఆట నుంచి రిటైరవుతున్నట్లు సీనియర్ బ్యాటర్ చెతేశ్వర్ పుజారా ఆదివారం ప్రకటించాడు. అతడు దశాబ్ద కాలానికి పైగా మూడో స్థానంలో భారత్‌కు నమ్మదగ్గ బ్యాటర్‌గా ఉన్నాడు. స్వదేశంలో, విదేశాల్లో టీమ్‌ఇండియా సాధించిన కొన్ని ముఖ్యమైన టెస్టు విజయాల్లో పుజారా కీలక పాత్ర పోషించాడు. 37 ఏళ్ల పుజారా.. తన కెరీర్‌లో 103 టెస్టుల్లో 43.60 సగటుతో 7,195 పరుగులు చేశాడు. అతడు 5 వన్డే మ్యాచ్‌లు కూడా ఆడాడు.

వివరాలు ఛాంపియన్ లో..



దారి మళ్లించినా.. ధరలు పెంచినా కేసులే



యూరియా కోసం రైతులెక్కడా ఇబ్బంది పడకూడదు

ఎరువులపై విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలి

మార్క్‌ఫెడ్‌కు 70% కేటాయింపులు

పీఏసీఎస్, ఆర్ఎస్‌కేల్లో సరిపడా నిల్వలుంచాలి: సీఎం చంద్రబాబు

> దుకాణాలు, పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లు, ఆర్ఎస్‌కేలు సహా ఎక్కడా యూరియా కోసం రైతులు పడిగాపులు పడే పరిస్థితి ఉండకూడదు.
>
> సరఫరాలో పొరపాట్లు ఉంటే సరిచేసుకోవాలి. యూరియా లభ్యతపై ఎక్కడైనా ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తుంటే తిప్పికొట్టాలి. అలాంటి వారెవరో పసిగట్టి సరైన రీతిలో సమాధానం చెప్పాలి.
>
> \- చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఎరువులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని.. విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. 'నల్లబజారుకు ఎరువులు తరలించే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయాలి. ధరలు పెంచి అమ్మేవారిపైనా కేసులు నమోదుచేయాలి. యూరియా కోసం రైతులు ఇబ్బంది పడకూడదు. ఎక్కువగా ఎరువులు విక్రయించే రిటైల్ వ్యాపారుల్లో.. తరచూ కొనుగోలు చేసేవారు ఉన్నట్లు గుర్తిస్తే వారిపై విచారణ చేయండి. యూరియా, ఇతర ఎరువుల నిల్వలు తనిఖీ చేయాలి. వాటి లభ్యతపై రైతులకు పూర్తిస్థాయి సమాచారాన్ని అందుబాటులో ఉంచాలి' అని స్పష్టంచేశారు. ఎరువుల లభ్యత, సరఫరాపై ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో పాటు వ్యవసాయశాఖ, విజిలెన్స్ విభాగాల అధికారులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఎరువుల సరఫరాపై ఆయన ఆరా తీశారు. అవసరానికి తగినంత యూరియా అందుబాటులో (మిగతా 2లో)

ఆంధ్రా రండి.. ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టండి
ఆనంద్ మహీంద్రాను ఆహ్వానించిన చంద్రబాబు 2లో



అఖిల భారత స్పీకర్ల సదస్సులో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ తొలి సభాపతి విఠల్‌భాయ్ పటేల్ స్మారక తపాలా బిళ్లలను ఆవిష్కరిస్తున్న కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్రమంత్రి కిరణ్ రిజిజు, దిల్లీ సీఎం రేఖా గుప్తా, దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, స్పీకర్ విజేందర్ గుప్తా

వాదోపవాదాలు ఉండాలి

- లేకపోతే చట్టసభలు జీవం లేని రాతి భవనాలే
- సంయమనంతో విభేదించాలి
- అడ్డంకులు సృష్టించకూడదు
- స్పీకర్ల సదస్సులో అమిత్ షా వ్యాఖ్యలు

ఈనాడు, దిల్లీ: చట్టసభల్లో వాదోపవాదాలుండాలని, అవి లేకపోతే సభలు జీవంలేని రాతి భవనాలుగా మిగిలిపోతాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభిప్రాయపడ్డారు. సభాధ్యక్షుడి ముందు భావ వ్యక్తీకరణ అధికారం అన్ని పార్టీల సభ్యులకు ఉంటుందని, అప్పుడే సభ సజీవ సౌధంగా నిలుస్తుందని పేర్కొన్నారు. 'వాదోపవాదాలు ప్రజా ప్రయోజనాల దృష్టితో జరగాలి తప్పితే రాజకీయ పార్టీల కోసం కాకూడదు. విభేదించడమూ సంయమనంతో ఉండాలి. అది ప్రతీకారాత్మకంగా ఉండకూడదు. విభేదిస్తున్నామనే పేరుతో రోజుల తరబడి, మొత్తం సమావేశాలు ముగిసేంత వరకూ సభలను అడ్డుకునే విధానంపై ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆలోచించాలి' అని స్పష్టం చేశారు. బ్రిటిష్ ఇండియాలో దిగువ సభగా వ్యవహరించిన సెంట్రల్ (మిగతా 2లో)

చట్టసభలను ఏటా 60 రోజులైనా నిర్వహించాలి
ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు 2లో

అరుణ ఫోన్లలో అసలు గుట్టు!

- ఆడియో, వీడియో రికార్డులు, పెద్ద ఎత్తున ఫొటోలు!
- వాటి వెలికితీతకు కోర్టు అనుమతి కోరనున్న పోలీసులు
- ఆమెతో సన్నిహితంగా మెలిగిన వారిలో ఆందోళన

ఈనాడు - అమరావతి

నెల్లూరుకు చెందిన లేడీ డాన్ అరుణ నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫోన్లలో కొంతమంది ప్రభుత్వాధికారులు, ప్రజాప్రతినిధుల ఆడియో, వీడియో రికార్డులతో పాటు వందలకొద్దీ ఫొటోలు ఉండి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. ప్రధానంగా వైకాపా హయాంలో నెల్లూరు జిల్లాలో పని చేసిన ఓ ఐపీఎస్ అధికారితో ఉన్న ఫొటోలు, వీడియోలు ఆ ఫోన్లో ఉన్నట్లు అనుమానిస్తున్నారు. కస్టడీకి తీసుకున్నప్పుడు ఆమెతోనే ఈ ఫోన్‌లను తెరిపించి వాటిలోని సమాచారాన్ని వెలికితీయాలని నిర్ణయించారు. అరుణను అరెస్టు చేసినప్పుడు ఆమెవద్ద నుంచి రెండు ఖరీదైన మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కోర్టు అనుమతి తీసుకుని వాటిని తెరిపించాలని పోలీసులు నిర్ణయించారు. దీంతో ఆమెతో సన్నిహిత సంబంధాలు కొనసాగించినవారిలో ఆందోళన మొదలైంది. వాటిలో ఎవరెవరి ఫొటోలు, వీడియోలు, ఆడియోలు ఉన్నాయి? ఎవరి గుట్టు బయటపడుతుందనేవి చర్చనీయాంశంగా మారాయి.



అరుణ

ఆమె అలవాటే.. వారిని పట్టిస్తుందా?

అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉన్నత స్థాయి వ్యక్తులతో ఫోన్‌లలో మాట్లాడినప్పుడు వాయిస్ రికార్డు చేయటం, వారితో సన్నిహితంగా ఉన్నప్పుడు ఫొటోలు, వీడియోలు తీసుకోవటం అరుణకు అలవాటు. తియ్యని మాటలతో వారిని ఉచ్చులోకి దించటం.. తర్వాత అనుకున్న పనులు చేయించుకోవటం ఆమె అనుసరించిన నేరవిధానం. తనకు సహకరించకపోతే.. వారితో సన్నిహితంగా ఉన్నప్పుడు, వివిధ ప్రాంతాలకు ట్రిప్పులకు వెళ్లినప్పుడు తీసిన వీడియోలు, ఫొటోలు బయటపెడతానని బెదిరించేది. అప్పటికీ దారికి రాకపోతే వాటిని చూపి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేది. ఓ అదనపు ఎస్పీ, ఓ జైలు అధికారిపైనా ఇలాగే ఫిర్యాదులు చేసింది.

ఓ విద్యాసంస్థ ప్రిన్సిపాల్‌తో కాంటాక్ట్.. డబ్బూ అక్కడి నుంచే

అరుణకు ఎవరు వెన్నుదన్నుగా నిలిచారు? ఆమె ఎవరెవర్ని బెదిరించింది? తదితర అంశాల గుట్టు తేల్చేందుకు పోలీసులు ఆమెకు సంబంధించిన రెండేళ్ల కాల్ డీటెయిల్ రికార్డులు (సీడీఆర్) తెప్పించి విశ్లేషించారు. పలువురు (మిగతా 2లో)



కొమ్మమూరు కాలువలపై ఏర్పాటు చేయనున్న ప్రతిపాదిత సెన్సర్ పరికరాలు

ఆధునిక లస్కర్లు.. ఈ సెన్సర్లు

ఉపద్రవాలను పసిగడతాయి.. ఉపగ్రహాలకు అందిస్తాయి

వాగులు, కాలువలు, నదులపై అమరిక

పక్కాగా నీటి లెక్కలు, వరదల అంచనాకూ వీలు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, పర్చూరు: వరదలను ముందుగానే అంచనా వేసేలా జలవనరులశాఖ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంది వాగులు, కాలువలు, నదులపై ఆటోమేటెడ్ వాటర్ లెవెల్ రికార్డర్ (ఏడబ్ల్యూఎల్ఆర్) వ్యవస్థను ఏర్పాటుచేస్తోంది. ఒకప్పుడు జలవనరుల్లో నీటి లభ్యతపై లెక్కలు వేయాలన్నా, వరద ముప్పును అంచనా వేయాలన్నా (మిగతా 2లో)

నేడూ రేపూ ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

ఈనాడు, విశాఖపట్నం: వాయవ్య బంగాళాఖాతంలో ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాలకు సమీపంలో సోమవారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం పేర్కొంది. దీని ప్రభావంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వానలు పడొచ్చని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, మంగళవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో బుధ, గురువారాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

విశాఖ కేంద్రంగా ప్రకృతి వైద్య కళాశాల
రాబోయే సంవత్సరం నుంచి ప్రవేశాలు
వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ 13లో

గ్రామాలకూ త్రీ ఫేజ్ విద్యుత్
ఆర్డీఎస్ఎస్‌లో ఫీడర్ల విభజన
9.9% తగ్గనున్న సాంకేతిక నష్టాలు
ఏటా రూ.851 కోట్లు ఆదా 13లో

గర్భంతో ఉన్న భార్య దారుణ హత్య
గొంతు కోసి చంపి.. కాళ్లు, చేతులు, తల వేరుచేసి మూసీలో విసిరివేత
హైదరాబాద్‌లోని మేడిపల్లిలో ఘటన 14లో

ఇదీ సంగతి!



వీరికంటే నోబెల్ జ్యూరీని బెదిరించి శాంతి బహుమతి తెచ్చుకోవడం సులువు సార్!

చిన్నారులకు అభయం!

- సుప్రీంకోర్టు ఆదేశాలతో కుక్కల నుంచి సంరక్షణకు కార్యాచరణ
- పాఠశాలలు, అంగన్‌వాడీలు ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
- ఎంపిక చేసిన ప్రాంతాల్లోనే శునకాలకు ఇక ఆహారం సరఫరా
- పుర, నగరపాలక సంస్థలకు ప్రభుత్వం ఆదేశాలు

ఈనాడు - అమరావతి

గుంటూరు నగరానికి చెందిన నాలుగేళ్ల బాలుడు ఈ ఏడాది ఏప్రిల్ 6న వీధికుక్కల దాడిలో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మోడల్ కాలనీలో గత ఏడాది నవంబరు 11న శునకాల



గుంపు దాడిలో రెండేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. రాష్ట్రంలో ఏటా 2.50 లక్షల మంది వీటి దాడిలో గాయపడుతున్నారు. అనేకమంది మృత్యువాత పడుతున్నారు. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాలతో కుక్కల నుంచి చిన్నారుల రక్షణకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వీటి నియంత్రణ కోసం పట్టణ స్థానిక సంస్థలకు మార్గదర్శకాలు జారీచేసింది. నిర్దేశిత ప్రాంతాల్లోనే స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, దాతల ద్వారా శునకాలకు ఆహారం సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటోంది. పెంపుడు కుక్కల యజమానులూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్దేశించింది. స్టెరిలైజేషన్, రేబిస్ నియంత్రణ టీకాలు వేయించడంతోపాటు ఇందుకు రికార్డులు సైతం నిర్వహించాలని సూచించింది. రాష్ట్రంలో 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో 3.50 లక్షలకుపైగా వీధికుక్కలు ఉన్నట్లు అంచనా.

సంరక్షణ చర్యలు ఇలా....

- భవన నిర్మాణ ప్రాంతాల్లో కుక్కల నుంచి కార్మికుల పిల్లల రక్షణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.
- అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, పిల్లల సంరక్షణ కేంద్రాల వద్ద శునకాలను గుర్తించి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు (స్టెరిలైజేషన్), రేబిస్ టీకాలు విధిగా వేయించాలి.
- ఆట స్థలాలు, పిల్లల సంరక్షణ కేంద్రాల వద్ద కుక్కలకు ఆహారం (మిగతా 2లో)

ఆంధ్రా రండి.. ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టండి

- ఆనంద్ మహీంద్రాను ఆహ్వానించిన చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో అద్భుత ఆధ్యాత్మిక వారసత్వ ప్రదేశాలతో పాటు అందమైన పర్యాటక స్థలాలు ఉన్నాయని, ఇక్కడ ఆతిథ్య రంగంలో పెట్టుబడులు పెట్టాలని మహీంద్రా గ్రూప్ సంస్థల ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఏపీలోని బీచ్ గురించి ఓ ఆంగ్లపత్రికలో వచ్చిన కథనాన్ని ప్రస్తావిస్తూ ఆనంద్ మహీంద్ర చేసిన పోస్టుపై చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. [illegible] అని చంద్రబాబు పేర్కొన్నారు.

హామీ ఇచ్చా.. చేసి చూపించా: శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా, [illegible] అని 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు.

దారి మళ్లించినా.. ధరలు పెంచినా కేసులే

(మొదటి పేజీ తరువాయి)

[illegible]

మన గగనతలం శత్రు దుర్భేద్యం!

(మొదటి పేజీ తరువాయి)

[illegible]

మూడు లక్ష్యాలపైకి..

[illegible]

అరుణ ఫోన్లలో అసలు గుట్టు!

(మొదటి పేజీ తరువాయి)

[illegible] ప్రిన్సిపాలతో ఎక్కువగా కాంటాక్టులో ఉన్నట్లు వెల్లడైంది. ఆ విద్యాసంస్థ పరిపాలన అధికారి నుంచి అరుణకు తరచూ డబ్బులు వచ్చేవని దర్యాప్తులో గుర్తించారు. అరుణ ప్రియుడు.. కరడుగట్టిన నేరగాడు శ్రీకాంత్‌కు పెరోల్ మంజూరు విషయంలోనూ ఆ ప్రిన్సిపాలే పలువురు ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు ఇప్పించినట్లు పోలీసులు నిగ్గు తేల్చారు. దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అరుణకు వివిధ ప్రాంతాల నుంచి ఖరీదైన బహుమతులు అందేవి. వాటిని ఎవరు పంపించారో పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఏనుగుకో సమాధి.. 123 ఏళ్ల కథ ఇది!



ఆ ఊళ్లోవారు ఏ పని మొదలుపెట్టినా ఓ ఏనుగు బొమ్మకు దండం పెట్టి వెళ్తుంటారు. వేరే ఊళ్లకు పయనమైనా అక్కడ నమస్కరించనిదే ముందుకు కదలరు. మొక్కుకున్న వారందరికీ మంచి జరుగుతుందన్నది వారి విశ్వాసం. 123 ఏళ్లుగా ఇది కొనసాగుతోంది. ఇంతకీ ఆ ఏనుగు బొమ్మ వెనుక ఉన్న చరిత్ర ఏంటో తెలుసుకుందాం. ప్రస్తుతం నంద్యాల జిల్లాలోని అహోబిలం మఠానికి అనేకచోట్ల ఆలయాలు ఉన్నాయి. అందులో తమిళనాడు రాష్ట్రంలోని కుంభకోణం ఒకటి. రవాణా సదుపాయాల్లేని ఆ కాలంలో జియ్యర్లు, మఠాధిపతులు కుంభకోణం నుంచి కాలినడకన బయలుదేరి అహోబిలం చేరుకునేవారు. ఏనుగులు, గుర్రాలతో ప్రయాణం సాగించేవారు. అలా 1902లో అహోబిలం వస్తుండగా మఠానికి చెందిన ఏనుగు జబ్బు పడింది. ప్రస్తుత వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు మండలం గుడిపాడు వద్దకు చేరుకున్నాక ముందుకు కదల్లేక కూలబడి అక్కడే మృతిచెందింది. దీంతో మఠం నిర్వాహకులు గ్రామస్థుల సహకారంతో ఏనుగుకు అంతిమ సంస్కారాలు నిర్వహించి సమాధి నిర్మించారు. శిలావిగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి గ్రామస్థులు ఆ ఏనుగు బొమ్మను పూజిస్తుండటం ఆచారంగా వస్తోంది.

– ఈనాడు, కడప

'కూల్'గా పళ్ల విక్రయం!



విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డులో పడవల రేవు వంతెన సమీపంలో బ్యాటరీ బండి వద్దే పళ్ల విక్రయాలు

విజయవాడకు చెందిన టోకు పళ్ల వ్యాపారి మహ్మద్ ఇబ్రహీం వ్యాపారంలో వినూత్న పంథాను అనుసరిస్తున్నారు. పళ్ల విక్రయాల కోసం.. శీతల వాతావరణంతో కూడిన అద్దాల గది (ఏసీ గది) ఉన్న 5 వాహనాలను ప్రత్యేకంగా తయారు చేయించారు. ఈ వాహనాల్లో పళ్లను ఉంచి సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ విజయవాడలోని వివిధ ప్రాంతాలకు పంపి సిబ్బందితో విక్రయాలు సాగిస్తున్నారు. బ్లూబెర్రీ, చెర్రీస్, గోల్డెన్ కివీ, రాంబుటాన్, మ్యాంగోస్టీన్, ప్లమ్, లిచి, గింజలు లేని బేబీ ఆరెంజ్‌లు, అవకాడో తదితర పళ్లు ఈ వాహనాల్లో అందుబాటులో ఉంటాయి. వాహనానికి ఉన్న బ్యాటరీని సుమారు అరగంట ఆన్‌లో ఉంచితే అద్దాల గది 2 గంటల సేపు చల్లగా ఉంటుంది. అనంతరం అవసరమైతే మళ్లీ బ్యాటరీ స్విచ్ ఆన్ చేస్తారు. ఫలితంగా బయట వాతావరణ వేడిగా ఉన్నప్పటికీ.. పళ్లు తాజాగా ఉంటాయి. త్వరలోనే మరికొన్ని వాహనాలు ఏర్పాటు చేసి వ్యాపారాన్ని విస్తరించనున్నట్లు ఇబ్రహీం తెలిపారు.



– ఈనాడు, అమరావతి

సురవరం సుధాకర్‌రెడ్డికి అంతిమ వీడ్కోలు

- నివాళి అర్పించిన తెలుగు రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి
- గాంధీ వైద్య కళాశాలకు పార్థివదేహం అప్పగింత





అంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు. చిత్రంలో చాడ వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, నారాయణ, అజీజ్ పాషా, డి.రాజా తదితరులు ★ మగ్దూంభవన్ నుంచి గాంధీ వైద్య కళాశాల వరకు సాగిన సురవరం అంతిమయాత్ర

న్యూస్‌టుడే, హిమాయత్‌నగర్, ఈనాడు, హైదరాబాద్: అనారోగ్యంతో కన్నుమూసిన కమ్యూనిస్టు దిగ్గజం, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డికి కుటుంబసభ్యులు, వివిధ పార్టీల నేతలు, సీపీఐ కార్యకర్తలు ఆదివారం అంతిమ వీడ్కోలు పలికారు. తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు.. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ మగ్దూంభవన్‌లో సురవరం పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళి అర్పించారు. సీపీఎం, సీపీఐ ప్రధాన కార్యదర్శులు ఎంఏ బేబీ, డి.రాజా, తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు తదితర ప్రముఖులు సురవరం భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సంతాప సందేశాన్ని పంపారు. సురవరం కోరిక మేరకు ఆయన భార్య విజయలక్ష్మి, కుమారులు కపిల్, నిఖిల్‌లు పార్థివ దేహాన్ని వైద్యవిద్య బోధన నిమిత్తం గాంధీ వైద్య కళాశాలకు అప్పగించారు.

సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూం భవన్ వద్ద మధ్యాహ్నం 3:20 గంటల ప్రాంతంలో సురవరం సుధాకర్‌రెడ్డి భౌతికకాయానికి రాష్ట్రప్రభుత్వ అధికార లాంఛనాలతో గౌరవ వందనం సమర్పించారు. పోలీసులు, రెడ్ ఆర్మీ వాలంటీర్లు కవాతు చేస్తుండగా ప్రజానాట్య మండలి కళాకారుల గేయాల నడుమ అంతిమయాత్ర మగ్దూంభవన్ నుంచి గాంధీ వైద్య కళాశాల వరకు సాగింది. దారిపొడవునా కామ్రేడ్.. అమర్‌రహే అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడారు

'సురవరం కమ్యూనిస్టు ఉద్యమంలో, దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. ఆయన ఓ పోరాటయోధుడు. ఆయనతో నాకు సుదీర్ఘ కాలంగా రాజకీయ స్నేహం ఉంది. సురవరానికి నేనంటే ప్రత్యేకమైన అభిమానం ఉండేది. ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రజాహితం కోసం ఇద్దరం కలిసి ఎన్నో రాజకీయ పోరాటాలు చేశాం. ఆయన మరణం సీపీఐకి మాత్రమే కాదు..యావత్ దేశానికే తీరని లోటు.

– చంద్రబాబునాయుడు, ముఖ్యమంత్రి

సురవరం జీవితం స్ఫూర్తిదాయకం

నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు నిలబడి, పోరాడిన వ్యక్తి సురవరం. నిబద్ధతతో జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేసిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకం.

– ఎం.వెంకయ్యనాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి

నిరంతరం పోరాడిన వ్యక్తి సురవరం

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి. ఆయన గొప్ప కమ్యూనిస్టు యోధుడు. కమ్యూనిజంలో తరాలను ప్రభావితం చేసిన మహనీయుడు. – డి.రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

వాదోపవాదాలు ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

లెజిస్లేటివ్ అసెంబ్లీ (ప్రస్తుత లోక్‌సభ) అధ్యక్ష బాధ్యతలను భారతీయుడైన విఠల్‌భాయ్ పటేల్ చేపట్టి ఆదివారానికి వందేళ్లైంది. ఈ నేపథ్యంలో అప్పటి సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ వేదికైన ప్రస్తుత దిల్లీ విధాన సభలో అఖిల భారతీయ స్పీకర్ల సదస్సు జరిగింది. ఇందులో అసెంబ్లీల స్పీకర్లు, శాసనమండళ్ల ఛైర్మన్లను ఉద్దేశించి అమిత్ షా ప్రారంభోపన్యాసం చేశారు. 'ఎన్నో దేశాలు అధికార మార్పిడి కోసం రక్తం ధార పోయాల్సి వచ్చింది. ఎన్నోచోట్ల యుద్ధాలు, విద్రోహాలు చోటుచేసుకున్నాయి. కానీ గత 80 ఏళ్లలో మన దేశంలో ఎన్నోసార్లు అధికార మార్పిడి జరిగినా ఒక్క రక్తపు బొట్టు కూడా నేల రాలలేదు. శాంతియుతంగా మార్పు చోటుచేసుకున్న ఏకైక దేశం భారత్ ఒక్కటే. అందుకు ప్రధాన కారణం మనం చట్టసభల వ్యవస్థను బలంగా ఉంచి, సమయానుకూలంగా మార్పులు చేయడమే. సభాధ్యక్షుల గౌరవానికి నిష్పాక్షికత, న్యాయాలే మూలస్తంభాలు. ప్రతి చట్టం ప్రజల విశ్వాసం నుంచే పుట్టుకు రావాలి. ఈ దిశగానే స్పీకర్లు, చట్టసభల సభ్యులు ఆలోచించాలి. చట్టసభ ప్రజాస్వామ్య ఇంజిన్. ఎమ్మెల్యేలంతా గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి. గ్రంథాలయాల ఉపయోగాన్ని పెంచడానికి సభాపతులు చర్యలు తీసుకోవాలి' అని అమిత్ షా పేర్కొన్నారు. దిల్లీ స్పీకర్ విజేంద్ర గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా, ఏపీ శాసనసభ సభాపతి అయ్యన్న పాత్రుడు, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్‌లతోపాటు విభిన్న రాష్ట్రాల సభాపతులు పాల్గొన్నారు.

చట్టసభలను ఏటా 60 రోజులైనా నిర్వహించాలి

- స్పీకర్ల సదస్సులో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



దిల్లీ అసెంబ్లీలో జరిగిన అఖిల భారత స్పీకర్ల సదస్సులో రాష్ట్ర శాసనసభ సభాపతి అయ్యన్న పాత్రుడు, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు

ఈనాడు, దిల్లీ: దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే చట్టసభలను ఏడాదికి కనీసం 60 రోజులైనా నిర్వహించాలని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. ఆదివారం ఇక్కడ దిల్లీ అసెంబ్లీ వేదికగా జరిగిన అఖిల భారత స్పీకర్ల సదస్సులో ఆయన మాట్లాడారు. 'స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో పార్లమెంటు ఏడాదికి 135 రోజులు నడిచేది. కానీ, నేను ఎంపీగా ఉన్న 17వ లోక్‌సభ సగటు పని దినాలు 55 మాత్రమే. అసెంబ్లీల సగటు పనిదినాలు 35-40 రోజులకు పడిపోయాయి. మనం ప్రజాస్వామ్యాన్ని కాపాడేది ఇలాగేనా?' అని ప్రశ్నించారు. చట్టసభల పనిదినాలు పెరగాలని పేర్కొన్నారు. 'రెండు సమావేశాల మధ్య వ్యవధి 180 రోజులకు మించకూడదని రాజ్యాంగం చెబుతోంది. మా రాష్ట్రం సహా చాలా రాష్ట్రాలు ఆ రాజ్యాంగ నిబంధన అమలు కోసం సరిగ్గా 180 రోజులకు సమావేశమవుతున్నాయి' అని రఘురామ పేర్కొన్నారు. 'సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ ప్రెసిడెంట్‌గా పనిచేసిన తొలి భారతీయుడు విఠల్‌భాయ్ పటేల్ లాంటివారిని గౌరవించాలంటే, వారి సేవలను పొగడటానికి బదులు ఇకపై చట్టసభలు ఏటా కనీసం 60 రోజులైనా నిర్వహిస్తామని మనమంతా ప్రతినబూనాలి. అలా చేయకుండా ఆర్డినెన్స్‌లు ఇస్తూ పోతే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లవుతుంది. కార్యనిర్వాహక వ్యవస్థ సొంతంగా ఆర్డినెన్సులు తీసుకొస్తున్నందున అక్కడ చర్చలకు తావు లేదు. శాసనవ్యవస్థ బలంగా ఉండేలా నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాల'ని ఉపసభాపతి కోరారు.

చిన్నారులకు అభయం!

(మొదటి పేజీ తరువాయి)

పెట్టకుండా చర్యలు చేపట్టాలి.

- పెంపుడు కుక్కలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. వాటికి రేబిస్ టీకాలు విధిగా వేయించాలి.

సుప్రీంకోర్టు సూచనలివి

- కుక్కలకు నిర్దేశిత ప్రాంతాల్లోనే ఆహారం అందించాలి. అలాంటి ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలి.
- వీధుల్లో ఎక్కడపడితే అక్కడ వాటికి ఆహారం పెడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.
- శునకాల సంరక్షణ, పిల్లల రక్షణకు సంబంధించిన పట్టణ స్థానిక సంస్థలు తీసుకుంటున్న చర్యలను రియల్ టైంలో పరిశీలనకు డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలి.

కుక్కల బెడద తీవ్రంగా ఉన్న ప్రాంతాలివే..

- మాంసం విక్రయించే దుకాణాలు, హోటళ్లు, ఫంక్షన్ హాళ్లు ఉన్నచోట వాటిలో మిగిలిన ఆహారం, వ్యర్థాలు బయట పారబోయకుండా చూడాలి.
- దాడిచేసే స్వభావం గల కుక్కలను పట్టుకుని సంరక్షణ కేంద్రాలకు తరలించాలి.
- శునకాల సమస్యపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించే వ్యవస్థ అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ఏర్పాటుచేయాలి.

గ్రహం అనుగ్రహం

25–8–2025 సోమవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, భాద్రపద మాసం, శుక్లపక్షం

విదియ: ఉ. 11-38 తదుపరి తదియ

ఉత్తర: తె. 3-59 తదుపరి హస్త

వర్జ్యం: ఉ. 10-12 నుంచి 11-54 వరకు

అమృత ఘడియలు: రా. 8-22 నుంచి 10-03 వరకు

దుర్ముహూర్తం: మ. 12-27 నుంచి 1-17 వరకు తిరిగి 2-57 నుంచి 3-47 వరకు

రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు

సూర్యోదయం: ఉ.5.48; సూర్యాస్తమయం: సా.6.18

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
ఒంగోలు	36.1	27.6
రాజమహేంద్రవరం	36.0	25.5
తిరుపతి	35.8	25.4
నెల్లూరు	35.5	27.8
గుంటూరు	34.0	28.0
విశాఖపట్నం	34.0	27.6
విజయవాడ	33.7	26.9
అనంతపురం	33.5	24.0
కడప	33.0	24.0
నరసాపురం	32.3	27.2
తాడేపల్లిగూడెం	32.2	27.1
కర్నూలు	32.2	26.8
హనుమకొండ	31.5	24.0
నిజామాబాద్	31.5	23.3
విజయనగరం	31.0	25.0
శ్రీకాకుళం	30.0	26.0
హైదరాబాద్	29.7	22.1

ఆధునిక లస్కర్లు.. ఈ సెన్సర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆయా ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన గేజ్ మీటర్లు, వాటిని పర్యవేక్షించే లస్కర్లే దిక్కు. మనుషులు చేరుకోలేని, మారుమూల ప్రాంతాల్లోని పరిస్థితిని తెలుసుకోవడం కష్టంగా ఉండేది. ఇప్పుడు అధునాతన సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. ఉపగ్రహ సేవలను వినియోగించుకుంటూ జలవనరుల శాఖ అధికారులు ఎక్కడికక్కడ సెన్సర్లు ఏర్పాటుచేసి కచ్చితమైన సమాచారం రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

కృష్ణా పశ్చిమ డెల్టాలో పైలట్ ప్రాజెక్టు

కృష్ణా పశ్చిమ డెల్టా కింద గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో సుమారు 5.71 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. వీటిలో ప్రధానంగా కొమ్మమూరు కాలువ, ఉపకాలువల ప్రవాహస్థితి, ఆయకట్టు భూముల్లో తేమశాతం, నీటి ప్రవాహ కొలతల సమగ్ర సమాచారం నిమిత్తం తొలి పైలట్ ప్రాజెక్టుగా నీటి కొలతల పరికరాలు ఏర్పాటుచేసేలా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. కాలువల్లో షట్టర్ల వద్ద, పొలాల్లో తేమ శాతాన్ని తెలుసుకునేలా వీటిని ఏర్పాటు చేయనుంది. ఇందులోని జీపీఎస్, రాడార్ సెన్సర్లు నీటి లెక్కలు, వరద పరిస్థితిని అంచనా వేస్తూ.. ఎప్పటికప్పుడు ఉపగ్రహ సాయంతో అధికారులకు సందేశాలు పంపిస్తాయి. సౌరశక్తితో రిమోట్ ఆధారంగా ఇవి పని చేస్తాయి. 119 కిలోమీటర్ల మేర కొమ్మమూరు కాలువపై వందకు పైగా సెన్సర్లను ఏర్పాటు చేస్తున్నారు.



ఈ సెన్సర్ ద్వారా భూమిలో తేమను తెలుసుకోవచ్చు

ఉమ్మడి పశ్చిమలోనూ 15 చోట్ల..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 చోట్ల ఈ ఆటోమేటెడ్ వాటర్ లెవెల్ రికార్డర్ వ్యవస్థ ఆరు నెలల క్రితమే ఏర్పాటైంది. ఇన్‌శాట్ ఉపగ్రహంతో అనుసంధానం కలిగి ఉంటాయి. జీఎస్ఎం, జీపీఆర్ఎస్, ఉపగ్రహ సంకేతాలను స్వీకరించే డేటాలాగర్, ఇన్‌శాట్ ట్రాన్స్‌మిటర్, యాగీ యాంటెన్నా, నాన్ కాంటాక్ట్ వాటర్ లెవెల్ సెన్సర్ తదితర అల్ట్రాసోనిక్, రాడార్ సెన్సర్లను ఈ పరికరాల్లో అమర్చారు. వీటి సాయంతో ఉపగ్రహ లేదా రేడియో కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ద్వారా రియల్ టైం డేటా ఎప్పటికప్పుడు డాష్‌బోర్డుకు అనుసంధానం అవుతుంది. తద్వారా మారుమూల ప్రదేశాల్లోని నీటి వనరుల సమాచారం కూడా తెలుసుకోవచ్చు. కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం సమీపంలో బయనేరు వాగు, తాడువాయి సంగం, జల్లేరు వాగు, పోలవరం మండలం ప్రగడపల్లి వద్ద కొవ్వాడ వాగుపై ఏడబ్ల్యూఎల్ఆర్ పరికరాలు అమర్చారు. వీటితోపాటు తమ్మిలేరు, ఎర్రకాలువ, యనమదుర్రు, గొంతేరు, ఉప్పుటేరు డ్రెయిన్లు, చించినాడ వద్ద గోదావరిపైనా ఏర్పాటుచేశారు.



ప్రయోగానికి ముందు షార్‌లో డమ్మీ క్రూ మాడ్యూల్‌ను పరిశీలిస్తున్న ఇస్రో ఛైర్మన్ నారాయణన్, ఇతర శాస్త్రవేత్తలు

మొదటి మెట్టుపై సగర్వంగా..

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతంగా పనిచేశాయి. బంగాళాఖాతంలో సురక్షితంగా దిగిన క్రూ మాడ్యూల్‌ను నౌకాదళ సిబ్బంది చెన్నై పోర్టుకు తరలించారు. షార్‌లో పరీక్షకు ముందు డమ్మీ క్రూ మాడ్యూల్‌ను ఇస్రో ఛైర్మన్ నారాయణన్ పరిశీలించారు. ఆయనతో పాటు షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ ఉన్నారు. ఈ పరీక్షలో వైమానిక దళం, కోస్టుగార్డు, రక్షణశాఖ (డీఆర్‌డీవో), నౌకాదళం సంయుక్తంగా పాల్గొన్నాయి.


దీనిముందు అన్నీ బలాదూర్
PACK TWO
XEV 9e
దీనిని తీసుకురండి. ఇది ఈ మధ్యనే లాంచ్ చేయబడిన 'XEV 9e Pack Two', ఇది ప్రతివిషయంలోనూ శ్రేష్ఠతకి చిహ్నం. మా టాప్ ఎండ్ Pack Three లాగానే. ఇంకా, దీని ఆకర్షణీయమైన ధర కేవలం ₹24.90 లక్షలు* మరియు EMI కూడా సులువుగా, కేవలం ₹45 716.00#. వచ్చేసిందిగా మీ ముఖంలో చిరునవ్వు! ఇప్పుడు కాస్త శ్రద్ధగా చూడండి మా టాప్ ఎండ్ ఫీచర్లని. ఇవి మీకు లభిస్తాయి Pack Two లో:
కాస్ట్-టు-కాస్ట్ 3 స్క్రీన్స్ డిస్ ప్లే • ప్రీమియం లెదరెట్ ఇంటీరియర్స్ • సోనిక్ స్టూడియో
16- స్పీకర్ హర్మన్ కార్డన్ సిస్టంతోపాటు డాల్బీ అట్మాస్ • లెవల్ 2 ADAS • LED ల్యాంప్స్ • R19 అల్లాయ్ వీల్స్
ఫిక్స్డ్-గ్లాస్ ఇన్ఫినిటీ రూఫ్ • 5- స్టార్ భారత్ NCAP సేఫ్టీ రేటింగ్
సింగిల్ ఛార్జితో 79 kWh బ్యాటరీ మీకిప్పిస్తుంది 500 km^ల రియల్ వర్ల్డ్ రేంజ్ అదే 59 kWh బ్యాటరీ తో 400 km^, అంటే వారంలో ఒక్కసారి ఛార్జి చేస్తే సరిపోతుంది. దాంతోపాటు, మీకు లభిస్తుంది బ్యాటరీ మీద లైఫ్ టైం వారంటీ###. ఇప్పుడు ప్రయాణం టెన్షన్ - ఫ్రీ.
ప్రారంభధర
₹24.90 లక్షలు*
₹45 716.00#ల సులువైన EMI
బిజినెస్సులకై 40% డిప్రిసిఏషన్ ప్రయోజనం##
XEV 9e PACK TWO | డెలివరీ ఇప్పుడు ప్రారంభం
మీకు దగ్గరలోనున్న డీలర్ షిప్ ని తెలుసుకునేందుకై స్కాన్ చెయ్యండి
*ఛార్జర్ మరియు ఇన్ స్టలేషన్ ఖర్చు లేకుండా XEV 9e Pack Two 59 kWh యొక్క ఎక్స్-షోరూమ్ ప్రారంభ ధర #MMFSL తరఫున బెలూన్ పేమెంట్ తోపాటు స్పెషల్ EMI స్కీమ్. ##అర్హత కోసం మీ ఫైనాన్షియల్ అడ్వైజర్ ని సంప్రదించండి. ###మొదటి రిజిస్టర్డ్ ఓనర్ కోసం. కేవలం ప్రైవేట్ రిజిస్ట్రేషన్ కై వర్తిస్తుంది. ఓనర్ షిప్ (యాజమాన్యం) మారితే, HV బ్యాటరీకి వారంటీ 10 సంవత్సరాలు లేదా 2 00 000 km, ఏది బండి డెలివరీకి ముందైతే అది. ^AC ఆన్ చేసి, నగరపు ప్రాంతాలలో నిజమైన పరీక్షల అనుసారం. వాస్తవిక పరిణామాలలో భిన్నంగా ఉండచ్చు. ARAI MIDC P1+P2 ప్రమాణిత రేంజ్ 59 kWh: 542 km, 79 kWh: 656 km. ¨షరతులు, నిబంధనలు వర్తిస్తాయి.
విస్తృతమైన షరతులు, నిబంధనలకై, ఇక్కడ విజిట్ చెయ్యండి: visit www.mahindraelectricsuv.com/tnc.html
ELECTRIC ORIGIN SUVs
mahindra

ఈనాడు

ఆర్థిక ప్రగతికి డిజిటల్ అక్షరాస్యత

అంతర్జాల విస్తరణతో ప్రపంచమే ఒక కుగ్రామంలా మారిపోయింది. కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్ల సాయంతో ఎలాంటి సమాచారాన్ని అయినా చిటికెలో తెలుసుకోవడం సాధ్యపడుతోంది. వివిధ ప్రభుత్వ పథకాలను, విద్యా వైద్య సంబంధిత సేవలను తేలిగ్గా అందిపుచ్చుకోవడానికి, సరికొత్త నైపుణ్యాలను అలవరచుకుని ఆవిష్కరణల్లో దూసుకుపోవడానికి ఇంటర్నెట్ తోడ్పడుతోంది. అదే సమయంలో సైబర్ మోసాలూ కట్టుతప్పుతున్నాయి. ఈ నేపథ్యంలో డిజిటల్ ఉపకరణాల వినియోగంపై సరైన అవగాహన లేనివారే నిజమైన నిరక్షరాస్యులుగా మిగులుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన కేంద్రం డిజిటల్ అక్షరాస్యతను పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను పట్టాలకెక్కించింది. అయినప్పటికీ అధ్యయనాల ప్రకారం దేశీయంగా 38శాతం కుటుంబాలకే సంబంధిత పరిజ్ఞానం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలోనే సంపూర్ణ డిజిటల్ అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలిచినట్లు వెలువడిన ప్రకటన అందరినీ అబ్బురపరుస్తోంది. రెండేళ్ల క్రితం ఇంటర్నెట్‌ను ప్రాథమిక హక్కుగా గుర్తించినప్పుడే ప్రజల నడుమ డిజిటల్ అసమానతల తగ్గింపు దిశగా కేరళ ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుంది. ఆపై 'డిజి కేరళ' కార్యక్రమం కింద ప్రత్యేక కార్యాచరణతో లక్షలాది మందికి ఆన్‌లైన్‌పై అవగాహన పెంచి మిగిలిన రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచింది!

అంతర్జాల విస్తృతి, డిజిటల్ అక్షరాస్యత పరంగా గడిచిన పదేళ్లలో మన దేశం గణనీయమైన వృద్ధి సాధించినట్లు ప్రధాని మోదీ ఇటీవల పేర్కొన్నారు. అది వాస్తవమే. అధికారిక లెక్కల ప్రకారం 2014లో ఇండియాలో ఇంటర్నెట్ కనెక్షన్ల సంఖ్య 25.15 కోట్లు. దశాబ్ద కాలంలో అవి అంతకు నాలుగు రెట్లకు పెరిగాయి. దేశీయంగా 85శాతం కుటుంబాలు కనీసం ఒక స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్నట్లు అంచనా. నాణేనికి మరోవైపు చూస్తే... స్త్రీ-పురుషులు, పల్లెలు-పట్టణాల నడుమ డిజిటల్ అంతరాలు కొనసాగుతున్నాయి. గ్రామీణ జనాభాలో 59శాతమే ఆన్‌లైన్ కార్యకలాపాల్లో నిమగ్నమవుతోంది. ఇక డిజిటల్ అక్షరాస్యత పరంగా దక్షిణాదితో పోలిస్తే ఉత్తర భారతం మరింత వెనకబడింది. జన జీవితాల్లో మెరుగైన మార్పులను సాకారం చేసే 'ఈ-విద్య' దేశార్థికవృద్ధిలోనూ కీలక పాత్ర పోషిస్తుంది. కేంద్రం లెక్కల ప్రకారం, 2022-23లో దేశ జీడీపీలో డిజిటల్ ఎకానమీ వాటా 11.74శాతం (రూ.31 లక్షల కోట్లు). 2030 నాటికి అది 20శాతానికి చేరనుంది. ప్రస్తుతం కోటిన్నర మందికి ఉపాధి కల్పిస్తున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థ మరింతగా పురోగమించాలంటే- సంబంధిత మౌలిక వసతులను విస్తృతం చేయాలి.

దేశీయంగా ఆరున్నర లక్షల పల్లెలకు బ్రాడ్‌బ్యాండ్ అనుసంధానత కల్పించాలన్నది 'భారత్ నెట్' కార్యక్రమం లక్ష్యం. అధికారిక సమాచారం మేరకు ఈ ఏడాది జూన్ నాటికి 2.14 లక్షల పంచాయతీలకే అది సాకారమైంది. సంబంధిత సేవల్లో నాణ్యత, కేబుళ్ల నిర్వహణలో లోపాలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిరుడు అక్టోబరు నాటికే దేశవ్యాప్తంగా 5జీ నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చినట్లు చెబుతున్నా కనెక్టివిటీ సమస్యలు వేధిస్తున్నాయి. చైనాలో ఇంటర్నెట్ సగటు వేగం 207 ఎంబీపీఎస్ అయితే, అమెరికాలో 176. ఇండియాలో అది 136కే పరిమితమైంది. ఇవన్నీ డిజిటల్ సాధికారతకు ప్రతిబంధకాలే! ఇక 2020-24 మధ్యలో దేశవ్యాప్తంగా సైబర్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు 900శాతం మేర అధికమయ్యాయి. మారుమూల పల్లెలకూ అంతర్జాల అనుసంధానతను కల్పించడం ఎంత ముఖ్యమో- డిజిటల్ బందిపోట్ల బారినపడకుండా ఉండటంపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడమూ అంతే ప్రధానం!

లాభసాటి సాగుకు సరైన ప్రణాళికలు

ఉపాధి అవకాశాల కల్పనలో, ఆహార భద్రత సాధనలో సాగు రంగమే కీలకమైనది. ఆంధ్రప్రదేశ్ సైతం వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థనే కలిగి ఉంది. రాష్ట్రంలో 62 శాతం మంది జీవనోపాధి కోసం సాగుపైనే ఆధారపడుతున్నారు. రాష్ట్ర జీఎస్‌డీపీలో వ్యవసాయ, అనుబంధ రంగాలే 37 శాతానికిపైగా వాటా కలిగి ఉన్నాయి. రాష్ట్ర రైతాంగానికి రాబడి పెరగాలంటే సరైన పంట ప్రణాళికలు అవసరం.



ఇటీవలి సంవత్సరాల్లో ఏపీలో వ్యవసాయం పలురకాల సవాళ్లు ఎదుర్కొంటోంది. రాష్ట్ర సాగురంగ వృద్ధి రేటు 2022-23లో మూడు శాతం ఉండగా, 2023-24లో 1.69 శాతానికి తగ్గింది. నీటి కొరత, వాతావరణ మార్పులు, వర్షాభావ పరిస్థితులు పునరావృతమవ్వడం, తీవ్రమైన తుపాన్లు వంటివి వ్యవసాయ ఉత్పాదకతను దెబ్బతీస్తున్నాయి. సాగు రంగంలో స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తున్నాయి. రాష్ట్రంలో 47.7 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. ఇది రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 29 శాతం. మొత్తం సేద్య భూమిలో సాగునీటి ఆధారిత భూమి 61 శాతం మాత్రమే ఉంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి 143.3 లక్షల టన్నుల దాకా నమోదవుతోంది. రాష్ట్రంలో ప్రధానంగా ఉన్న ఎరుపు లేటరైట్, నలుపు నేలల్లో ఉప్పుదనం, తక్కువ ఉత్పాదకత వంటి సమస్యలు ఉన్నాయి.

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం చేపట్టిన ఒక అధ్యయనంలో గడచిన దశాబ్దకాలంలో ప్రధాన పంటల తీరుతెన్నులను పరిశీలించారు. 2014-15 నుంచి 2018-19 వరకు, 2019-20 నుంచి 2023-24 వరకు... ఇలా అయిదేసి సంవత్సరాల వ్యవధిలో ఈ పరిశీలన చేపట్టారు. ఈ అధ్యయనంలో వరి, మొక్కజొన్న, కందులు, మినుములు, పెసలు, సెనగ, వేరుశనగ, పత్తి, చెరకు వంటి ముఖ్యమైన పంటలను పరిగణనలోకి తీసుకున్నారు. రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం లభించడంలో పంటల విస్తీర్ణం, ఉత్పాదకత, ధరల ప్రభావాన్ని విశ్లేషించారు.

రైతుల రాబడిపై ప్రభావం చూపిన అంశాలు

పంట	మొదటి కాలవ్యవధి (2014–19)	రెండో కాలవ్యవధి (2019–24)	మొత్తం కాలవ్యవధి (2014–24)
వరి	ధర	విస్తీర్ణం	ధర
మొక్కజొన్న	ధర	ధర	ధర
కంది	ఉత్పాదకత	ధర	ధర
మినుములు	ధర	ధర	ధర
సెనగ	ఉత్పాదకత	విస్తీర్ణం	ధర
వేరుశనగ	ధర	విస్తీర్ణం	ఉత్పాదకత
పత్తి	ఉత్పాదకత	ఉత్పాదకత	ఉత్పాదకత
చెరకు	విస్తీర్ణం	విస్తీర్ణం	విస్తీర్ణం

వాణిజ్య పంటలవైపు మొగ్గు

వరి సాగు విషయానికి వస్తే, విస్తీర్ణం తగ్గినా ఖరీఫ్, రబీ రెండు కాలాల్లోనూ మంచి దిగుబడుల వల్ల ఉత్పత్తి పెరిగింది. 2019-20 నుంచి 2023-24 మధ్యలో మాత్రం వరిసాగు విస్తీర్ణం, ఉత్పత్తి రెండూ తగ్గాయి. ఈ తగ్గుదల ఖరీఫ్ సీజన్‌లో అధికంగా నమోదైంది. మిగతా ప్రధాన పంటలైన మినుములు, సెనగలు, వేరుశనగ, పత్తి, చెరకు పంటలకు విస్తీర్ణంలో ప్రతికూల వృద్ధిరేటు కనిపించింది. మొక్కజొన్న, కంది పంటలకు మాత్రమే సానుకూల వృద్ధిరేటు నమోదైంది. మరోవైపు వరి, మొక్కజొన్న, మినుము పంటల ఉత్పత్తిలో సానుకూల ధోరణి కనిపించింది. కంది, సెనగలు, వేరుశనగ, పత్తి, చెరకు పంటల ఉత్పత్తిలో ప్రతికూల వృద్ధి నమోదైంది. ఉత్పాదకతలో ప్రతికూల ధోరణి కేవలం కంది, పత్తి పంటలకే పరిమితమైంది. వరి విషయంలో విస్తీర్ణం, ఉత్పత్తిలో అస్థిరత ప్రధానంగా 2019-20 నుంచి 2023-24 మధ్యలో ఎక్కువగా కనపడింది. రైతులు ఆర్థికంగా లాభదాయకమైన వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్న సూచనలు వెలువడుతున్నాయి. ఆయా పంటల ఉత్పాదకతలో అస్థిరత తక్కువగా ఉండటం, పరిశోధనల కారణంగా అందివచ్చిన సాంకేతికతల అమలుతో ఇది సాధ్యమైందని చెప్పవచ్చు.

రబీ సీజన్‌లో కంది, పత్తిలో విస్తీర్ణం, ఉత్పత్తిపరంగా అస్థిరత నెలకొంది. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, మినుములు, వేరుశనగలకు విస్తీర్ణం, ఉత్పత్తి పరంగా అధిక అస్థిరత సూచికలు నమోదయ్యాయి. ప్రధాన పంటల స్థూల ఆదాయ మార్పుల విషయంలో ముఖ్యంగా ధరే ప్రభావితం చేస్తోంది. ఆ తరవాత విస్తీర్ణం, ఉత్పాదకత ప్రభావం చూపుతున్నాయి. వరిలో ధరల మార్పు ఆధారంగా ఆదాయం పెరిగింది, అయితే గడచిన అయిదేళ్లలో విస్తీర్ణంలో వచ్చిన మార్పు ఆదాయాలను ప్రభావితం చేసింది. మొక్కజొన్న, మినుముల పంటల్లోనేమో అన్ని కాలాల్లో ధరల్లో మార్పే ప్రధానంగా స్థూల ఆదాయంపై ప్రభావం చూపించింది. పత్తి పంటలో మాత్రం ఉత్పాదకతలో మార్పు ప్రధాన పాత్ర పోషించింది. చెరకు విషయానికి వస్తే అన్ని కాలాల్లో విస్తీర్ణంలో మార్పే ప్రధాన ప్రభావం చూపింది.

మెరుగైన దిగుబడుల కోసం...

మెరుగైన దిగుబడులు వచ్చినప్పుడే రైతుల ఆదాయాలు పెరుగుతాయి. ఆ విధంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సీజన్లవారీగా, ప్రాంతీయంగా పంటల ప్రణాళికలను అమలు చేయాల్సిన అవసరం ఉంది. రబీ సీజన్‌లో వరి, కంది, పత్తి పంటల సాగును తగ్గించాలి. అదే సమయంలో మొక్కజొన్న, మినుములు, వేరుశనగల ఉత్పత్తిని ప్రోత్సహించాలి. పప్పు దినుసుల్లో ముఖ్యంగా కందిపప్పులో ఉత్పాదకత పెంపుపై పరిశోధనలు జరగాలి. పత్తి పంటకు మెరుగైన ఉత్పత్తి సాంకేతికతను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. సహకార రంగంలోని చెరకు పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని పంట విస్తీర్ణం, ఉత్పత్తి పెంపునకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఉత్పాదకత పెంపుపై మాత్రమే కాకుండా, ధరల పతనానికి గురైన పప్పు దినుసులను సాగుచేసే రైతులను రక్షించేందుకూ చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం, రైతుల వైపు నుంచి ఇలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా దిగుబడులకు మెరుగైన ధరను సాధించవచ్చు. అప్పుడే రైతుల కష్టాలు తీరతాయి. నవతరం కూడా ఉత్సాహంగా సాగురంగంలోకి ప్రవేశిస్తుంది.



డాక్టర్ ఐ.వి.వై.రామారావు
గౌరవ డైరెక్టర్, సాగు ఖర్చు విభాగం,
ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం



సహానుభూతి... నేర్పాలి!

పిల్లలకు నేర్పించాల్సిన జీవన నైపుణ్యాల్లో అత్యంత ముఖ్యమైనది... సహానుభూతి. అది చుట్టూ ఉన్న మనుషులను, వారి పరిస్థితులను అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది. సహానుభూతి ఉన్నవారు తోటివారు మాటల్లో వ్యక్తపరచలేని భావాల్ని, వేదనను గుర్తించగలుగుతారు. ఇతరుల కష్టాలను చూసి స్పందిస్తారు. మంచి మనిషిగా ఎదుగుతారు.

పదేళ్ల పిల్లాడు పెంపుడు జంతువులమ్మే దుకాణానికి వెళ్లాడు. అక్కడ రకరకాల కుక్క పిల్లలను చూశాడు. వాటన్నిటికీ కాస్త దూరంగా ఓ మూలన మరో కుక్క పిల్ల ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ కూర్చుని ఉంది. దాన్ని చూసిన వెంటనే ఆ అబ్బాయి 'అది కూడా అమ్మడానికేనా? ధర ఎంత? ఎందుకలా దాన్ని వేరేగా ఉంచారు' అని దుకాణదారుణ్ని అడిగాడు. అది కూడా మిగతా వాటితో పాటుగానే పుట్టిందని, కాకపోతే దానికి అవయవ లోపం ఉండటంతో ఎవరూ కొనరని విడిగా ఉంచామని యజమాని బదులిచ్చాడు. ఆ కుక్కపిల్లకి ఒక కాలు సరిగా లేదు. పిల్లాడు దాన్ని ఎత్తుకోగానే ఎంతో ఉత్సాహంగా, సంతోషంగా కనిపించింది. ఆ అబ్బాయి దాన్నే కొనాలనుకున్నాడు. యజమాని వద్దని చెప్పినా వినకుండా జేబులో నుంచి డబ్బులు తీసి ఇచ్చాడు. 'అంత డబ్బు పెట్టేటప్పుడు నీకు మంచి కుక్క పిల్లే దొరుకుతుంది కదా. కాలు బాలేని దీన్నే ఎందుకు కొనాలనుకుంటున్నావో అర్థం కావట్లేదు' అన్నాడు దుకాణ యజమాని. ఆ పిల్లాడు మౌనంగా తన ఎడమ కాలి ప్యాంటు పైకెత్తి చూపించాడు. సన్నగా ఉన్న ఆ కాలికి బెల్టులు కట్టిన బూట్లు కనిపించాయి. వెంటనే దుకాణదారు 'అర్థమైంది. ఇక నిన్నేమి అడగను. దీన్ని తీసుకో' అని నవ్వుతూ ఆ అబ్బాయి భుజం తట్టి కుక్క పిల్లని ఇచ్చేశాడు. తనలాంటి పరిస్థితే దానిదీ అని అర్థం చేసుకున్నాడు కాబట్టి ఆ పిల్లాడు దాన్ని అక్కున చేర్చుకున్నాడు. అలా కాకుండా ఆరోగ్యంగా ఉన్నవాళ్లలో కూడా ఆ పరిస్థితిని అర్థంచేసుకోగలిగే సహానుభూతి ఉంటే ఎంత బాగుంటుంది... అనుకున్నాడాయన.

నిజమే కదా, పిల్లల్లో సహజంగానే సహానుభూతి ఉంటుంది. కానీ పెంపకం, చుట్టూ ఉన్న పరిస్థితుల నుంచి నేర్చుకున్న గుణగణాలు వారిని మార్చేస్తాయి. నిజంగా తమ పిల్లలు అలాంటి కుక్కపిల్లను తెచ్చుకుంటే ఊరుకునే తల్లిదండ్రులు ఎంతమంది? పిల్లలు ఏం చూస్తారో అదే నేర్చుకుంటారు. చుట్టూ సమాజంలో, సోషల్ మీడియాలో, వీడియో గేమ్స్‌లో, టీవీలో, సినిమాల్లో... ఎటు చూసినా హింసే కనిపిస్తున్న రోజులివి. ఇలాంటి సమయంలో పిల్లలకు మంచి గుణాలు, మానవతా విలువలు అలవడేలా పెంచడం తల్లిదండ్రులకు కత్తిమీద సాము లాంటిదే. కానీ తప్పదు. బాధ్యతాయుతమైన పౌరులుగా పిల్లలను తీర్చిదిద్దాలంటే- పెద్దలు రోల్ మోడల్స్‌గా వాళ్ల చుట్టూ ఉండాలి. మంచీ చెడు విచక్షణ తెలిసేలా వారిని పెంచాలి.

– ర్యాలి హేమంత్ కుమార్




నిజంగా సంతోషంగా ఉన్న వ్యక్తులెవరూ ఇతరులను ట్రోల్ చేయరు. తమ జీవితాలను తాము బాగుచేసుకోలేక అసంతృప్తిలో కూరుకుపోయినవారే ఇతరుల మీద రాళ్లేస్తూ ఆనందిస్తారు.

– అంకుర్ వారికూ, ఇంటర్నెట్ ఎంట్రప్రెన్యూర్

మౌన ఫలం

మౌనం అంటే కేవలం మాట్లాడకుండా ఉండటం కాదు. వాక్కు, మనసు, ఇంద్రియాలపై నియంత్రణ సాధించడం. రమణమహర్షి చెప్పినట్లు మౌనం ఒక నిశ్శబ్ద సంభాషణ, అత్యంత సమర్థవంతమైన భాష.

వాక్ మౌనం అంటే వ్యర్థమైన మాటలను నియంత్రించడం. ఇంద్రియ మౌనం అంటే పంచేంద్రియాల ద్వారా కలిగే కోరికలను అదుపులో ఉంచుకోవడం. మానసిక మౌనం అంటే మనసులో కలిగే ఆలోచనలు, ఆవేదనలు, ఆక్రోశాలు, వాంఛలను నిరోధించడం. మనసును దైవచింతనపై ఉంచి, పరిపూర్ణ నిశ్చల స్థితికి చేరుకోవడం. నిజానికి మౌనం ద్వారా ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. జ్ఞానోదయం కలిగి ఆరోగ్యం, ప్రశాంతత, సంకల్పశక్తి, ఆత్మవిశ్వాసం అందివస్తాయి. మౌనం ద్వారా అంతరంగ ప్రబోధంతోపాటు అంతర్ముఖ పయనం సాధ్యమై, అంతర్యామిని దర్శించే అవకాశం లభిస్తుంది. వేదాలు, పురాణాలు మొదలైన భారతీయ ధార్మిక గ్రంథాలలో మౌనానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. వేదకాలం నుంచి మౌనం తపస్సులో ముఖ్య భాగంగా ఉంది. ఇంద్రియ నిగ్రహానికి, చిత్తశుద్ధికి మార్గంగా గుర్తింపు పొందింది. రుషులు, మునులు సత్యదర్శనం కోసం, బ్రహ్మజ్ఞానం కోసం... మౌనం అవసరమని గుర్తించారు. 'వాక్కును నిరోధించడం ద్వారానే దివ్యత్వం వైపు అడుగులు వేయగలం' అంటారు శంకరాచార్యులు. మహర్షులు భక్తి ప్రపత్తులతో దీర్ఘకాలం మౌనవ్రతాలు ఆచరించడం ద్వారా గొప్ప శక్తులను, జ్ఞానాన్ని పొందినట్లు పురాణ గాథలలో పేర్కొన్నారు. మౌనం ద్వారా దైవసాన్నిధ్యం సాధ్యమని పురాణాలు ఘోషిస్తున్నాయి. దక్షిణామూర్తి మౌనం ద్వారా జ్ఞానబోధ చేశాడని చెబుతారు.



అంతర్యామి

మౌనం మెదడుపై సానుకూల ప్రభావం చూపుతూ ఒత్తిడిని తగ్గిస్తుంది. మానసిక స్పష్టతను, సృజనాత్మకతను పెంచుతుందని న్యూరోసైన్స్ అధ్యయనాలు సూచిస్తున్నాయి. సాంఖ్య సిద్ధాంతం మనిషి మనసు, దాని శక్తి సామర్థ్యాలపై నమ్మకాన్ని ప్రకటిస్తుంది. మనల్ని మనం స్పష్టంగా చూసుకోవడానికి మౌనం సాయపడుతుందని, భగవంతుడిపై మనసును లగ్నంచేసేందుకు తగిన వాతావరణాన్ని కల్పించే స్వతంత్ర తత్వశాస్త్రం మౌనమని చెబుతుంది.

రామపురం చాలా అందమైన గ్రామం. కానీ, ప్రజలమధ్య నిరంతరం కొనసాగే మాటల యుద్ధం మూలంగా ఊళ్లో ప్రశాంతత ఉండేది కాదు. అక్కడికి ఒక జ్ఞాని వచ్చి పరిస్థితి తెలుసుకుని, 'మీరంతా ఒక నెలరోజులపాటు మౌనవ్రతం పాటించండి, అత్యవసరమైతే తప్ప మాట్లాడకండి' అన్నాడు. ఆయన సూచనలను అందరూ అంగీకరించి, ఆచరించారు. వాగ్వివాదాలు లేకపోవడంతో ఎవరి పని వారు నిశ్శబ్దంగా చేసుకోసాగారు. అలా ప్రశాంత వాతావరణం ఏర్పడింది. మౌనం ఆలోచనలకు స్పష్టతనిస్తుంది, మనసుకు శాంతినిస్తుంది, సంబంధాలను బలపరుస్తుంది.

అంతర్గత ప్రయాణం, స్వీయ ఆవిష్కరణ, ఉన్నత స్థితికి చేరుకోవడానికి చేసే త్రివిధ తపస్సులలో మౌనం శక్తిమంతమైన సాధనమని భగవద్గీత చెబుతోంది. ముఖ్యంగా మానసిక మౌనం దైవచింతనపై ఏకాగ్రత కుదరడానికి సాయపడుతుంది. ఆ స్థితిలో మనసు బాహ్య ప్రపంచం నుంచి విడివడి, అంతర్గతమైన దైవిక అంశాలపై దృష్టి సారించగలుగుతుంది.

– డాక్టర్ శ్రీదేవీ శ్రీకాంత్

ఎగుమతుల జోరు

చైనా, బంగ్లాదేశ్, వియత్నాం, జర్మనీ, ఇటలీల తరవాత ప్రపంచంలో ఆరో అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఇండియా నిలుస్తోంది. ప్రస్తుతం 220 దేశాలకు భారత్ నుంచి వస్త్రాలు ఎగుమతి అవుతున్నాయి. 2030 నాటికి తొమ్మిది లక్షల కోట్ల రూపాయల విలువైన వస్త్ర ఎగుమతులు సాధించాలని కేంద్ర ప్రభుత్వం లక్షిస్తోంది. భారత హస్తకళా కృతులకూ విదేశాల్లో మంచి ఆదరణ ఉంది. 2023-24లో దాదాపు రూ.15 వేల కోట్ల విలువైన హ్యాండీక్రాఫ్ట్స్‌ను ఇండియా ఎగుమతి చేసింది. గడిచిన అయిదేళ్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల్లో భారత టెక్స్‌టైల్, అపెరల్, హ్యాండీక్రాఫ్ట్ ఎగుమతుల విలువ...

(కోట్ల డాలర్లలో)

2020–21	3,158
2021–22	4,443
2022–23	3,668
2023–24	3,587
2024–25	3,775
2025–26	932 (ఏప్రిల్–జూన్)

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

మన జట్టు 'గోల్' కొట్టేదెప్పుడు?

ప్రపంచంలో క్రికెట్ కంటే ఎక్కువమంది ఆసక్తి చూపించే క్రీడ ఫుట్‌బాల్. కానీ మన దేశంలో రానురాను ఈ ఆట మరింత బలహీనమవుతోంది. భారత దిగ్గజ ఫుట్‌బాల్ ఆటగాడు సునీల్ ఛెత్రి స్థానాన్ని భర్తీ చేసేవాళ్లు లేక... ఆట అటకెక్కుతోంది. రిటైర్ అయిన వ్యక్తినే మళ్లీ వెనక్కి తెచ్చుకుని ఆడించుకోవాల్సిన పరిస్థితి రావడం బాధాకరం. మన దేశంలో ఫుట్‌బాల్‌కు పూర్వ వైభవం రావాలంటే ముందు శిక్షణ తీరు మారాలి.

ఫుట్‌బాల్‌లో భారత్ ఒకప్పుడు వెలిగిన దేశమే. కానీ ఇప్పుడు వందలోపు ర్యాంకు సాధించడానికే ఆపసోపాలు పడుతోంది. సునీల్ ఛెత్రి.. దాదాపు రెండు దశాబ్దాల పాటు ఇండియన్ ఫుట్‌బాల్ జట్టును నడిపించిన సారథి. ఆ ఇరవై ఏళ్లలో మన దేశంలో ఫుట్‌బాల్ బాగానే అభివృద్ధి చెందింది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందడంతో వసతులూ పెరిగాయి. సంతోష్ ట్రోఫీ లాంటి ప్రతిష్ఠాత్మక పోటీలు నిరాటంకంగా జరిగాయి. విదేశీ కోచ్‌లు రావడంతో మన క్రీడాకారుల ఆట కూడా మెరుగుపడింది. మన కంటే మెరుగైన జట్లకు కూడా గట్టి పోటీ ఇవ్వగల దేశంగా ఎదిగి... టాప్-100లో నిలిచింది. కానీ సునీల్ ఛెత్రి వీడ్కోలు భారత జట్టుకు శాపమైంది. అనంతరం జరిగిన ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో మన కంటే తక్కువ ర్యాంకు ఉన్న అఫ్గానిస్థాన్ జట్టు చేతుల్లో ఓడిపోయింది. ఒక్క ఆటగాడు లేకపోవడంతో జట్టు ఎంత బలహీనపడిందో చెప్పడానికి ఈ ఫలితం నిదర్శనమైంది. దాంతో కొన్ని నెలల్లోనే సునీల్ మళ్లీ జట్టులోకి రావాల్సి వచ్చింది.



గతమెంత ఘనమైనా..

విజయన్, బైచుంగ్ భుటియా, సునీల్ ఛెత్రి గత 30 ఏళ్లలో భారత్ ఫుట్‌బాల్ జట్టు స్టార్ ప్లేయర్లు. మధ్య మధ్యలో కొందరు ఆటగాళ్లు వెలుగులోకి వచ్చినా స్థిరంగా సత్తా చాటలేకపోయారు. కానీ ఒకప్పుడు భారత జట్టులో ఎక్కువమంది స్టార్లు ఉండేవాళ్లు. ఒకరిని మించి ఒకరు ఆడేవాళ్లు. అందుకే 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్‌లో మన దేశం నాలుగో స్థానం దక్కించుకోగలిగింది. కానీ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా జట్టును వీడటంతో భారత ఫుట్‌బాట్ జట్టు క్రమంగా బలహీనపడింది. ఐరోపా శైలి ఆటను అందిపుచ్చుకోవడంలో విఫలమైంది. ఫుట్‌బాల్ జట్టు ఆట.. ఒకరు ఆడితే సరిపోదు. ఒక మెరుగైన ప్లేయర్ ఉంటే, మిగిలిన వాళ్లను నడిపిస్తూ ముందుకు సాగవచ్చు. విజయన్ వెళ్తే భుటియా వచ్చాడు. భుటియా రిటైర్ అవ్వగానే ఛెత్రి.. ఆ స్థానాన్ని భర్తీ చేశాడు. ఇప్పుడు ఛెత్రి స్థాయిని అందుకునే ప్లేయర్ దొరకకపోవడమే దురదృష్టం.

ఖేలో ఇండియా లాంటి కార్యక్రమాల ద్వారా నైపుణ్యమున్న క్రీడాకారులను గుర్తిస్తున్నారు. కానీ ఆ కార్యక్రమాలేవీ అమలులో అంతగా ప్రభావం చూపట్లేదు. దేశానికి ఆడగలిగే స్థాయి ప్లేయర్లు వెలుగులోకి రావట్లేదు. ఈ విషయంలో జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య ప్రణాళికా లోపం స్పష్టమవుతోంది. 2017లో భారత్ వేదికగా అండర్-17 ప్రపంచకప్ జరగడం మన దేశంలో ఈ ఆటకు ఉత్సాహాన్ని ఇచ్చింది. అయితే అందులో నుంచి ఎక్కువమంది సీనియర్ జట్టులో చోటు దక్కించుకోలేకపోయారు. జూనియర్లను ప్రోత్సహించి ముందుకు తీసుకెళ్లే వేదిక లేకపోవడమే ఇందుకు కారణం. ఇండియన్ సూపర్ లీగ్‌ను ఆరంభించి దశాబ్దం కావొస్తోంది. ఆశించిన ఫలితాలు మాత్రం రావట్లేదు. బ్రెజిల్, ఫ్రాన్స్, అర్జెంటీనా దేశాల నుంచి కొంతమంది ప్లేయర్లు భారత్‌కు వస్తున్నా, వాళ్లందరూ నాలుగో శ్రేణి ఆటగాళ్లే. పైగా రిటైర్ అయినవాళ్లు. దీని వల్ల మన క్రీడాకారులకు పెద్దగా ఉపయోగం ఉండట్లేదు.

శిక్షణ శిబిరాలతో...

బ్రెజిల్, అర్జెంటీనా లాంటి దేశాల్లో ఒక ఆటగాడు జాతీయ జట్టు నుంచి వెళ్లిపోయినా ఆ జట్టుకు నష్టమేమీ ఉండదు. ఎందుకంటే అతడి స్థానాన్ని భర్తీ చేయడానికి చాలామంది సిద్ధంగా ఉంటారు. నాణ్యమైన ఆటగాళ్లు లీగ్స్‌లో ఆడుతూ తమ స్థానం కోసం ఎదురు చూస్తుంటారు. కానీ భారత్‌లో మాత్రం పూర్తిగా భిన్నం. ఒక మంచి ప్లేయర్ రిటైర్ అయితే ఆ స్థాయి ఆటగాడు కరవే. మన దగ్గర లీగ్ వ్యవస్థ బలంగా లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రపంచ స్థాయిని పక్కన పెడితే కనీసం ఆసియాలోనైనా భారత్ రాణించకపోవడం కలవరపరిచే విషయం. ఇది ఇలాగే కొనసాగితే మన దేశంలో ఫుట్‌బాల్ ఆట మరింత పతనమవుతుంది. అలా జరగకూడదంటే మొదటి నుంచే ప్రతిభావంతులను గుర్తించి వారిని సానబెట్టాలి. జట్టుకు కావాల్సినట్లుగా తీర్చిదిద్దుకోవాలి. తరచూ శిబిరాలు నిర్వహిస్తూ, విదేశీ కోచ్‌లను రప్పించి శిక్షణ ఇప్పించాలి. మన జూనియర్ జట్లను విదేశాలకు పంపి టోర్నీల్లో ఆడించాలి. అప్పుడే మన ఫుట్‌బాల్ జట్టు మెరుగైన ఫలితాలు రాబట్టే అవకాశం ఉంటుంది.

– దాస్యం వెంకట వంశీకృష్ణ

బాక్స్ తీసిందెవరు?

లక్కీ ఆరో తరగతి చదువుతోంది. ఆరోజు కూడా ఎప్పటిలాగే వాళ్లమ్మ ఇచ్చిన లంచ్‌బాక్స్ తీసుకుని స్కూల్‌కి వెళ్లింది. క్లాసులన్నీ బుద్ధిగా విని.. టీచర్లు చెప్పిన నోట్స్ కూడా రాసుకుంది. లంచ్ టైంలో తన స్నేహితుడు విక్కీతో.. 'ఈరోజు మా అమ్మ నాకు చాలా ఇష్టమైన శాండ్‌విచ్ చేసింది తెలుసా!' అంటూ ఉత్సాహంగా చెప్పింది. ఇద్దరూ తినడానికి కూర్చుని బాక్సులు తెరిచారు. కానీ లక్కీ బాక్స్ మాత్రం ఖాళీగా ఉంది. తను చాలా బాధపడింది. 'మరేం పర్లేదులే లక్కీ.. ఈరోజుకు నా బాక్స్ తినేద్దాంలే' అన్నాడు విక్కీ. ఇక ఇద్దరూ తినేసి క్లాస్‌కి వెళ్లిపోయారు. ఆ మరుసటి రోజూ ఇలానే జరిగింది. లక్కీ బాక్స్ ఎవరో తినేసి ఖాళీగా పెడుతున్నారు.

అసలు అది ఎవరి పనో కనిపెట్టాలనుకున్నారు లక్కీ, విక్కీ. 'ఒక పని చెయ్.. రేపు కూడా మీ అమ్మను శాండ్‌విచ్ పెట్టమని అడుగు. తరవాత అందులో ఒక దాంట్లో కాస్త పచ్చిమిర్చి ఎక్కువ వెయ్యి. అది బాక్స్‌లో పెట్టు, ఎప్పటిలా ఉన్నదేమో నీ బ్యాగ్‌లోనే పెట్టుకో' అని చెప్పాడు విక్కీ. అలాగే చేసింది లక్కీ. లంచ్ టైం కంటే ముందుగానే బయటికి వెళ్లిన రుత్విక్.. లక్కీ బాక్స్ తీసుకుని తినసాగాడు. అందులో మిర్చి ఎక్కువగా ఉండటంతో పాపం నోరంతా మండిపోయింది. గబగబా క్లాస్‌లోకి వచ్చి నీళ్లు తాగాడు. అదంతా లక్కీ, విక్కీ గమనించారు. తన దగ్గరికి వెళ్లిన లక్కీ.. 'అదేంటి రుత్విక్.. నన్ను అడిగితే ఎంచక్కా అందరం పంచుకుని తినేవాళ్లం కదా! ఇలా చెప్పకుండా ఎందుకు తీసుకుంటున్నావు. పోనీ తీసుకుంటే తీసుకున్నావు.. నీ బాక్స్ అయినా అక్కడ పెట్టాలి కదా! రెండురోజుల నుంచి నేను, విక్కీ బాక్స్ షేర్ చేసుకుంటున్నాను. నీ వల్ల మేమిద్దరం సగం ఖాళీ కడుపుతోనే ఉండాల్సి వచ్చింది తెలుసా!' అంది. 'సారీ లక్కీ..! ఇంకోసారి ఇలా చేయను. ఇదిగో ఈరోజు నా బాక్స్ షేర్ చేసుకుందాం పదండి' అన్నాడు రుత్విక్. ఇక ముగ్గురూ కలిసి ఎంచక్కా లంచ్ చేసేశారు.

– అందె ఉదయశ్రీ



హాయ్! బుజ్జీ!!

ఆ ఒక్కటి ఏది?

ఇక్కడ ఇచ్చిన వాటిల్లో ఒకటి మాత్రం మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. అదేంటో కనిపెట్టండి చూద్దాం.

1. పెన్, ల్యాప్‌టాప్, పెన్సిల్, నోట్‌బుక్
2. పళ్లెం, గరిట, గాజులు, గ్లాసు
3. భరతనాట్యం, కథకళి, కూచిపూడి, ఫ్లూట్

జవాబు: 1. ల్యాప్‌టాప్ 2. గాజులు 3. ఫ్లూట్

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో ఈ నెల 25వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్య క్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొ న్నారు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని పింగళి వెంకయ్య సమా వేశ మందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1. 30 గంటల వరకు వినతి పత్రాలను స్వీకరించనున్నట్టు వివరిం చారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మీకోసం వెబ్‌సైట్‌లోనూ: ప్రజలు తమ సమస్యల అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఇందులో దాఖలైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారాన్ని తెలుసుకునేందుకు 1100 నంబరుకు ఫోన్ చేయవచ్చని ఆయన చెప్పారు.




ఖిల్లా.. కళకళ..

ఆదివారం సెలవు కావడంతో కొండపల్లి ఖిల్లా సంద ర్శకులతో కళకళలాడింది. పిల్లలు, పెద్దలు అంతా కలిసి కొండపై సందడి చేశారు. కోటలోని ఆనాటి రాజుల చిత్రాలు, కొండపల్లి బొమ్మలు, కోట బురుజులపై ఉన్న అద్భుత కళాఖండాలను ఆసక్తిగా తిలకిస్తూ, చరవాణిలో స్వీయ చిత్రాలు తీసుకుంటూ, ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. కొండంతా కలియతిరుగుతూ అలనాటి కట్టడాలను చూస్తూ చరిత్ర నెమరేసుకున్నారు. చెట్ల కింద సేదతీరుతూ, అక్కడే భోజనాలు చేస్తూ కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఉల్లాసంగా గడిపారు.

-ఈనాడు, అమరావతి

అడిగినంత ఇచ్చుకో.. అందినంత దోచుకో!

వైకాపా హయాంలో అక్రమాలెన్నో

ఈనాడు, అమరావతి



☛ **రెడ్డిగూడెం మండలంలో** కొందరు క్షేత్ర సహాయకులు, మేట్లు కలిసి కొత్త రకం దందా చేశారు. ఉపాధి శ్రామికుల నుంచి వారానికి రూ.100 చొప్పున నెలకు రూ.400 వసూలు చేశారు. ఇలా వేల మంది శ్రామికుల నుంచి భారీగా వసూళ్లు చేశారు.

☛ చాలా పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో చేసిన పనికి, దస్త్రాల్లో చూపిన దానికి పొంతన లేదు. గోరంత పనులు చేసి కొండంత బిల్లులు చేసుకున్నారు. ఒకే పనిని ఇద్దరు క్షేత్రసహాయకులు చేసినట్లు బిల్లులు పెట్టుకున్నారు. ఈ తరహాలో మండలంలో దాదాపు రూ.50 లక్షల వరకు స్వాహా చేశారు.

☛ కుదప, నరుకుళ్లపాడు, రంగాపురం గ్రామాల్లోనే ఇద్దరు అంగన్‌వాడీ ఉద్యోగులు, ఇద్దరు వీవోఏలు, బ్యాంకు అటెండర్లు ఇలా చాలా మంది ఉద్యోగులకు జాబు కార్డులు ఇచ్చారు. వారు పని చేసినా చేయకున్నా తప్పుడు మస్టర్లతో అక్రమాలకు పాల్పడ్డారు.

☛ కుటుంబానికి ఒక కార్డు, వంద రోజుల పని కల్పిస్తారు. ఇక్కడ మాత్రం ఒకే కుటుంబానికి రెండు, మూడు కార్డులు ఇచ్చేశారు. దీంతో ఒక్కో కుటుంబానికి 200 వరకు పని దినాలు పెంచి అక్రమంగా నిధులు మింగేశారు. నరుకుళ్లపాడు పరిధిలోనే 50 వరకు ఈ తరహా అధిక కార్డులు ఉన్నాయి. వైకాపా పాలనలో రెడ్డిగూడెం మండలంలో భారీగా ఉపాధి నిధుల స్వాహా జరిగింది. శ్రామికుల నుంచి నెలవారీ మామూళ్ల వసూళ్లు, పని కొలతల్లో కిరికిరి.. ఉద్యోగులకు జాబు కార్డులు, ఒకే కుటుంబానికి రెండు మూడు కార్డులు జారీ...ఇలా అనేక అక్రమాలతో ఉపాధి నిధులు భారీగా మింగేశారు.

రూ.కోటికి పైగా దోపిడీ.. 2024-25లో మండలానికి రూ.14 కోట్లు కేటాయించారు. ఎన్నికల్లోగా మొత్తం చక్కబెట్టుకోవాలని వైకాపా నాయకులు, క్షేత్ర సహాయకులు కుమ్మక్కై దోపిడీకి కొత్త దారులు వేశారు. ఎన్నికల్లోగా 90 శాతం పనులు, వంద శాతం వసూళ్లు ముగించారు. ప్రతి పంచాయతీలో అవకతవకలున్నా.. రంగాపురం, నరుకుళ్లపాడు, కుదప గ్రామాల్లో భారీగా అక్రమాలు జరిగాయి. శ్రీరామపురంలో మస్టర్లు మొత్తం కొట్టి వేతలతో దర్శనమిచ్చాయి. వంద రోజులు పనికి రాకున్నా మస్టర్లు వేసి బిల్లులు చేసుకున్నారు. అనేక విధాలుగా రూ.కోటికి పైగా దోపిడీ చేశారు.

మట్టి గణపతికే.. జై

జిల్లాలో రికార్డు నెలకొల్పేందుకు సన్నాహాలు

ఈనాడు, అమరావతి

పర్యావరణహిత మట్టి గణనాథుడి స్ఫూర్తి ఈ ఏడాది ఉవ్వెత్తున ఎగిసిపడుతోంది. ఏటా ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో పలు రకాల కార్యక్రమాలను నిర్వహిస్తూ.. మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తూ.. కాలుష్య నివారణకు తీవ్రంగా కృషి చేస్తుంటారు. ఈ ఏడాది ఎన్టీఆర్ జిల్లా ప్రభుత్వం యంత్రాంగమంతా కలిసి.. పర్యావరణహిత గణనాథుడినే పూజిద్దామంటూ ప్రచారం చేస్తోంది. ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడానికి.. ఈనెల 26న వినాయక చవితికి ముందురోజు గిన్నిస్ రికార్డును సృష్టించేందుకు విజయవాడలో ఏర్పాట్లు చేస్తున్నారు.



ఐదు వేల ప్రతిమలు.. గతంలో 4వేల మందికి పైగా మట్టి గణపతి విగ్రహాలను ఒకేసారి చేసి రికార్డు సృష్టించిన నేపథ్యంలో.. తాజాగా విజయవాడ కేంద్రంగా 5వేల మందితో తయారు చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేసింది. నగరంలోని ఇందిరాగాంధీ క్రీడా మైదానంలో 2వేల మంది ఒకేసారి విగ్రహాలను తయారు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే సమయంలో విజయవాడలోని ఐదు విద్యా కేంద్రాల్లో 3వేల మంది విద్యార్థులతోనూ విగ్రహాలను చేయించనున్నారు. వీళ్లందరితో ఒకేసారి విగ్రహాలను తయారు చేయడానికి అవసరమైన శిక్షణను సోమవారం ఇవ్వనున్నారు.

5 టన్నుల మట్టి.. కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దీనికి రూపకల్పన చేశారు. ఇప్పటికే ఐదు టన్నుల బంక మట్టిని తీసుకొచ్చారు. దీనిని ఆరు కేంద్రాల్లో గణేశుని విగ్రహాలను తయారు చేయబోయే అందరికీ అందించనున్నారు.

ప్రత్యేక యాప్ ద్వారా పోటీ.. మట్టి విగ్రహాలను ఈ ఏడాది పూజించే వారికి జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్టీఆర్ ఇగ్నైట్ పేరుతో యాప్‌ను రూపొందించారు. మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసినవాళ్లు ఈ యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తే వాటిలో బాగున్న వాటిని ఎంపిక చేసి ధ్రువపత్రాలు, బహుమతులు ఇస్తారు.

✪ వినూత్నంగా కూరగాయలు, పూలు, విత్తనాలు లాంటి వాటితో విగ్రహాలను తయారు చేసే వారిని ప్రత్యేకంగా ప్రోత్సహించనున్నారు. వేడుకల తర్వాత ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి బహుమతుల ప్రదానం చేయనున్నారు.

కాలుష్య నివారణే లక్ష్యం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులతో తయారు చేసే విగ్రహాల్లో ప్రమాదకర రసాయనాలుంటాయి. ఏటా కృష్ణా నది, చెరువుల్లో జలకాలుష్యం జరుగుతోంది. ప్రకృతికి కలిగే నష్టాన్ని నివారించేందుకే పర్యావరణహిత కార్యక్రమానికి రూపకల్పన చేశాం.

- జి. లక్ష్మీశ, జిల్లా కలెక్టర్

వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో వరద ఆదివారం మరింత తగ్గింది. ప్రకాశం బ్యారేజీకి ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 3,93,025 క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 3,75,125 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు 3,83,916 క్యూసెక్కులు రాగా, 47 గేట్లను పూర్తి గానూ, మిగతా 22 గేట్లను 8 అడుగుల మేర ఎత్తారు. (ఒక గేటు మూసి ఉంది.). సముద్రంలోకి 3,65,725 క్యూసెక్కులు విడుదల చేశారు. పులిచింతల (వజినేపల్లి) నుంచి 3,53,180, పాలేరు నుంచి 706, కీసర (మునేరు) నుంచి 4,238 క్యూసెక్కుల మేర ప్రవాహం ఉంది.

పెరిగిన సాగునీటి అవసరాలు

వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయానికి సాగునీటి అవసరాలు పెరిగాయి. కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాలువలకు నీటి విడుదల పెంచారు. మొత్తం 18,191 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 10,187, పశ్చిమ కాలువకు 8,004 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ 5,017, బందరు 1,911, కేఈబీ 1,802, ఏలూరు కాలువలకు 1,457 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

తెదేపా జిల్లా అధ్యక్షుడి రేసులో.. నలుగురు

త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో సుదీర్ఘంగా సమీక్ష



బుద్దా వెంకన్న, గన్నె ప్రసాద్, బొమ్మసాని, నాగుల్‌మీరా

ఈనాడు, అమరావతి - పటమట, న్యూస్‌టుడే: ఎన్టీఆర్, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుల ఎన్నికకు కసరత్తు పూర్తయింది. అధిష్ఠానం పంపించిన త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ, మచిలీపట్నంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సుదీర్ఘంగా సమావేశాలు నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, సీనియర్ కార్యకర్తలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి బుద్ధా వెంకన్న, గన్నె వెంకట నారాయణ ప్రసాద్(అన్నా), బొమ్మసాని సుబ్బారావు, నాగుల్‌మీరా.. ఈ నాలుగు పేర్లను పార్టీ అధ్యక్షుడి కోసం నాయకులంతా కలిసి ఎంపిక చేసి త్రిసభ్య కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. కృష్ణా జిల్లాలో కొనకళ్ల నారాయణ, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, కోనేరు నాగేంద్రకుమార్ పేర్లను ఎంపిక చేశారు. వీరిలో నుంచి జిల్లా అధ్యక్షులను పార్టీ అధిష్ఠానం ఎంపిక చేస్తుంది.

నాలుగు గంటలకు పైగా సమీక్ష.. విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు త్రిసభ్య కమిటీ సభ్యులైన మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్సీ బి.టి.నాయుడు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, ఆరుగురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు 400 మంది వరకూ హాజరయ్యారు. అందరి అభిప్రాయాలను తీసుకున్న తర్వాత నాలుగు పేర్లను ఎంపిక చేశారు.

★ **బుద్ధా వెంకన్న** ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్‌గా పనిచేశారు. ప్రస్తుతం తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. గతంలో విజయవాడ నగర అధ్యక్షుడిగా ఆరేళ్ల పనిచేశారు.

★ **గన్నె ప్రసాద్** ప్రస్తుతం తెదేపా రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. గతంలో విజయవాడ పట్టణ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.

★ **బొమ్మసాని సుబ్బారావు** ప్రస్తుతం తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఈయన గొల్లపూడి సర్పంచిగా సుదీర్ఘ కాలం పనిచేశారు.

★ **నాగుల్‌మీరాకు** రాష్ట్ర నూర్ బాషా కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఇటీవల పదవి ఇచ్చారు. గతంలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు.

అమరావతి సురక్షితం: మంత్రి

ఈనాడు డిజిటల్, భీమవరం, కాళ్ల, న్యూస్‌టుడే: గత అయిదేళ్లు మూడు ముక్కలాట ఆడిన వైకాపా నాయకులు అమరావతి రాజధానిపై అవాస్తవాలు దుష్ప్రచారం చేస్తున్నారని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు. వైకాపా హయాంలో రాజధానిని నాశనం చేయగా.. ఆ సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించింది, అయిదు ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు, గవర్నర్ బంగ్లా పనులు, రహదారులు, ఐకాన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలంలో జిల్లా తెదేపా త్రిసభ్య కమిటీ సమావేశానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. అమరావతి ప్రాంతంలో కేంద్రం చేపట్టిన పశ్చిమ బైపాస్ పనులు కొనసాగుతున్నాయి, కొండవీటి వాగు ప్రవాహం కింద ఒక్కోచోట పనుల వల్ల మట్టి పేరుకుపోవడంతో వాగులోని నీరు వెళ్లేందుకు తగినంత వీలు లేకుండా పోయిందని, దానిపై వైకాపా నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. మూడు రిజర్వాయర్లు, 22 వేల క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసే నిర్మాణాలను పక్కాగా ప్రణాళిక చేశామన్నారు. అమరావతి రాజధాని చాలా సురక్షితమని, మార్చి నెలాఖరు నాటికి అధికారుల కోసం నిర్మిస్తున్న 4 వేల ఫ్లాట్లలో 250 మినహా అన్నింటినీ వారికే ఇస్తామన్నారు.





దసరా సమీపిస్తున్న నేపథ్యంలో భక్తులకు అసౌకర్యాలు కలగకుండా దుర్గగుడి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2023 సెప్టెంబరులో దుర్గఘాట్ ఎదురుగా ఉన్న కొండ నుంచి భారీగా కొండరాళ్లు పడ్డాయి. ఆ సమయానికి అక్కడ జనసంచారం లేకపోవడంతో ప్రమాదం జరగలేదు. దసరా దగ్గరపడడంతో పాటు తరచూ వర్షాలు కురుస్తుండడంతో కొండరాళ్లు పడకుండా శాశ్వత రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. ఈ కొండ ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో గోడ నిర్మాణం వల్ల వాహనదారులకు రక్షణ లభిస్తుంది.

-ఈనాడు, అమరావతి

ఉద్యానానికి కొత్త రెక్కలు

వినూత్న పంటల సాగుకు శ్రీకారం

ఈనాడు, అమరావతి



రెడ్డిగూడెంలో డ్రాగన్‌ఫ్రూట్

ఉమ్మడి కృష్ణా అనగానే ప్రపంచానికి మధురమైన మామిడి రుచి చూపిన రైతన్న, రాష్ట్రానికి అన్నం పెట్టే అన్నదాత గుర్తొస్తారు. తాజాగా జిల్లాలో యువ రైతులు కొత్త ట్రెండుకు శ్రీకారం చుడుతున్నారు. కొత్త పంటలు సాగు చేసి లాభాలు పండిస్తున్నారు. నేల స్వభావం, వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలాల లభ్యత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని సాగు చేస్తున్నారు. వీరికి కూటమి సర్కారు ఆర్థిక దన్నుగా నిలుస్తోంది.

డ్రాగన్‌పై ఆసక్తి.. ఐదేళ్ల కిందట వరకు కనిపించని డ్రాగన్ జిల్లాలో మొదలైంది. చందర్లపాడు, రెడ్డిగూడెం, పెనుగంచిప్రోలు, గన్నవరం, బాపులపాడు మండలాల్లో రైతులు ఆసక్తిగా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 100 ఎకరాలకు పైగా డ్రాగన్ సాగు చేస్తున్నారు. జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల్లో వ్యాపారులే దీన్ని కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఏడాదికి వంద ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరగనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

విభిన్న పంటలకు వేదిక: రెడ్డిగూడెం విజయవాడ గ్రామీణ పరిధిలో 20 ఎకరాల వరకు అంజీర సాగు చేస్తున్నారు. తిరువూరు, రెడ్డిగూడెం, ఏకొండూరు, రామచంద్రపురం ప్రాంతంలో 30 మంది రైతులు దాదాపు 40 ఎకరాల్లో ఆపిల్ బేర్ సాగు చేస్తున్నారు. జగ్గయ్యపేట పరిధిలో 10 ఎకరాల విస్తీర్ణంలో దానిమ్మ సాగు మొదలుపెట్టారు. మైలవరం మండలం పుల్లూరు, గంపలగూడెం, పెనమలూరు మండలం గోశాల, వణుకూరు పరిధిలో గులాబీ సాగు చేసి పూలు పూయిస్తున్నారు. తోట్లవల్లూరు, మైలవరం మండలాల్లో 20 ఎకరాల్లో ఆవకాడో, బాపులపాడు, చల్లపల్లి మండలాల్లో 20 ఎకరాల్లో వక్కసాగు సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 ఎకరాల్లో నేరేడు సాగు జరుగుతోంది.

ప్రభుత్వ ప్రోత్సాహం

కొత్త పంటల సాగుకు కూటమి సర్కారు వెన్నుదన్నుగా నిలుస్తోంది. దానిమ్మకు ఎకరానికి రూ.2.16లక్షలు, డ్రాగన్ ఫ్రూట్ అరెకరానికి రూ.2లక్షలు, గులాబీ 25సెంట్లకు రూ.62వేలు, అంజీర ఎకరానికి రూ.1.64లక్షలు, ఆపిల్‌బేర్‌కు ఎకరానికి రూ.1.26 లక్షలు, మునగకు 25 సెంట్లకు రూ.27.5వేలు అందిస్తోంది. మొక్కల దశ నుంచి పంట చేతికొచ్చే వరకు ఖర్చు లెక్కించి మొత్తం ప్రభుత్వమే ఉపాధి హామీ నిధుల నుంచి అందిస్తోంది. ఉద్యాన, డ్వామా అధికారులు రైతులకు సాగు సలహాలిస్తున్నారు. భవిష్యత్తులో కొత్త పంటల సాగు పెంచేందుకు ప్రభుత్వం మరిన్ని రాయితీలు తీసుకొస్తోంది.

బీసీల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

ఆటోనగర్(విజయవాడ), న్యూస్‌టుడే: రాష్ట్రంలో బీసీలకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, వారి సంక్షేమానికి అన్నివిధాలా కృషి చేస్తోందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం విజయవాడ ఆటోనగర్‌లోని ఎగ్జిబిషన్ సొసైటీ హాల్‌లో గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, యాత, శ్రీశయన ఆత్మీయ సమావేశానికి మంత్రి హాజరై మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వనన్ని నిధులు కేటాయించి బీసీల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.42,456 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు కీలక పదవులు బీసీలకు కేటాయించి సముచిత స్థానం కల్పించారని చెప్పారు. గత ప్రభుత్వంలో బీసీలకు దక్కాల్సిన వివిధ పదవులు ఇవ్వకుండా.. ఆయా వర్గాలను అణగదొక్కారని ఆరోపించారు. సుమారు 680 మంది బీసీలపై తప్పులు కేసులు పెట్టారని గుర్తు చేశారు. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం కేటాయించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. చేనేత కార్మికుల మగ్గాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వడంతో పాటు జీఎస్టీ తగ్గించారని, సెలూన్ షాపులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకం అమలు చేస్తున్నామని వివరించారు. మత్స్యకారుల సంక్షేమానికి రూ.540 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేటు ల్యాబ్‌లు.. ఆసుపత్రులు టారిఫ్ బోర్డులు ప్రదర్శించాలి'

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు.. ల్యాబ్‌లు తప్పనిసరి ధరల పట్టిక, ఏఏ చికిత్సలకు ఎంత రుసుము వంటి వివరాలు టారిఫ్ బోర్డులో ప్రదర్శించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డా.సుహాసిని ఆదివారం పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద ప్రజలకు కనిపించే విధంగా పెట్టాలని, ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌ల వారు స్కానింగ్ చేసే గది బయట, లోపల, ఐఈసీ మెటీరియల్‌ను తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని, అన్ని అంశాలు ప్రజలకు అర్థమయ్యే విధంగా బోర్డులు ప్రదర్శించాలని కోరారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో చట్ట వ్యతిరేక పనులు, నిబంధనలు అతిక్రమించినట్లు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలంటే జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం, విజయవాడ పాతాసుపత్రి ఆవరణలోని కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు.



కాస్తంత దూరమే కదా ఏముందిలే అని అపసవ్య దిశలో వెళ్తూ పలుచోట్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు కారణమవుతున్నారు. విజయవాడ నగరంలో రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా పోలీసులు ఎన్ని నిబంధనలు పెడుతున్నా విద్యావంతులైన వాళ్లూ వాటిని ఉల్లంఘిస్తూనే ఉన్నారు. ఇలా హడావుడిగా వెళ్తూ ప్రమాదం కొనితెచ్చుకుంటున్నారు.

అపసవ్యం.. అనర్థం..



-ఈనాడు, అమరావతి

శరణ్ మూలాలపై ఆరా!

నగరంలోనూ మ్యూల్ ఖాతాలు తెరిచాడా?

ఈనాడు, అమరావతి

సైబర్ నేరాల్లో కొట్టేసిన సొమ్మును పలు మార్గాల్లో బదిలీ చేసేందుకు మ్యూల్ ఖాతాలు తెరవడంలో కీలక సూత్రధారి లలిత శరణ్‌కుమార్.. నగరంలోని సీతారాంపురం ప్రాంతానికి చెందిన వ్యక్తిగా తెలిసింది. హైదరాబాద్‌లో గత ఏడాది నమోదైన కేసులో శనివారం శరణ్‌ను అక్కడి సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. అక్కడ తెరిచిన ఆరు మ్యూల్ ఖాతాల ద్వారా రూ.156 కోట్లు లావాదేవీలు జరిగినట్లుగా గుర్తించి కేసు నమోదు చేశారు. హైదరాబాద్ పోలీసులు అతనిపై లుకౌట్ నోటీసు జారీ చేశారు. అప్పటి నుంచి నిందితుడు దేశానికి రాకుండా దుబాయ్‌లో ఉంటున్నట్లు గుర్తించారు. శుక్రవారం నేపాల్ సరిహద్దు ద్వారా రోడ్డు మార్గంలో దేశంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించి దొరికిపోయి అరెస్టు అయ్యాడు. విజయవాడ నగరానికి చెందిన వ్యక్తిగా తేలింది. దీంతో విజయవాడ పోలీసులు నిందితుడి గురించి ఆరా తీశారు.

★ ఇక్కడి రికార్డుల్లో ఎక్కడా పేరు లేకపోవడంతో వివరాలు బయటకు రాలేదు. హైదరాబాద్‌తో పాటు అహ్మదాబాద్‌లోనే కేసులు ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడ మాత్రం పోలీసుల రికార్డులకు ఎక్కలేదు. తెలంగాణలోని హెడ్‌క్వార్టర్ సైబర్ క్రైమ్ విభాగంతో మాట్లాడి సమాచారం రాబడుతున్నారు. నిందితుడు పలు ప్రాంతాల్లో డబ్బు ఆశచూపి బ్యాంకు ఖాతాలను తెరిపించి కమీషన్ ముట్టజెప్పేవాడని తెలిసింది. శరణ్‌కు పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్లు హైదరాబాద్ పోలీసుల విచారణలో వెల్లడైంది. విజయవాడ నగరంలో అతని తల్లిదండ్రులు సీతారాంపురంలో ఉంటున్నట్లు సమాచారం. వారికి అక్కడి పోలీసుల నుంచి ఫోన్ రావడంతో హైదరాబాద్ వెళ్లినట్లు తెలిసింది. బెజవాడలోనూ ఇటీవలి కాలంలో మ్యూల్ ఖాతాల ద్వారా సొమ్ము బదిలీ అయినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. దీంతో శరణ్ సొంతూరిలోనూ పలువురితో ఖాతాలు తెరిపించి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

★ కంబోడియా, చైనా, మలేషియా, దుబాయ్, తదితర దేశాల్లో సైబర్ నేరగాళ్లకు అద్దె ఖాతాలను సమకూర్చేవాడు. ఈ ఖాతాల్లో పడిన సొమ్ము వివిధ మార్గాల్లో బిట్ కాయిన్ల రూపంలో ఇతర దేశాలకు తరలిపోతోంది. విజయవాడ నగరంలో ఈ మధ్య కాలంలో నమోదైన పలు సైబర్ క్రైమ్ కేసుల్లో అద్దె ఖాతాల ద్వారా డబ్బు తరలిపోయిందని పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసుల సాయంతో ఇక్కడి మూలాలను కూడా తవ్వే పనిలో నిమగ్నమయ్యారు.

ఆరు పలకలు.. అడ్డ దారులు!

- ✪ ప్రమాదకర మెఫెంటర్మిన్ సల్ఫేట్ ఇంజక్షన్ల వాడకం
- ✪ యువత ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

పటమట, న్యూస్‌టుడే

ఈ నెల 23న విజయవాడ మొగల్రాజపురంలోని మెట్రో వద్ద అనధికారికంగా మెఫెంటర్మిన్ సల్ఫేట్ ఇంజిక్షన్లు విక్రయిస్తున్న నగరానికి చెందిన జి.వేణుగోపాల్, కె.ఫణీంద్రలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 20 ఇంజిక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. వ్యాయామానికి వెళ్తున్న యువతకు అనధికారికంగా రెట్టింపు ధరకు వాటిని విక్రయిస్తున్నారు.

★ ఫార్చ్యూన్ మురళీ రోడ్డులోని ది కెఫెన్ షాపు నుంచి నగరంలోని జిమ్‌లకు అనాబాలిక్ స్టెరాయిడ్‌లను సరఫరా చేస్తున్నారనే సమాచారంతో ఈగల్ బృంద సభ్యులు ఈ ఏడాది మార్చిలో దాడులు చేశారు. 44 రకాల అనాబాలిక్ స్టెరాయిడ్‌లను స్వాధీనం చేస్తున్నారు. వాటిని సరఫరా చేస్తున్న సమీర్ అలీఖాన్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నగరంలోని జిమ్‌లకు అతను వాటిని సరఫరా చేస్తున్నట్లు తేలింది. కండరాలు పెంచడం కోసం జిమ్ ట్రైనర్లు ఏకంగా సమీర్ అలీఖాన్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు గుర్తించారు.



ఆరు పలకల దేహంపై మోజు పెంచుకుంటున్న యువకులు పెడదారి పడుతున్నారు. రాత్రికి రాత్రే సిక్స్ ప్యాక్ రావాలని అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రమాదకర సూది మందులు, స్టెరాయిడ్లు తీసుకుంటున్నారు. కొన్ని జిమ్ సెంటర్లు నాలుగు, ఐదు నెలల్లో ఆరు పలకల దేహం వచ్చేలా శిక్షణ ఇస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నాయి. ఆశపడి వచ్చేవారికి ప్రొటీన్ పౌడర్లు, స్టెరాయిడ్లు అలవాటు చేస్తున్నారు. జిమ్‌లకు వెళ్తున్న ప్రతి పది మందిలో ఇద్దరు ముగ్గురు అలాంటివి తీసుకుంటున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో అలాంటి ఉత్పత్తులు విపరీతంగా అందుబాటులో ఉన్నాయి. స్పోర్ట్స్, బాడీ బిల్డింగ్ ఇతర అవసరాలకు తగినట్లు ప్రొటీన్ ఉత్పత్తులు పుట్టుకొస్తున్నాయి. వాటిపై నియంత్రణ లేదు. వాటిని విచ్చలవిడిగా వాడి యువకులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జిమ్‌లపై నిఘా పెంచి ఇలాంటి ఉత్పత్తులను అరికట్టాల్సిన అవసరం ఉంది.

మూత్రపిండాలు పాడైపోతాయి



సిక్స్ ప్యాక్ కోసం యువకులు వ్యాయామశాలలకు వెళ్తున్నారు. తక్కువ సమయంలో ఆరు పలకలు రావాలనే ఆలోచనతో మెఫెంటర్మిన్ సల్ఫేట్ ఇంజిక్షన్లు, స్టెరాయిడ్లు, ప్రొటీన్ పౌడర్లు తదితరాలను అవగాహన లేక వాడుతున్నారు. ఆ ప్రభావం మూత్రపిండాలపై పడుతోంది. 25 నుంచి 30 ఏళ్ల లోపు యువకుల మూత్రపిండాలు దెబ్బతింటున్నాయి. వాటిని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

- ఎం.వి.విశ్వనాథ్, కిడ్నీ వ్యాధి నిపుణుడు

అడుగులు పడుతున్నాయ్..

ఓఆర్ఆర్‌కు భూసేకరణలో సర్వే నంబర్ల ఖరారు

మైలవరం, న్యూస్‌టుడే



మైలవరంలో బాహ్యవలయ రహదారికి కలవనున్న జాతీయ రహదారి (30)

రాష్ట్ర ప్రజలు కలగా భావిస్తున్న బాహ్యవలయ రహదారి(ఓఆర్ఆర్) నిర్మాణానికి కార్యాచరణ దిశగా యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఇప్పటికే జిల్లాలో నిర్మిత ప్రాంతానికి సంబంధించి కన్సల్టింగ్ సంస్థ ఇచ్చిన నివేదికల ఆధారంగా రెవెన్యూ యంత్రాంగం భూములను గుర్తించింది. గుర్తించిన సర్వే నంబర్లలో భూముల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలంటూ జిల్లా అధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయికి అందజేయడంతో ఓఆర్ఆర్ నిర్మాణంపై ప్రజల్లో ఆశలు చిగురిస్తుంటే, బహిరంగ మార్కెట్లో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

స్వల్ప మార్పులతో: గత తెదేపా హయాంలో రాజధాని అమరావతి చుట్టూ నిర్మించే బాహ్యవలయ రహదారి కోసం భూములను నిర్ధారించారు. అప్పట్లోనే చాలా వరకు సర్వే నంబర్లను గుర్తించి, రిజర్వ్ చేయగా.. ఆ తర్వాత వైకాపా అధికారంలోకి రావడంతో నిర్మాణ కలలు ధ్వంసమయ్యాయి. తిరిగి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టడంతో గతంలోని నివేదికల్లో స్వల్ప మార్పులు, చేర్పులతో రెవెన్యూ యంత్రాంగం పూర్తిస్థాయి భూముల జాబితాలను సిద్ధం చేసింది. జిల్లా జాయింట్ కలెక్టర్(జేసీ)ను కాంపిటేట్ అథారిటీగా నియమించింది.

జిల్లాలో ఇలా..

ఓఆర్ఆర్ నిర్మించే మండలాలు: 4
భూ సేకరణ గ్రామాలు: 18
రెవెన్యూ డివిజన్లు: 2
ప్రతిపాదనలు: 3093.54 ఎకరాలు

నాలాలు చెల్లించొద్దు: జిల్లాలో నాలుగు మండలాల పరిధిలో రహదారి నిర్మించనుండగా.. ఆయా ప్రాంతాల్లో సుమారు వెయ్యి మందికి పైగా రైతుల నుంచి భూమిని సేకరించనున్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో భూముల రిజిస్ట్రేషన్ల ధరలు ఖరారై ఉన్నాయి. ఈ నేపథ్యంలో గుర్తించిన సర్వే నంబర్లలో లేఔట్ల కోసం, ఎటువంటి నాలా (భూ వినియోగ మార్పిడి రుసుం)లను చెల్లించుకోవద్దని గత నెలాఖరులోనే జేసీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ మండలాల్లోనే : గుర్తించిన సర్వే నంబర్లను జేసీ ద్వారా జిల్లా రిజిస్ట్రార్‌కు, విజయవాడ, నందిగామ ఆర్డీవోలకు జాబితాలను పంపారు. వాటికి రిజిస్ట్రేషన్లను ఆపాలని ఆదేశించడంతో, ఆయా మండలాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లకు జాబితాలు చేరాయి. భూ సేకరణ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా 500 మీటర్ల వెడల్పున రిజిస్ట్రేషన్లు నిలిపేస్తూ ఆదేశాలిచ్చారు. మైలవరం మండలంలో మైలవరం, పొందుగల, జి.కొండూరులో.. దుగ్గిరాలపాడు, వేట్రంపాడు, కుంటముక్కల, చిన నందిగామ, కోడూరు, వీరులపాడు పరిధిలో గూడెం మాధవరం, చెన్నారావుపాలెం, జుజ్జూరు, జగన్నాథపురం, పొన్నవరం, కంచికచర్ల మండలంలో కునికినపాడు, మోగులూరు, మున్నలూరు, పేరకలపాడు, కంచికచర్లలో భూ సేకరణ చేయనున్నారు.

ఇది.. సైకిల్ వారం!

ఎన్టీఆర్ జిల్లా పోలీసుల వినూత్న నిర్ణయం

- ఇంటికి పదడుగుల దూరంలో ఉన్న దుకాణంలో పాల ప్యాకెట్ తేవాలంటే బండి తీయాలి.
- పప్పు, ఉప్పులకు నాలుగు అడుగులు వేయాలంటేనే కష్టపడిపోతున్నారు.
- ఉదయం లేదా సాయంత్రం వేళ కాస్తంత నడకకు వెళదామంటే అమ్మో... అంటున్నారు. పిల్లలు, పెద్దల్లో ఇదీ పరిస్థితి. రోజూ కొద్దిపాటి వ్యాయామంతో రోగాలను దూరం పెట్టవచ్చని చెబుతుంటే వినేసి... ప్చ్ అని పక్కన పెట్టేస్తున్నారు.

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

ఆరోగ్యంపై అవగాహన ఉన్న కొద్ది మంది నడకంటే ప్రాణమిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ఫిట్ ఇండియా' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. వారంలో ఒక రోజు సైకిల్ వాడాలని సూచిస్తున్నాయి. విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు దీనిని అమల్లోకి తీసుకొచ్చారు. ఆదివారం మహాత్మా గాంధీ రోడ్డులోని కేపస్ వ్యాస్ కాంప్లెక్సు వద్ద ఈ వినూత్న కార్యక్రమానికి డీసీపీ ఎస్.వి.డి. ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు.

పోలీసులు, విద్యార్థులు పోటాపోటీగా.... కేపస్ వ్యాస్ కాంప్లెక్సు నుంచి సైకిల్‌పై బయలుదేరిన పోలీసులు, విద్యార్థులు మహాత్మాగాంధీరోడ్డులో పాత పోలీస్ కంట్రోల్‌రూం వరకు వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి కాంప్లెక్సు వద్దకు చేరుకున్నారు. ఉత్సాహంగా పోటాపోటీగా జరిగిన ఈ కార్యక్రమం.. నగరంలో వినూత్నంగా కనిపించింది. పలు పోలీస్‌స్టేషన్ల అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున తరలివచ్చారు.



ఆదివారం సైకిల్ వారాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీసీపీ ఎస్.వి.డి.ప్రసాద్

ఆదివారం సైకిల్‌వారం అంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇకపై ప్రతి పోలీస్‌స్టేషన్‌లోనూ సిబ్బంది ఆదివారం సైకిల్ తొక్కాలని నిర్ణయించుకున్నారు.

అరగంట సైక్లింగ్‌తో ఆరోగ్యం

ప్రతి రోజూ కనీసం రోజుకు అరగంట సైకిల్ తొక్కాలంటున్నారు వ్యాయామ నిపుణులు. దీనివల్ల శరీరానికి కావాల్సిన వ్యాయామం లభిస్తుంది. సహజ సిద్ధమైన వాతావరణంలో సైకిల్ తొక్కితే.. ఊబకాయం, మధుమేహం వంటి రోగాలు దరిచేరవని చెబుతున్నారు. తద్వారా శరీరం చురుకుగా మారి మనసు ప్రశాంతంగా ఉంటుందని చెబుతున్నారు. పోలీసులే కాదు... మనమూ ఆదివారం సైకిల్ వారం పాటించి ఆరోగ్యం కాపాడుకుందామా..

నాలుగు పోస్టులకు అవకాశం

డీఎస్సీలో సత్తా చాటిన గిరిజన యువకుడు



నాగరాజు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన గిరిజన యువకుడు భూక్యా నాగరాజు డీఎస్సీలో ఉత్తమ ర్యాంకులు సాధించి నాలుగు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యే అవకాశాన్ని మెరుగుపర్చుకున్నాడు. అతను ఎమ్మెస్సీ, బీఎడ్, డీఎడ్ పూర్తి చేశాడు. ఇంటర్ తరువాత బీటెక్‌లో చేరి మధ్యలో ఆపేశాడు. తరువాత నాగార్జున విశ్వవిద్యాలయం ద్వారా ఓపెన్ విధానంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించాడు. 2015, 2018 డీఎస్సీలు రాసినప్పటికీ ఉద్యోగం దక్కలేదు. అవనిగడ్డలోని ఓ సంస్థలో శిక్షణ తీసుకున్నాడు. తాజా డీఎస్సీ పరీక్షలో ఎస్టీ కేటగిరీలో పీజీటీ(గణితం) 191వ ర్యాంక్, స్కూల్ అసిస్టెంట్(గణితం) 530వ ర్యాంక్, స్కూల్ అసిసెంట్(ఫిజిక్స్) 276వ ర్యాంక్, ఎస్జీటీ జనరల్ కేటగిరీలో 213వ ర్యాంక్ సాధించాడు. ప్రస్తుతం తను గ్రామంలో ఎస్‌బీఐ కస్టమర్ సర్వీసు పాయింట్ నిర్వహిస్తున్నాడు. తల్లిదండ్రులు గన్యానాయక్, లక్ష్మి వ్యవసాయం చేస్తున్నారు. పదేళ్లుగా డీఎస్సీలో ఉపాధ్యాయ కొలువు దక్కించుకోవాలని వివాహం చేసుకోకుండా నిరీక్షించారు. ఎట్టకేలకు ఈ డీఎస్సీలో నాలుగు ఉపాధ్యాయ పోస్టులకు మంచి ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందని, తాను పీజీటీ(గణితం) పోస్టు ఎంపిక చేసుకుంటానని చెప్పాడు. ఎస్జీటీ కోసం తీసుకున్న శిక్షణ డీఎస్సీలో ఈ ర్యాంకులకు దోహదపడిందని తెలిపాడు.

బుజ్జాయిలు.. బొజ్జగణనాథులు



విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తాము తయారుచేసిన మట్టి వినాయక ప్రతిమలతో చిన్నారులు. - న్యూస్‌టుడే, గవర్నర్‌పేట

రైతులకు అండగా ఉండడమే ప్రభుత్వ ధ్యేయం

అట్టహాసంగా అన్నదాత సుఖీభవ విజయోత్సవ సభ

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అమలు చేసిన అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. తెదేపా ప్రభుత్వం రైతులకు అండగా ఉండాలనేది సీఎం చంద్రబాబు లక్ష్యమని స్పష్టం చేశారు. పంటల సాగు తరుణంలో పెట్టుబడి కోసం ప్రభుత్వం అందించిన ఆర్థికసాయం ఎంతో ఉపయుక్తంగా ఉందని కర్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. తిరువూరులో ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ విజయోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ యార్డులో తెలుగు రైతులతో సమావేశం, బైపాస్ రోడ్డులోని అయ్యప్పస్వామి గుడి నుంచి రాజుపేట అష్టలక్ష్మి అమ్మవారి గుడి వరకు ట్రాక్టర్లతో భారీ ప్రదర్శన నిర్వహించారు. సభలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం సృష్టించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటూ ఎన్నికల హామీలను అమలు చేస్తోందన్నారు. తెలుగురైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, ఏఎంసీ ఛైర్‌పర్సన్ ఆర్.లక్ష్మీఅనిత, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వి.మునియ్య, తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాల పార్టీ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, ఆర్.సుబ్బారావు, ఎం.రామకృష్ణ, పట్టణ శాఖ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, తెదేపా సీనియర్ నాయకులు టి.రామారావు, డీవీ.కృష్ణారావు, ఆర్.వీరారెడ్డి, వై.పుల్లయ్యచౌదరి, బి.ఉమామహేష్, జి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో భుజాన నాగలితో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నాయకులు

పర్యావరణ హితంగా గణపతి నవరాత్రులు



మాట్లాడుతున్న త్రిమూర్తిరాజు, పక్కన వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ హితంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని గణపతి నవరాత్రి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి పి. త్రిమూర్తిరాజు తెలిపారు. ఆదివారం గాంధీనగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాల నిర్వాహకులకు అన్ని రకాల అనుమతులు సింగిల్ విండో పద్ధతిలో 24గంటల్లోనే ఇస్తున్నారని తెలిపారు. ఎక్కడైన సమస్యలు ఉంటే తెలియజేయాలని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. అసభ్యకర పాటలు, రాజకీయ అంశాలకు తావులేకుండా ఉత్సవాలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. మండపాలకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. త్వరలో జిల్లాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు వ్యవహరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ ఉపాధ్యక్షుడు బి. వెంకటేశ్వరరావు, కార్యదర్శి సానా శ్రీనివాస్, బాలకృష్ణ లోయ, సంజయ్ మెహత, పల్లపు రాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయండి



అధికారులతో మాట్లాడుతున్న రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ అధికారులను సూచించారు. ఇంద్రకీలాద్రిపై సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించే దసరా ఉత్సవాల ఏర్పాట్లను ఈవో శీనానాయక్‌తో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. రామచంద్ర మోహన్ మాట్లాడుతూ.. ప్రసాదాల పోటు, అన్నదాన భవనం, పూజా మందిరాలు, ఎలివేటెడ్ క్యూలైన్లు ఉత్సవాలకు ఇబ్బంది లేకుండా పూర్తి చేయాలన్నారు. భక్తులకు అవసరమైన తాగునీరు, ప్రసాదాలు, అన్నప్రసాద పంపిణీకి ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనల మేరకు భక్తులకు మూలా నక్షత్రం రోజున ఉచిత లడ్డు ప్రసాదాన్ని అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఉత్సవాల్లో ప్లాస్టిక్‌కు బదులు రీసైక్లింగ్ చేయగల వస్తువులను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, డీఈలు రవీంద్ర, అశోక్ పాల్గొన్నారు.

మధుమేహానికి అత్యాధునిక వైద్యం

లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : మధుమేహం ఉందని భయపడొద్దని, దానికి అత్యంత ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందని యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ (వైడీఆర్ఎఫ్) మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ యలమంచి సదాశివరావు అన్నారు. యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డయాబ్ ఎండోకాన్-2025 సదస్సు విజయవాడ లబ్బీపేటలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శరీర బరువును అదుపులో ఉంచుకోవడం వల్ల మధుమేహాన్ని నియంత్రించడంతో పాటు గుండె జబ్బుల ముప్పు నుంచి తప్పించుకోవచ్చని సూచించారు. ఇన్సులిన్ ఇంజక్షన్ల నుంచి త్వరలో విముక్తి లభిస్తుందని, ఇన్సులిన్ సులువుగా తీసుకునేలా ఇన్‌హేలర్లు అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది వైద్య నిపుణులు హాజరై.. ఆధునిక చికిత్సా పద్ధతులు, నూతన ఆవిష్కరణల గురించి వివరించారు. వైడీఆర్ఎఫ్ జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ హిమన తదితరులు పాల్గొన్నారు. మధుమేహ వైద్య నిపుణుడు డాక్టర్ అమర్‌పాల్ సింగ్‌కు బంగారు పతకాన్ని ప్రదానం చేశారు.



డాక్టర్ అమర్‌పాల్ సింగ్‌కు బంగారు పతాకాన్ని ప్రదానం చేస్తున్న సదాశివరావు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -112 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 194, చికెన్ స్కిన్‌లెస్ - 221.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 115, 124, 135 చికెన్ విత్ స్కిన్ - 220 చికెన్ స్కిన్‌లెస్ - 230.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.99/-.

ఫొటోగ్రఫీ విజేతలకు బహుమతుల ప్రదానం నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన పోటీల్లో విజేతలైన ఫొటోగ్రాఫర్లకు నగరంలోని కలెక్టరేట్‌లో ఈనెల 25వ తేదీ సోమవారం బహుమతి ప్రదానం చేయనున్నారు. పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో కలెక్టర్ జి.లక్ష్మీశ, జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొంటారు.

పాలిటెక్నిక్ కళాశాలల టెక్నికల్ స్టాఫ్ సంఘం కార్యవర్గం ఎన్నిక

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఏపీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల టెక్నికల్ స్టాఫ్ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం విజయవాడ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొల్లా మహ్మద్ పాషా, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు, పొట్ల శ్రీహరి, చిన్నం సుకీర్తి, ప్రధాన కార్యదర్శిగా కె.సి.హెచ్.ప్రధాన్, సంయుక్త కార్యదర్శిగా డీబీఎస్ ప్రసాద్, కోశాధికారిగా కె.వెంకటేశ్వరరావు, జోనల్ కార్యదర్శులుగా వి.జక్కన్న బాబు, ఎ.రాంబాబు, ఎస్.పి.ఎస్. ప్రసాద్, పి.నరేష్‌లను ఎన్నుకున్నారు.



ఎన్నికైన నూతన సభ్యులు

అధికారుల దృష్టికి ఉద్యోగుల సమస్యలు



కొత్తగా ఎన్నికైన జోనల్ సభ్యులతో డివిజనల్ నాయకులు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: విజయవాడ డివిజన్‌లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని ఆలిండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రమేష్, బీవీ నాయక్ తెలిపారు. అసోసియేషన్ జోనల్ ఎన్నికలు గత నెల 30న జరగగా.. గెలుపొందిన జోనల్ అధ్యక్షుడు అంగడి వినోద్, కార్యదర్శి దాశరథ కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మానాయక్, అడిషనల్ కార్యదర్శి శ్రీహరిప్రసాద్, కోశాధికారి సాయిబాబాను విజయవాడ డివిజన్ సభ్యులు ఆదివారం సంఘ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. డివిజనల్ సభ్యులకు పూర్తి సహకారం అందిస్తామని జోనల్ నాయకులు పేర్కొన్నారు. డివిజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్వీ రమణయ్య, సహాయ కార్యదర్శి ఐ.రాజీవ్, కోశాధికారి బి.విజయరాజు, విద్యుత్తు బ్రాంచి అధ్యక్షుడు కె.జాషువా, వివిధ బ్రాంచీల నాయకులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురైన లైన్‌మెన్ మృతి



రాజశేఖర్ (పాత చిత్రం)

ముస్తాబాద (గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే : విద్యుదాఘాతానికి గురైన లైన్‌మెన్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విజయవాడ రూరల్ మండలం నున్న విద్యుత్తు సెక్షన్ పరిధిలోని సావరగూడెం డిస్ట్రిబ్యూషన్ విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-2 జూనియర్ లైన్‌మెన్ కె.రాజశేఖర్ (31) గత బుధవారం ముస్తాబాద విద్యుత్తు ఉప కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తూ.. విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు, తోటి సిబ్బంది విజయవాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజశేఖర్ ఆదివారం మృతి చెందినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. మృతుడి స్వస్థలం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటగా పేర్కొన్నారు.

రాజధానిలో ఆర్ట్ గ్యాలరీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సునీల్ కుమార్

రాఘవయ్యపార్క్ కూడలి (కృష్ణలంక), న్యూస్‌టుడే : చిత్రకారులు పాత.. కొత్త తరాలకు వారధిలాంటి వారని ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్ అన్నారు. ఎంబీ విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, కళాయజ్ఞల సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం 'వర్తమాన పరిస్థితుల్లో చిత్రకారుడి పాత్ర' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రతి మనిషిలోనూ సృజనాత్మకత ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) వచ్చినప్పటికీ మానవ మేధస్సుకు మించి గొప్పది ఏదీ లేదన్నారు. రాష్ట్ర రాజధానిలో కళాకారులకు ఒక ప్రత్యేకమైన వేదిక ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 'సంప్రదాయ చిత్రకళ- ఆవశ్యకత' అంశంపై విశ్లేషకులు డాక్టర్ సాగర్ గిన్నె, 'చిత్రకళా రంగంలో వస్తున్న మార్పులు' అంశంపై డాక్టర్ మృత్యుంజయరావు, 'మార్పులకు అనుగుణంగా చిత్రకారుడు' అంశంపై వై.శేషబ్రహ్మం ప్రసంగించారు. ఎన్ఆర్ఐ వల్లభనేని గిరిబాబు మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తం శ్రమ మీద నడుస్తోందని చెప్పారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ బాధ్యుడు సునీల్ కుమార్ మాట్లాడుతూ.. కళాకారులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం సాంస్కృతిక విధానాన్ని ప్రకటించి, రాజధానిలో కళాకారులకు ఆర్ట్ గ్యాలరీలు ఏర్పాటు చేయాలని సదస్సు తీర్మానించింది. 'శ్రమైక జీవనం' పేరుతో 40మంది చిత్రకారులు వేసిన చిత్రాలను చిత్రకళావధాన్ మర్లపూడి ఉదయ్‌కుమార్ ప్రారంభించారు. నగర ప్రముఖులు బాయన వెంకట్రావు, అమరావతి బుద్ధ విహార్ బాధ్యులు శుభాకర్, పి.మురళీకృష్ణ, అరసవిల్లి గిరిధర్, మల్లిక్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో అమరావతి క్రషర్స్ జట్టు



అతిథుల నుంచి బహుమతి అందుకుంటున్న క్రీడాకారుడు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: సూపర్-4 లీగ్ పోటీల్లో అమరావతి క్రషర్స్ జట్టు ఏడు పాయింట్లతో ఆధిక్యంలో కొనసాగుతోంది. స్థానిక సీహెచ్ఆర్‌కే వీఎంసీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 'యువ ఆంధ్రా ఛాంపియన్‌షిప్-2025' కబడ్డీ లీగ్‌లో భాగంగా ఆదివారం జరిగిన సూపర్-4 లీగ్‌లో అమరావతి క్రషర్స్, విజయనగరం నింజాస్, కర్నూలు నైట్స్, వైజాగ్ కమెండోస్ జట్లు రెండేసి మ్యాచ్‌లు ఆడగా.. ఒక మ్యాచ్ గెలుపొంది.. మరో మ్యాచ్‌లో పరాజయం పాలయ్యాయి. పాయింట్ల ఆధారంగా విజయనగరం నింజాస్, కర్నూలు నైట్స్ జట్లు ఆరేసి పాయింట్లతో ద్వితీయ, తృతీయ, వైజాగ్ కమెండోస్ జట్టు 5 పాయింట్లతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. సోమవారం మరో రెండు మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఆ మ్యాచ్‌ల్లో సాధించిన పాయింట్ల ఆధారంగా విజేత ఎవరో తేలుతుంది. ఆదివారం అతిథులు ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ మెహర్ బాబా, ఇండియన్ పోస్టల్ కబడ్డీ క్రీడాకారుడు వి.చంద్రరావు ఉత్తమ క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేశారు. కర్నూలు నైట్స్ జట్టు.. విజయనగరం నింజాస్ జట్టుపై, విజయనగరం నింజాస్ జట్టు... అమరావతి క్రషర్స్ జట్టుపై, వైజాగ్ కమెండోస్ జట్టు... కర్నూలు నైట్స్ జట్టుపై, అమరావతి క్రషర్స్ జట్టు... వైజాగ్ కమెండోస్ జట్టుపై విజయం సాధించాయి.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కొండపల్లి: 8008574656, జి.కొండూరు 9063144762

? కూనపరాజుపర్వలో మురుగు కాల్వల వ్యవస్థ సక్రమంగా లేక మురుగు నీరు రహదారులపైకి చేరుడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ? గ్రామంలోని పంటపొలాలకు వెళ్లే గోపాలకుంట రహదారి వర్షం పడితే బురదమయంగా తయారై రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **-జమలయ్య, స్థానికుడు** ✔ పరిశీలించి సమస్య పరిష్కారాని చర్యలు తీసుకొంటాం, ✔ ఉపాధిహామీ పథకంలో వివరాలు పెట్టి రహదారి అభివృద్ధి పనులు చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొంటాం. **- ఎం.భాస్కరరావు. పంచాయతీ కార్యదర్శి.** –న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

? విస్సన్నపేట సీహెచ్‌సీ రోడ్డులో గుంతలు పడి వర్షపు నీరు నిలిచి ఉండటంతో దుర్వాసన వస్తోంది. **-స్థానికులు.** ✔ సిబ్బందిని పంపి గుంతలు పూడ్చి మరమ్మతులు చేయిస్తాం. **- హరికృష్ణ కుమార్, కార్యదర్శి**

? మండలంలోని నరసాపురం గ్రామ పంచాయతీ ప్రధాన రహదారిపై మంచినీటి కుళాయి లీకేజీ వల్ల నీరు నిలిచి పోయి..రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - **స్థానికులు** ✔ పంచాయతీ సిబ్బందిని పంపి బాగుచేయిస్తాం. **- డి స్వాతి, కార్యదర్శి** –న్యూస్‌టుడే, విస్సన్నపేట

? వరద నీరు తగ్గుముఖం పట్టాయి. పవిత్ర సంగమం ప్రారంభపు ఘాట్లలో చెత్త అలాగే నిలిచి ఉంది. అక్కడ కూడా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తే అంతా పరిశుభ్రంగా ఉంటుంది. **-వెంకటేశ్వరరావు, ఇబ్రహీంపట్నం** ✔ నీరు నిల్వ ఉన్న చోట్ల మినహాయించి దాదాపు అన్ని చోట్లా పారిశుద్ధ్య పనులు నిర్వహించాం. నీరు దిగువకు వెళ్లిన తరువాత అక్కడ కూడా శుభ్రం చేయిస్తాం. **-మధు, పారిశుద్ధ్య మేస్త్రీ .** –న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం



★ ఇబ్రహీంపట్నం రింగు సెంటరు నుంచి కొండపల్లి ఎర్ర బ్రిడ్జి వరకు ఛత్తీస్‌గడ్ జాతీయ రహదారి మధ్యలో డివైడర్ల పక్కన ఇసుక మేటలు వేయడంతో ద్విచక్రవాహన చోదకులు జారిపడుతున్నారని స్థానికులు చేసిన ఫిర్యాదుపై టోల్‌గేట్ పర్యవేక్షకులు స్పందించారు. సిబ్బందిని ఏర్పాటు చేసి డివైడర్ల పక్కనున్న మేటలను తొలగింపజేయించి సమస్యను పరిష్కరించారు. **-న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**

స్పందనకు వందనం

★ పట్టణంలోని 8వ వార్డు పరిధిలోని డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోయి మురుగు నిలిచి దోమల బెడద ఎక్కువైందని స్థానికులు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపించి శుభ్రం చేయించి దోమల మందు పిచికారీ చేయించారు. **-న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గొల్లపూడి, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా గొల్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం మూడు గంటల పాటు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈఈ రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. హెడ్‌పోస్టాఫీసు ప్రాంతం, టింబర్‌డిపోలు, ఎస్ఎస్ఎస్‌కాలనీ, వస్త్రలతకాలనీ, నేతాజీనగర్ ప్రాంతం, అయ్యప్పస్వామి ఆలయం, పంచాయతీ కార్యాలయం రోడ్డు, గంగానమ్మ ఆలయం ప్రాంతం, వన్‌సెంటర్, దేవాదాయ శాఖ కార్యాలయం, వాసవి మెడికల్ కాంప్లెక్స్, ల్యాంకోకాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 7:30 నుంచి 10:30 వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

మైలవరం, న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్ సభ్యుడు హరి అప్పారావు పుట్టినరోజును పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో ఆదివారం రూ.13 వేల విలువైన ఇనుప బీరువాను స్థానిక ఎస్వీఆర్‌జీఎన్నార్ హైస్కూల్‌కు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ నాయకులు నాగభూషణం, రామిరెడ్డి, హరీష్‌కుమార్ గుప్తా, జాస్తి వెంకటేశ్వరరావు, శ్రీధర్, ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం ఛైర్మన్ నియామకం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట పట్టణంలోని సత్తుపల్లి రోడ్డులో గల శ్రీగంగా పార్వతీ సమేత చంద్రశేఖర స్వామి దేవాలయం(శివాలయం) ఛైర్మన్‌గా వెంపటి శ్రీ కృష్ణ జనార్దన్ నియామకం జరిగినట్లు తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు ఓ ప్రకటనలో తెలిపారు.

స్వచ్ఛ వాతావరణానికి కృషి చేయాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మొక్కలను పెంచి స్వచ్ఛమైన వాతావరణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొండపల్లి పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు అన్నారు. ఇబ్రహీంపట్నం ఐదో సచివాలయంలో మెప్మా సభ్యులు సీటీజీ(సిటీ టెర్రస్ గార్డెన్) ఆధ్వర్యంలో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో స్థల సమస్యతో చెట్లను పెంచలేని పరిస్థితి ఉందన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా సిటీజీ ఆధ్వర్యంలో మొక్కలు పెంచే మార్గాలను తెలుసుకోవాలన్నారు. మెప్మా మహిళలు పోషకు వృద్ధి చేసుకుని స్వయం సమృద్ధిని సాధించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, పురపాలిక అధికారులు పాల్గొన్నారు.

అక్రమాల చిక్కులు.. ఇంకా తేలని లెక్కలు

నాలుగున్నరేళ్లుగా సొసైటీలో ఉండిపోయిన ఎరువులు

మైలవరం, న్యూస్‌టుడే

అక్రమాలకు ప్రతీకగా మారిన మండలంలోని చంద్రగూడెం వ్యవసాయ పరస్పర సహకార సంఘంలో సహకారం నేతిబీరలో నెయ్యి చందంగా మారింది. రైతులకు సహకారాన్ని మరచి, వారి రుణాలను అడ్డగోలుగా కొల్లగొట్టి దోచుకున్న ఉద్యోగులు, చివరికి రైతులకు అందాల్సిన ఎరువుల్ని మూలనపెట్టేసి, సంఘానికి రూ.లక్షల్లో నష్టాలను మిగిల్చారు. నాలుగేళ్లుగా సంఘం పరిధిలోని రైతులు లబోదిబోమంటున్నా, ఉన్నతాధికారులు చోద్యం చూడడంతో, గడువుమీరుతున్న ఎరువుల్ని అరువుకైనా అమ్మాల్సిన దుస్థితి దాపురించింది.

రూ.2 కోట్లు పక్కదారి..

మండలంలోని చంద్రగూడెం సహకారం సంఘంలో అక్రమాలకు కొదవే లేకుండా పోతోంది. గత ప్రభుత్వ హయాంలో అమాయక రైతులను మోసం చేసి, సుమారు రూ.2 కోట్ల వరకు పక్కదారి పట్టించారు. రైతుల ఫిర్యాదుతో దాదాపు ఏడాదిపాటు విచారించి, అక్రమాలను నిగ్గుతేల్చి రూ.1.30 కోట్ల వరకు గతేడాదే ఉద్యోగుల నుంచి రికవరీ చేశారు. అయితే అదే సమయంలో మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం సహకార సంఘాలకు సరఫరా చేసిన ఎరువుల విక్రయాలకు సదరు అక్రమాలు అడ్డుగా మారడంతో, దాదాపు 2020 నుంచి చంద్రగూడెం సంఘంలో పెద్ద ఎత్తున ఎరువుల నిల్వలు పేరుకున్నాయి.



చంద్రగూడెం సొసైటీలో దీర్ఘకాలంగా నిల్వ ఉన్న ఎరువు కట్టలను పరిశీలిస్తున్న తహసీల్దార్, సొసైటీ ఛైర్మన్

రూ.లక్షల్లో నష్టం

సంఘం పరిధిలోని రైతులకు ఎరువులను అందించాలన్న లక్ష్యంతో అప్పట్లో యూరియా, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, గుళికలు, కాంప్లెక్స్ ఎరువులైన 20-20-0 రకాలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకున్నారు. అందుకు గానూ రూ.50 లక్షల వరకు లావాదేవీలు నిర్వహించారు. ఒక్కసారిగా ఉద్యోగుల అవినీతి భాగోతం బయటపడడంతో, రైతులకు రుణాలే కాదు, కనీసం ఎరువులు అమ్మేందుకు చిక్కులు వచ్చి పడ్డాయి. దాంతో పెద్ద ఎత్తున ఎరువుల కట్టలు గోదాములో నాలుగేళ్లుగా మూలుగుతున్నాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం నూతన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయగా, చిక్కుల ముడివిప్పడం పెద్ద తలనొప్పిగా మారింది.

తక్కువకే విక్రయిస్తున్నాం..

సొసైటీలో గతంలో జరిగిన నిర్వాకాలతో అన్ని రకాలుగా నష్టపోవాల్సి వచ్చింది. ఎరువుల విక్రయాలు ఆగిపోవడంతో నేటికీ సుమారు 500 కట్టల వరకు నిల్వలు ఉండిపోయాయి. దీర్ఘకాలంగా నిల్వ ఉండటంతో, రైతులు అపోహలు చెందుతుంటే, ఒక్కో కట్టపై రూ.100 నుంచి రూ.150 వరకు నష్టం భరించి, రైతులకు సరఫరా చేస్తున్నాం. మళ్లీ కొత్తగా ఎరువుల దిగుమతితో రైతులకు అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం.

- ఎం.రోశాలు, సొసైటీ త్రిసభ్య కమిటీ ఛైర్మన్

జూదరుల అరెస్టు

కనుమూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కనుమూరులో ఆదివారం నిర్వహించిన దాడిలో జూదమాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,020 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎస్.శ్రీను తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్త మంగాపురంలోని తోటల్లో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై ఆదివారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. 9 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.20,500 నగదు, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కే సుధాకర్ తెలిపారు.

మట్టి తరలిస్తున్న లారీలు స్వాధీనం

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలిలో ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో తెలంగాణ రాష్ట్రంలో వెన్నవల్లి గట్టు నుంచి అక్రమంగా గంపలగూడెం మండలం మీదుగా మట్టి తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎస్.శ్రీను తెలిపారు. మట్టి లారీలను గంపలగూడెం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చామన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై సతీష్‌కుమార్

జి.కొండూరు: వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసే మండపాల్లో నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కే సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక సామాజిక భవనంలో గణేశ్ ఉత్సవ ప్రతినిధులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. మండపాల ఏర్పాటుకు తీసుకోవాల్సిన అనుమతులు వివరించారు. నిమజ్జనోత్సవంలో డీజేలు, అశ్లీల నృత్యాలు నిషేధమని వాటిని అతిక్రమించవద్దని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, శిక్షణ ఎస్సైలు గౌరీశ్వరి, గౌతమ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకి తాత్కాలిక మరమ్మతులు



మైలవరం, న్యూస్‌టుడే: అధ్వానంగా ఉన్న మండలంలోని వెల్వడం, గణపవరం రోడ్డుకు గణపవరం తెదేపా నాయకుడు ఉమ్మా రమణారెడ్డి, నాయకులు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. వెల్వడం రహదారిని తవ్వేయడంతో వచ్చిన, తారును ట్రాక్టర్ల ద్వారా తరలించి ఆదివారం గణపవరం మార్గంలోని గోతుల్లో నింపారు. గణపవరం అడ్డరోడ్డు వద్ద కాలనీ నుంచి రహదారిపైకి వస్తున్న నీటితో ప్రాణాంతకమైన గోతులు ఏర్పడగా, కొత్తగా తూములను నాయకులే ఏర్పాటు చేయించారు. అడ్డ రోడ్డు నుంచి విద్యుత్తు ఉపకేంద్రం వరకు గోతులను పూడ్చడంతో ఇబ్బందులు తాత్కాలికంగా తొలగినట్లేనని వాహనదారులు అంటున్నారు. కార్యక్రమంలో నాయకులు గుంటక వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీకి తరలిన అన్నదాతలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: తిరువూరులో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన అన్నదాత సుఖీభవ విజయోత్సవ కార్యక్రమానికి ఆదివారం మండలం నుంచి ట్రాక్టర్లతో పెద్దఎత్తున అన్నదాతలు తరలి వెళ్లారు. పట్టణంలో జరిగిన ర్యాలీలో ఎమ్మెల్యే కొలికపూడి ట్రాక్టర్ నడిపి కూటమి శ్రేణులను, రైతులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, మురుగుల ప్రసాద్, సొసైటీ ఛైర్మన్ కంభంపాటి బద్రీనాథ్ కూటమి నాయకులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే కొలికపూడి, పక్కన కూటమి శ్రేణులు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వీలుగా ప్రధాన కార్యాలయం, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. నగర వాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్టీటీపీఎస్ ఏ కాలనీ వెంకటేశ్వర స్వామి ఆలయప్రాంగణంలో శివాలయం పునఃప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగిన సందర్భంగా ఆదివారం ఆలయంలో ఆలయ అర్చకులు సాయిస్వామితోపాటు వేదపండితుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. కాలనీ వాసులతోపాటు ఇబ్రహీంపట్నం కొండపల్లి గ్రామాలకు చెందిన భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. శివాలయ పునఃప్రతిష్ఠ నిర్మాణానికి ఆర్థిక సహాయ సహకారాలు అందించిన దాతలు వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ కమిటీ దాతలను సత్కరించింది. అనంతరం భక్తులకు అన్న సమారాధన జరిగింది.



చండీ హోమం చేస్తున్న అర్చకులు సాయిస్వామి

ఖాళీ స్థలం.. తెస్తోంది కష్టం



ఎక్కడైనా ఖాళీ స్థలాలు నివాసయోగ్యంగా మార్చుకుంటారు. మైలవరంలో మాత్రం అందుకు విరుద్ధంగా జలాశయాలుగా మారుతున్నాయి. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ మైలవరంలోని ఎన్నెస్పీ కార్యాలయానికి సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న స్థలమే. రెండు రహదారుల మధ్య గల ఈ స్థలం ప్రైవేటు వ్యక్తులదో, ప్రభుత్వానిదో అర్థంకాని పరిస్థితులున్నాయి. ప్రతి ఏడాది వర్షాకాలంలో పెద్ద ఎత్తున నీరు చేరుతుంటే, భారీ వర్షాల సమయంలో ఏకంగా జాతీయ రహదారిని ముంచెత్తుతోంది. చాలా రోజుల పాటు నీటి నిల్వతో విష పురుగులు వస్తున్నాయని స్థానిక గృహాల వారు ఆందోళన చెందుతున్నారు. **-న్యూస్‌టుడే, మైలవరం**

తాగునీటి వృథా కనపడదా..?



స్థానిక పంచాయతీ పరిధిలోని రాఘవాపురం గ్రామంలోని పాల కేంద్రం-2 భవనం ఎదురుగా తారురోడ్డుపై ఉన్న ఉన్న రక్షిత నీటి సరఫరా పైపులైను పగిలిపోయి నీరు వృథాగా పోతుంది. దీనికి తోడు వర్షాలు పడినప్పుడు పక్కనే ఉన్న డ్రెయినేజీ నుంచి మురుగు, ఈ తాగునీరు కలిసి ప్రవహిస్తుండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇదే క్రమంలో ఈ మురుగు నీరు కాస్తా పైపులైనులోకి వెళ్తుందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పగిలిన పైపులైను మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టి నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

అడ్డుగా ఆవులు..ట్రాఫిక్‌కు ఇబ్బందులు



విస్సన్నపేటలో ప్రధాన రహదారులపై ఆవుల మంద విచ్చలవిడి సంచారంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు, స్థానిక ప్రజలు వాపోతున్నారు. నూజివీడు -తిరువూరు రోడ్డు, విస్సన్నపేట -సత్తుపల్లి రోడ్డు, విస్సన్నపేట -ఏ కొండూరు రోడ్డు, బస్టాండు సెంటర్, అంబేడ్కర్ కూడలిలో పలు చోట్ల ఆవుల సంచారం ఎక్కువగా ఉంది. అవి రహదారిపై అడ్డుగా పడుకోవడంతో రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆవుల యజమానులు గుర్తించి చర్యలు తీసుకోవాలని రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, విస్సన్నపేట**

స్మార్ట్‌కార్డులు సిద్ధం

గంపలగూడెం, న్యూస్‌టుడే: రేషన్ కార్డుదారులకు స్మార్ట్‌కార్డులు చేతికందనున్నాయి. ఇప్పటికే మండల రెవెన్యూ కార్యాలయాలకు వాటిని సరఫరా చేయగా.. తిరువూరు రెవెన్యూ డివిజన్‌లోని వీఆర్వోలకు తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు, రెడ్డిగూడెం తహసీల్దారుల ఆధ్వర్యంలో స్మార్ట్‌కార్డులను అందజేశారు.



గంపలగూడెంలో వీఆర్వోలకు స్మార్ట్‌కార్డులు అందజేస్తున్న తహసీల్దారు రాజకుమారి

ప్రభుత్వ ఆదేశాలు అందగానే గ్రామాల్లో రెవెన్యూ అధికారులు చౌక దుకాణాల వారీగా లబ్ధిదారులకు స్మార్ట్‌గా ముద్రించిన కార్డులను పంపిణీ చేశారు. గతంలో బియ్యం కార్డులు పెద్ద సైజులో ఉండగా తాజా అందించనున్న కార్డులు అరచేతిలో ఇమిడిపోతాయి. ఓటరు, పాన్, ఏటీఎం, డ్రైవింగ్ లైసెన్స్ కార్డుల తరహాలోనే వీటిని తయారు చేశారు. తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో 180 రేషన్ దుకాణాలు ఉండగా 95,270 మంది

మండలం	చౌక దుకాణాలు	కార్డుదారులు
గంపలగూడెం	41	23,226
తిరువూరు	41	22,843
విస్సన్నపేట	37	18,068
ఎ.కొండూరు	32	15,675
రెడ్డిగూడెం	29	15,458

తెలుపు రంగు కార్డు లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులు అందిస్తారు. ★ తాజాగా సరఫరా చేయనున్న కార్డుపై బియ్యం కార్డు రకం, కుటుంబ పెద్ద పేరు (మహిళ), ఆమె పుట్టిన తేదీ, వయసు, కుటుంబ సభ్యుల సంఖ్య, పేర్లు, గ్రామం, మండలం, చిరునామ, రేషన్ దుకాణం నంబరు, రెవెన్యూ కార్యాలయం వివరాలు నమోదై ఉంటాయి.

బాల్యమిత్రుడికి ఆర్థిక సాయం

తిరువూరు, న్యూస్‌టుడే: మూడున్నర దశాబ్దాల కిందట తమతో కలిసి చదువుకున్న వ్యక్తి అనారోగ్యానికి గురయ్యాడని తెలుసుకుని అతని మిత్రబృందం ఆదివారం రూ.50వేల ఆర్థికసాయం అందించింది. కోయంబత్తూర్‌కు చెందిన కరుగాయల సురేష్ కుటుంబం జీవనోపాధి కోసం 35 ఏళ్ల కిందట తిరువూరుకు వచ్చారు. తదుపరి స్వస్థలమైన కోయంబత్తూర్ వెళ్లిపోయారు. వాట్సాప్ సమాచారం ద్వారా బాల్యమిత్రులంతా కలుసుకున్నారు. ఇటీవల సురేష్ అనారోగ్యానికి గురయ్యాడని తెలుసుకుని తిరువూరుకు ఆహ్వానించి అతని వైద్యం కోసం సాయం చేశారు. చిన్ననాటి ఆప్యాయతను గుర్తు చేసుకుని తనకు అండగా నిలిచిన మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.



సురేష్‌కు నగదు అందజేస్తున్న స్నేహితులు

తెల్లారేలోపు తీసేస్తున్నారు..!

ద్విచక్రవాహనాల పైపులు కోసి ఆయిల్ చోరీ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నంలో పెట్రోలు దొంగలు పెచ్చుమీరుతున్నారు. ఇళ్ల ముందు నిలిపిన ద్విచక్రవాహనాల్లోని పెట్రోలును తెల్లవారేలోపే ఖాళీ చేస్తూ వాహనదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. రాత్రి సమయాల్లో వీధుల్లో సంచరిస్తూ కనబడిన వాహనాల పెట్రోలు తాలుకా పైపులు కోసేసి ట్యాంకులోని చమురు మొత్తం దోచేస్తున్నారు. ఆయిల్ లాక్ చేసినా చమురు చోరీ జరుగుతుండడంపై వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఉదయం పనుల నిమిత్తం బయటకు వెళ్లేందుకు వాహనం తీస్తే పైపులు తెగిపోయి ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. ఎన్టీటీపీఎస్ కాలనీలతోపాటు భీమరాజుగుట్ట ప్రాంతాల్లో రెండు రోజుల కిందట ఇదే మాదిరి వరుస దొంగతనాలు జరిగాయి. పెద్దపెద్ద చోరీలపై చూపే శ్రద్ధ చిన్న చిన్న దొంగతనాలపై చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఆర్థిక భారంగా ఉందని : స్టేషన్ పరిధిలోని గుంటుపల్లి గ్రామంతో పాటు శివారు ఖాజీపేట, కాలనీల్లో చిల్లర దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గతంలో ఈ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలతోపాటు వాటి విడిభాగాల చోరీకి గురవుతుండడంతో పోలీసులు కొంత కాలం గస్తీ నిర్వహించి నివారించినా.. మళ్లీ చోరీల కథ మొదటికి వచ్చింది. రోజూ వందలాది రూపాయలు విలువ చేసే చమురు తీసేస్తుంటే ఆర్థిక భారం ఎక్కువైందని..కత్తిరించిన చమురు పైపుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించడంతో మరింత ఇబ్బందిగా ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు చొరవ తీసుకుని ఈ దొంగలను పట్టుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నాణ్యమైన సేవలు అందిస్తున్నాం

ఇబ్రహీంపట్నం: వీటీపీఎస్ కో-ఆపరేటివ్ స్టోర్స్, పెట్రోల్‌బంకులో నాణ్యమైన సేవలను వినియోగదారులకు అనేక సంవత్సరాలుగా అందిస్తున్నామని ఆఫీసర్స్, కంజ్యూమర్స్ కో-ఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షకార్యదర్శులు శ్రీనివాస్, వెంకటరమణలు తెలిపారు. స్టోర్స్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పెట్రోల్ బంకులో నగదు గల్లంతు, ఉద్యోగి అదృశ్యం విషయాలు పోలీసులు విచారిస్తున్నారని చెప్పారు. అయితే స్టోర్స్ పెట్రోల్ బంకులో ఎటువంటి అవకతవకలు లేవన్నారు. స్టోర్స్, బంకుపై వస్తున్న ఆరోపణలు న్యాయబద్ధంగా విచారణ జరిగించేందుకు తాము అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

గొల్లపూడి, న్యూస్‌టుడే: గొల్లపూడిలోని వెంకయ్యస్వామి ఆలయంలో భక్తులు విశేష పూజలు చేశారు. మూడు రోజులుగా ఆలయంలో నిర్వహిస్తున్న ఆరాధనోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయంలో రుద్రహోమం జరిగింది. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. శ్రీ హనుమద్దీక్షా పీఠాధిపతులు దుర్గాప్రసాద్ స్వామీజీ, ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ బోయపాటి శ్రీరాములు, భక్తులు పాల్గొన్నారు.

భద్రంగా ఉండండి.. బాధ్యతగా మెలగండి

గణపతి ఉత్సవాల నిర్వాహకులకు అధికారుల సూచనలు

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే



వినాయక చవితి వేడుకలకు సమయం దగ్గర పడుతోంది. దీంతో పట్టణం నుంచి పల్లెల వరకు ఉత్సవాలకు నిర్వాహకులు సిద్ధమవుతున్నారు. ముందస్తుగానే గణనాథుల విగ్రహాలను మండపాలకు చేర్చుతున్నారు. ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్న తరుణంలో ఉత్సవాల్లో ప్రమాదాలకు తావివ్వకుండా ఏటా జరుగుతున్న ఘటనలను దృష్టిలో పెట్టుకుని తగిన జాగ్రత్తలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు.

అగ్ని ప్రమాదాలకు ఆస్కారం: మండపాల్లో అధిక లోడు కలిగిన విద్యుత్తు పరికరాలను వాడినప్పుడు వైర్లు కాలిపోయి అగ్నిప్రమాదాలు సంభవించవచ్చు. దీపాలు, కొవ్వొత్తులు వెలిగించేటప్పుడు, హోమం చేస్తున్నప్పుడు జాగ్రత్తలు పాటించకపోతే వస్త్రాలు, కాగితాలు, వస్తువులకు మంటలు వ్యాపిస్తాయి. కొన్నిచోట్ల ఉత్సవ సమయంలో టపాసులు కాల్చుతారు..వీటి వల్ల అగ్నిప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది. మండపాల్లో అగ్నిమాపక పరికరాలు, ఇసుక బక్కెట్లు వంటి పరికరాలు లేకపోతే షార్ట్ సర్క్యూట్ కూడా పెద్ద ప్రమాదంగా మారే అవకాశం ఉంది.

ఇవి పాటించాల్సిందే.. ★ విగ్రహాలను తరలించే వారికి భద్రతపై అవగాహన ఉండాలి. ★ మండపాల్లో నాణ్యమైన విద్యుత్తు వైర్లు ఉపయోగించాలి. దెబ్బతిన్న వైర్లను వాడకూడదు. తప్పనిసరిగా ఎర్తింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ★ నైపుణ్యం కలిగిన ఎలక్ట్రిషియన్ లేదా స్థానిక విద్యుత్తు సంస్థ సిబ్బందితోనే మండపాల్లో విద్యుత్తు సంబంధిత ఏర్పాట్లు చేసుకోవాలి. ★ వైర్లను బహిరంగంగా కాకుండా సక్రమంగా ఇన్సులేట్ చేసి భక్తులు తిరిగే ప్రాంతాలకు దూరంగా ఉంచాలి.

నాణ్యమైన పరికరాలు వాడాలి: మండపాల్లో విద్యుత్తు వినియోగంలో జాగ్రత్త అవసరం. అక్కడ ఏర్పాటు చేసే పరికరాలు, వైర్లు నాణ్యమైనవి వాడాలి. అతుకులు ఉన్న తీగలను వినియోగిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. వీటిపై నిర్వాహకులకు అవగాహన ఉండాలి. ఏది ఏమైనా భక్తితో..భద్రంగా ఉండాలి.

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

ఊటుకూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరులో గణపతి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ (సీసీఆర్) సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. వాతావరణ కాలుష్య నివారణ, ప్రజారోగ్యంపై భక్తులకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఇంట్లో మట్టి వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించాలని కోరారు. నిర్వాహకులు పి.మణిదీప్, ఆర్.శ్రీరామ్, సీహెచ్.రామలక్ష్మి, వై.మునిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు మట్టి వినాయకులను అందజేస్తున్న నిర్వాహకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

భవానీపురం: గొల్లపూడి పెట్రోలు బంకు సెంటర్ వద్ద వినయ్‌గోపి కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అతను వడ్రంగం పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి పెట్రోలు బంకు సెంటర్ వద్ద జాతీయ రహదారి దాటుతుండగా విజయవాడ నుంచి ఇబ్రహీంపట్నం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

120 మందికి నేత్ర పరీక్షలు

చందర్లపాడు: తుర్లపాడులో పబ్బతి పొంగళ్లు, పుల్లయ్య ఛారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, నంది గామ సత్యసాయి సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 120 మందిని పరీక్షించి 37 మందిని శుక్లాల శస్త్ర చికిత్సకు తీసుకెళ్లారు.

బుట్టెడు కాదు.. అంతకుమించి!



బుట్టలో లేదా బస్తాలో కాయలు నింపి విక్రయించడం పాత పద్ధతి. పైగా అలా వేసే కాయల నాణ్యత చూడాలని ప్రతి ఒక్కరూ వాటిని బయటకు తీస్తుండటం వల్ల అవి దెబ్బతింటున్నాయి. అందుకే, అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కాశీపట్నంలో సీతాఫలాల విక్రయదారులు చిత్రంలో చూపినట్లు విక్రయిస్తున్నారు. బుట్టపై కాయలు ఇలా పేర్చడం వల్ల కాయలు ఎలా ఉన్నాయో చూడొచ్చు. అన్నట్లు ఒక బుట్ట (80 నుంచి 100 కాయలు) ధర ఎంతో తెలుసా.. వెయ్యి రూపాయలు.

– ఈనాడు, అనంతగిరి

సిద్ధమవుతున్న 'అస్త్రం'

- విజయవాడలో ట్రాఫిక్ కష్టాలు తగ్గించేందుకు ఏఐ ఆధారిత యాప్
- త్వరలో ప్రారంభించనున్న డీజీపీ

ఈనాడు, అమరావతి: విజయవాడ వాసులు నిత్యం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ట్రాఫిక్ జామ్. ఆ పద్మ వ్యూహంలో చిక్కుకున్నారు.. బయటకు వచ్చి వేరే మార్గంలో గమ్యస్థానం చేరాలన్నా సాధ్యం కాని పరిస్థితి. ఈ ఇబ్బందులను తగ్గించేందుకు నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు.. ఏఐ ఆధారిత యాప్‌ను తయారు చేయిస్తున్నారు. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా త్వరలో దీన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు.

అంతర్గతం నుంచి అందరికీ..

ఇప్పటివరకు పోలీసు సిబ్బంది మాత్రమే ఉపయోగిస్తున్న 'అస్త్రం' అనే ఏఐ టూల్.. ఇకపై పౌరులకూ యాప్ రూపంలో అందుబాటులోకి రానుంది. గతేడాది దసరా ఉత్సవాల సమయం నుంచి దీనిని పోలీసుశాఖలో అంతర్గతంగా ఉపయోగిస్తున్నారు. టెలిగ్రామ్ యాప్‌లో కమిషనరేట్‌లోని ట్రాఫిక్ విభాగం అధికారులు, సిబ్బందిని అనుసంధానించారు. దీని ద్వారా సంబంధిత సీఐలు, ఎస్సైలకు రద్దీ సమాచారం అలెర్టుల రూపంలో వెళ్తున్నాయి. వీటి ఆధారంగా ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. ఇది సత్ఫలితాలు ఇవ్వడంతో పౌరులకూ ఈ సేవలు విస్తరించాలని నిర్ణయించారు.

ప్రత్యామ్నాయ మార్గాలనూ చూపిస్తుంది

ఈ యాప్‌లో పలు ఫీచర్లను పొందుపరుస్తున్నారు. నగర మ్యాప్‌ను అనుసంధానిస్తారు. అన్ని మార్గాల్లో ట్రాఫిక్ రద్దీని చూపిస్తుంది. 300 మీటర్ల వరకు వాహనాలు నిలిచిపోతే మధ్యస్థం అని, 300 నుంచి 500 మీటర్ల వరకు అయితే.. ఎక్కువ అని, అంతకంటే ఎక్కువ దూరం నిలిచిపోతే తీవ్రం అని హెచ్చరికలు మొబైల్‌కు వస్తాయి.

✦ మొబైల్‌లో జీపీఎస్ ఆన్ చేసుకుంటే.. మనం ఉన్న ప్రాంతంలో రద్దీ ఎలా ఉంది? ఒకవేళ ఎక్కువగా ఉంటే.. ప్రత్యామ్నాయ మార్గాల్లో ఎలా గమ్యస్థానం చేరుకోవాలో సూచిస్తుంది. అందులోని డైరెక్షన్లు కూడా వస్తాయి. నగరంలో భారీ వర్షం పడి రోడ్లపైకి నీరు వస్తే.. ఆ వివరాలు కూడా తెలియజేస్తుంది. సురక్షిత మార్గాల వివరాలు అందిస్తుంది.

✦ ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్న రోజుల్లో ట్రాఫిక్ మళ్లింపుల వివరాలు, గ్రీన్ ఛానల్ ఉన్న వీవీఐపీల వాహన శ్రేణి వెళ్తున్న సమయంలోనూ నోటిఫికేషన్లు వస్తాయి.

చలానాల చెల్లింపు వెసులుబాటు, వాతావరణ సమాచారం కూడా..

విజయవాడ జంక్షన్ మీదుగా రాకపోకలు సాగించే రైళ్లు, బస్సుల వివరాలను కూడా యాప్‌లో పొందుపరుస్తున్నారు. వీటితో పాటు నగరంలో వాతావరణ సమాచారాన్ని కూడా జోడిస్తున్నారు. వర్షం, పిడుగులు పడే అవకాశాలు, ఉష్ణోగ్రతలు, గాలిలో తేమ శాతం, తదితర వివరాలు ప్రతి గంటకు అప్‌డేట్ల రూపంలో రానున్నాయి. ఈ-చలానాలను చెల్లించేందుకు సైతం వెసులుబాటు కల్పిస్తున్నారు. వాహనం నంబరు ఎంటర్ చేస్తే 'పేమెంట్ గేట్‌వే'లోకి వెళ్లేలా అనుసంధానం చేయనున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో బోయపాటి శ్రీను, వంశీ పైడిపల్లి, త్రివిక్రమ్ శ్రీనివాస్, దిల్ రాజు, అల్లు అరవింద్, దామోదర ప్రసాద్, జెమిని కిరణ్

సినిమా పరిశ్రమకు పూర్తి సహకారం

- వివాదం ఉండొద్దనే కార్మికుల సమ్మె విరమణకు చొరవ చూపా
- నిర్మాతలు, దర్శకులతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: మా ప్రభుత్వం నుంచి సినిమా పరిశ్రమకు పూర్తి సహకారం ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సినిమా పరిశ్రమలో సానుకూల వాతావరణం కల్పించాలని కోరారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆదివారం రేవంత్‌రెడ్డిని పలువురు తెలుగు సినీ నిర్మాతలు, దర్శకులు కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "పరిశ్రమలోకి కొత్తగా వచ్చేవారి నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. స్కిల్స్ యూనివర్సిటీలో సినిమా పరిశ్రమ కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తాం. పరిశ్రమలో వివాదం ఉండకూడదని కార్మికుల సమ్మె విరమణకు చొరవ చూపించాను. నిర్మాతలు, కార్మికుల అంశంలో సంస్కరణలు అవసరం. సినిమా పరిశ్రమకు పర్యవేక్షణ అవసరం. ఈ రంగానికి ఏమేం కావాలో కొత్త పుస్తకం రాసుకుందాం. వ్యవస్థలను నియంత్రిస్తామంటే ప్రభుత్వం సహించదు. అందరూ చట్టం పరిధిలో పనిచేయాల్సిందే. అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సినిమా పరిశ్రమను ఉంచడమే నా ధ్యేయం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

అధిక లాభాలంటూ రూ.7 కోట్ల సైబర్ మోసం

ఇద్దరిని అరెస్టుచేసిన ఒడిశా పోలీసులు



సుధీర్‌కుమార్



బిట్టుకుమార్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: తమ సంస్థల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ ఆశ చూపి రూ.7 కోట్లకు పైగా సైబర్ మోసానికి పాల్పడిన ఇద్దరు నిందితులను ఒడిశా పోలీసులు అరెస్టు చేశారు. వేర్వేరు సైబర్ నేరాలకు సంబంధించి గుంటూరుకు చెందిన చాపలమడుగు సుధీర్‌కుమార్(33), ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన బిట్టుకుమార్(41)లను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఒకరైన బిట్టు అధిక లాభాలు ఇస్తామంటూ డిజిటల్ ప్లాట్‌ఫాం వేదికగా పలు పలువురిని రూ.6.16 కోట్ల వరకు మోసగించాడు. వారిలో ఒడిశాకు చెందిన బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు.. నిందితుడిని పంజాబ్‌లోని లుధియానాలో అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడైన సుధీర్ ఇదే తరహాలో రూ.1.01 కోట్ల మోసానికి పాల్పడ్డాడు. సొమ్ము తిరిగి చెల్లించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు గుంటూరులో సుధీర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

దేశ రక్షణకు హిమ, ఉదయగిరిలు వచ్చేస్తున్నాయ్!

నీలగిరి శ్రేణి నౌకలు రేపు జాతికి అంకితం

విశాఖపట్నం (సింధియా), న్యూస్‌టుడే: స్వీయ సాంకేతికతతో తయారు చేసిన నీలగిరి శ్రేణి నౌకలైన ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరిలను ఈ నెల 26న జాతికి అంకితం చేయనున్నారు. తూర్పు నౌకాదళ ముఖ్య కేంద్రమైన విశాఖపట్నంలోని డాక్‌యార్డులో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి ముఖ్య అతిథులుగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేష్‌కుమార్ త్రిపాఠి హాజరుకానున్నారు. ఇండో-పసిఫిక్, చైనా ప్రాంత సరిహద్దుల్లో చేపడుతున్న వ్యూహాత్మక రక్షణ ప్రాజెక్టు పనుల్లో భాగంగా పీ-17 పేరిట స్వీయ సాంకేతికత, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలతో కోల్‌కతా, ముంబయిలలో ఈ యుద్ధ నౌకలను భారత రక్షణ వ్యవస్థ నిర్మించింది. హిమగిరి, ఉదయగిరి నౌకలను ఏకకాలంలో విశాఖ వేదికగా జాతికి అంకితం చేస్తుండటం నేవీ చరిత్రలో మహత్తర ఘట్టంగా నేవీ వర్గాలు అభివర్ణిస్తున్నాయి.



ఐఎన్ఎస్ హిమగిరి



ఐఎన్ఎస్ ఉదయగిరి

ప్రత్యేకతలు ఏంటంటే..

6,670 టన్నుల బరువు, 28 నాటికల్స్ మైళ్ల వేగం, ఆధునిక సెన్సార్ వ్యవస్థ వీటి సొంతం. ఈ నౌకల మీద నుంచి సూపర్ సోనిక్, బ్రహ్మోస్ వంటి అస్త్రాలను నింగిలోని లక్ష్యాలకు ప్రయోగించవచ్చు. ఈ నౌకల పొడవు దాదాపు 149 మీటర్లు. భీకర పోరు సాగించే ఆధునిక ప్రత్యేకతలు కలిగిన ఈ నౌకలు భారత నౌకాదళానికి వెన్నుదన్నుగా నిలవబోతున్నాయని రక్షణ నిపుణులు చెబుతున్నారు.

14 మంది డాలస్ ప్రయాణికులను వదిలేసి వెళ్లిపోయిన విమానం!

ఓవర్ బుకింగ్ పేరుతో సర్వీసు మార్పు

హైదరాబాద్(శంషాబాద్), న్యూస్‌టుడే: ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ముంబయికి, అక్కడి నుంచి డాలస్ వెళ్లాల్సిన కొందరు ప్రయాణికులను ఇక్కడే వదిలేసి విమానం వెళ్లిపోయింది. బాధిత ప్రయాణికులు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్ నుంచి డాలస్ వెళ్లాల్సిన 38 మంది టర్కిష్ ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్ సూచన మేరకు ఇండిగో ఎయిర్‌లైన్స్ టై-అప్ టికెట్లను ఆన్‌లైన్‌లో రూ.2 లక్షల చొప్పున చెల్లించి కొనుగోలు చేశారు. వీరు శంషాబాద్ విమానాశ్రయం నుంచి శనివారం రాత్రి 11.40 గంటలకు ముంబయి వరకు ఇండిగో ఎయిర్‌లైన్స్ 6ఇ-5195 విమానంలో, అక్కడి నుంచి టర్కిష్ ఎయిర్‌లైన్స్ విమానంలో డాలస్‌కు వెళ్లాలి. 38 మంది ప్రయాణికులు శనివారం శంషాబాద్ విమానాశ్రయానికి సకాలంలో చేరుకుని ఎయిర్‌లైన్స్ కేంద్రంలో సంప్రదించారు. ఓవర్ బుకింగ్ పేరుతో విమాన ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు సర్వీస్ నంబరును 6ఇ-6132గా మార్చారని, అందులో 24 మందినే ఎక్కించుకుని ముంబయికి పంపించారని మిగతా ప్రయాణికులు ఆరోపించారు. దీనిపై ఇండిగో ప్రతినిధులను నిలదీయగా పొంతనలేని సమాధానాలిచ్చారంటూ ఆందోళనకు దిగారు. దాదాపు ఏడు గంటలపాటు విమానాశ్రయంలోనే వేచి ఉన్న అనంతరం వారు వెనుదిరిగారు. ఈ విషయంపై జీఎమ్మార్ విమానాశ్రయ ప్రతినిధులను 'న్యూస్‌టుడే' ఫోన్‌లో సంప్రదించగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు.



పుస్తకావిష్కరణలో వైద్యులు రఘునాథరావు, మూర్తి, లీల, రమణయ్య, సాయి ప్రసాద్ తదితరులు

వైద్యరంగం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉండాలి

- లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ ఆచార్యులు డాక్టర్ జి.వి.ఎస్.మూర్తి

విజయవాడ (కృష్ణలంక, రాఘవయ్యపార్క్ కూడలి), న్యూస్‌టుడే: వైద్య రంగం ప్రైవేటీకరణలో కొన్ని ప్రయోజనాలున్నా.. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నప్పుడే సాధారణ ప్రజలకు మేలు చేకూరుతుందని లండన్ స్కూల్ ఆఫ్ హైజీన్ అండ్ ట్రాపికల్ మెడిసిన్ ఆచార్యులు డాక్టర్ జి.వి.ఎస్.మూర్తి అన్నారు. ఆదివారం ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఆరోగ్య సదస్సును విజయవాడలో నిర్వహించారు. 'వైద్యరంగం ప్రైవేటీకరణ పరిణామాలు' అంశంపై మూర్తి మాట్లాడుతూ.. ప్రజారోగ్యం బాధ్యత ప్రభుత్వానిదేనని, వైద్య రంగం ప్రైవేటీకరణతో సాధారణ ప్రజానీకానికి గొప్పగా మేలు జరిగినట్లు ప్రపంచంలో ఎక్కడా రుజువు కాలేదని వ్యాఖ్యానించారు. వైద్యరంగం కనీసం 80 శాతం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండాలని, ఆర్థిక స్థితిని బట్టి 20శాతం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నా ఇబ్బంది లేదన్నారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డి.రఘునాథరావు, డి.లీల మాట్లాడారు. అనంతరం 'క్యాన్సర్లు ముందుగా గుర్తించే పద్ధతులు-నివారణ మార్గాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.వి.ఎస్.సాయి ప్రసాద్ అధ్యక్షత వహించారు. అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య, ప్రధాన కార్యదర్శి డి.కామేశ్వరరావు, పెద్ద సంఖ్యలో వైద్యులు, వైద్య, నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి పంచాయతీ కార్యదర్శుల సమస్యలు

ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్



విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషిచేస్తామని ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ పేర్కొన్నారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాఖ్యకు పూర్తి మద్దతిస్తామని ప్రకటించారు. డీఏ బకాయిల చెల్లింపు, పీఆర్సీ నియామకం, పంచాయతీల రీగ్రూపింగ్, కార్యదర్శులకు గ్రూప్-3 పేస్కేల్ అమలు, పనిఒత్తిడి తగ్గింపు, జాబ్ చార్ట్ తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్, ప్రధాన కార్యదర్శి బందెల రమేష్‌లు మాట్లాడుతూ.. కార్యదర్శులకు మినిస్టీరియల్ సిబ్బందిలో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వర్తించేలా సిద్ధం చేసిన దస్త్రాన్ని సంబంధిత శాఖకు పంపినట్లు చెప్పారు. కార్యదర్శి పేరును గ్రామాభివృద్ధి అధికారి లేదా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా మార్చాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అసోసియేట్ జనరల్ సెక్రటరీ చల్లా ప్రసాద్‌రెడ్డి, కోశాధికారి కొండలు, కార్యదర్శులు సాయిరామ్, విజయ్‌కుమార్, నాగరాజు, వీరభద్ర తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికలు వాయిదా

భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు

ఈనాడు, హైదరాబాద్ – కర్మన్‌ఘాట్, న్యూస్‌టుడే: ఓటమి భయంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేస్తోందని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో భాజపా మీడియా, ఐటీ, సామాజిక మాధ్యమాల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసి 19 నెలలైనా ఎందుకు ఎన్నికలు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. "రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇస్తున్న నిధులను సరిగా వినియోగించకుండా దారి మళ్లిస్తోంది. భారాస హయాంలో పలువురు సర్పంచులు చేసిన పనులకు బిల్లులు రాక, అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నారు" అని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సిద్ధాంతాలు, కేంద్రం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. భాజపా విజయానికి సామాజిక మాధ్యమాల విభాగం కీలకంగా పనిచేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా అంశంలో కావాలనే కృత్రిమ కొరత సృష్టించి మోదీ ప్రభుత్వాన్ని చెడుగా చూపించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ దేశమంతా తెలంగాణ వైపు చూస్తోందని, రాష్ట్రంలో భాజపా రోజురోజుకూ బలపడుతోందన్నారు.

ఆస్ట్రేలియా బొగ్గు భారాన్ని తగ్గించుకున్న విశాఖ స్టీల్

- స్థాయీసంఘానికి తెలిపిన ఉక్కు మంత్రిత్వశాఖ

ఈనాడు, దిల్లీ: విశాఖ స్టీల్‌ప్లాంట్ తన వ్యయభారాన్ని తగ్గించుకొని ఉత్పత్తిని పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు పార్లమెంటు స్థాయీ సంఘానికి కేంద్ర ఉక్కుశాఖ తెలిపింది. ఏటా పెరిగిపోతున్న నష్టాలతో పాటు, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడానికి ముడిసరకు ఖర్చులను తగ్గించుకోవాలని సూచిస్తూ భాజపా సీనియర్ ఎంపీ అనురాగ్‌సింగ్ ఠాకుర్ నేతృత్వంలోని బొగ్గు, గనులు, ఉక్కు వ్యవహారాల స్థాయీసంఘం గత ఏడాది డిసెంబరు 4న పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఈ సిఫార్సుల అమలు కోసం తీసుకున్న చర్యల గురించి తెలపాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. దానికి అనుగుణంగా కేంద్ర ఉక్కుశాఖ అందజేసిన నివేదికను స్థాయీ సంఘం ఇటీవల పార్లమెంటుకు సమర్పించింది.

బొగ్గు దిగుమతుల భారం తగ్గింపు

ఆస్ట్రేలియా నుంచి దిగుమతి చేసుకొనే బొగ్గుభారాన్ని విశాఖ స్టీల్‌ప్లాంట్ క్రమంగా తగ్గించుకుంటున్న విషయాన్ని స్థాయీసంఘానికి కేంద్ర ఉక్కుశాఖ నివేదించింది. 'రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ ఆస్ట్రేలియా కోకింగ్ కోల్‌పై ఆధారపడడం తగ్గించుకొని, అమెరికా, ఇండోనేషియా, మొజాంబిక్, రష్యా వంటి దేశాల వైపు మళ్లుతోంది. దానివల్ల ఆస్ట్రేలియా బొగ్గు వినియోగం 2020-21 నుంచి 2024 నవంబరు మధ్య కాలంలో 78% నుంచి 49%కి పడిపోయింది. దీంతోపాటు 2022-23 నుంచి 2024-25 మధ్యకాలంలో ఖరీదైన హార్డ్ కోకింగ్‌కోల్‌ను ఇతర బొగ్గుతో కలిపే నిష్పత్తిని 63% నుంచి 54%కి తగ్గించింది. 2023-24లో చాలా పోటీధరల్లో రష్యా నుంచి 0.55 మిలియన్ టన్నుల బొగ్గు దిగుమతి చేసుకుంది. రష్యా సరఫరాదారులతో దీర్ఘకాల సరఫరా ఒప్పందాలు చేసుకొంది. స్థిరమైన ధరలతో సుస్థిరంగా బొగ్గు సరఫరా చేసే ఇతర సంస్థలతోనూ ఒప్పందాలు కుదుర్చుకొంది. ప్రపంచంలోని విభిన్న ప్రాంతాల నుంచి తక్కువ ధరలతో వనరులను దిగుమతి చేసుకోవడానికి నిరంతరం గ్లోబల్ టెండర్లు జారీచేయాలని ఈ సంస్థ నిర్ణయించింది. విదేశీ కోకింగ్‌కోల్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం కోసం 5-8% వరకు దేశీయ బొగ్గును కలిపి వాడుతోంది. దీన్ని 12% వరకు తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకొంది' అని కేంద్ర ప్రభుత్వం స్థాయీ సంఘానికి తెలిపింది.

ఉత్పత్తి సామర్థ్యం పెరిగింది

కేంద్రప్రభుత్వం ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన తర్వాత సంస్థలో 2024 అక్టోబరు 28 నుంచి రెండో బ్లాస్ట్‌ఫర్నేస్ మొదలుపెట్టినట్లు స్థాయీసంఘానికి కేంద్రం సమాచారం అందించింది. సంస్థ నిర్వహణ సామర్థ్యం 2024 సెప్టెంబరు నుంచి 2025 ఫిబ్రవరి మధ్యకాలంలో పెరిగినట్లు వివరించింది.

ఇవీ ఆర్ఐఎన్ఎల్ ఉత్పత్తి లెక్కలు (వేల టన్నులు)

వివరం	సెప్టెంబరు-24	అక్టోబరు-24	నవంబరు-24	డిసెంబరు-24	జనవరి	ఫిబ్రవరి
హాట్‌మెటల్	155	209	307	418	419	381
హాట్‌మెటల్/ రోజువారీ టన్నులు	5,170	6,732	10,222	13,485	13,504	13,622
ముడి స్టీల్	141	190	269	389	386	351
ఫినిష్డ్ స్టీల్	94	230	246	354	354	340
సేలబుల్ స్టీల్	128	240	251	365	364	349

దొంగ సిమ్‌ల భరతం పట్టేస్తా

- కట్టడి చేస్తున్న ఎ.ఎస్.టి.ఆర్.
- ఏడాది కాలంలో 82 లక్షల సిమ్ కార్డులు రద్దు

ఈనాడు, హైదరాబాద్: ఎన్నెన్నో సైబర్ నేరాలకు కీలకమవుతున్న సిమ్ కార్డులను కట్టడి చేసేందుకు గట్టి ప్రయత్నం మొదలైంది. ఓ టూల్ ఒకే వ్యక్తి వేరువేరు పేర్లతో వాటిని తీసుకుంటే పట్టేస్తోంది. దొంగ సిమ్‌ల దందా... వాటి ఆధారంగా సైబర్ నేరాలకు పాల్పడితే సులభంగా కనుక్కునేందుకు దర్యాప్తు సంస్థలకు ఒక పరిష్కారం దొరికింది. సాధారణంగా సిమ్ కొనుగోలు చేసే వ్యక్తి ఫొటోతో సహా పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలి. ఆ వ్యక్తి తెలియజేసిన చిరునామాలో ఉంటున్నట్లు భౌతికంగా విచారణ జరిపిన తర్వాతనే సిమ్‌ను యాక్టివేట్ చేయాలి. కానీ చాలామంది సిమ్ కార్డు అమ్మకందారులే నేరస్థులతో కుమ్మక్కై తప్పుడు పత్రాలతో వాటిని జారీ చేస్తున్నారు. హరియాణాకు చెందిన ఒకే వ్యక్తి వంద పేర్లతో 213 తీసుకున్నట్లు ఇటీవల బయటపడటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. క్షేత్రస్థాయిలో లోపాలను అరికట్టడం కష్టం కావడంతో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కేంద్రీకృతంగా సిమ్‌కార్డులు పరిశీలించాలని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ ఫేషియల్ రికగ్నిషన్ పవర్డ్ సొల్యూషన్ ఫర్ టెలికాం సిమ్ సబ్‌స్క్రైబర్ వెరిఫికేషన్‌ను అభివృద్ధి చేశారు. దీనిని ఎ.ఎస్.టి.ఆర్.గా పిలుస్తున్నారు. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలీమాటిక్స్(సి-డాక్)అభివృద్ధి చేసిన ఈ టూల్ దొంగ సిమ్ కార్డుల్ని ఇట్టే పట్టేస్తోంది.

ఎలా పనిచేస్తోందంటే...

మొత్తం 142 కోట్ల ఫొటోలతో సి-డాక్ పెద్ద డేటాబేస్ తయారుచేసింది. సిమ్ కొనుగోలు చేసేటప్పుడు విధిగా ఫొటో సమర్పించాలి కాబట్టి ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ విశ్లేషిస్తుంది. ఒకే తరహా ముఖకవళికలు ఉన్న వారి ఫొటోలు, వారు సమర్పించిన వివరాలను పక్కనపెడుతుంది. ఒకే వ్యక్తి వేర్వేరు వేషధారణలలో ఫొటో దిగినా ఎ.ఎస్.టి.ఆర్. పట్టుకుంటుంది. మోసపూరితంగా ఆ వ్యక్తి సిమ్‌కార్డులు తీసుకుంటే రద్దు చేస్తుంది. ఆ వివరాలన్నీ దర్యాప్తు సంస్థకు చేరవేస్తుంది. ఏడాది కాలంలో 82లక్షల సిమ్‌కార్డులను అధికారులు రద్దు చేశారు.

'మారిటైం' ప్రోత్సాహకాల చెల్లింపులో మార్పులు

విధానానికి సవరణలు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: ఏపీ మారిటైం విధానానికి (2024-29) అవసరమైన సవరణలు చేసేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి అనువుగా విధానాన్ని సమర్థంగా రూపొందించేందుకు అనుమతించింది. ఏపీ మారిటైం బోర్డు సీఈవో నుంచి అందిన ప్రతిపాదనల మేరకు..

■ ఏపీ పారిశ్రామిక విధానం 2024-29లో పేర్కొన్న ప్రకారం పెట్టుబడులను మూడు క్యాటగిరీలుగా వర్గీకరించారు. రూ.125 కోట్ల లోపు పెట్టుబడులు పెట్టే సంస్థలను ఎంఎస్ఎంఈల కింద, రూ.500 కోట్ల లోపు సబ్ లార్జ్ కింద, రూ.వెయ్యి కోట్ల వరకు పెట్టుబడులు పెట్టే సంస్థలను భారీ ప్రాజెక్టుల కింద పరిగణిస్తారు.

రెండు క్యాటగిరీల్లో ప్రోత్సాహకాలు

1. **మారిటైం మౌలిక సదుపాయాల అభివృద్ధి:** ఓడరేవులు, పోర్టు ప్రాక్సిమల్ పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధి (పోర్టు నిర్మాణంతో ఆయా పరిధిలో జరిగే అభివృద్ధి), ఇన్‌ల్యాండ్, తీరప్రాంతంలో షిప్పింగ్ కోసం టెర్మినళ్ల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాలను కల్పించినందుకు ప్రోత్సాహకాలు ఇస్తారు. తద్వారా మూలధన పెట్టుబడుల ఆకర్షణ, దీర్ఘకాలిక మౌలికసదుపాయాల వృద్ధిని సాధించాలనే లక్ష్యంతో ప్రోత్సాహకాలను అందించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.

ప్రోత్సాహకాలకు అవకాశం ఉన్న పెట్టుబడులు

- ■ గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్‌ఫీల్డ్ నాన్-మేజర్ పోర్టులు, బెర్తుల విస్తరణ, డ్రెడ్జింగ్, మారిటైం మౌలికసదుపాయాల కల్పన
- ■ ప్యాసింజర్ జెట్టీలు, బహుళ వినియోగ టెర్మినళ్లు, కార్గో, క్రూయిజ్ టెర్మినళ్ల ఆధునికీకరణ ప్రాజెక్టులు
- ■ నౌకల నిర్మాణం, మరమ్మతుల మౌలిక సదుపాయాలు, యార్డులు, డ్రై డాక్స్, స్లిప్‌వేస్, వర్క్‌షాపులు, మెయింటెనెన్స్, రిపేర్లు, నిర్వహణ(ఎంఆర్‌వో) సదుపాయాల ప్రాజెక్టులు.
- ■ అంతర్గత జల రవాణా కనెక్టివిటీని పెంచేందుకు ఏర్పాటు చేసే కార్గో టెర్మినళ్లు, లోడింగ్/అన్‌లోడింగ్ పాయింట్లు, నావిగేషనల్ సదుపాయాలు.
- ■ మారిటైం లాజిస్టిక్స్, అనుబంధ మౌలిక సదుపాయాలు, బంకరింగ్ స్టేషన్లు, తీరప్రాంత లాజిస్టిక్ హబ్‌లు, ఇన్‌ల్యాండ్ డిపోలు.

2. **మారిటైం కార్యకలాపాలను ప్రారంభించడం:** కార్గో హ్యాండ్లింగ్, నౌకల కదలికలు, షిప్పింగ్ సేవల కార్యకలాపాల ఆధారంగా ప్రోత్సాహకాలు.

- ■ పోర్టు ఆధారిత పారిశ్రామికాభివృద్ధి ప్రాజెక్టులను ప్రోత్సహించే లక్ష్యంతో మారిటైం మౌలికసదుపాయాల రంగంలో పెట్టుబడులకు ప్రోత్సాహకాలు

స్థిర మూలధన పెట్టుబడి (ఎఫ్‌సీఐ)పై ప్రోత్సాహకాలు

- ■ ఎంఎస్ఎంఈలు: ఎఫ్‌సీఐపై 25 శాతం..

మైక్రో: గరిష్ఠంగా రూ.కోటి. చిన్న పరిశ్రమలు–గరిష్ఠంగా రూ.6 కోట్లు, మధ్యతరహా-గరిష్ఠంగా రూ.10 కోట్లు

- ■ సబ్‌లార్జ్ ప్రాజెక్టులు: ఎఫ్‌సీఐపై 12 శాతం.. 5 ఏళ్లలో సమాన వాయిదాల్లో ప్రోత్సాహకాల చెల్లింపు.
- ■ భారీ ప్రాజెక్టులు: ఎఫ్‌సీఐపై 12 శాతం.. 7 ఏళ్లలో సమాన వాయిదాల్లో చెల్లింపు.
- ■ విద్యుత్, జీఎస్టీల తిరిగి చెల్లింపు
- ■ మెగా ప్రాజెక్టులకు కాంపిటీటివ్ రాయితీలు. గరిష్ఠంగా ఎఫ్‌సీఐపై 75 శాతం వరకు.
- ■ పోర్టు ప్రాక్సిమల్ ఏరియా డెవలప్‌మెంట్‌కు ఇచ్చే ప్రోత్సాహకాలకు సంబంధించి నిబంధనల సవరణ
- ■ షిప్‌యార్డు, క్లస్టర్ డెవలప్‌మెంట్ విధానంలోనూ సవరణలు
- ■ మారిటైం అనుబంధ కార్యకలాపాలు, కోస్టల్ షిప్పింగ్, వాటర్ టూరిజం, క్రూయిజ్ టూరిజం, ఫ్లోటెల్స్, హౌస్‌బోట్లు, సీప్లేన్, యాంఫీబియన్ బస్సులకు ప్రోత్సాహకాలు.
- ■ షిప్ బిల్డింగ్ యూనిట్లను ఏర్పాటు చేసే సంస్థలకు భూముల కేటాయింపు, లీజులు, రాయితీలకు నిబంధనలు.

కడుపు మాడ్చి.. ఎముకల గూడులా మార్చి..!

- తెలంగాణలోని అశ్వారావుపేటలో వివాహిత అనుమానాస్పద మృతి
- రెండేళ్లుగా గృహనిర్బంధం చేసి, హింసించి చంపారని ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు



లక్ష్మీప్రసన్న పెళ్లినాటి చిత్రం



బక్కచిక్కి మృతిచెంది

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: రెండేళ్లుగా ఆ తల్లిదండ్రులు తమ కుమార్తెను చూడలేదు. ఒక్కసారిగా అల్లుడు ఫోన్ చేసి మెట్ల మీద నుంచి పడిపోయిందని.. ఆసుపత్రిలో చేర్పించామని చెప్పడంతో పరుగున వెళ్లారు. తీరా అక్కడ ఎముకల గూడులా మారి.. విగతజీవిగా పడి ఉన్న తమ కుమార్తెను చూసి హతాశులయ్యారు. అల్లుడే మా బిడ్డకు తిండి పెట్టకుండా హింసించి హత్య చేశాడని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలో చోటుచేసుకుంది. మృతురాలి తండ్రి ముదిగొండ వెంకటేశ్వరరావు, బంధువులు, అశ్వారావుపేట ఎస్సై యయాతి రాజు కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం ముచ్చవరం పంచాయతీ పరిధిలోని విశ్వనాథపురానికి చెందిన లక్ష్మీప్రసన్న(33)ను అదే మండలం ఖాన్‌ఖాన్‌పేట వాసి పూల నరేశ్‌బాబుకు ఇచ్చి 2015లో వివాహం జరిపించారు. తొమ్మిదేళ్ల క్రితం వారికి కుమార్తె పుట్టింది. తరువాత నరేశ్‌బాబు ఆరేళ్లపాటు భార్యతో కలిసి అత్తగారింట్లోనే ఉన్నాడు. మూడేళ్ల తర్వాత భార్యాబిడ్డలతో కలిసి అశ్వారావుపేటకు వచ్చి అక్కాబావల ఇంట్లో ఉంటున్నారు. శనివారం నరేశ్‌బాబు అత్తామామలకు ఫోన్ చేసి.. లక్ష్మీప్రసన్న ఇంట్లో మెట్లపైనుంచి కిందపడటంతో గాయాలయ్యాయని, దగ్గర్లోని రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చేర్పించామని చెప్పాడు.

దీంతో వారు ఆసుపత్రికి వెళ్లి చూడగా అప్పటికే లక్ష్మీప్రసన్న మృతిచెంది ఉంది. ఎముకల గూడులా మారిన ఆమెను కాసేపు గుర్తుపట్టలేకపోయారు. శరీరమంతా కొత్త గాయాలు, మానిన గాయాల గుర్తులు ఉండటం చూసి తల్లడిల్లిపోయారు. లక్ష్మీప్రసన్నను అదనపు కట్నం కోసం నరేశ్‌బాబు, అతని తల్లి విజయలక్ష్మి, అక్క దాసరి భూలక్ష్మి, బావ శ్రీనివాసరావు హింసించేవారని ఆరోపించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండేళ్ల నుంచి మాట్లాడనివ్వలేదు

'వివాహ సమయంలో రెండెకరాల మామిడితోట, అరెకరం పొలంతోపాటు రూ.10 లక్షల నగదు, రూ.10 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను కట్నంగా ఇచ్చాం. అశ్వారావుపేటకు వెళ్లిన ఏడాదిపాటు తమ కుమార్తె మాట్లాడేది. రెండేళ్ల నుంచి ఆమెను చూపించలేదు, ఫోన్ చేసినా మాట్లాడనివ్వలేదు. మేము వెళ్లినా ఊర్లో లేదని ఏవేవో కారణాలు చెప్పి పంపించేవారు. ఆమెను గృహ నిర్బంధం చేసి ఆహారం పెట్టకుండా చంపేశారు' అని లక్ష్మీప్రసన్న తల్లిదండ్రులు తెలిపారు. నరేశ్‌బాబు బావ మాత్రం.. లక్ష్మీప్రసన్నకు రక్తహీనత, థైరాయిడ్ సమస్యలు ఉన్నాయని, ఆమెను తల్లిదండ్రులకు చూపించలేదనడం అవాస్తమని చెప్పారు.

వసుంధర

vasundhara@eenadu.in

ముఖం నిండా మొటిమలు... నువ్వా నేనా అన్నట్లు బయటకు వచ్చిన పొట్ట! మరేంటి? నేనూ ఉన్నా సతాయించడానికి అంటూ ఊడిపోయే జుట్టు... ఇవన్నీ చాలవన్నట్లు ఇంట్లో, ఇరుగూపొరుగూ మాటలు. ఎన్నెన్ని ఎదుర్కోవాల్సి వస్తుందో కదా కొత్తగా తల్లైన మహిళలు. అయితే వీటికి కాలమే సమాధానం అంటున్నారు నిపుణులు.

అమ్మా... తొందరెందుకు!



నిద్రలేమి...



మొదటిసారి అమ్మానాన్నలైన వారు బిడ్డకు రెండేళ్లు వచ్చేసరికి... వాళ్ల జీవితాలంలో సుమారు 6 నెలల నిద్రా సమయాన్ని కోల్పోతారని పరిశోధనలు చెబుతున్నాయి. మళ్లీ వాళ్లు ఐదువరకల ప్రశాంతంగా నిద్రపోవడానికి ఆరేళ్ల సమయం పడుతుందట. అయితే నాన్నల విషయం ఏమో కానీ, అమ్మలు పడే వేదన వర్ణనాతీతం. శారీరక, మానసిక ఒత్తిడికి సగానికిపైగా నిద్రలేమి కారణం. అయితే, మనం ఎంత ప్రయత్నించినా దీన్ని మార్చలేం. పిల్లలతోపాటే మన నిద్ర వేళల్ని రెండేళ్ల వరకూ మార్చుకోవాల్సిందే. అంతేకాని వీటికోసం అతిగా ఆలోచించినా, వేరేవారి పద్ధతులు ఏవీ పాటించినా అనవసర శ్రమ. నిద్రకోసం వాడే మందులవల్ల బిడ్డకి లేనిపోని సమస్యలు కొనితెచ్చినవారవుతారు.

జుట్టు రాలడం...



ప్రసవానంతరం జుట్టు రాలే సమస్య దాదాపు 40-50శాతం మందిలో ఉంటుంది. బుజ్జాయికి మూడు లేదా ఐదు నెలలు వచ్చేటప్పటికి ఇది మరింత ఎక్కువ అవుతుంది. ఓ పరిశోధన ప్రకారం... కొత్తగా తల్లైన మహిళల్లో రోజుకు 150 వెంట్రుకల దాకా ఊడిపోతాయట. హార్మోన్లలో హెచ్చుతగ్గులే ఇందుకు కారణం. అయితే బిడ్డకు సంవత్సరం వచ్చేలోపు ఈ సమస్య దూరమవుతుంది. మంచి ఆహారంతోపాటూ జీవనశైలిలో అనువైన మార్పులు చేసుకోవడం వల్ల దీన్ని కొంతమేర తగ్గించుకోవచ్చు. ఇవేవీ చేయకుండా కేశ సంరక్షణకు మీరెన్ని ఉత్పత్తులు వాడినా ప్రయోజనం ఉండదు సరికదా, రసాయనాలు ఎక్కువగా ఉండే షాంపూలు, నూనెలు వాడితే చిన్నారికి లేనిపోని చిక్కులు వచ్చే ముప్పు ఉంది.

బరువు నియంత్రణ...



కొత్తగా తల్లైన మహిళలను సతాయించే సమస్యల్లో బరువు ఒకటి. దీన్ని నియంత్రించడానికి ఏవేవో డైట్లు పాటిస్తుంటారు. ఒక్కసారి ఆలోచించండి. మీరు గర్భం దాల్చిన ముందుకీ, ఇప్పటికీ బరువుల్లో వచ్చిన తేడా ఒక్కసారిగా వచ్చిందా? ఒక్క రోజులో తగ్గిపోవడానికి. తొమ్మిది నెలలు కొద్దికొద్దిగా బిడ్డ అవసరాలకు అనుగుణంగా పెరుగుతూ వచ్చారు. అలానే తగ్గుతారు కూడా. అంతేకానీ, తక్షణ ఫలితాల కోసం మీరేం చేసినా వృథానే. పైగా పాలిచ్చే తల్లులు ఇలాంటి డైట్లకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

పొట్ట పెరగడం...



డెలివరీ అయి రోజులైనా గడవవు... 'అమ్మాయికి పొట్ట అలానే ఉండిపోయిందే' అంటారు. ఏ ఫంక్షన్లకో... పార్టీలకో వెళ్లారంటే 'మా పాపకి అసలు పొట్టే రాలేదు', 'ఎన్నో నెల' అంటూ ఎన్ని ప్రశ్నలో... ఇవన్నీ ఓ రకంగా బాడీ షేమింగే. అడిగేవారి ఉద్దేశం ఏదైనా... పాపం ఆ అమ్మ ఎంత బాధపడుతుందో కదా! వీటినుంచి తప్పించుకోవడానికి కొందరు బయటకు వెళ్లడానికే ఇష్టపడరు. కొందరు డైట్ల పేరుతో తిండికి దూరమవుతారు. గర్భధారణ సమయంలో పొట్ట కండరాలు బేబీ ఎదుగుదలకు అనుగుణంగా సాగుతాయి. ఇది కొంతమందిలో ఎక్కువగా, మరికొంతమందిలో తక్కువగా ఉంటుంది. ఏ ఒక్కరి శరీర తత్వం ఇంకొకరితో పోలి ఉండదు. అధ్యయనాల ప్రకారం ఇలా వచ్చే మమ్మీ బెల్లీ తగ్గడానికి కనీసం సంవత్సరం పడుతుంది.

చూశారుగా మరి... వీటన్నింటికీ పరిష్కారం కాలంతోపాటే ఉంటుంది. మనం ఏం చేసినా వీటిని మార్చలేం అన్న నిజాన్ని అర్థం చేసుకోవాలి. అయితే మంచి ఆహారం, వ్యాయామాల్ని మన జీవనశైలిలో ఎంపిక చేసుకుని సమస్యలు ఉండే సమయాన్ని తగ్గించుకోవచ్చు. అంతేకానీ, సామాజిక మాధ్యమాలు ఉన్నాయి కదా అని ఏ నిర్ణయం తీసుకున్నా... రీల్స్ చూస్తూ పాత జ్ఞాపకాల్ని, మీ గత జీవితాల్ని తలుచుకుంటూ ఒత్తిడికి గురైనా ఆ ప్రభావమంతా పడేది మీ మీద, మీ బిడ్డ జీవితం మీదే... అందుకే అన్నీ పక్కన పెట్టి హాయిగా ఉండండి. సమయం వచ్చినప్పుడు వాటికవే సర్దుకుంటాయి.

ఈ కొన్ని మార్పులు...



ఈ సమస్యల్లో చాలావరకు హార్మోన్ల అసమతౌల్యత వల్ల ఏర్పడినవే ఎక్కువ. విటమిన్లు, ఖనిజాల లోపమూ మరో కారణం. ప్రెగ్నెన్సీ సమయంలో ఆరోగ్యకరమైన ఆహారానికి ఇచ్చినంత ప్రాధాన్యత, బాలింతగా ఉన్నప్పుడు ఇవ్వరు. పథ్యం పేరుతో పోషకాహారానికి దూరం అవుతారు. దాదాపు సగానికి పైగా అమ్మలు ఇలానే చేస్తారు. దీని ప్రభావం బిడ్డకు ఇచ్చే పాలు, తల్లి కోలుకోవడం మీదా పడుతుంది. అలాకాకుండా, మీ డైట్లో ఐరన్, ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని చేర్చుకోవాలి. దీంతోపాటు తేలికపాటి వ్యాయామాల్ని చేయడం ద్వారా మీ సమస్యల్ని అధిగమించవచ్చు.

- డా. చీపురుపల్లి వసుంధర, గైనకాలజిస్ట్



పట్టుదల ఉండాలే కానీ ఏదైనా సాధించవచ్చని నిరూపించారు శివ స్వప్న. పెళ్లి కారణంగా పదో తరగతితో చదువుకు బ్రేక్ పడినా, భర్త ప్రోత్సాహంతో చదువు కొనసాగించి... తాజా డీఎస్సీలో వైఎస్సార్ కడప జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. ఆ వివరాల్ని 'వసుంధర'తో పంచుకున్నారిలా...

పదో తరగతిలో పెళ్లి... ఇప్పుడు స్కూల్ అసిస్టెంట్!

మా మేనత్తకు క్యాన్సర్. చనిపోయేలోపు తన కొడుకు పెళ్లి చూడాలని కోరడంతో బావ శ్రీనివాస్ రెడ్డితో పదో తరగతిలో ఉండగానే పెళ్లి చేశారు. ఆయన ఉద్యోగం దృష్ట్యా తమిళనాడుకు వెళ్లాల్సి వచ్చింది. ఏడాది పాటు అక్కడ ఉన్నాక, చదువుకోవాలని ఉందని మనసులోని మాట చెప్పాను. మా అమ్మవాళ్ల ఊరు ప్రొద్దుటూరుకు పంపి అందుకు ఏర్పాట్లుచేశారు. అక్కడే ఇంటర్ పూర్తిచేశా. డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో పాప పుట్టింది. ఇక చదవలేనేమో అనుకున్నా! కానీ, అమ్మ ఆదెమ్మ, అక్క పార్వతి సాయం చేశారు. పాపను చూసుకుంటూనే, డిగ్రీ, బీఈడీ కూడా చేశాను. ఆ సమయంలో ఆయనకు దిల్లీకి బదిలీ అయింది. అప్పటి వరకైతే వారానికో సారి వచ్చి మమ్మల్ని చూసుకునేవారు. దిల్లీ దూరాభారం కావడంతో ఆయనతో వెళ్లాను. పాప స్కూలుకు వెళ్లాక చదివేదాన్ని. అక్కడ ఉండగానే ఇగ్నోలో దూరవిద్య ద్వారా ఎం.ఏ. ఇంగ్లిష్ చేశాను. తర్వాత కోల్‌కతాకు బదిలీ అయింది. డీఎస్సీ నోటిఫికేషన్ పడిన వెంటనే ప్రొద్దుటూరు వచ్చి ప్రిపేర్ అయ్యాను. సొంతంగా సిద్ధమవుతూ ఆన్‌లైన్‌లో ఈనాడు ప్రతిభ మాక్ టెస్టులు రాసేదాన్ని. బాగా రాశాను అనుకున్నా కానీ, జిల్లా టాపర్ (స్కూల్ అసిస్టెంట్-ఇంగ్లిష్ లాంగ్వేజ్-83.27 మార్కులు)గా నిలుస్తానని మాత్రం అనుకోలేదు. ఈ ప్రయాణంలో మావారే నాకు మార్గదర్శి.

- బెజవాడ వెంకటేశ్వర్లు

మీకు తెలుసా?



అతి కొద్దిమంది నవజాత శిశువుల్లో పాల ఉత్పత్తి కూడా ఉంటుందట. దీన్నే 'నియోనేటల్ గెలాక్టోరియా' అని అంటారు. గర్భంలో ఉన్నప్పుడు తల్లి హార్మోన్ల ప్రభావం ప్లాసెంటాపై పడటం వల్ల ఇలా జరుగుతుందట. అయితే, ఈ కండిషన్ తాత్కాలికమే. బేబీకి 2-12వారాలు వచ్చేసరికి దానంతట అదే పోతుందట.

'అప్పుడే నిద్ర రావట్లేదు', 'ఈ ఒక్క కార్టూన్ చూసి పడుకుంటా'... నిద్రపొమ్మని చెప్పడం ఆలస్యం ఇలాంటి కారణాలెన్నో చిన్నారుల నోట్లోంచి దూసుకొస్తాయి. ఫోన్, టీవీలు, చదువుల ఒత్తిడి వంటివి పిల్లల్లో నిద్రను త్వరగా దరిచేరనీయవు. అలాగని ఊరుకుంటే నిద్రలేమికి గురవడంతో పాటు ఎన్నో సమస్యలు కొని తెచ్చుకుంటారు. అలా అవొద్దంటే 'నైట్ రొటీన్' తప్పనిసరి అంటారు నిపుణులు.

నైట్ రొటీన్... మీ ఇంట్లో ఉందా?



రోజూ ఒక నిర్ణీత సమయానికి పడుకునేలా అలవాటు చేయడమే ఈ నైట్ రొటీన్. ఒకరకంగా ఇది విశ్రాంతి సమయమని శరీరం దానంతట అది గుర్తించేలా చేయడమన్న మాట. ఇందుకోసం పిల్లల గది నిశ్శబ్దంగా, చల్లగా వీలైనంత చీకటిగా ఉండేలా చూసుకోండి. మంచమూ మెత్తగా, సౌకర్యవంతంగా ఉండాలి. రోజూ నిర్ణీత సమయానికి పడకగదిలోకి వెళ్లేలా చూడాలి. చిన్న చిన్న స్ట్రెచ్‌లు చేయించాలి. అప్పుడు ఫిజికల్ టెన్షన్ తగ్గుతుంది. అయితే అది 5 నిమిషాలకు మించకూడదు. మరో అయిదు నిమిషాలు శ్వాస సంబంధిత వ్యాయామాలు చేయిస్తే మనసూ నెమ్మదిస్తుంది.

ఇప్పుడు పడుకోబెట్టి, ఆరోజు బాగా నవ్వించినవీ, వాళ్లు చేసిన నచ్చిన పనులు... ఇలా సానుకూల అంశాల గురించే మాట్లాడండి. ఇలా చేయడం వల్ల మనసు నిండటమే కాదు, భద్రతా భావన కూడా కలుగుతుందట. దీంతో ప్రశాంతంగా నిద్రపోతారు. మరోరోజు కథ చెప్పొచ్చు, పుస్తకం చదివి వినిపించొచ్చు. దీన్నో రొటీన్‌లా చేయాలి. ఇవి ఆరోజు నిద్రపోవడానికే కాదు, భవిష్యత్తులో వాళ్లు మానసికంగా ఆరోగ్యంగా ఎదగడానికీ సాయపడతాయి. పిల్లల్లో స్వీయ నియంత్రణ అలవడుతుంది. ఒత్తిడి త్వరగా దరిచేరదు. భావోద్వేగాలపైనా పట్టు సాధిస్తారు. దీంతో వాళ్లలో త్వరగా ఆందోళన కూడా దరిచేరదట. దీనిమీద ఎన్నో పరిశోధనలూ జరిగాయి. ఎంత త్వరగా 'బెడ్ టైమ్ రొటీన్' లేదా 'నైట్ రొటీన్'ని అలవాటు చేస్తే పిల్లలు అంత సుఖనిద్రకి అలవాటు పడతారు, ఆరోగ్యంగా ఎదుగుతారని వాటి ఫలితాలు తేల్చాయి. కాబట్టి, మీ ఇంట్లోనూ ప్రయత్నించేయండి. మంచి విశ్రాంతి, భవిష్యత్తును మీ పిల్లలకు అందించండి.

నా వయసు 26. ఈ మధ్య ఓ అబ్బాయిని ఇష్టపడుతున్నా. ఇద్దరం ఒకే దగ్గర పనిచేస్తున్నాం. కానీ అతనికి నేనంటే ఇష్టమో కాదో తెలియదు. ఇదే విషయం మా స్నేహితురాలితో చెబితే... 'తను మంచోడు కాదు, తొందర పడకు, కొంచెం సమయం తీసుకో' అంటోంది. ఏం చేయను? - ఓ సోదరి

ఇష్టపడుతున్నా... చెప్పాలా వద్దా?

మీరు చెబుతున్న దానిబట్టి చూస్తే... మీకు అతనిపై ఉన్న ఇష్టం తెలుస్తుంది. ప్రేమ అంటే ఇరువైపుల నుంచి ఉండాలి. ఒకవేళ అతనికి మీపై ఆ అభిప్రాయం ఉంటే... మాటల్లోనో, చేతల్లోనో ఇప్పటికే మీకు తెలిసి ఉండేది. అలాంటి భావం లేకుండా మీరే ముందు ప్రేమను వ్యక్తపరిస్తే... అతను మిమ్మల్ని చులకనగా చూసి, చెడుగా అనుకునే అవకాశం ఉంది. ఇతరులతో ఈ విషయాన్ని పంచుకుంటే... సమస్యలు కోరి తెచ్చుకున్న వారవుతారు. మీ స్నేహితురాలు చెప్పినట్లు వేచి చూస్తేనే మంచిది. లేదూ, ఆమె అతనెందుకు 'మంచివాడు కాదు' అందో వివరంగా అడిగి తెలుసుకోండి. దాంతోపాటు అతని అలవాట్లు, గుణాలు, కుటుంబ వివరాలు తదితరాలు తెలుసుకోవడానికి ప్రయత్నించండి. ఈ సమయంలో మీరంటే అతనికి ఇష్టం ఉంటే తనే బయటపడతాడు. లేదా వివరాలన్నీ తెలిశాక అతను మీకు అన్ని విధాలా తగినవాడు అనుకుంటే మీ ఇష్టాన్ని చెప్పండి. ఏదేమైనా ఆలోచించి నిర్ణయం తీసుకోండి.

డియర్ వసుంధర



డా. మండాది గౌరీదేవి
మానసిక నిపుణురాలు

గొడవైతే ఏడ్చేస్తున్నా..!

నా వయసు 25, పెళ్లైంది. నేను గొడవల్ని ఇష్టపడను. అలా అని ఎవరైనా కావాలని నా జోలికి వచ్చినా ఊరుకోను. వాదనకు దిగుతాను. కానీ ఈ క్రమంలో వారు గట్టిగా అరిస్తే ఏడ్చేస్తున్నా. తప్పు అవతలి వాళ్లదైనా నేనెందుకు ఇలా రియాక్ట్ అవుతున్నా. ఇదేమన్నా సమస్యా? -ఓ సోదరి

మానసిక ఎదుగుదలలో భావోద్వేగాలన్నవి ముఖ్యమైన అంశాలు. కొంతమంది వీటిని చక్కగా నియంత్రించుకోగలుగుతారు. సున్నితమైన, చంచలమైన మనసు కలిగిన వాళ్లు ఇందుకు భిన్నంగా ప్రవర్తిస్తుంటారు. మీరు చెబుతున్నదానిబట్టి చూస్తే... మీరు రెండో కోవకు చెందినవారు. కానీ ఇది అన్ని సందర్భాల్లో మంచిది కాదు. దీన్ని ఎదుటి వాళ్లు మీ బలహీనతగా భావించే అవకాశం ఉంటుంది. మీరు గొడవ పడే సందర్భాలు వచ్చినప్పుడు... ముందు తప్పొప్పులను బేరీజు వేసుకోండి. ఇలా చేయడం వల్ల మీ వాదనకు బలం చేకూర్చుకున్న వారవుతారు. వాదనకు దిగకుండా మాట్లాడి పరిష్కరించుకోవడానికి ప్రయత్నించండి. లేదూ అవతలి వాళ్లు తగాదాకే చూస్తున్నారు అనుకుంటే.. తొందర్లో, కోపంలో మాట తూలకుండా పరిస్థితులకు అవసరమైనట్లే మాట్లాడండి. ఇన్ని జాగ్రత్తలు పాటించినా మీ భావోద్వేగాలు నియంత్రణలో ఉండటం లేదు అనుకుంటే... సైకాలజిస్టుని కలవండి. మీ సమస్యకు కారణాలు తెలుసుకుని అవసరమైన చికిత్స అందిస్తారు.

అక్కాచెల్లెళ్లు... ప్రభుత్వోద్యోగులు!

ఇంట్లో ఒకరిద్దరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడమే కష్టం. అలాంటిది ఒకే ఇంటి నుంచి నలుగురు అక్కాచెల్లెళ్లు ఉద్యోగాలు సాధించి ప్రత్యేకతను చాటారు!

సాధారణంగా ఆడపిల్లలు పుట్టగానే చదువు కంటే ముందుగా... పెళ్లికి ప్రణాళికలు వేసుకునే తల్లిదండ్రులు ఉన్నారు. కానీ చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం వేపమాకులపల్లెకు చెందిన సీతప్పగారి మునివెంకటప్ప, గౌరమ్మ అందుకు భిన్నం. వీళ్ల పిల్లల చదువుల గురించి ఆలోచించారు. వీరిది సాధారణ రైతు కుటుంబం. వీరికి నలుగురు కుమార్తెలు. వీణాకుమారి, వాణి, వనజాక్షి, శిరీష. ఆరుగాలం కష్టపడినా... పెట్టుబడులైనా దక్కని వ్యవసాయం! అయినా రాజీ పడకుండా పిల్లల్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలనుకున్నారా తల్లిదండ్రులు. 2007లో మునివెంకటప్ప అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటికి పిల్లలు ఇంకా చిన్నవాళ్లే. చదువులూ పూర్తికాలేదు. ఆ తల్లిది దిక్కుతోచని పరిస్థితి. ఆ సమయంలో పిల్లలు తల్లి కష్టాన్ని గుర్తించి వీలు దొరికినప్పుడల్లా ఇంటి పని, వ్యవసాయంలో సాయం చేసేవారు. ఇలా నలుగురు కుమార్తెలూ డిగ్రీ పూర్తిచేశారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధనే లక్ష్యంగా నిరంతరం శ్రమించి పోటీ పరీక్షలకు హాజరయ్యేవారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఇంటిల్లిపాది ఓర్చుకుని బ్యాంకు, పోలీస్, టీచరు... తదితర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసేవారు. వారి కష్టానికి ఫలితంగా పెద్ద కుమార్తె వీణాకుమారి 2014లో కానిస్టేబుల్‌గా, 2016 డీఎస్సీలో వాణి ఎస్‌జీటీగా ఉద్యోగాలు సాధించారు. రెండేళ్ల వ్యవధిలో ఇద్దరు కుమార్తెలకూ ప్రభుత్వ ఉద్యోగాలు రావడంతో ఆ తల్లి మనసు కొంత కుదుటపడింది. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అమ్మాయిని కానిస్టేబుల్, టీచరుగా చేస్తున్న అమ్మాయిని టీచరే వివాహం చేసుకోవడం మరింత సంతోషాన్నిచ్చింది. మిగిలిన ఇద్దరు అమ్మాయిలూ ఉద్యోగాలు సాధిస్తే బాగుంటుందని అల్లుళ్లు ప్రోత్సహించారు.



వనజాక్షి, వీణ, గౌరమ్మ, వాణి, శిరీష

గత నెలలో విడుదలైన పోలీస్ ఉద్యోగాల ఫలితాల్లో వనజాక్షి కానిస్టేబుల్‌గా, తాజా డీఎస్సీ ఫలితాల్లో శిరీష సెకండరీ గ్రేడ్ టీచరుగా ఎంపికయ్యారు. తల్లి కష్టాన్నీ, నమ్మకాన్నీ వమ్ము చేయకుండా ఆశయాన్ని సాధించిన కుమార్తెలూ.. కూతుళ్లను ఉద్యోగులుగా చూడాలని పట్టుబట్టి చదివించిన తల్లీ.. వీరి కథ అందరికీ స్ఫూర్తిదాయకమే కదా!

- యస్వీ రమణ, చిత్తూరు



ఆ కొవ్వులే... కీలకం!

వయసు మీద పడే కొద్దీ ఎవరిలోనైనా జ్ఞాపకశక్తి మందగిస్తుంది. అది తీవ్రమై ఆల్జీమర్స్‌గా మారే వారి సంఖ్య ఇప్పుడు పెరుగుతోంది. అయితే, మగవారితో పోలిస్తే ఆడవారిలో ఇది వచ్చే శాతం అధికమే. మరి అందుకు కారణమేంటి? ఇదే తెలుసుకోవాలనుకున్నారు కింగ్స్ కాలేజ్ లండన్ పరిశోధకులు. ఇందుకోసం ఆల్జీమర్స్ ఉన్న కొంతమంది నుంచి ప్లాస్మా శాంపిళ్లను తీసుకున్నారు. వాళ్ల రక్తంలోని లిపిడ్స్‌ను విశ్లేషించారు. ఆరోగ్యంగా ఉన్న ఆడవారితో పోలిస్తే, ఆల్జీమర్స్ ఉన్న మహిళల్లో ఒమేగా3 ఫ్యాటీ ఆమ్లాలు కలిగి ఉన్న లిపిడ్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. అదే మగవారిలో అయితే, ఆరోగ్యంగా ఉన్నవాళ్లలోనూ, అభిజ్ఞాన నైపుణ్యాల్లో వెనకబడి ఉన్న వారిలోనూ ఈ లిపిడ్లలో ఎలాంటి మార్పులూ లేవట. కాబట్టి, ఒమేగా 3 కొవ్వులు ఆడవాళ్లకు మరింత అవసరమనీ... అందుకు తగినట్లు ఆహారంలో మార్పులు చేసుకోవాలని లేదా సప్లిమెంట్లు వంటివి తీసుకోవాలని సూచిస్తున్నారు పరిశోధకులు.

శోధిత

బీరువాలో చెద వాసన రాకుండా!


కాలం ఏదైనా వార్డ్‌రోబ్‌లను ఎప్పుడూ మూసే ఉంచినా, వాతావరణంలో కాస్త తేమ ఎక్కువైనా... వాసన వస్తాయి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చెదలూ, పురుగులూ ఇబ్బంది పెడతాయి. ఇలాంటప్పుడు దుస్తులు పాడవకుండా సమస్య దూరమవ్వాలంటే...



- బీరువాలో దుస్తుల్ని నెలల తరబడి మడత తీయకుండా వదిలేయకండి. అప్పుడప్పుడూ ఎండలో ఆరేయాలి. మడతల్లో చిన్న దేవదారు ముక్కల్ని ఉంచాలి. లేదంటే పచ్చ కర్పూరాన్ని వస్త్రంలో చుట్టి పెట్టొచ్చు. ఈ వాసన చెద పురుగులకు నచ్చదు.
- తేమ ఉన్న చోట చెద పట్టే అవకాశం ఉంటుంది. షెల్ఫ్‌లో ఓ మూల సిలికా జెల్ ప్యాకెట్ ఉంచండి. వారానికోసారి డీహ్యూమిడిఫయర్ పెడితే సరి. చెదల సమస్య నివారించొచ్చు.
- వార్డ్‌రోబ్‌లో ఏమైనా క్రాక్స్, గ్యాప్స్ ఉంటే వాటిని సీల్ చేయండి. దుమ్మూ, ధూళిని ఎప్పటికప్పుడు వాక్యూమ్ చేస్తే సరి.
- వేప ఆకులు, లవంగాలు... ఇవి అన్నీ చెదల నివారణకు సాయపడతాయి. వాటి దుర్వాసనతో పాటూ తేమ కూడా పోవాలంటే... లవంగాల పొడి, బొగ్గు, బేకింగ్ సోడా లోపల ఉంచండి.
- చెమట, నూనె, ఆహార మరకలు ఉన్న దుస్తులను పూర్తిగా శుభ్రం చేశాకే బీరువాలో పెట్టండి. లేదంటే ఇవి సిల్వర్‌ఫిష్... ఇతర పురుగులను ఆకర్షిస్తాయి. అలానే బీరువాల్లో కార్డ్‌బోర్డు బాక్సులను నిల్వ చేయొద్దు.
- ఎప్పుడో ఒకసారి ధరించే దుస్తుల్ని వాక్యూమ్ సీల్డ్ చేసి బ్యాగుల్లో పెట్టండి. దుస్తుల వరుసల మధ్య ఖాళీ ఉండనివ్వండి. పిప్పర్‌మెంట్, యూకలిప్టస్ వంటి ఎసెన్షియల్ ఆయిల్స్‌లో ముంచి తీసిన కాటన్ బాల్స్‌ని లోపల పెడితే పురుగులు రావు.

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

అన్నింటా... బొమ్మంట!



స్వీట్ హోమ్

సాధారణంగా ఇంట్లో చిన్న చిన్న వస్తువులను ఉంచటానికి స్టోరేజ్ బాక్సులను వాడుతుంటాం. ఇది ఒకప్పటి పద్ధతి. ఇప్పుడు ప్రతిదీ కళాత్మకంగా ఉండేలా చూసుకుంటున్నారు చాలామంది. అందుకే, స్టోరేజ్ కోసం రకరకాల గృహాలంకరణ వస్తువులను తెచ్చేస్తున్నారు. అలాంటి వాటిలో ఒకటే ఈ ట్రెండీ 'గర్ల్ డాల్స్'. వీటిని పెన్నులు, మేకప్ వస్తువులు, పండ్లు, రిమోట్‌లు... వంటివి ఉంచే స్టోరేజ్ ట్రే లాగానే కాదు, పూల కుండీలుగా, బుక్ హోల్డర్లుగానూ వాడుతున్నారు. లివింగ్ రూమ్, వంటగది, రీడింగ్, ఆఫీస్ రూమ్‌లలో అందంగా సర్దేస్తున్నారు. సృజనాత్మకత ఉట్టిపడే ఈ డాల్స్ ఇంటికి నూతన అందాన్ని తెస్తాయి. బహుళ ప్రయోజనాలున్న ఈ క్యూట్ డాల్స్ స్నేహితులకూ, బంధువులకూ బహుమతిగా ఇవ్వడానికీ బావుంటాయి. ప్రయత్నించండి.



జెన్ జీలు... జ్యోతిష్యం!




'ఈ రోజు నా రాశి ఎలా ఉంది? ఎప్పుడు పెళ్లవుతుంది? ప్రమోషన్ ఎప్పుడు వస్తుంది? కొత్త ప్రాజెక్టులు ప్రారంభించడానికి ఇది అనువైన కాలమేనా?'... ఇన్‌స్టాగ్రామ్ ఓపెన్ చేస్తే చాలు, ఇలాంటి పోస్టులూ ప్రకటనలూ చాలానే కనిపిస్తున్నాయి కదా! ఓ పక్క కృత్రిమ మేధ విస్తరిస్తుంటే... మరోవైపు ఇలాంటి వాటిని ఎవరైనా నమ్ముతారా అంటే... 'మేం నమ్ముతాం' అంటున్నారు జెన్‌జీ అమ్మాయిలు. అంతేకాదు వీటిని ఫాలో అయ్యే, రోజుని ప్రారంభిస్తున్నారట. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ఏ విషయాన్నైనా ప్రాక్టికల్‌గా ఆలోచించే జెన్‌జీలు... దీనిలో మాత్రం ఎందుకిలా చేస్తున్నారు అనుకునేరు! వీళ్లు మానసిక ప్రశాంతతకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో మనకు తెలిసిందే. ఇంటా బయటా ఏ పని చేసినా సంతృప్తి, విశ్రాంతి, ఎక్కడ ఆలోచనలు అక్కడే వదిలేయాలి అన్న అంశాల్ని పక్కాగా పాటిస్తున్నారు. మిలీనియల్స్‌కు దిక్సూచిగా మారుతున్నారు. ఈ శాస్త్రాన్ని జోడించడం కూడా దానిలో భాగమే అంటున్నారు. దీని వల్ల సానుకూల దృక్పథంతో పనిచేయగలుగుతున్నారట. ఎప్పుడో జరిగే విషయాల గురించి ఆలోచిస్తూ ప్రస్తుత సమయాన్ని వృథా చేసుకుని, ఒత్తిడీ, ఆందోళనలతో బాధపడే కన్నా... ఫలానా సమయంలో అవి వస్తాయని తెలుసుకుని మానసిక సాంత్వన పొందడం మేలంటున్నారు. ఈ భావన ప్రతికూల ఆలోచనల్ని తగ్గించేందుకూ సహకరిస్తుందని జవాబిస్తున్నారు. మీరేం అంటారు?

కందిరీగలూ మంచివే!



కందిరీగలను చూస్తే అల్లంత దూరం పారిపోతాం. అది కుట్టిందంటే నొప్పి భరించలేం. అందుకే వాటిని మనం ద్వేషిస్తాం. చంపేయాలని చూస్తాం. అయితే వాటిలోనూ మంచి కోణాన్ని స్పృశించారు.. ఓ శాస్త్రవేత్త. వాటివల్ల మానవాళికి చాలా ఉపయోగాలున్నాయని పేర్కొంటున్నారామె. అందుకే వాటిని ప్రేమించాలని పిలుపునిస్తున్నారు.



యూనివర్సిటీ కాలేజ్ లండన్ (యూసీఎల్)కు చెందిన బిహేవియరల్ ఎకాలజీ ప్రొఫెసర్ సెరియన్ సమ్నర్.. కందిరీగలపై పరిశోధన చేస్తున్నారు. వాటిపై ఆమె ప్రత్యేకంగా పుస్తకం రాశారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతా పేరు 'కందిరీగల ప్రొఫెసర్' (వాస్ప్ ప్రొఫెసర్) అనే ఉంటుంది. వాటి కోసం సమ్నర్.. యూనివర్సిటీలోని గ్రాంట్ మ్యూజియంలో ఓ అంతర్జాతీయ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ప్రస్తుతం ప్రపంచంలో 1,00,000 రకాల తెలిసిన కందిరీగ జాతులున్నాయని, అంతకు 10 రెట్లు మనకు తెలియనివి ఉన్నాయని సమ్నర్ తెలిపారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

పెస్ట్ కంట్రోల్‌గా.. కందిరీగలు సహజమైన పెస్ట్ కంట్రోల్‌గా ఉపయోగపడతాయి. ఒకవేళ అవి లేకపోతే మిగతా కీటకాలను నియంత్రించడానికి మరిన్ని రసాయనాలను వాడాల్సి వస్తుంది. పచ్చ దోమలను, గొంగళి పురుగు, సాలె పురుగు, పేడ పురుగులను ఇవి వేటాడుతుంది.

పరాగ సంపర్కానికి.. పర్యావరణ వ్యవస్థలో పరాగ సంపర్కానికి తేనెటీగలు ఎంతో తోడ్పడతాయి. అందుకే వాటిని మనం పాలినేటర్లుగా (సంపర్కానికి తోడ్పడే కీటకాలు) భావించి పెంచుతాం. అలాగే కందిరీగలూ అతి ముఖ్యమైన పాలినేటర్లుగా పని చేస్తాయి. అత్తి పండు వంటి మొక్కలకు ఇవి సహకరిస్తాయి.

ఔషధాలకు: కొన్ని కందిరీగల విషం క్యాన్సర్‌ను నయం చేస్తుందని అధ్యయనంలో తేలింది. బ్రెజిలియన్ కందిరీగలు క్యాన్సర్ సెల్స్‌ను అంతమొందించాయని అధ్యయనంలో వెల్లడైంది. ఆరోగ్యకరమైన సెల్స్‌కు అవి ఎటువంటి హాని చేయలేదని తేలింది. కందిరీగ విషంలో యాంటీబయాటిక్స్ కూడా ఉంటాయి.

ఆహారంగా: ప్యూపా, లార్వాల కోసం కొన్ని ప్రాంతాల్లో కందిరీగలను పెంచుతారు. చైనా లాంటి దేశాల్లో దీనిని ఆహారంగా తీసుకుంటారు. ఇందులో ప్రొటీన్ అధికంగా ఉంటుంది.

పేపరు తయారీలో: కందిరీగలు చెట్ల మొదలు నుంచి బెరడును సేకరిస్తాయి. దానిని తమ లాలాజలంతో కలిపి సున్నితంగా తయారు చేస్తాయి. దాని నుంచి సన్నని పేపరు లాంటిదాన్ని తయారు చేస్తాయి.



వరదలతో జమ్మూకశ్మీర్‌లోని కథువాలో జాతీయ రహదారిపై కుంగిపోయిన వంతెన

ఉత్తరాదిన వర్షబీభత్సం

- రాజస్థాన్‌లో ఆరుగురి మృతి

జమ్మూ/జైపుర్: ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వరద నీరు ముంచెత్తడంతో రహదారులు, వంతెనలు, భవనాలు దెబ్బతిన్నాయి. రాజస్థాన్‌లో వర్ష సంబంధ ఘటనల్లో ఆరుగురు మృతి చెందారు. ఆ రాష్ట్రంలోని దౌసాలో 29 సెం.మీ. వర్షపాతం నమోదైంది. మరోవైపు జమ్మూలో 24 గంటల వ్యవధిలో 19 సెం.మీ. వర్షపాతం కురిసింది. జమ్మూలోని ఐఐఎం హాస్టల్ ప్రాంగణంలో వరద నీటిలో చిక్కుకుపోయిన 45 మంది విద్యార్థులను సహాయక సిబ్బంది సురక్షిత ప్రాంతానికి తరలించారు. కథువా జిల్లాలోని జమ్మూ-పఠాన్‌కోట్ హైవేకు సమీపంలో ఉన్న సహార్ ఖడ్ నది ఉప్పొంగడంతో ఓ వంతెన కుంగింది. హిమాచల్ ప్రదేశ్‌లో రెండు జాతీయ రహదారులు సహా 484 రోడ్లను మూసివేశారు. మహారాష్ట్ర, పంజాబ్, హరియాణా, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లోనూ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది.

ఓనం పండగకు రమ్మంటున్న మోనాలిసా



ఇంటర్నెట్ డెస్క్: కేరళలో ఘనంగా జరుపుకొనే ఓనం పండగ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కేరళ పర్యాటక విభాగం తన సోషల్ మీడియా హ్యాండిల్స్‌పై ప్రపంచ ప్రఖ్యాత 'మోనా లిసా' చిత్రరువుతో వినూత్న ప్రచారం నిర్వహిస్తోంది. కేరళ సంప్రదాయంలో బంగారు అంచు గల తెల్లని కసావు చీర ధరించి, నుదుట బొట్టు.. సిగలో మల్లెలు పెట్టుకున్న మోనాలిసా ఏఐ ఫొటోను 'కేరళ టూరిజం - టైమ్‌లెస్.. గ్లోసల్.. ఐకానిక్' పేరుతో ఓనం ప్రచారానికి వాడుతున్నారు. ఓనం ఉత్సవాలు ఈ నెల 26న ప్రారంభమై సెప్టెంబరు 5న తిరు ఓనంతో ముగుస్తాయి.



అన్నీ ఒకేసారి చిట్లవు కదా..!

పాప్‌కార్న్ వేయించేటప్పుడు అన్ని గింజలూ ఒకేసారి చిట్లవు! కొన్ని త్వరగా, మరికొన్ని కాస్త నెమ్మదిగా పాప్‌కార్న్‌గా మారతాయి. వృత్తిపర సామర్థ్యాల విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. త్వరగా విరమించుకోకుండా బరిలో ఉండండి. మీరూ పూర్తిస్థాయిలో సత్తాచాటే సమయం వస్తుంది.

– రూత్ ఆర్, కంటెంట్ క్రియేటర్

భాజపాతో ఈసీ భాగస్వామ్యం

- ఓట్ల సంస్థాగత చోరీని అడ్డుకుని తీరుతాం
- నా పెళ్లిపై లాలూతో సంప్రదింపులు!: రాహుల్

అరరియా: భాజపాతో కేంద్ర ఎన్నికల సంఘానికి భాగస్వామ్యం ఉందని లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. బిహార్‌లో సంస్థాగతంగా ఓట్లచోరీకి జరుగుతున్న ప్రయత్నాలను ప్రతిపక్ష ఇండియా కూటమి అడ్డుకుని తీరుతుందని స్పష్టంచేశారు. 'ఓటరు అధికార యాత్ర'లో ఆదివారం బిహార్‌లోని పూర్ణియా జిల్లా నుంచి అరరియా జిల్లాకు ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌తో కలిసి రాహుల్ బుల్లెట్‌పై వచ్చారు. రహదారికి ఇరువైపులా ప్రజలు స్వచ్ఛందంగా బారులు తీరారంటూ విలేకరుల సమావేశంలో ఆనందం వ్యక్తం చేశారు. 'ఓట్ చోర్..... గద్దీ ఛోడ్' (ఓటు దొంగ..గద్దె దిగు) అనే నినాదం ఇప్పుడు ఆరేళ్ల పిల్లల నోటివెంట కూడా వస్తోందని చెప్పారు. ర్యాలీలోనూ ప్రసంగించారు. బిహార్‌లో లక్షల ఓటర్లను తొలగించినా భాజపా ఒక్క ఫిర్యాదైనా చేయలేదని, ప్రజలు ఆ పార్టీని వదిలిపెట్టరని రాహుల్ చెప్పారు. తన పెళ్లి గురించి వచ్చిన ప్రశ్నకు బదులిస్తూ, ఇదివరకు ఆ సూచన చేసిన తేజస్వీ తండ్రి లాలూతో సంప్రదింపులు జరుగుతున్నాయని చమత్కరిస్తూ చెప్పారు.



హఠాత్తుగా వచ్చి ముద్దుపెట్టిన వ్యక్తి

ర్యాలీలో బుల్లెట్‌ను రాహుల్ మెల్లగా నడుపుతుండగా, గుర్తుతెలియని వ్యక్తి అకస్మాత్తుగా దూసుకువచ్చి ఆయన్ని గట్టిగా ఆలింగనం చేసుకున్నాడు. భుజంపై ముద్దిచ్చాడు. వాహనాన్ని బ్యాలెన్స్ చేయడంలో రాహుల్ తడబాటుకు గురయ్యారు. భద్రతా సిబ్బంది వెంటనే ఆ వ్యక్తిని పక్కకు ఈడ్చేసి, చెంప దెబ్బ కొట్టారు. రాహుల్ మాత్రం చిరునవ్వులు చిందిస్తూ ముందుకు సాగారు.

అధికారాన్ని హరించనున్న భాజపా: ఖర్గే



దిల్లీ: ఓట్లచోరీ తర్వాత భాజపా ఇప్పుడు అధికారాన్ని హరించే పనిలో నిమగ్నమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలను కూల్చివేసి, ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచేందుకు బిల్లులు తెస్తున్నారని మండిపడ్డారు. హరియాణా, మధ్యప్రదేశ్‌ల డీసీసీల నూతన అధ్యక్షులతో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు తమకు నచ్చిన అభ్యర్థిని ఎన్నుకునే హక్కును ఈ బిల్లులు కాలరాస్తాయని, ఇవి ప్రజాస్వామ్యంపై బుల్‌డోజర్లు నడపడం వంటివని వివరించారు.

విదేశీ వస్తువులను కొనకండి

- స్వదేశీని ఆదరించండి
- యువతకు మోదీ పిలుపు

అహ్మదాబాద్: యువత విదేశీ వస్తువుల మోజును తగ్గించుకోవాలని, ఇంటికి వాటిని తెచ్చుకునే సంస్కృతిని వదిలేయాలని, స్వదేశీ ఉత్పత్తులను ఆదరించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. యువతకు భారీగా ఉద్యోగావకాశాల కల్పనపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. స్వయం సమృద్ధి అనేది నేటి ప్రపంచంలో తప్పనిసరని అభిప్రాయపడ్డారు. యువత దేశీయ ఉత్పత్తులను ఆదరించాలని కోరారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన వీడియో మాధ్యమం ద్వారా ప్రసంగించారు. 'ఆపరేషన్ సిందూర్ ఒక్కటే దేశభక్తికి చిహ్నం కాదు. స్వదేశీ వస్తువులనే విక్రయిస్తామని వ్యాపారులు నిర్ణయం తీసుకోవడంద్వారా దేశభక్తిని చాటుకోవాలి. స్కిల్ ఇండియా ద్వారా కోట్ల మంది యువత నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా మారుతున్నారు. ప్రస్తుత ప్రపంచం వృద్ధాప్య సమస్యను ఎదుర్కొంటోంది. చాలా దేశాలకు యువత కావాలి. ప్రపంచం మొత్తానికి యువ మానవ వనరులను అందించగలిగే సత్తా భారత్‌కు ఉంది. మీరు నైపుణ్యం కలిగిన యువత అయితే.. పలు ఉపాధి అవకాశాలున్నాయి. వారు స్వయం సమృద్ధి సాధించగలరు. ఇది వారికి శక్తినిస్తుంది' అని మోదీ పేర్కొన్నారు. 'భారత్ స్వయం సమృద్ధి సాధించాల్సి ఉంది. అంటే దేశీయ ఉత్పత్తులనే వినియోగించాలి. స్వదేశీ ఉద్యమం మన భవిష్యత్తును బలపరుస్తుంది' అని వివరించారు.



కష్టే ఫలి..
వైద్యుడిగా కూలీ



తల్లిదండ్రులతో శుభమ్ శబర్

ఈటీవీ భారత్: ఒడిశాలోని ఖోర్ధా జిల్లా ముదులిధియా గ్రామానికి చెందిన శుభమ్ శబర్ దినసరి కూలీ నుంచి వైద్యుడిగా ఎదగనున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నడుమే భువనేశ్వర్‌లో ఇంటర్ పూర్తిచేసిన శుభమ్ ఆ తర్వాత చదివే స్తోమత లేక బెంగళూరుకు వెళ్లి ఓ కంపెనీలో కూలీగా చేరాడు. ఇటీవల పనిలో ఉండగా.. ఊరి నుంచి ఉపాధ్యాయుడు బసుదేవ్ ఫోను చేసి ''మిఠాయిలు పంచవా'' అని అడిగారు. శుభమ్‌కు తొలుత ఏమీ అర్థం కాలేదు. బసుదేవ్ ప్రోత్సాహంతో రెండు నెలల కిందట తాను రాసిన నీట్ పరీక్ష ఆ తర్వాత గుర్తుకొచ్చింది. నీట్‌లో 4,000 ర్యాంకు వచ్చిందని తెలిసి శుభమ్ ఆనందానికి అవధుల్లేవు. తండ్రి సహదేవ్ శబర్, తల్లి రంగి శబర్ చేసే వ్యవసాయమే ఆ కుటుంబానికి జీవనాధారం. వీరి కష్టం ఫలించి మంచి ర్యాంకుతో నీట్ ఉత్తీర్ణత సాధించిన శుభమ్ బ్రహ్మపురలోని ఎంకేసీజీ ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశం సాధించాడు.

అవును..
ఇదీ ప్రేమే!



ఈటీవీ భారత్: కేరళలోని కన్నూర్‌కు చెందిన జయకుమార్ పశుసంవర్ధక శాఖ అధికారిగా పదవీ విరమణ చేసి, మేకల పెంపకంతో శేషజీవితం గడుపుతున్నారు. పదేళ్ల కిందట.. మార్కెట్‌లో విక్రయానికి పెట్టిన లేత గోధుమరంగు మేక ఆయన దృష్టిని ఆకర్షించింది. యజమానితో బేరమాడి రూ.7 వేలకు కొన్న ఆ మేకను ఇంటికి తెచ్చి 'సిరోహి' అని నామకరణం చేశారు. నాటి నుంచీ మేకల పెంపకం ఆయనకు హాబీగా మారిపోయింది. మేకలకు వైటీ, బ్లాకీ, బ్రౌనీ వంటి పేర్లు పెట్టి.. నిత్యం ప్రత్యేక మేత పెడుతూ కన్నబిడ్డల్లా చూసుకొంటున్నారు. జయకుమార్ పిలిస్తే మేకలు కూడా అలాగే స్పందిస్తున్నాయి. ఏదైనా మేక చనిపోతే తన పొలంలోనే ఆయన ఖననం చేస్తారు. జయకుమార్ భార్య రసిజ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. భర్త పెంచుతున్న మేకల వైపు చూస్తూ 'మాది పెద్ద కుటుంబం' అంటారామె.

రోజువారీ వాడుక పదాలను
ట్రేడ్‌మార్క్‌గా గుర్తించలేం

- దిల్లీ హైకోర్టు



దిల్లీ: రోజువారీ ఉపయోగించే పదాలపై ఏ ఒక్కరికీ ప్రత్యేక హక్కు ఉండదని, వాటిని ట్రేడ్‌మార్క్‌లుగా గుర్తించలేమని దిల్లీ హైకోర్టు స్పష్టంచేసింది. బుక్‌మై యాత్ర, బుక్‌మై యాత్ర.కామ్ మార్క్‌లను ఉపయోగించుకుని మరెవరూ సేవలను ప్రారంభించకుండా నిషేధించాలని కోరుతూ.. యాత్రా ఆన్‌లైన్ లిమిటెడ్ అనే సంస్థ దాఖలు చేసిన అభ్యర్థనపై విచారణ జరుపుతూ జస్టిస్ తేజస్ కరియా ఈ వ్యాఖ్యలు చేశారు. 2006 నుంచి 'యాత్ర', యాత్ర.కామ్ పేర్లతో తమ సంస్థ అపారమైన సేవలను అందిస్తోందని, 2023-24 ఆర్థిక సంవత్సరం నాటికి 1.50 కోట్లమంది వినియోగదారులతో రూ.5,600 కోట్ల రాబడిని సాధించిందని యాత్ర ఆన్‌లైన్ తరఫు న్యాయవాదులు తెలిపారు. తమ సేవలను పోలేలా 'బుక్‌మైయాత్ర' అనే సంస్థ పుట్టుకొచ్చిందని, దీనిని నియంత్రించేందుకు యాత్ర అనే పదంపై ట్రేడ్‌మార్క్‌ను ఇవ్వాలని సంస్థ అభ్యర్థించింది. హిందీలో ప్రయాణానికి పర్యాయపదంగా ఉన్న 'యాత్ర' అనే వ్యక్తీకరణ.. పర్యాటక సేవలకు సంబంధించి చాలా సాధారణ పదమని, ఏ ఒక్క సంస్థ కూడా దీనిపై ప్రత్యేక హక్కును పొందజాలదని జస్టిస్ కరియా స్పష్టంచేశారు. యాత్ర పేరుతో దేశవ్యాప్తంగా వందల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సేవలు జరుగుతుంటాయంటూ అభ్యర్థనను తోసిపుచ్చారు.

ఆలయాల్లో రాజకీయ ప్రచారాలను నియంత్రించండి

- 3 ప్రధాన దేవస్థానం బోర్డులకు కేరళ హైకోర్టు ఆదేశం

కొచ్చిన్: తమ పరిధిలో ఉన్న ఆలయ ప్రాంగణాల్లో ఎటువంటి రాజకీయ కార్యకలాపాలు జరగకుండా నియంత్రించాలని కేరళలోని మూడు ప్రధాన దేవస్థాన బోర్డులు ట్రావెన్‌కోర్, కొచ్చిన్, మలబార్‌లను రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. ఎర్నాకుళంలో నివాసముండే ఎన్.ప్రకాశ్ అనే వ్యక్తిచేసిన అభ్యర్థనను పరిశీలించిన జస్టిస్ వి.రాజా విజయరాఘవన్, జస్టిస్ కె.వి.జయకుమార్‌ల ధర్మాసనం ఈ మేరకు సూచించింది. ఈ అభ్యర్థనలో.. కోజికోడ్‌లోని తాలి గుడి, అట్టింగల్‌లోని శ్రీ ఇడిలయప్పన్ సహా పలు దేవాలయాల్లో రాజకీయ ప్రచారాలు చేస్తున్నారని, దీంతో భక్తులకు ఇబ్బంది కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం.. ఆలయం, ప్రాంగణాల్లో నిర్వాహకులు ఎటువంటి రాజకీయ ప్రచారాలను అనుమతించకూడదని ఆదేశించింది. ''దేవస్థానాల నిధులను రాజకీయ పార్టీల ప్రయోజనాలకు వినియోగించకూడదు. 1988 నాటి మతపరమైన సంస్థల(దుర్వినియోగ నిరోధక) చట్టం.. ఆలయంలో నిర్వహించే ఏదైనా పండగ, ఉత్సవం, ఊరేగింపు వంటి కార్యక్రమాల్లో రాజకీయ ప్రచారాలను నిషేధిస్తుంది'' అని తెలిపింది. ఎటువంటి చట్ట ఉల్లంఘన చర్యలు బోర్డు దృష్టికి వచ్చినా ఆలస్యం చేయకుండా అధికారులకు తెలియజేయాలని పేర్కొంది. చట్టంలోని నిబంధనలను కచ్చితంగా పాటించేలా తమ పరిధిలోని ఆలయాలకు ఈ ఆదేశాలు జారీచేయాలని బోర్డులకు సూచించింది.

రష్యా చమురు కొనుగోలుపై..
ట్రంప్ అభ్యంతరాన్ని తీవ్రంగా పరిగణించాలి

- భారత్‌కు నిక్కీహేలీ సూచన



న్యూయార్క్: రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో ట్రంప్ లేవనెత్తిన అభ్యంతరాన్ని భారత్ తీవ్రంగా పరిగణించాలని, పరిష్కారం కోసం వీలైనంత త్వరగా శ్వేతసౌధంతో కలిసి పనిచేయాలని అమెరికా రిపబ్లికన్ నేత నిక్కీ హేలీ సూచించారు. రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న స్నేహం, విశ్వాసమే.. ప్రస్తుత ఒడుదొడుకులను దాటేందుకు బలమైన పునాదిగా ఉపయోగపడుతుందన్నారు. ''వాణిజ్యానికి సంబంధించి.. రష్యా చమురుపై అభిప్రాయభేదాలు పరిష్కరించుకోవడానికి బలమైన చర్చలు, సంప్రదింపులు అవసరం. చైనాను ఎదుర్కోవడానికి అమెరికాకు భారత్‌లో మిత్రులు ఉండాలి అన్న అంశం చాలా ముఖ్యమైంది. దీనిని ఏమాత్రం విస్మరించడకూడదు'' అని నిక్కీ హేలీ శనివారం పోస్టుచేశారు. ఇటీవల ఓ పత్రికకు రాసిన వ్యాసంలో.. ''ప్రపంచంలో ఆరోవంతు జనాభాకు కేంద్రం భారత్. యువ జనాభాలో చైనాను దాటేసింది. మరోవైపు డ్రాగన్ జనాభాలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్'' అని నిక్కీహేలీ పేర్కొన్నారు. ట్రంప్ హయాంలో క్యాబినెట్ స్థాయిలో పనిచేసిన తొలి భారతీయ- అమెరికన్ ఆమె. భారత్‌కు మద్దతు తెలిపినందుకు నిక్కీహేలీ సొంత పార్టీ నుంచే విమర్శలెదుర్కొన్నారు.

98 శాతం ఓటర్ల పత్రాలు అందాయి: ఎన్నికల కమిషన్

దిల్లీ: బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)కు సంబంధించి ఇప్పటికే 98.2 శాతం పత్రాలు అందాయని ఎన్నికల సంఘం వెల్లడించింది. ప్రజలు దీనిపై అభ్యంతరాలను దాఖలు చేయడానికి వచ్చే నెల 1 వరకు సమయం ఉందని ఈసీ ఆదివారం తెలిపింది. ఈ వ్యవధిలో ఓటరు ముసాయిదా జాబితాలో తప్పులను సరిదిద్దుకోవడమే కాకుండా, ఓటరు గణన సమయంలో ఇవ్వని అవసరమైన పత్రాలను కూడా సమర్పించవచ్చని తెలిపింది. రెండు నెలల్లో 98.2 శాతం పత్రాలు ఈసీకి చేరాయని, మిగిలిన 1.8 శాతం ఓటర్లు నిర్ణీత గడువులోపు పత్రాలు సమర్పించాలని కోరింది. ముసాయిదా జాబితాలో తప్పుగా నమోదైన వివరాలను సరిచేసుకోవడానికి ఓటర్లకు ఇదే చివరి అవకాశమని ఈసీ వెల్లడించింది.

బిహార్ ఓటర్ల జాబితాలో ఇద్దరు పాకిస్థానీ మహిళలు

ఇంటర్నెట్ డెస్క్: బిహార్‌లో ఇద్దరు పాకిస్థానీ మహిళలకు ఓటరు కార్డులు జారీ కావడంతో కేంద్ర హోంశాఖ చర్యలకు ఉపక్రమించింది. వారి పేర్లను వెంటనే తొలగించాలని యంత్రాంగానికి ఆదేశాలు జారీచేసింది. ఇమ్రానా ఖానమ్, ఫిర్దోషియా ఖానమ్ అనే మహిళలకు ఇటీవల ఓటరు కార్డులు జారీ అయ్యాయి. దీనిపై కేంద్ర హోంశాఖ విచారణ చేపట్టింది. ఫిర్దోషియా 1956లో మూడు నెలల వీసాపై, ఇమ్రానా మూడేళ్ల వీసాపై భారత్‌కు వచ్చి.. భాగల్పూర్ జిల్లాలోని భీకన్‌పూర్‌లో స్థిరపడ్డారు. వీరికి ఓటరు కార్డులు ఉండటంపై విచారణ జరపాలని జిల్లా కలెక్టర్‌ను హోంశాఖ ఆదేశించింది. ఆ ఇద్దరికీ నోటీసులు పంపనున్నట్లు కలెక్టర్ నావల్ కిశోర్ చౌధరీ చెప్పారు.

రష్యాపై ఒత్తిడికే భారత్ మీద సుంకాలు: వాన్స్

వాషింగ్టన్: ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని నిలిపివేసేలా రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకే భారత్‌పై తాము అధిక సుంకాలు వేస్తున్నామని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ తెలిపారు. చమురు విక్రయం ద్వారా వచ్చిన డబ్బుతో ధనిక దేశంగా మారకుండా రష్యాకు అడ్డంకులు కల్పించడం తమ ఉద్దేశమని చెప్పారు. ఎన్‌బీసీ న్యూస్ నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉక్రెయిన్ యుద్ధానికి అడ్డుకట్టపడేలా చేయడంలో అమెరికా మధ్యవర్తిత్వం విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇరుపక్షాల నుంచి ఇప్పటికే ఈ మేరకు సంకేతాలు అందుతున్నాయన్నారు. ఉక్రెయిన్‌లో నరమేధాన్ని ఆపితే రష్యాను తిరిగి ప్రపంచ ఆర్థిక రంగంలోకి ఆహ్వానిస్తామనే సంకేతాలను ట్రంప్ ఇప్పటికే పంపించారని చెప్పారు.

ఉక్రెయిన్‌కు మరో 3,350 అమెరికా క్షిపణులు

- నిధులు సమకూర్చనున్న ఐరోపా దేశాలు



ఉక్రెయిన్‌కు మద్దతుగా జర్మనీ రాజధాని బెర్లిన్‌లో ర్యాలీ

వాషింగ్టన్: ఉక్రెయిన్ గగనతల రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు మరో 3,350లకు పైగా ఎక్స్‌టెండెడ్ రేంజ్ అటాక్ మ్యూనిషన్ (ఈఆర్ఏఎమ్) క్షిపణులను ఆ దేశానికి అందించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆమోదం తెలిపినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఆయుధ ప్యాకేజీకి ఐరోపా దేశాలు నిధులు సమకూరుస్తున్నట్లు తెలిపాయి. ఆరు వారాల్లో ఈ క్షిపణులు కీవ్‌కు చేరుకుంటాయని సమాచారం. అయితే 240 కి.మీ. నుంచి 450 కి.మీ. పరిధి కలిగిన ఈఆర్ఏఎమ్ క్షిపణులను రష్యాపైకి ప్రయోగించాలంటే ఉక్రెయిన్ పెంటగాన్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అమెరికా అధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు మరిన్ని ఆయుధాలను సరఫరా చేసే విషయాన్ని అమెరికా ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది.

ప్రయోగానికి అనుమతించని పెంటగాన్

మరోవైపు రష్యా భూభాగంలోని లక్ష్యాలను ఛేదించడానికి అమెరికా రూపొందించిన లాంగ్-రేంజ్ ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్స్ (ఏటీఏసీఎంఎస్)ను వినియోగించకుండా పెంటగాన్ అడ్డుకుంటున్నట్లు పలు నివేదికలు సూచిస్తున్నాయి. మాస్కో చేపడుతున్న దాడులకు దీటుగా ఆయుధాలను ఉపయోగించకుండా కీవ్ సామర్థ్యాన్ని పరిమితం చేస్తోందని పేర్కొన్నాయి. యుద్ధం ముగింపునకు తాను ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఇరుదేశాల నేతలు ముందడుగు వేయకపోవడంతో ట్రంప్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి.

మా అణువిద్యుత్ కేంద్రంపై ఉక్రెయిన్ దాడులు

- 95 డ్రోన్‌లను అడ్డుకున్నాం: రష్యా

మాస్కో: ఉక్రెయిన్ స్వాతంత్ర్య దినోత్సవం రోజున తమ దేశ అణువిద్యుత్, ఇంధన వనరులపై శనివారం అర్ధరాత్రి నుంచి కీవ్ డ్రోన్ దాడులు చేస్తోందని రష్యా ఆదివారం ఆరోపించింది. ముఖ్యంగా పశ్చిమ కుర్స్క్ ప్రాంతంలోని అణువిద్యుత్ కేంద్రంతో పాటు ఇతర విద్యుత్ కేంద్రాలు, ఇంధన వనరులను ఆ దేశం లక్ష్యంగా చేసుకుందని పేర్కొంది. ఈ ఘటనలో అణువిద్యుత్ కేంద్రంలోని ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిని మంటలు చెలరేగగా వెంటనే ఆర్పివేశామని, ఇందులో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ప్లాంట్ అధికారులు తెలిపారు. రేడియేషన్ స్థాయిలు కూడా సాధారణ పరిమితుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. తమ భూభాగంలోకి వచ్చిన 95 ఉక్రెయిన్ డ్రోన్‌లను అడ్డుకున్నామని రష్యా రక్షణ శాఖ తెలిపింది. సైనిక చర్యల వల్ల రష్యాలోని అణువిద్యుత్ కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతిని మంటలు చెలరేగినట్లు మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా తమకు తెలిసిందని ఐక్యరాజ్యసమితికి చెందిన అణువిద్యుత్ కేంద్రాల పరిశీలన సంస్థ పేర్కొంది.

మాస్కోలో పేలుడు..ఒకరి మృతి

రష్యా రాజధాని మాస్కోలోని ఓ ప్రముఖ వాణిజ్య భవనంలో ఆదివారం పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. లుబియాంక స్క్వేర్‌లోని సెంట్రల్ చిల్డ్రన్ స్టోర్ షాపింగ్ మాల్‌లోని మూడో అంతస్తులో ఈ పేలుడు జరిగింది. గ్యాస్ సిలిండర్ పేలుడుతో ఈ ఘటన చోటు చేసుకుందని అగ్నిమాపక విభాగం వెల్లడించింది.

గాజా సిటీపై బాంబుల వర్షం

- 64 మంది మృతి



ఇజ్రాయెల్ దాడితో గాజాలో అలముకొన్న పొగ

డెయిర్ అల్-బలా: గాజా సిటీపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తోంది. వైమానిక దాడులతో పాటు.. ట్యాంకులతోనూ విరుచుకుపడుతోంది. గడచిన 24 గంటల్లో 64 మంది మృతి చెందారని, 300 మందికి గాయాలయ్యాయని హమాస్‌కు చెందిన ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆదివారం తెలిపింది. గాజాసిటీ లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్‌కు ఇజ్రాయెల్ 60 వేల మందితో రిజర్వు దళాలను రంగంలోకి దింపింది. మొత్తం గాజాస్ట్రిప్‌ను ఆక్రమించే ఉద్దేశం ఉందని బందీల విడుదలపై హమాస్‌తో పరోక్ష చర్చలు విఫలమైన తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్న సంగతి తెలిసిందే.

■ యెమెన్ రాజధాని సనాపై ఇజ్రాయెల్ ఆదివారం దాడులు చేసింది. ఓ విద్యుత్కేంద్రం, గ్యాస్ స్టేషన్‌తో పాటు రాజధాని వ్యాప్తంగా వివిధ ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది.

'రామజన్మ భూమి' ట్రస్టు సభ్యుడు
విమలేంద్ర మిశ్ర కన్నుమూత

అయోధ్య: ఉత్తర్‌ప్రదేశ్‌లోని శ్రీరామజన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్టులో కీలక సభ్యుడు, అయోధ్య రాజకుటుంబ వారసుడు విమలేంద్ర మోహన్ ప్రతాప్ మిశ్ర(75) కన్నుమూశారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శనివారం రాత్రి స్వగృహంలో విమలేంద్ర తుదిశ్వాస విడిచినట్లు ఆయన తమ్ముడు శైలేంద్ర మోహన్ ప్రతాప్ మిశ్ర తెలిపారు. అయోధ్య వివాదంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన అనంతరం మిశ్ర.. రామాలయ 'రిసీవర్'గా నియమితులయ్యారు.

నేరం చేస్తే పబ్‌లోకి నో ఎంట్రీ

- సంగీత కచేరీలు, క్రీడా ఈవెంట్లలోకి ప్రవేశం నిషిద్ధం
- బ్రిటన్‌లో అమల్లోకి వచ్చిన కొత్త తరహా శిక్షలు

లండన్: బ్రిటన్‌లో ఇక నుంచి నేరస్థులకు న్యాయమూర్తులు కొత్త తరహా శిక్షలు విధించనున్నారు. ఈ మేరకు శిక్షల పరిధిని ఆ దేశ న్యాయ మంత్రిత్వశాఖ విస్తరించింది. నేరస్థుల స్వేచ్ఛను కట్టడి చేసే చర్యల్లో భాగంగా వారిని పబ్‌లు, సంగీత కచేరీలు, క్రీడా ఈవెంట్లలో పాల్గొనకుండా నిషేధించనున్నారు. నేరస్థుల డ్రైవింగ్ వేగంపైనా పరిమితులు విధించనున్నారు. వారి ప్రయాణాలపైనా ఆంక్షలు పెట్టనున్నారు. నిర్దిష్ట ప్రాంతాలకు వారిని పరిమితం చేయనున్నారు.

దూరవిద్యలో హెల్త్‌కేర్ కోర్సులు అందించొద్దు

ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ ఆదేశం

దిల్లీ: ఈ విద్యా సంవత్సరం నుంచి హెల్త్‌కేర్, దాని అనుబంధ విభాగాల కోర్సులను దూరవిద్య లేదా ఆన్‌లైన్ ద్వారా అందించడం నిలిపివేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) అన్ని ఉన్నత విద్యా సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిషేధం నేషనల్ కమిషన్ ఫర్ ఎలైడ్ అండ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ (ఎన్‌సీఏహెచ్‌పీ) చట్టం-2021 కింద ఉన్న కోర్సులకు వర్తిస్తుంది. ఇందులో సైకాలజీ, మైక్రోబయాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, బయోటెక్నాలజీ తదితర విభాగాలు ఉన్నాయి. ఈ ప్రొఫెషనల్ కోర్సుల నాణ్యతా ప్రమాణాలపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకొన్నట్లు యూజీసీ సెక్రెటరీ మనీశ్ జోషి తెలిపారు.



కావాలా.. వింటేజ్ ఆతిథ్యం



కోపెల్లలో ఆధునికీకరించిన వందేళ్ల నాటి ఇల్లు

పురాతన ఇళ్లు.. పూర్వం ఉమ్మడి కుటుంబాల సమయంలో కుటుంబసభ్యులు, బంధువులతో కళకళలాడేవి. కాలం మారడంతో ప్రస్తుతం.. ఈ ఇళ్లలో సందడి తగ్గిపోయింది. అదే సమయంలో ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో తాతల కాలం నుంచి వారసత్వంగా వస్తున్న పురాతన నివాసాలు, మండువా ఇళ్లను కాపాడుకునేందుకు యజమానులు ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నారు. వాటి మూలస్వరూపం దెబ్బతినకుండా ఆధునిక హంగులు అద్దుతున్నారు. ఇందుకోసం ఖర్చుకు వెనుకాడడం లేదు. దీంతో ఈ ఇళ్లలో బంధువులు, స్నేహితులతో గడిపేందుకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వైద్యులు తదితర వృత్తి నిపుణులు వరుస కడుతున్నారు. ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు వచ్చే వారికీ అద్దెకు ఇస్తున్నారు. వారికి ఆహార ఏర్పాట్లూ యజమానులే చేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో కాళ్ల మండలం కోపెల్లలో 1912లో నిర్మించిన ఇంటిని మంతెన హెరిటేజ్ పేరుతో మంతెన వెంకటపతిరాజు ఆధునికీకరించారు. మూడంతస్తులతో ఉన్న ఈ ఇంట్లో 14 పడక గదులు, 16 గదులు ఉన్నాయి. వివిధ రంగాలకు చెందిన వారు వచ్చి ఈ నివాసంలో వింటేజ్ ఆతిథ్యం పొందుతున్నారు.

- ఈనాడు డిజిటల్, భీమవరం; న్యూస్‌టుడే, కాళ్ల



ఇంటి ఆవరణలో వేదిక



లోపల విందు ఏర్పాట్లు



నాటి చెక్క మెట్లు నేటికీ పదిలం

సముద్ర చేపలకు ఆహారం..
మనకు పోషకాహారం



మైక్రో ఆల్గే

జెల్లీలు

హెల్త్‌డ్రింక్

సముద్రపు నాచు (సీవీడ్)తో బిస్కెట్లు, పాస్తా, నూడుల్స్ వంటి ఉత్పత్తులు తయారుచేసి ప్రజలకు అందించిన విశాఖలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ(సీఐఎఫ్‌టీ) మరో అడుగు ముందుకేసింది. మైక్రో ఆల్గేలను మానవ ఆహారంగా అందించడానికి పరిశోధనలు పూర్తిచేసింది. వాటితో జెల్లీలు, హెల్త్ డ్రింక్స్ వంటి ఉత్పత్తులు తయారుచేసింది. త్వరలోనే మార్కెట్‌లోకి తీసుకరానున్నారు. సీవీడ్ లాగే మైక్రో ఆల్గేలు మొక్కజాతికి చెందినవి. ఇవి సముద్ర చేపల ముఖ్య ఆహారం. వీటిలో ప్రొటీన్లు, ఎ, ఈ, కే, బీ12 విటమిన్లతో పాటు ఒమెగా-ఫ్యాటీ ఆమ్లాలు ఉంటాయి. రక్తహీనత తగ్గించడానికి, రోగనిరోధక శక్తి పెరగడానికి దోహదం చేస్తోంది. 'సాధారణంగా ఉండే మైక్రో ఆల్గేలను వంద రెట్లు పెంచితేనే మైక్రోస్కోప్‌లో కనిపిస్తాయి. వీటి పొర మందంగా ఉండటంతో త్వరగా జీర్ణం కావు. అందుకే వాటి పైపొరను పగలగొట్టి పోషకాలను బయటకు తీశాం. అనంతరం సూక్ష్మజీవులతో పులియబెట్టి హెల్త్ డ్రింక్స్, జెల్లీలను తయారుచేశాం' అని సీఐఎఫ్‌టీ సీనియర్ సైంటిస్టు విజి, సీఐఎఫ్‌టీ ఇన్‌ఛార్జి బి.మధుసూదనరావు తెలిపారు. – ఈనాడు, విశాఖపట్నం

మీ కారుతో పాటు మా రైలెక్కండి



మీ కారుతో పాటు మా రైలెక్కండి అంటోంది కొంకణ్ రైల్వే. గణేశ్ ఉత్సవాలకు ముందు రహదార్లపై రద్దీని తగ్గించేందుకు ఓ వినూత్న రైలు సర్వీసును తెరపైకి తీసుకొచ్చింది. అదే రోల్ ఆన్-రోల్ ఆఫ్ (రో-రో) రైలు. ఈ రైలులో ప్రయాణికులు తమతో పాటు.. కారునూ తీసుకెళ్లొచ్చు. మహారాష్ట్ర, గోవా మధ్య తొలి సర్వీసును ఆదివారం నడిపారు. ఈ ప్రయాణంలో నాలుగు ప్రైవేట్ కార్లను సింధు దుర్గ్ జిల్లాలోని నంద్‌గావ్‌లో, మరో కారును దక్షిణ గోవాలోని వెర్నాలో దించామని అధికారులు చెప్పారు. ఈ సర్వీసులో భాగంగా ఏసీ కోచ్‌లో సెకండ్ సీటింగ్ అందిస్తామని, ప్రయాణికుల కార్లను కూడా సురక్షితంగా ఉంచుతామని పేర్కొన్నారు. – పణజీ

ఏ గాలి పీలుస్తున్నారో..
మీరే తెలుసుకోండి

వాయు కాలుష్యం ప్రధాన సమస్యగా మారిన ప్రస్తుత తరుణంలో.. తమ ప్రాంతంలో గాలి నాణ్యత ఎలా ఉందో తెలుసుకోవాలనే ఆసక్తి అందరికీ ఉంటుంది. ఈ నేపథ్యంలో గూగుల్ మ్యాప్స్ ఓ ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా దేశమంతటా ఎప్పటికప్పుడు పీల్చేగాలి నాణ్యతను తెలుసుకోవచ్చు.

ఎలా చూడాలి.. గూగుల్ మ్యాప్స్ (సైన్ ఇన్ అయి ఉండాలి) ఓపెన్ చేశాక.. కింద ఎడమవైపున ఉష్ణోగ్రత సింబల్ కనిపిస్తుంది. దానిని క్లిక్ చేస్తే మీ ప్రాంతంలో ఉష్ణోగ్రత ఎన్ని డిగ్రీలు ఉంది? గంటగంటకు ఎంత మారుతుంది? అనే విషయం కనిపిస్తుంది. దాని కింద ఎయిర్ క్వాలిటీ, దాని నాణ్యతను వివరించే సింబల్ కనిపిస్తుంది. మీకు దేశంలోని ఏ ప్రాంతంలోనైనా గాలి నాణ్యతను తెలుసుకోవాలంటే కింద 'అబౌట్ ఎయిర్ క్వాలిటీ' అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే గూగుల్ సహాయక కేంద్రం పేజీ ఓపెన్ అవుతుంది. అందులో దిగువన 'వ్యూ ఎయిర్ క్వాలిటీ నియర్ యూ' అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేస్తే దేశంలోని అన్ని ప్రాంతాల్లోని వాయు నాణ్యత ఎలా ఉందో కనిపిస్తుంది. ఏ ప్రాంతంలోనైనా వాయునాణ్యత బాగా లేకుంటే.. అక్కడివారు మాస్కులు పెట్టుకుని రక్షణ పొందే ప్రయత్నం చేయొచ్చు.

– ఈనాడు డిజిటల్, హైదరాబాద్



కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వాయునాణ్యత ప్రమాణాలు

వాయునాణ్యత సూచీ	కేటగిరీ
0-50	బాగు
51-100	సంతృప్తికరం
101-200	మధ్యస్థం
201-300	నాసిరకం
301-400	అత్యంత నాసిరకం
401-500	హానికరం

నొసటికెక్కిన నకిలీ!



- శిరీషకు కొన్ని రోజులుగా ఒకటే తుమ్ములు. ముక్కునుంచి నీరు కారుతోంది. దీనికి కారణం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా వెలిగించిన నకిలీ అగరుబత్తీల నుంచి వచ్చిన పొగ అని నిర్ధారణ అయింది.
- రమ్య నిత్యం నుదుటిపై కుంకుమ ధరిస్తారు. కొన్నాళ్లుగాచర్మం పొక్కులేచి.. పుండులా మారింది. చివరికి తెల్లని మచ్చ ఏర్పడింది. చర్మవ్యాధుల నిపుణుడిని సంప్రదిస్తే.. కుంకుమ కల్తీదని తేల్చారు.

ఇలాంటి సమస్యలు చాలామందికి వస్తున్నాయి. ఎంతో మంది నుదుటిపై మచ్చలు, దద్దుర్ల సమస్యతో బాధపడున్నారు. ధూపం, దీపాల పొగతో అలర్జీలకు గురవుతున్నారు. మార్కెట్లో విక్రయిస్తున్న పూజా ద్రవ్యాల కల్తీనే ఈ సమస్యలకు కారణంగా కనిపిస్తోంది.

రసాయనాలను కలిపి తయారుచేస్తున్న కల్తీ కుంకుమలు మార్కెట్లో పెద్దఎత్తున ఉన్నాయి. మైదా, గోధుమ పిండి తదితర పిండి పదార్థాలను కలిపి కల్తీకి పాల్పడుతున్నారు. ఈ తరహా కుంకుమను నీటిలో వేయగానే పూర్తిగా కరగదు. చేతిపైనా బాగా ఊరుతుంది. కల్తీ కుంకుమతో నుదుటిపై పుండ్లు, మచ్చలు, వేలి కొనలపై ఎలర్జీలు వస్తాయి. గంధంతో గవదలపై చర్మం పొట్టులేచినట్లుగా మారడం, ఎలర్జీ, మచ్చలు వస్తాయి. పసుపులోనూ ఇదే తరహా మోసాలు జరుగుతున్నాయి. కుళ్లిన పూలు, రసాయనాలు, బూడిదలాంటి పదార్థాలతో రూపొందించిన అగరబత్తుల నుంచి వెలువడే ఘాటు వాసనలు ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



దీపాలు వెలిగించేందుకు వినియోగించే నూనెల్లో ఇతర కందెనలను కలుపుతున్నారు. ఏదో ఒక పేరుతో స్టిక్కర్ అంటించిన సీసాలను మార్కెట్లోకి తెస్తున్నారు. కల్తీ నూనెలు మండించినప్పుడు వచ్చే వాసన భిన్నంగా ఉంటుంది. పొగ కూడా దట్టంగా ఉంటుంది. దీనివల్ల శ్వాస సంబంధమైన వ్యాధులు, కళ్ల మంటలు వచ్చే ప్రమాదం ఉంది.

నువ్వులు, ఆముదాలను మిల్లులో ఆడిస్తే స్వచ్ఛమైన నూనె వస్తుంది. లేదా మంచి బ్రాండ్‌వి పరిశీలించి కొనుగోలు చేయాలి.

- ఈనాడు, హైదరాబాద్

మీరే తయారు చేయవచ్చు

చిన్న గిన్నెలో పసుపు తీసుకుని దానికి సున్నం కలుపుతూ పోతే కుంకుమగా మారుతుంది. కుంకుమ పువ్వుతోనూ చేసుకోవచ్చు. కానీ, అది ఖరీదైనది.

- మంచి పసుపు కొమ్ములను గిర్నీలో ఆడిస్తే స్వచ్ఛమైన పసుపు వస్తుంది. గంధపు చెక్కలు వినియోగించడం మేలు.

– ఆచార్య లక్ష్మారెడ్డి, విశ్రాంత శాస్త్రవేత్త (ఎన్ఐటీ), వరంగల్

భరతనాట్యానికి
గజ్జెకట్టిన చైనా



చైనా రాజధాని నగరం బీజింగ్‌లో శుక్రవారం రాత్రి కిక్కిరిసిన ఆడిటోరియం ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో మార్మోగింది. 17 ఏళ్ల జాంగ్ జియాయువాన్ (రియా) భారతీయ శాస్త్రీయనృత్యం భరతనాట్య ప్రదర్శనతో అరంగేట్రం చేసింది. గతేడాది పదమూడేళ్ల లీ ముజీ సైతం భరతనాట్య ప్రదర్శనతో అరంగేట్రం చేసి ఈ ఘనత సాధించిన తొలి చైనా విద్యార్థినిగా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు రియా ఆ కోవలో రెండో విద్యార్థినిగా అందరి ప్రశంసలు అందుకొంది. చైనా యువతలో భారతీయ నృత్యంపై పెరుగుతున్న మక్కువకు ఇవి నిదర్శనాలు. రియా ప్రదర్శనకు బీజింగ్‌లోని భారత ఉప రాయబారి అభిషేక్ శుక్లా, చైనాకు చెందిన ప్రముఖ భరతనాట్య కళాకారిణి జిన్ షాన్ షాన్ హాజరయ్యారు. చెన్నైలోని ప్రఖ్యాత కళాక్షేత్ర ఫౌండేషనులో జిన్ భారతీయ నృత్య రీతులను అభ్యసించారు. ఈమె నిర్వహిస్తున్న నృత్య కళాశాలలో వందమందికి పైగా విద్యార్థులు భరతనాట్యం నేర్చుకొంటున్నారు. –బీజింగ్




సరళంగా ఉంటేనే జీవితం బాగుంటుంది!

అతిగా ఆలోచిస్తూ జీవితాన్ని సంక్లిష్టం చేసుకోకండి. ఎవరినైనా మిస్సవుతున్నట్లు అనిపిస్తే- వెంటనే వారికి ఫోన్ చేయండి. కలవాలనుకుంటే- ఆహ్వానించండి లేదా మీరే వెళ్లండి. మీ సన్నిహితులెవరైనా మిమ్మల్ని అపార్థం చేసుకున్నారనిపిస్తే- కూర్చోబెట్టి వాస్తవాన్ని వివరించండి. మీకేమైనా ప్రశ్నలుంటే అడిగేయండి. ఎవరినైనా ఇష్టపడుతుంటే- నేరుగా చెప్పేయండి. జీవితం అనేది ఎంత సరళంగా ఉంటే అంత బాగుంటుంది.

– సీన్ మెక్‌ఫీట్, వ్యాపారవేత్త

మా ఆవాసంలోకే వస్తావా?




మనుగడ కోసం జీవజాతుల మధ్య పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఇందులో భాగంగా ఎర్రచీమల దండు ఓ నల్లచీమ (కండ చీమ)పై దాడి చేసి చంపేశాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరం కృష్ణాలయం ప్రహరీపై కనిపించిన చిత్రమిది. గుంపుగా వెళ్తున్న ఎర్రచీమల దండు బారి నుంచి.. ఒంటరిగా చిక్కిన నల్లచీమ తప్పించుకోలేపోయింది. అన్నీ ఒకేసారి దాడి చేసి చంపేసిన తర్వాత తమ గూటిలోకి లాక్కెళ్లే ప్రయత్నం చేశాయి. ఈ చీమల జాతి వైరుధ్యం గురించి ముమ్మిడివరం ఏరువాక కేంద్రం సమన్వయకర్త, కీటక శాస్త్రవేత్త ఎం.నందకిశోర్ మాట్లాడుతూ.. ఒక సమూహం ఆవాసంలోకి వేరేవి వచ్చినప్పుడు దాడి చేస్తాయన్నారు. సహజంగానే ఎర్రచీమలు దూకుడు స్వభావం కలిగి ఉండగా.. నల్లచీమలు కాస్త రక్షణాత్మకంగా ఉంటాయని తెలిపారు.

– న్యూస్‌టుడే, కోనసీమ

చెత్తబుట్ట నుంచి..
కొత్త ఆలోచన

ఏడు పదుల త్రేతానంద సామంత తన ఇంటిని ఓ మినీ మ్యూజియంగా మార్చేశారు. ఒడిశాలోని అనుగుల్ జిల్లా రాణిగోడ గ్రామంలో గల ఆ ఇంట్లోని తాళపత్ర గ్రంథాలు, అరుదైన పుస్తకాలు, నాణేలు, కరెన్సీ నోట్లు, 140కు పైగా దేశాల పోస్టల్ స్టాంపులను చూస్తే చరిత్ర కళ్లెదుట మెదులుతుంది.



సామంతకు ఈ ఆసక్తి కలగడానికి కారణం ఒక చెత్తబుట్ట. 1984లో భువనేశ్వర్‌లోని నాల్కోలో ఆయనకు ఉద్యోగం వచ్చింది. ఓరోజు ఆఫీసు చెత్తబుట్టలో పడేసిన పోస్టల్ కవరుకు ఆస్ట్రేలియా స్టాంపు ఉండటం గమనించారు. ఆ స్టాంపుతో మొదలుపెట్టి.. కొన్ని వందల ప్రాచీన వస్తువులను సామంత సేకరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, చరిత్ర పరిశోధకులు ఈ మ్యూజియాన్ని సందర్శిస్తుంటారు. వారందరికీ సామంత దగ్గరుండి అన్నీ వివరిస్తారు.

–ఈటీవీ భారత్

మొదటి అడుగు
ఎప్పుడూ ఒంటరే..

మొదటివాడు వేసే ఒక్క అడుగు వెనుక వచ్చే వాళ్లకు బాట అవుతుందన్న కవివాక్కును ఈ పదేళ్ల చిన్నారి ఆచరణలో చూపింది. కర్ణాటకలోని దావణగెరె జిల్లా ఆలూరుకు చెందిన సుస్మిత.. గ్రామంలోని దేవరాజ్ అర్స్ ప్రాథమిక పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. రోజూ పాఠశాలకు వెళ్లే మార్గం పూర్తిగా గుంతలతో నిండి ఉండటం, వర్షం కురిస్తే మురుగునీరంతా రోడ్డుపైకి చేరడం ఆమెలో ఆవేశాన్ని రగిల్చింది. గ్రామస్థులు తాగునీటికి పడుతున్న ఇబ్బందులూ నిత్యం చూసేది. ఈ సమస్యలు పరిష్కరించాలన్న ప్లకార్డుతో నేరుగా గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిరసనకు దిగింది. పంచాయతీ అధికారి సుస్మితతో చర్చలు జరిపి వెంటనే ఆయా పనులను ప్రారంభించారు. గ్రామంలో మంచినీటి యూనిట్ సైతం ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. –ఈటీవీ భారత్



ఈ కుర్రాళ్లు..
సైకిల్‌పై సై అన్నారు!



ఖుషీ ఖుషీగా సాగుతూ.. అని కోనసీమ అందాలను వారానికోసారి సైకిళ్లపై చుట్టేస్తారు ఈ కుర్రోళ్లు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన వీరంతా ప్రతి ఆదివారం పొద్దు పొడవగానే సైకిళ్లను తీసుకుని బయల్దేరతారు. అలా కోనసీమకే ప్రత్యేకమైన పచ్చటి పొలాలు, కొబ్బరి తోటలు, పిల్లకాలువల మధ్య నుంచి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ముందుకు సాగుతారు. ప్రతి వారం కొత్త ప్రాంతాల వైపు వెళతామని, రానూపోనూ సుమారు 30 కి.మీ. సైకిల్ తొక్కుతామని ఈ బృందం 'న్యూస్‌టుడే'కు తెలిపింది. ఆయా ప్రాంతాల్లో గుర్తింపు పొందిన అల్పాహారాన్ని లొట్టలేస్తూ లాగించేస్తామని చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఇద్దరు ముగ్గురితో ప్రారంభమైన ఈ యాత్ర ఇప్పుడు 15కి చేరింది. వారిలో వ్యాపారులు, ఉద్యోగులు, విశ్రాంత జీవనం గడిపేవారూ ఉన్నారు.

– న్యూస్‌టుడే, కోనసీమ

కొర్రమీను.. ఆరోగ్యమేను!

'ఆహా ఇలస...ఓహో పులస..' అంటూ దాని కోసం ఎంత ఎదురుచూసినా అది దొరికేది ఈ ఒక్క సీజన్‌లోనే. పైగా అందనంత ధర. కానీ- ఏడాది పొడవునా అందుబాటులో ఉండే రుచికరమైన ఆరోగ్యకరమైన చేపల్లో ముందుగా గుర్తొచ్చేది కొర్రమీను. ఖరీదు కిలో రూ.300-700 ఉంటుంది. దీన్నే బొమ్మె చేప అనీ అంటారు. శాస్త్రీయనామం చన్నా స్ట్రియాటస్. ఇది మంచి నీటి ఔషధ చేప. ఆక్సిజన్ శాతం తక్కువగా ఉన్న నీటిలోనూ పెరిగే సామర్థ్యం దీని సొంతం. చెరువులు, నదులతో పాటు వరి పొలాల్లోనూ పెంచుతారు. మన తెలుగు రాష్ట్రాల్లో రాష్ట్ర చేప హోదా అందుకున్న ఒకే ఒక మత్స్యం ఈ కొర్రమట్ట లేదా కొర్రమీను.



ముళ్లు తక్కువగా ఉండే కొర్రమీను నీటిలోనే కాదు, తడి నేలమీదా మూడునాలుగు రోజులు జీవించగలదు. అందుకే కొర్రమీను బతికున్న దశలోనే ఎక్కువగా మార్కెట్లో దొరుకుతుంది. ఇందులో జెయింట్, స్ట్రైప్‌డ్, స్పాటెడ్, మడ్... ఇలా నాలుగు ప్రధాన రకాలున్నాయి. తల పాముని పోలి ఉంటుంది కాబట్టి, స్నేక్ హెడ్ ఫిష్ అనీ అంటారు. పులుసు, వేపుడు ఎలా చేసుకున్నా రుచిగా ఉండే ఈ చేపను తింటే ఆరోగ్య ప్రయోజనాలెన్నో...

ఈ చేపల చర్మంలోని ఓ పదార్థం సెరెటోనెర్జిక్ అనే గ్రాహక వ్యవస్థను ప్రభావితం చేయడం ద్వారా యాంటీడిప్రెసెంట్‌గా పనిచేస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. రుచిలోనే కాదు, ఆరోగ్యానికీ ఎంతో మేలు కాబట్టే తెలంగాణ ప్రభుత్వం వీటి పెంపకాన్ని భారీగా చేపట్టింది.

కొవ్వు తక్కువ. ఒమెగా-ఫ్యాటీ ఆమ్లాలు, ప్రొటీన్లూ అధికం. వంద గ్రా. కొర్రమీనులో 25.2 గ్రా. ప్రొటీన్ ఉంటుంది. చికెన్‌లో 18.2, గుడ్డులో 12.8గ్రా. ఉంటుంది. అందుకే హృద్రోగులు, బీపీ, షుగర్ రోగులకు ఇది మేలుచేస్తుంది.

పొట్టకు సంబంధించిన సమస్యలకు ఈ చేప మంచి ఔషధం. మలబద్ధకం ఉన్నవాళ్లు తింటే వెంటనే ఉపశమనం ఉంటుంది. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు మంటనీ వాపునీ తగ్గిస్తాయి. అందుకే కీళ్లనొప్పులు, ఆస్తమాతో బాధపడే వాళ్లకీ కూడా మంచి పోషకాహారం.

కొర్రమీనులో ఎ, డి3, బి12, సి విటమిన్లతో పాటు కాల్షియం, ఫాస్ఫరస్, ఐరన్, జింక్, అయోడిన్, మెగ్నీషియం, పొటాషియం, సెలీనియం వంటి ఖనిజాలూ ఎక్కువే. ఇవన్నీ మెదడు పనితీరు, చర్మ సంరక్షణ, జుట్టు పెరుగుదలకి తోడ్పడతాయి.

OMEGA 3

A D3 A C

గాయాలు మానడానికి..

కొర్రమీనులో కీలకమైన అమైనో ఆమ్లాలు, ఫ్యాటీ ఆమ్లాల సమ్మేళనం కండరాల పెరుగుదలకీ గాయాల నివారణకీ తోడ్పడుతుంది. ముఖ్యంగా గ్లైసిన్, అరాకిడోనిక్ ఆమ్లాలు గాయాలను మాన్పడానికి సాయపడతాయి. గ్లైసిన్ అనే అమైనో ఆమ్లం కొల్లాజెన్‌లో కీలకమైంది. చర్మ నిర్మాణం, పుండ్లు, గాయాలు మానడానికి తోడ్పడుతుంది. అలాగే అరాకిడోనిక్ అనే ఫ్యాటీ ఆమ్లం కూడా గాయాల్ని నయం చేయడానికి సాయపడుతుంది. అందుకే ఈ రెండు ఆమ్లాలూ పుష్కలంగా ఉన్న ఈ చేప సిజేరియన్, ఇతరత్రా సర్జరీలు చేయించుకున్నవాళ్లకీ మంచిది. అయితే ఒక్క విషయం... మంచినీటి చేప కాబట్టి సముద్ర చేపలతో పోలిస్తే మెర్క్యురీ కాలుష్యం బారినపడే ప్రమాదం తక్కువే అయినప్పటికీ గర్భిణులు తగు మోతాదులో తీసుకోవడం మేలు.



– డా. కె దమయంతి (రిటైర్డ్)సీనియర్ సైంటిస్ట్, ఐసీఎంఆర్-ఎన్ఐఎన్

- వసుంధర డెస్క్

ఆయనకు యముడే దైవం



శ్రీమంజునాథ సినిమా చూసి యముడికి భక్తుడిగా మారిన ఒకరు 24 ఏళ్లుగా యమధర్మరాజునే ఇష్టదైవంగా కొలుస్తున్నారు. ఎంతలా అంటే తన రెండు ద్విచక్రవాహనాలపై ఖాళీ లేకుండా యముడికి సంబంధించిన శ్లోకాలు, పద్యాలు రాయించారు. తన ఇంటిలోనూ శ్లోకాలు రాసుకున్నారు. కుడిచేతిపై 'జై యమధర్మరాజు' అని పచ్చబొట్టు వేయించుకున్నారు. ఆయనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కోరివారి అగ్రహారానికి చెందిన ఆర్ఎంపీ గంటి శ్రీరామచంద్రమూర్తి. ధనవంతుడైనా, పేదవాడైనా యమధర్మరాజు పిలుపుతో పైకి వెళ్లాల్సిందేనని ఆయన అంటున్నారు. చావు, పుట్టుకలు సహజమని.. మానవ జన్మ ఎత్తిన ప్రతి ఒక్కరూ ఇతరులకు సాయపడాలని ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, అంబాజీపేట

ఛాంపియన్

ఓ మేటి

ఇన్నింగ్స్ ముగిసింది

క్రికెట్‌కు పుజారా గుడ్‌బై



దిల్లీ

దశాబ్ద కాలానికి పైగా టెస్టు క్రికెట్లో భారత జట్టుకు గోడలా నిలిచిన బ్యాటర్ చెతేశ్వర్ పుజారా ఆటకు వీడ్కోలు పలికాడు. అన్ని రకాల క్రికెట్ నుంచి రిటైరవుతున్నట్లు ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు. "భారత జట్టు తరపున ఆడాలని చిన్నప్పుడు కల కన్నా. ఆట నాకు ఇంతి స్తుందని అనుకోలేదు. అమూల్యమైన అవకాశాలు, ఎన్నో అనుభవాలు, ఎంతో ప్రేమ.. అన్నింటికన్నా ముఖ్యంగా నా రాష్ట్రానికి, ఈ గొప్ప దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశమిచ్చింది" అని పుజారా పేర్కొన్నాడు. "భారత జెర్సీని ధరించడం, జాతీయ గీతాన్ని ఆలపించడం, మైదానంలో అడుగు పెట్టిన ప్రతిసారీ అత్యుత్తమ ప్రదర్శన చేయడానికి ప్రయత్నించడం.. ఇవన్నీ కలిగించిన అనుభూతిని మాటల్లో చెప్పలేను. కానీ మంచి విషయాలన్నింటికీ ఏదో ఒక రోజు ముగింపు పలకాల్సిందే. అన్ని రకాల భారత క్రికెట్ నుంచి రిటైర్ కావాలని నిర్ణయించుకున్నా" అని చెప్పాడు. బీసీసీఐ, సౌరాష్ట్ర క్రికెట్ సంఘం, సహచరులు, సహాయ సిబ్బంది, కోచ్‌లకు అతడు కృతజ్ఞతలు తెలిపాడు. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో పుజారా వీడ్కోలు మరీ ఆశ్చర్యం కలిగించేదేమీ కాదు. చివరిసారి 2023 జూన్‌లో టెస్టు మ్యాచ్ ఆడిన 37 ఏళ్ల పుజారాకు తిరిగి జట్టులోకి వచ్చే దారి పూర్తిగా మూసుకుపోయింది.

పుజారా 2010లో టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. 103 టెస్టుల్లో 43.60 సగటుతో 7195 పరుగులు చేశాడు. టెస్టుల్లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో పుజారా ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. అతడు ఫస్ట్ క్లాస్ క్రికెట్లో 21301 పరుగులు చేశాడు. రాబోయే దేశవాళీ సీజన్‌లో పుజారా ఆడతాడని అనుకున్నారు. కానీ వీడ్కోలుకు ఇదే సరైన సమయమని అతడు భావించాడు. "పుజారా వచ్చే సీజన్‌లో ఆడతాడని మేం ఆశించాం. కానీ అతడి నిర్ణయాన్ని గౌరవిస్తాం. మైదానం నుంచి అతడు వీడ్కోలు చెబితే బాగుండేది. పుజారాకు శుభాకాంక్షలు" అని సౌరాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు జయ్‌దేవ్ షా అన్నాడు.

పుజారా కెరీర్

టెస్టులు:	103
పరుగులు:	7195
సగటు:	43.60
శతకాలు:	19
అర్ధశతకాలు:	35

నిలువెత్తు నిగ్రహం

ఈనాడు క్రీడావిభాగం

2020–21 సీజన్లో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన టీమ్‌ఇండియా.. ప్రతికూల పరిస్థితులను అధిగమించి 2-1తో సాధించిన సిరీస్ విజయాన్ని అభిమానులు అంత సులువుగా మరిచిపోలేరు. భారత క్రికెట్ చరిత్రలోనే గొప్ప సిరీస్ విజయాల్లో అదొకటి. ముఖ్యంగా చివరి టెస్టులో 329 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి సిరీస్‌ను సొంతం చేసుకోవడం ఒక అపురూప ఘట్టం. ఆ మ్యాచ్ గురించి తలుచుకున్నపుడల్లా రిషబ్ పంత్ ఆడిన 89 పరుగుల అజేయ ఇన్నింగ్సే గుర్తుకు వస్తుంది. అదే ఇన్నింగ్స్‌లో శుభ్‌మన్ గిల్ 91 పరుగులతో అదరగొట్టాడు. కానీ స్కోరు బోర్డు చూస్తే ఈ ఇన్నింగ్స్‌ల ముందు చెతేశ్వర్ పుజారా అర్ధశతకం (56) చిన్నదిగా అనిపించొచ్చు! కానీ ఆ మ్యాచ్ చూసిన వాళ్లకు తెలుసు పుజారా ఇన్నింగ్స్ విలువేంటో! స్టార్క్, కమిన్స్, హేజిల్‌వుడ్ త్రయం.. బుల్లెట్ బంతులతో అతడిపై మామూలుగా దాడి చేయలేదు ఆ రోజు. వాళ్లకు ఆ రోజు అతను పంచ్ బ్యాగ్‌లా మారాడు. బ్రాడ్‌మన్‌పై ఒకప్పుడు ఇంగ్లిష్ బౌలర్లు ప్రయోగించిన బాడీలైన్ బౌలింగ్‌ను గుర్తుకు తెచ్చింది ఆసీస్ పేస్ త్రయం. తన వికెట్ పడితే.. భాగస్వామ్యాలు నిలబడవని పదే పదే ఒంటి మీదికి బంతులు సంధిస్తుంటే.. మొక్కవోని పట్టుదలతో నిలిచాడు పుజారా. ఆ ఇన్నింగ్స్‌లో చెతేశ్వర్ ఎదుర్కొన్న 211 బంతులు తన కెరీర్లోనే అత్యంత సవాలుతో కూడుకున్నవి. తన ఒంటి మీద ఆ రోజు పదికి పైగా గాయాలు కావడం గమనార్హం. గిల్, పంత్‌లతో పుజారా నెలకొల్పిన భాగస్వామ్యాలే జట్టు విజయంలో ఎంతో కీలకమయ్యాయి. పుజారా కెరీర్‌ను నిర్వచించే ఇన్నింగ్స్ అది. ఆస్ట్రేలియా గడ్డపై మొట్టమొదటి సిరీస్ విజయం సాధించడంలో అత్యంత కీలక పాత్ర పుజారాదే. అక్కడ సిరీసే గెలవని పేలవ రికార్డుతో 2018 పర్యటనకు వెళ్లింది టీమ్‌ఇండియా. గత పర్యటనలో సెంచరీల మీద సెంచరీలు కొట్టిన కెప్టెన్ విరాట్ కోహ్లి.. ఈసారి కూడా అలాగే రెచ్చిపోతాడని, సిరీస్ సాధించి పెడతాడని ఆశించారు అభిమానులు. కానీ ఆ సిరీస్‌లో విరాట్ సాధారణ ప్రదర్శన చేశాడు. కానీ టీమ్‌ఇండియా చారిత్రక సిరీస్ విజయాన్నందుకుంది. మేటి బౌలర్లకు ఎదురొడ్డి.. సొంతగడ్డపై ఆస్ట్రేలియా బ్యాటర్లకు కూడా సాధ్యం కాని స్థాయిలో పరుగుల వరద పారిస్తూ సిరీస్ టాప్‌స్కోరర్ (521)గా నిలిచింది, తొలిసారి కంగారూల గడ్డపై భారత్ సిరీస్ సాధించడంలో అత్యంత కీలక పాత్ర పోషించింది ఎవరు అంటే.. పుజారానే. చెతేశ్వర్ భారత క్రికెట్‌కు ఎంత చేశాడో చెప్పడానికి ఈ రెండు సిరీస్ విజయాలు చాలు. ఇవి కాక పుజారా పరుగుల వరద పారించి, భారత్‌ను గెలిపించిన మ్యాచ్‌లు, సిరీస్‌లు ఎన్నెన్నో! తనలా గంటలు గంటలు క్రీజులో ఓపిగ్గా నిలుస్తూ బౌలర్లను అసహనానికి గురి చేయడం, ఒక ఎండ్‌లో దృఢంగా నిలబడి అవతలి బ్యాటర్లకు మద్దతు ఇవ్వడం, మారథాన్ ఇన్నింగ్స్‌లతో జట్టుకు భారీ స్కోర్లు సాధించి పెట్టడం అందరి వల్లా సాధ్యమయ్యే పని కాదు.

అతడిది కంటికి ఇంపైన ఆట కాదు. అతను ఈ తరం క్రికెటర్లలా క్రీజులోకి వచ్చీ రాగానే బౌలర్లపై విరుచుకుపడే బ్యాటర్ కాదు. ఇప్పుడు క్రికెట్‌లో అత్యంత ఆకర్షణ ఉన్న టీ20 ఫార్మాట్లో అతను మెరుపులు మెరిపించింది లేదు. క్రికెట్ అభిమానుల ఫేవరెట్ లీగ్ ఐపీఎల్‌లో అతడికి పెద్దగా అవకాశాలే దక్కలేదు. తన కోసం అభిమానులు ఎగబడరు. తన కోసం గళం విప్పే మాజీలూ కనిపించరు! చెతేశ్వర్ పుజారా ఆడుతున్నపుడే కాదు.. ఆటకు టాటా చెప్పేసిన ఈ సందర్భంలోనూ పెద్దగా హడావుడి లేదు. కానీ భారత క్రికెట్‌కు అతను చేసిన సేవను మరువగలమా? అతడి ఘనతలను తక్కువ చేయగలమా? అతడి ఇన్నింగ్స్‌ల విలువను అంచనా వేయగలగమా!

ఇంకొకడు దొరకడు..



పుజారా 2010లో అంతర్జాతీయ క్రికెట్లోకి వచ్చే సమయానికే టీ20 క్రికెట్ ఊపు పెరిగింది. తర్వాతి కాలంలో టెస్టులు, వన్డేలను కమ్మేసే స్థాయికి చేరుకుంది. దీంతో క్రికెటర్లందరూ ఆ ఫార్మాట్‌కు ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టారు. టెక్నిక్‌కు ప్రాధాన్యం తగ్గిపోయి యువ ఆటగాళ్లు దూకుడు మంత్రం పఠించడం మొదలుపెట్టారు. తన సహచర క్రికెటర్లందరూ కూడా దూకుడుగా ఆడుతూ వన్డేలు, టీ20ల్లో విజయవంతమైన వాళ్లే. కానీ పుజారా మాత్రం దూకుడుగా ఆడలేని బ్యాటర్‌గా ముద్ర పడి టెస్టులకే పరిమితం అయిపోయాడు. అయితే తన ఆటను అభిమానులు మెచ్చుకపోయినా, స్ట్రైక్ రేట్ విషయంలో విమర్శలు వచ్చినా.. అతను మాత్రం శైలి మార్చుకోలేదు. ఆ శైలితోనే ఎన్నో విలువైన ఇన్నింగ్స్‌లతో జట్టును రక్షించాడు, గెలిపించాడు. అయినా అప్పుడప్పుడూ సెలక్టర్లు అతడిపై శీతకన్నేశారు. 2015 శ్రీలంక పర్యటన ముంగిట తనపై వేటు వేస్తే.. ఆ సిరీస్ చివరి మ్యాచ్‌కు మురళీ విజయ్ అందుబాటులో లేకుంటే మళ్లీ అవకాశం దక్కింది. ఆ మ్యాచ్‌లో 145 పరుగుల అద్భుత ఇన్నింగ్స్‌తో మ్యాచే కాక సిరీసూ సొంతమయ్యేలా చేశాడు పుజారా. ఇలాంటి ఆణిముత్యాల్లాంటి ఇన్నింగ్స్‌లు తన కెరీర్లో ఎన్నో కనిపిస్తాయి. అయితే 2020-21 ఆస్ట్రేలియా పర్యటన తర్వాత పుజారా అంచనాలకు తగ్గట్లు రాణించలేకపోయాడు. సగటు పడిపోయింది. వైఫల్యాలు కొనసాగడంతో వేటు తప్పలేదు. చివరగా 2023లో టెస్టు మ్యాచ్ ఆడిన పుజారా.. మళ్లీ భారత జట్టులోకి రాలేకపోయాడు. మరోవైపు కోహ్లి, రోహిత్ సైతం నిష్క్రమించడం, జట్టులో యువ ఆటగాళ్లకు ప్రాధాన్యం పెరగడంతో 37 ఏళ్ల పుజారాకు ఇక అవకాశం రాదని తెలిపోయింది. అందుకే అతనిక చాలు అనిపించేశాడు. సుదీర్ఘ కాలం అంతర్జాతీయ క్రికెట్ ఆడి, ఎన్నో ఘనతలు సాధించి, జట్టుకు గొప్ప బలంగా నిలిచిన ఓ ఆటగాడు రిటైరవుతుంటే.. తన తర్వాత ఆ స్థానాన్ని భర్తీ చేసే క్రికెటర్ ఎవరు అనే ప్రశ్న తలెత్తుతుంది. కొన్నాళ్ల శూన్యత తర్వాత ఎవరో ఒకరు ఆ స్థానంలోకి వస్తారు. సత్తా చాటుతారు. ఆ ఆటగాడు లేని లోటు ఎంతో కొంత భర్తీ అవుతుంది. ఇలా ఎందరో గొప్ప ఆటగాళ్ల స్థానాలు భర్తీ అవుతూ వచ్చాయి. కానీ చెతేశ్వర్ పుజారా పోషించిన పాత్రను భారత క్రికెట్లో ఇక ఎప్పటికైనా మరొకరు పోషించగలరా అంటే సందేహమే! రాహుల్ ద్రవిడ్ తర్వాత తన స్థానాన్ని భర్తీ చేయడం అసాధ్యం అనుకున్నపుడు పుజారా వచ్చాడు కానీ.. తనలా క్రీజు చుట్టూ గోడ కట్టే మరో ఆటగాడు ఇకపై దొరకడం కష్టమే కావచ్చు. అందుకే పుజారా నిష్క్రమణతో భారత క్రికెట్లో ఒక శకం ముగిసిందని చెప్పొచ్చు!

లక్ష్య, సింధులకు పరీక్ష

ప్రపంచ ఛాంపియన్‌షిప్ నేటినుంచే



సింధు

పారిస్: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్లు లక్ష్యసేన్, పి.వి.సింధులకు పరీక్ష ఎదురవనుంది. గత కొంత కాలంగా ఫామ్‌తో ఇబ్బందులు పడుతున్న భారత క్రీడాకారులకు ప్రపంచ టోర్నీలో కఠినమైన డ్రా పడింది. సోమవారం ప్రారంభంకానున్న ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో షై యుకి (చైనా)తో లక్ష్యసేన్, జోకిమ్ ఓల్డార్ఫ్ (ఫిన్లాండ్)తో హెచ్.ఎస్.ప్రణయ్ తలపడనున్నారు. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత రికార్డున్న సింధు ఈసారి ఎలా ఆడుతుందన్నది చూడాలి. 2019లో స్వర్ణం.. 2018, 2017లో రెండు రజతాలు.. 2014, 2013లో రెండు కాంస్యాలతో మొత్తం సింధు అయిదు పతకాల్ని కైవసం చేసుకుంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో కలోయానా నల్బంతోవా (బల్గేరియా)తో సింధు పోటీపడనుంది. మొదటి రెండు రౌండ్లు అధిగమిస్తే ప్రిక్వార్టర్‌ఫైనల్లో రెండో సీడ్ వాంగ్ జి యి (చైనా)తో సింధు తలపడొచ్చు. భారత స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్- చిరాగ్‌శెట్టికి తొలి రౌండ్లో బై లభించింది. రెండో రౌండ్లో హరిహరన్- రుబన్ కుమార్ లేదా ల్యూ హెంగ్- యాంగ్ హాన్ (చైనీస్ తైపీ) జోడీతో సాత్విక్- చిరాగ్ జంట పోటీపడుతుంది. మహిళల డబుల్స్‌లో గాబ్రియెలా- స్టెఫానీ (బల్గేరియా)తో రుతుపర్ణ- శ్వేతపర్ణ, మార్గోట్- కెమిలీ (ఫ్రాన్స్)తో ప్రియ- శ్రుతి.. మిక్స్‌డ్ డబుల్స్‌లో లియాంగ్- వెంగ్ (మకావు)తో రోహన్ కపూర్- గద్దె రుత్విక శివాని తమ పోరాటాన్ని ప్రారంభించనున్నారు. ధ్రువ్ కపిల- తనీషా క్రాస్టో జోడీకి బై లభించింది.

ఇండియా-ఎ మహిళల ఓటమి

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా-ఎతో జరుగుతున్న ఏకైక అనధికారిక టెస్టులో ఇండియా-ఎ మహిళల జట్టుకు చుక్కెదురైంది. ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో ఆసీస్-ఎ ఆరు వికెట్ల తేడాతో ఇండియా-ఎను ఓడించింది. ఓవర్‌నైట్ స్కోరు 260/8తో నాలుగో రోజు ఉదయం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా-ఎ.. 81.4 ఓవర్లలో 286 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బౌలర్లు ఎమీ ఎడ్గర్ (5/57), జార్జియా ప్రెస్ట్‌విడ్జ్ (3/47) సత్తాచాటారు. అనంతరం 281 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన ఆసీస్-ఎకు బ్యాటర్లు సమష్టిగా సత్తా చాటి విజయాన్ని అందించారు. రాచెల్ ట్రెనామన్ (64; 143 బంతుల్లో 6×4), కెప్టెన్ తాలియా విల్సన్ (46; 104 బంతుల్లో 4×4), మ్యాడీ డార్కే (68; 116 బంతుల్లో 6×4), అనిక లియరాడ్ (72; 125 బంతుల్లో 9×4) రాణించడంతో ఆసీస్-ఎ 85.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఇండియా-ఎ బౌలర్లలో సైమా ఠాకూర్ (2/63), జోషిత (1/24), తనుశ్రీ సర్కార్ (1/20) సఫలమయ్యారు.

ఐశ్వరీకి స్వర్ణం



ఐశ్వరీ ప్రతాప్ సింగ్

షింకెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత షూటర్ ఐశ్వరీ ప్రతాప్ సింగ్ స్వర్ణం సాధించాడు. అతను 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో 462.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. వెన్‌యు జావ్ (చైనా-462) రజతం, ఒకాడా (జపాన్-445.8) కాంస్యం గెలిచారు. జూనియర్ పురుషుల 3 పీ ఈవెంట్లో అడ్రియన్ కర్మాకర్ కూడా పసిడి పతకం గెలిచాడు. అతను ఫైనల్లో 463.8 పాయింట్లతో అగ్రస్థానం సాధించాడు.



రదుకాను

రదుకాను శుభారంభం

న్యూయార్క్: యుఎస్ ఓపెన్‌లో ఎమ్మా రదుకాను (బ్రిటన్) శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ మొదటి రౌండ్లో ఆమె 6-1, 6-2తో షిబహర (జపాన్)పై అలవోకగా గెలిచింది. పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన రదుకాను.. మ్యాచ్‌లో రెండు ఏస్‌లు, ఏడు విన్నర్లు కొట్టింది. వెలెంటోవా (చెక్), కేసియర్ (జర్మనీ) కూడా రెండో రౌండ్లో ప్రవేశించారు. మొదటి రౌండ్లో వెలెంటోవా 6-3, 3-6, 6-4తో బ్రొంజెటి (ఇటలీ)పై నెగ్గగా.. కేసియర్ 7-5, 7-5తో లినెట్టి (పోలెండ్)ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో మెన్సిచ్ (చెక్) రెండో రౌండ్లో అడుగుపెట్టాడు. తొలి రౌండ్లో అతడు 7-6 (7-5), 6-3, 6-4తో జారీ (చిలీ)పై నెగ్గాడు. మరో మ్యాచ్‌లో డెవిడోవిచ్ ఫోకినా (స్పెయిన్) 6-1, 6-1, 6-2తో షెవ్‌చెంకో (కజకిస్థాన్)పై గెలిచాడు.

మీరాబాయి వచ్చేసింది

అహ్మదాబాద్: టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత మీరాబాయి చాను సుదీర్ఘ విరామం తర్వాత పునరాగమనం చేయనుంది. ఈ స్టార్ వెయిట్‌లిఫ్టర్ సోమవారం కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్స్‌లో బరిలోకి దిగనుంది. గాయాలతో సతమతమైన చాను.. నిరుడు పారిస్ ఒలింపిక్స్ తర్వాత ఎక్కడా పోటీపడలేదు. 2028 లాస్‌ఏంజిలెస్ ఒలింపిక్స్ నుంచి 49 కిలోల బరువు విభాగాన్ని తొలగించిన నేపథ్యంలో 48 కిలోలకు మారాలని చాను నిర్ణయించుకుంది. చాను ఏడేళ్ల 49 కేజీ విభాగంలో పోటీపడింది. కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత్ భారీగా పతకాలు సాధిస్తుందని భావిస్తున్నారు. ఈ ఛాంపియన్‌షిప్స్‌కు భారత్ చివరగా 2023లో ఆతిథ్యమిచ్చింది. అప్పుడు 20 పతకాలు గెలిచింది.



చికిత

చరిత్ర సృష్టించిన చికిత

యూత్ ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్‌గా తెలుగమ్మాయి

పెద్దపల్లి, న్యూస్‌టుడే: తెలుగమ్మాయి తానిపర్తి చికిత (తెలంగాణ) చరిత్ర సృష్టించింది. ప్రపంచ యూత్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచింది. ఈ ఘనత సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు నెలకొల్పింది. ఉత్కంఠభరితంగా సాగిన అండర్-21 మహిళల కాంపౌండ్ ఫైనల్లో చికిత 142-136తో యెరిన్ పార్క్ (కొరియా)పై విజయం సాధించింది. అంతకుముందు సెమీస్‌లో చికిత 142-133తో పౌలా డయాజ్ (స్పెయిన్)పై చికిత నెగ్గింది. క్వార్టర్స్‌లో టాప్ సీడ్ పర్ణీత్ కౌర్‌ను చికిత చిత్తు చేసింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన 20 ఏళ్ల చికిత జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తోంది. సాయ్ కోచ్ క్రాంతిరెడ్డి దగ్గర సోనీపత్‌లోని జాతీయ శిక్షణ శిబిరంలో తర్ఫీదు పొందుతోంది.

ప్రిటోరియా క్యాపిటల్స్ చీఫ్ కోచ్‌గా గంగూలీ



గంగూలీ

సెంచూరియన్: దక్షిణాఫ్రికా లీగ్ (ఎస్‌ఏ20) జట్టు ప్రిటోరియా క్యాపిటల్స్‌కు భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ చీఫ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. 2026 సీజన్ కోసం గంగూలీని చీఫ్ కోచ్‌గా నియమించినట్లు జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్‌కు చెందిన ప్రిటోరియా క్యాపిటల్స్ ఆదివారం ప్రకటించింది. చీఫ్ కోచ్ పదవి నుంచి శనివారమే వైదొలగిన ఇంగ్లాండ్ మాజీ బ్యాటర్ జొనాథన్ ట్రాట్ స్థానాన్ని గంగూలీ భర్తీ చేయనున్నాడు. "క్యాపిటల్స్ శిబిరానికి రాజసం తీసుకొచ్చేందుకు ప్రిన్స్ సిద్ధంగా ఉన్నాడు. గంగూలీని మా చీఫ్ కోచ్‌గా ప్రకటిస్తున్నందుకు సంతోషంగా ఉంది" అని ప్రిటోరియా క్యాపిటల్స్ పేర్కొంది. ఒక క్రికెట్ జట్టుకు గంగూలీ చీఫ్ కోచ్‌గా వ్యవహరించనుండటం ఇదే ప్రథమం. 2018, 2019లలో ఐపీఎల్‌లో దిల్లీ క్యాపిటల్స్‌కు గంగూలీ డైరెక్టర్‌గా పనిచేశాడు. బీసీసీఐ అధ్యక్షుడవగానే ఆ పదవి నుంచి తప్పుకున్నాడు. నిరుడు జేఎస్‌డబ్ల్యూ క్రికెట్ డైరెక్టర్‌గా గంగూలీ నియమితుయ్యాడు. దిల్లీ క్యాపిటల్స్‌కు జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ సహ యజమాని కూడా.

హైదరాబాద్‌కు రెండో విజయం



నితీశ్‌రెడ్డి


చెన్నై: అఖిల భారత బుచ్చిబాబు క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం ముగిసిన రెండో రౌండ్లో హైదరాబాద్ 2 వికెట్ల తేడాతో ఝార్ఖండ్‌పై విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 205/4తో మూడో రోజు ఉదయం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 82.4 ఓవర్లలో 330 పరుగులకు ఆలౌటైంది. నితీశ్‌రెడ్డి (106; 115 బంతుల్లో 9×4, 3×6), రాహుల్ రాదేశ్ (70), వరుణ్‌గౌడ్ (65) సత్తాచాటడంతో హైదరాబాద్‌కు 47 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం ఝార్ఖండ్ రెండో ఇన్నింగ్స్‌లో 25.3 ఓవర్లలో 130 పరుగులకే కుప్పకూలింది. తనయ్ త్యాగరాజన్ (4/74), అనికేత్‌రెడ్డి (3/25) విజృంభించి ప్రత్యర్థిని కట్టడి చేశారు. 84 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన హైదరాబాద్‌ను రిషబ్ రాజ్ (5/44), మానిషి (3/39) దెబ్బకొట్టారు. అయితే రాహుల్ సింగ్ (35) పోరాడడంతో హైదరాబాద్ 22.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

గుకేశ్ × అలీరెజా

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్వెఫీల్డ్ కప్ ఆరో రౌండ్‌లో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద కీలక పోరాటాలకు సిద్ధమయ్యారు. సోమవారం జరిగే పోరులో అలిరెజా ఫిరోజా (ఫ్రాన్స్)తో గుకేశ్, డూడా జాన్ క్రిజ్‌టాఫ్ (పోలెండ్)తో ప్రజ్ఞానంద తలపడనున్నారు. అయిదు రౌండ్ల తర్వాత ఫాబియానో కరువానా (అమెరికా) మూడున్నర పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. 3 పాయింట్లతో ప్రజ్ఞానంద, లెవాన్ అరోనియన్ (అమెరికా) సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు. గుకేశ్, అలిరెజా, శామ్యూల్ సెవియన్ (అమెరికా), వెస్లీ సో (అమెరికా), మ్యాక్సిమ్ వాషియర్ లాగ్రేవ్ (ఫ్రాన్స్) రెండున్నర పాయింట్లతో ఉమ్మడిగా మూడో స్థానంలో కొనసాగుతున్నారు.

ఆసీస్ 276 పరుగుల తేడాతో..

దక్షిణాఫ్రికాపై భారీ విజయం ● హెడ్, మార్ష్, గ్రీన్ సెంచరీలు



హెడ్

మెకే (ఆస్ట్రేలియా): దక్షిణాఫ్రికాతో మూడో వన్డేలో ఆస్ట్రేలియా ఏకంగా 276 పరుగులతో విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను దక్షిణాఫ్రికా ఇప్పటికే 2-0తో గెలుచుకోగా.. నామమాత్రమైన మూడో మ్యాచ్‌లో 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ట్రావిస్ హెడ్ (142; 103 బంతుల్లో 17×4, 5×6), కెప్టెన్ మిచెల్ మార్ష్ (100; 106 బంతుల్లో 6×4, 5×6), కామెరూన్ గ్రీన్ (118 నాటౌట్; 55 బంతుల్లో 6×4, 8×6) మెరుపు శతకాలతో మొదట ఆసీస్ 2 వికెట్లకు 431 పరుగుల భారీ స్కోరు సాధించింది. అలెక్స్ కేరీ (50 నాటౌట్; 37 బంతుల్లో 7×4) కూడా రాణించాడు. ఒక ఇన్నింగ్స్‌లో మొదటి ముగ్గురు బ్యాటర్లు శతకాలు సాధించడం వన్డేల్లో ఇది రెండోసారి మాత్రమే. హెడ్, మార్ష్ తొలి వికెట్‌కు 250 పరుగులు జోడించడం విశేషం. గాయం కారణంగా ప్రధాన పేసర్ రబాడ ఈ మ్యాచ్‌కు దూరమవగా.. మిగతా బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. కెరీర్‌లో మూడో వన్డే ఆడుతున్న పేసర్ క్వెనా మఫాకా 6 ఓవర్లలో 73 పరుగులు ఇచ్చాడు. మరో పేసర్ వియాన్ ముల్డర్ 7 ఓవర్లలో 93, స్పిన్నర్ సేనురాన్ ముత్తుసామి 9 ఓవర్లలో 75 పరుగులు సమర్పించుకున్నారు. అనంతరం లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా చేతులెత్తేసింది. 24.5 ఓవర్లలో 155 పరుగులకు ఆలౌటైంది. డెవాల్డ్ బ్రెవిస్ (49; 28 బంతుల్లో 2×4, 5×6), టోనీ డి జోర్జి (33; 30 బంతుల్లో 6×4) మాత్రమే చెపుకోదగ్గ స్కోర్లు సాధించారు. ఎడమచేతి వాటం స్పిన్నర్ కూపర్ కానోలీ (5/22) విజృంభించి ఆసీస్‌కు విజయాన్ని అందించాడు. పరుగుల వ్యత్యాసం ప్రకారం వన్డేల్లో దక్షిణాఫ్రికాకు ఇదే ఘోరమైన ఓటమి. వన్డే ఫార్మాట్లో ఆసీస్‌కు రెండో అత్యధిక స్కోరు (431) ఇది. 2006లో దక్షిణాఫ్రికాపైనే ఆసీస్ 434/4 స్కోరు నమోదు చేసింది. అయితే ఆ మ్యాచ్‌లో మరో బంతి మిగిలివుండగానే దక్షిణాఫ్రికా 9 వికెట్లకు 438 పరుగులు రాబట్టి చరిత్రాత్మక విజయం నమోదు చేసింది.



తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో జంట జలాశయాలు

శేషా'జల' అందాలు.. బోధించే పాఠాలు

వర్షాకాలంలో శేషాచల కొండల్లోంచి జాలువారే జలాలను ఒడిసిపట్టేందుకు తిరుపతి ఐఐటీ, ఐసర్ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) విద్యాసంస్థలు వినూత్న పంథాను ఎంచుకున్నాయి. ఏర్పేడు సమీపంలోని ఈ జాతీయ విద్యాసంస్థల ప్రాంగణాల్లో ప్రత్యేక ఆకృతుల్లో కోనేరులను తీర్చిదిద్దాయి. ఎగువన కొండల్లోంచి వచ్చే వర్షపు నీటిని చిన్నచిన్న కాల్వల ద్వారా ఇక్కడి కొలనుల్లోకి మళ్లిస్తున్నారు. ఐఐటీలోని రెండు కొలనుల నీటి నిల్వ సామర్థ్యం 8.37 కోట్ల లీటర్లు. వీటి అందమైన ఆకృతులు, నూరు శాతం జల సంరక్షణ చర్యలకు 2023లో కేంద్ర జల్‌శక్తి శాఖ కితాబిచ్చింది. జలకూర్పు విభాగంలో స్పెషల్ మెన్షన్ పురస్కారాన్ని అందజేసింది. ఇక, సమీపంలోని ఐసర్‌ను వర్షాకాలంలో వరద నీరు చుట్టేసేది. ఇప్పుడా నీటిని విద్యాసంస్థకు ఎదురుగా తవ్విన కోనేటిలోకి మళ్లిస్తున్నారు. కుంట తవ్వినప్పుడు బయటపడ్డ రాళ్లను నీటి మధ్య ప్రత్యేక ఆకర్షణగా నిలబెట్టారు. అందమైన విద్యుద్దీపాలతో కోనేటి అందాలు ద్విగుణీకృతమవుతున్నాయి. జల సంరక్షణ చర్యలను భావితరాలకు తెలియజెప్పే లక్ష్యంతోనే ఈ కుంటలను తవ్వి, వాటికి అదనపు హంగులు అద్దినట్లు విద్యాసంస్థల అధికారులు వివరించారు.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి, ఏర్పేడు



ఐసర్ ప్రాంగణంలో జల సంరక్షణ కేంద్రం

వైకాపా వదిలేసిన చెత్తను తొలగిస్తున్నాం

మంత్రి నారాయణ



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

మచిలీపట్నం (కోనేరు సెంటరు), న్యూస్‌టుడే: వైకాపా హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ వదిలేసిన చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని నగరపాలక సంస్థ డంపింగ్ యార్డును ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వం అధికారం కోల్పోయేనాటికి రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్తను తొలగించకుండా వదిలేసిందని మండిపడ్డారు. ప్రజారోగ్యం, పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక చెత్త తొలగించే పనులు చేపట్టిందన్నారు. ఇప్పటి వరకూ 72 లక్షల టన్నులు తొలగించగా మరో 13 లక్షల టన్నులు మిగిలి ఉందన్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం చెత్త నుంచి సంపద సృష్టించాలన్న లక్ష్యంతో అభివృద్ధి చెందిన దేశాల్లో అధ్యయనం చేసి రాష్ట్రంలో 10 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లను ఏర్పాటుచేసిందని గుర్తుచేశారు. విశాఖ, గుంటూరులో అవి పనిచేస్తుండగా మిగిలిన వాటిని వైకాపా రద్దు చేసిందన్నారు. రాష్ట్రంలో ప్రతి రోజూ వచ్చే 7,500 టన్నుల సాలిడ్ వేస్ట్‌ను సద్వినియోగం చేసుకునేలా ఆరు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ద్రవ వ్యర్థాల నిర్వహణకు రెండేళ్లలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ల ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విశాఖ కేంద్రంగా ప్రకృతి వైద్య కళాశాల

వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో తొలి ప్రకృతి వైద్య కళాశాలను విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్నామని, రాబోయే విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు ప్రారంభిస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. విశాఖ, కాకినాడల్లో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రుల నిర్మాణాలు సిద్ధమవుతున్నాయని, వాటిలో ఆయుర్వేదం, హోమియో, యునాని వైద్యసేవలు అందిస్తామని పేర్కొన్నారు. విశాఖలో ప్రభుత్వ ఆయుర్వేద మందుల తయారీ, నాణ్యత పరీక్షల ప్రయోగశాల కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "వైకాపా హయాంలో నిర్వీర్యమైన ఆయుష్ వైద్యసేవల్ని మెరుగుపరచడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. కాకినాడ ఆసుపత్రి నిర్మాణానికి రూ.7.17 కోట్లు, విశాఖలో ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రికి రూ.4.18 కోట్లు, ప్రకృతి వైద్యకళాశాలకు రూ.4.08 కోట్లు మంజూరయ్యాయి. ప్రకృతి వైద్య కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ నేచురోపతి అండ్ యోగా సైన్సెస్ కోర్సులో 50 సీట్లు అందుబాటులోకి తెస్తాం. ధర్మవరం, కాకినాడల్లో నేషనల్ ఆయుష్ మిషన్ కింద ఆయుర్వేద కళాశాలల ఏర్పాటుకూ ప్రతిపాదనలు పంపాం" అని పేర్కొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి ఘనత మాదే

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: విశాఖ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కోసం రూ.11,500 కోట్లు కేటాయించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ అంశంపై ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావు లేదన్నారు. ఆదివారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. 'కొందరు అదే పనిగా ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేస్తున్నామనడం వారి అవివేకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు ప్లాంట్‌ను అభివృద్ధి చేసేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నాయి' అని పేర్కొన్నారు.

బార్‌ల లైసెన్సుల కోసం 34 మంది దరఖాస్తు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 840 బార్‌లకు మూడేళ్ల కాలపరిమితితో లైసెన్సుల జారీ కోసం ఎక్సైజ్ శాఖ దరఖాస్తులు ఆహ్వానించగా.. ఆదివారం సాయంత్రానికి 34 మందే దరఖాస్తు చేసుకున్నారు. అవి కూడా 23 బార్‌ల కోసమే. మిగతా వాటికి ఒక్కటీ రాలేదు. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ రెండురోజుల్లో ఎక్కువమంది దరఖాస్తు చేసుకునే అవకాశముందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. నూతన పాలసీ ప్రకారం ప్రతి బార్‌కు కనీసం 4 దరఖాస్తులు వస్తే, వాటిలోంచి లాటరీ తీసి లైసెన్సు ఖరారుచేస్తారు. కానీ, ఇప్పటివరకు కేవలం 3 బార్‌లకు మాత్రమే నాలుగేసి దరఖాస్తులు వచ్చాయి. ఆదివారం సాయంత్రం వరకు 1,132 మంది ప్రాసెసింగ్ రుసుము రూ.10 వేలు చెల్లించి వారి వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

తెలుగు టెకీ మనోహర్‌రెడ్డికి బీసీఎస్ అవార్డు



ఈనాడు, హైదరాబాద్: యూకేలోని లూటన్ నివాసి, తెలుగు వ్యక్తి, డేటా సైన్స్ నిపుణుడు మనోహర్‌రెడ్డి ఆవిష్కరణల్లో ప్రతిభ చూపుతున్నారు. సాంకేతిక నైపుణ్యం, ఆవిష్కరణలకు వరుసగా రెండో ఏడాది బ్రిటిష్ కంప్యూటర్ సొసైటీ(బీసీఎస్) యూకే ఐటీ ఇండస్ట్రీ అవార్డ్స్-2025లో స్ఫూర్తిదాయక వ్యక్తి కేటగిరీలో ఎంపికయ్యారు. గతేడాది అటానమస్ సెక్యూరిటీ రోబోట్స్ ప్రాజెక్టుకు అవార్డు వచ్చింది. ఆ ఆవిష్కరణతో విమానాశ్రయ భద్రతలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. తాజాగా ఏఐ ఏరో ఆప్స్ డాష్‌బోర్డు ప్రాజెక్టు ద్వారా విమానయాన కార్యక్రమాల్లో గణనీయమైన సమర్థతతో మరోసారి అవార్డుకు ఎంపికయ్యారు. సెప్టెంబరులో పురస్కారం అందుకోనున్నారు.



గందరగోళంగా ఉన్నా వెనకడుగు వేయొద్దు

మీరు ప్రస్తుత స్థితి నుంచి ఉన్నతమైన వ్యక్తిగా ఎదగాలంటే.. ఇప్పటివరకూ వాస్తవాలుగా భావించిన చాలా విషయాలను స్వయంగా సవాలు చేయాల్సి రావొచ్చు. మీ పురోగతి చాలా గందరగోళంగా, భయపెట్టేలా ఉండొచ్చు. అనేక రకాల అసౌకర్యాలకు గురవ్వాల్సి రావొచ్చు. అవన్నీ చూసి వెనకడుగు వేయకండి. సరైన దిశలో వెళ్లడం లేదేమోనని బెంగపడకండి. తాత్కాలిక అవాంతరాలకు ఆవల చూడండి.. మీకే స్పష్టత వస్తుంది.

– లెవిస్ హోవెస్, రచయిత

కుప్పంలోకి ప్రవేశించిన కృష్ణా జలాలు

- పండుగ వాతావరణంలో రైతుల నీరాజనం
- 30న సీఎం చేతుల మీదుగా జలహారతి



హంద్రీ-నీవా కాలువలో పసుపుమయమైన కృష్ణా జలాలు

కుప్పం పట్టణం, శాంతిపురం, న్యూస్‌టుడే: పాతకాలం నాటి చెరువులు అడుగంటి పోయాయి. ఏళ్లుగా నీరు చేరక అనవాళ్లు కోల్పోయాయి. కొత్తగా ఎలాంటి సాగునీటి ప్రాజెక్టులూ రాలేదు. వ్యవసాయమంతా వర్షాధారమే. పంట వేయాలంటే వరుణుడి కరుణ తప్ప, మరో మార్గం లేదు. ఈ క్షామ పరిస్థితుల్లో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం ప్రాంతానికి రెండు దశాబ్దాల క్రితం బిందు, తుంపర సేద్యాన్ని పరిచయం చేశారు ముఖ్యమంత్రి చంద్రబాబు. వ్యవసాయంలో కొత్త పంథాకు శ్రీకారం చుట్టారు. సాగును మరింత విస్తరించే క్రమంలో కృష్ణా జలాలను హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం ద్వారా కుప్పానికి తీసుకువచ్చే బృహత్తర ప్రయత్నంలో సఫలీకృతులయ్యారు. కృష్ణా జలాలు ఆదివారం కుప్పం నియోజకవర్గానికి చేరుకున్నాయి. శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె వద్ద ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, పీఎంకే ఉడా ఛైర్మన్ డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు తదితరులు హంద్రీ-నీవా కాలవలోకి దిగి కృష్ణమ్మకు సారెను సమర్పించారు. నవంబరు నాటికి కుప్పానికి కృష్ణమ్మ నీటిని తరలిస్తామని మాట ఇచ్చిన ముఖ్యమంత్రి.. మూణ్నెల్ల ముందే హామీ నెరవేర్చారని తెలిపారు.

కరవు తీరేలా..

కుప్పం నియోజకవర్గ వ్యాప్తంగా 554 చెరువులున్నాయి. దశాబ్దాలుగా తీవ్ర వర్షాభావంతో అధిక శాతం చెరువులు నీరు లేకుండా పోయాయి. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు సైతం వట్టిపోయాయి. గుడుపల్లె మండలంలో 1,300 అడుగుల లోతుకు బోరు వేస్తే తప్ప, నీరు లభించని పరిస్థితి. ఈ దఫా కర్ణాటక సరిహద్దుల్లోనూ వర్షాలు అంతగా కురవక పోవడంతో కరవు ఛాయలు కమ్ముకుంటున్నాయి. ఈ తరుణంలో హంద్రీ-నీవా జలాలు తరలించడంపై రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 30న ముఖ్యమంత్రి కుప్పం పర్యటనలో భాగంగా పట్టణంలోని పరమసముద్రం చెరువులోకి హంద్రీ-నీవా జలాలు విడుదల చేస్తారని కుప్పం ప్రాంతీయాభివృద్ధి సంస్థ పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. జలహారతి కార్యక్రమాన్ని చరిత్రాత్మక వేడుకగా నిర్వహిస్తామని చెప్పారు.

గ్రామాలకూ త్రీ ఫేజ్ విద్యుత్

- ఆర్డీఎస్ఎస్‌లో ఫీడర్ల విభజన
- 9.9% తగ్గనున్న సాంకేతిక నష్టాలు
- ఏటా రూ.851 కోట్ల ఆదా

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గ్రామాలకూ త్రీ ఫేజ్ ద్వారా అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందనుంది. దీనికోసం విద్యుత్ పంపిణీ సంస్థల పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్డీఎస్ఎస్) కింద ఫీడర్ల విభజన, కొత్త ఫీడర్ల ఏర్పాటు పనులను డిస్కంలు చేపట్టాయి. తద్వారా సాంకేతిక నష్టాలు 9.9% తగ్గుతాయని, విద్యుత్ కొనుగోలు వ్యయంలో ఏటా రూ.851 కోట్లు ఆదా అవుతుందని అధికారులు పేర్కొన్నారు. ఒక కి.మీ. ఫీడర్ విభజన పనులు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ కొనుగోలు వ్యయంలో యూనిట్‌కు 4 పైసల చొప్పున ఆదా అవుతుందని లెక్కగట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 77,646 మిలియన్ యూనిట్ల(ఎంయూ) మేర విద్యుత్ సంస్థలు విక్రయించాయి.

5,783 ఫీడర్ల విభజన

మూడు డిస్కంల పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరాకు ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటుతో పాటు ఓవర్‌లోడ్ ఉన్న వాటితో కలిపి 5,783 ఫీడర్ల విభజన పనులు డిస్కంలు నిర్వహిస్తున్నాయి. దీనివల్ల వ్యవసాయానికి ఆఫ్-పీక్ వేళల్లో విద్యుత్ అందించి, పీక్ డిమాండ్ సమయంలో వినియోగాన్ని నియంత్రించొచ్చు. ఆ మేరకు విద్యుత్ కొనుగోలు ఖర్చు తగ్గుతుంది. ఈ పనులకు డిస్కంలు సుమారు రూ.10వేల కోట్లు వెచ్చిస్తున్నాయి.

★ వ్యవసాయ కనెక్షన్లతో పాటు ఇతర వినియోగదారులకు విద్యుత్ సరఫరా అవుతున్న (మిక్స్‌డ్) 4,845 ఫీడర్లను విభజిస్తున్నారు. తద్వారా గ్రామాల్లోని వినియోగదారులకు, అక్కడి చిన్న పరిశ్రమలకు అంతరాయం లేకుండా త్రీఫేజ్ విద్యుత్ అందించవచ్చు.

★ 11 కేవీ, 33 కేవీ ఫీడర్లపై అధిక లోడ్ వల్ల తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగి, సాంకేతిక నష్టాలు పెరుగుతున్నాయి. ఇలాంటి ఫీడర్లు 938 ఉన్నాయి. సరఫరాలో సమస్య పరిష్కరించేందుకు ఇప్పటికే 417 ఫీడర్ల విభజనను డిస్కంలు పూర్తిచేశాయి. మరో 173 ఫీడర్ల విభజన వివిధ దశల్లో ఉంది. ఇంకా 307 చోట్ల పనులు చేపట్టాల్సి ఉంది. ఫీడర్ పరిధి తక్కువగా ఉంటే, లోడ్ పెరిగినప్పుడు వెంటనే గుర్తించి మౌలిక సదుపాయాలు కల్పించవచ్చు.


★ వైకాపా ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్ పనులకు టెండర్లు పిలిచి, తర్వాత పట్టించుకోలేదు. దీంతో మూడు డిస్కంలలో 20-30% పనులు మాత్రమే పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించే క్రమంలో ఆర్డీఎస్ఎస్ పనులపై దృష్టిపెట్టింది. గుత్తేదారులతో చర్చించి పనులను వేగవంతం చేసింది. ఇప్పటికే 40-50 శాతం పనులు కాగా, ఈ ఏడాదిలో మొత్తం పూర్తిచేయడంపై అధికారులు దృష్టిసారించారు.

డిస్కంల వారీగా ఆర్డీఎస్ఎస్‌లో చేపట్టిన ఫీడర్ల విభజన వివరాలు

డిస్కం	ప్రతిపాదించినవి	పూర్తి చేసినవి	పనులు కొనసాగుతున్నవి	ఇంకా చేపట్టాల్సినవి
ఈపీడీసీఎల్	994	255	285	355
ఎస్‌పీడీసీఎల్	3,015	462	1,139	982
సీపీడీసీఎల్	836	272	271	255

సోషల్‌మీడియా కలిపింది అందరినీ!

- విభిన్న పంటల సాగుతో ముందడుగు



మన్యంలో డ్రాగన్‌ఫ్రూట్ సాగు

చింతపల్లి, న్యూస్‌టుడే: సోషల్ మీడియా ద్వారా ప్రపంచంలో ఉన్న ఎవరితోనైనా మాట్లాడవచ్చు.. మనకు ఆసక్తి ఉన్న రంగంలో అప్పటికే రాణిస్తున్న వారితో మాట కలిపి మనమూ ఓ మెట్టు ఎక్కొచ్చు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం రైతులు ఇదే దారిలో ముందుకెళుతున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టా, యూట్యూబ్‌ల్లో వివిధ ప్రాంతాల్లో సాగవుతున్న పంటల వివరాలను చూసి.. సంబంధిత వ్యక్తులను ఆన్‌లైన్‌లోనే సంప్రదిస్తున్నారు. అవసరమైన మెలకువలు తెలుసుకుని విభిన్న పంటలను సాగు చేస్తున్నారు.

★ గొందిపాకలు గ్రామానికి చెందిన యువ రైతు జనకాని సింహాచలం గతంలో తన ఎకరా పొలంలో వరి సాగు చేసేవారు. ఫేస్‌బుక్‌లో నల్లబియ్యం సాగు గురించి తెలుసుకుని హైదరాబాద్‌కు చెందిన మిత్రుడి ద్వారా మహారాష్ట్ర నుంచి విత్తనాలను తెప్పించుకున్నారు. వాటిని సాగుచేసి మంచి ఫలితం సాధించారు. ఎర్రబియ్యం సాగునీ ప్రారంభించారు.



నల్లబియ్యం సాగులో గిరిజన రైతు సింహాచలం

★ గొందిపాకలుకే చెందిన మరో యువకుడు బొడు రవీంద్రప్రసాద్ ఫేస్‌బుక్ పరిచయం ద్వారానే కశ్మీర్‌లో పండే కుంకుమపువ్వు దుంపలను ఆన్‌లైన్ ద్వారా తెప్పించుకుని సాగు ప్రారంభించారు. రాజుపాకలులో కౌలు రైతులు రాహుల్, రాజు సేంద్రియ పద్ధతుల్లో జుకుని, బ్రకోలీ, రెడ్ క్యాబేజీ, చైనీస్ క్యాబేజీ, ఎర్రబెండ, పింక్ క్యాలీఫ్లవర్ వంటి భిన్నమైన పంటలను సాగు చేసి ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు.

★ చింతపల్లి మండలంలో సుమారు 50 ఎకరాల్లో స్ట్రాబెర్రీ సాగవుతోంది. దీనికి ప్రధాన కారణం సామాజిక మాధ్యమాలే. ఇక్కడ పండే స్ట్రాబెర్రీ చూసి ఫేస్‌బుక్, వాట్సప్‌ల ద్వారా స్థానికంగా ఉన్న గిరిజన రైతులతో వ్యాపారులు సంప్రదింపులు జరుపుతున్నారు.



రాజుపాకలో గులాబీ, పసుపు రంగుల కాలీఫ్లవర్ సాగు

డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు బిహార్ రాజభాషా పురస్కారం



బిహార్ సీఎం నీతీశ్‌కుమార్ చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న డాక్టర్ కేఎస్ రావు

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి, కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదప్రోలుకు చెందిన డాక్టర్ కృత్తివెంటి శ్రీనివాసరావుకు బిహార్ ప్రభుత్వ రాజభాషా పురస్కారం లభించింది. శనివారం పట్నాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ డాక్టర్ కేఎస్‌రావుకు బాబూ గంగాశరణ్ సింహ్ హిందీ భాషా సాహిత్య పురస్కారం ప్రదానం చేశారు. రూ.లక్ష నగదు బహుమతి అందజేశారు. హిందీ భాషా సాహిత్యాలకు విశేషంగా సేవచేసిన వివిధ రంగాల ప్రముఖులకు బిహార్ ప్రభుత్వం ప్రతియేటా రాజభాషా పురస్కారాలు, నగదు బహుమతులు ప్రదానం చేస్తోంది. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శిగా దశాబ్దానికి పైగా వివిధ భాషా సాహిత్యాల అభివృద్ధికి చేసిన సేవలకు గాను డాక్టర్ కేఎస్ రావు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ సంస్థల నుంచి అనేక పురస్కారాలు అందుకున్నారు.

మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా


ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన మంగళవారానికి వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సోమవారం నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా.. దీన్ని వాయిదా వేసినట్లు పాఠశాల విద్యాశాఖ ఆదివారం రాత్రి ప్రకటించింది. ఇప్పటికే డీఎస్సీ మెరిట్ జాబితాను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. డీఎస్సీలో వచ్చిన స్కోర్‌తోపాటు అర్హులైన వారందరికీ ర్యాంకులు కేటాయించారు. రిజర్వేషన్లు, స్థానికత ఆధారంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం కాల్‌లెటర్లు జారీచేయాల్సి ఉంటుంది. ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అధికారులు ఒకటికి రెండుసార్లు జాబితాలను పరిశీలిస్తున్నారు. విద్యాశాఖ మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆదివారం అభ్యర్థుల లాగిన్‌కు కాల్ లెటర్లు పంపించి, సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన చేయాల్సి ఉండగా.. కాల్ లెటర్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా పడింది. కాల్ లెటర్లను సోమవారం ఉదయం నుంచి అభ్యర్థుల లాగిన్‌లో ఉంచనున్నారు.

డీఎస్సీ అమలు అభినందనీయం

కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వం ఆలస్యమైనా.. డీఎస్సీ అమలుచేయడం అభినందనీయమని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే డీఎస్సీపై తొలి సంతకం పెట్టి ఉపాధ్యాయ పోస్టులు భర్తీచేస్తామని హామీ ఇచ్చిందని ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా మిగతావాటినీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే రూ.3వేల చొప్పున ఇస్తామన్న నిరుద్యోగ భృతి మాటేమిటని ప్రశ్నించారు. ఈబీసీ, కాపునేస్తం పథకాలు కూడా అమలు చేయాలన్నారు.

కంటెయినర్‌లో 255 ల్యాప్‌టాప్‌ల చోరీ



ల్యాప్‌టాప్‌లు ఉన్న కంటెయినర్

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కంటెయినర్‌లో తరలిస్తున్న ల్యాప్‌టాప్‌లు చోరీకి గురైన ఘటన బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్లలో ఆదివారం వెలుగుచూసింది. చీరాల డీఎస్పీ మొయిన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఎఫ్‌సీపీఎల్ ట్రాన్స్‌పోర్టుకు చెందిన కంటెయినర్ ముంబయి నుంచి 255 ల్యాప్‌టాప్‌లు, 150కు పైగా ప్రింటర్లను తీసుకుని చెన్నై వెళుతోంది. ఇలా మరో నాలుగు కంటెయినర్లు ఇదే దారిలో ప్రయాణిస్తున్నాయి. ఈ ఐదింటికీ డోర్ లాక్ అలారం ఏర్పాటుచేశారు. అందులో ఒక వాహనానికి శనివారం ఉదయం అద్దంకి మండలం చిన్న కొత్తపల్లి సమీపంలో తలుపు తెరిచినట్లు కంపెనీ ప్రతినిధులకు అలారం వెళ్లింది. స్పందించిన వారు విజయవాడలోని తమ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా మేదరమెట్ల సమీపంలోని ఒక దాబా వద్ద కంటెయినర్‌ను వదిలివెళ్లినట్లు గుర్తించారు. అందులో పరిశీలించగా 255 ల్యాప్‌టాప్‌లు, ఒక మానిటర్, ఒక టోనర్ చోరీకి గురికాగా, ప్రింటర్లు అలాగే ఉన్నాయి. లారీ డ్రైవర్, క్లీనర్ ఫోన్లు స్విచాఫ్ అయ్యాయి. ఈ మేరకు మేదరమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. చోరీకి గురైన ల్యాప్‌టాప్‌ల విలువ సుమారు రూ.95 లక్షలు ఉంటుందని, అన్ని రకాల పన్నులు కలిపితే రూ.1.80 కోట్ల వరకు ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

28 నుంచి జనసేన రాష్ట్రస్థాయి సమావేశాలు

విశాఖ వేదికగా 'సేనతో సేనాని' పేరిట నిర్వహణ



గోడపత్రిక విడుదల చేస్తున్న మంత్రి మనోహర్, చిత్రంలో విశాఖ డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, రమేష్‌బాబు, రామకృష్ణ, విజయకుమార్, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: విశాఖ వేదికగా ఈ నెల 28 నుంచి 'సేనతో సేనాని' పేరిట మూడు రోజుల పాటు జనసేన పార్టీ రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహిస్తామని ఆ పార్టీ పీఏసీ ఛైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విశాఖ పాతనగరంలోని మున్సిపల్ స్టేడియంలో, బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ హాల్లో సమావేశాల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో కలిసి మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ "28 నుంచి 30 వరకు జరిగే సమావేశాల్లో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పాల్గొంటారు. రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీశ్రేణులు హాజరవుతాయి. 28న వైఎంసీఏ సమావేశ మందిరంలో జరిగే జనసేన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొని.. తాజా రాజకీయ పరిణామాలు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తారు. మధ్యాహ్నం జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో 320 మంది కార్యవర్గ సభ్యులు పాల్గొంటారు. 29వ తేదీన ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న 10 మందిని ఎంపిక చేసి.. వారితో వివిధ అంశాలపై అధినేత మాట్లాడతారు. ఆ రోజు రాత్రి ఉత్తరాంధ్ర ప్రాముఖ్యత తెలియజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 30న మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మున్సిపల్ స్టేడియంలో జరిగే బహిరంగసభకు రాష్ట్ర నలుమూలల నుంచి శ్రేణులు తరలివస్తాయి. సాయంత్రం 6 గంటలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సభా ప్రాంగణానికి చేరుకుని ప్రసంగిస్తారు' అని మంత్రి తెలిపారు. అనంతరం సమావేశాల గోడపత్రికను ఆవిష్కరించారు.

రెండు విమానాశ్రయాల నిర్మాణానికి అనుమతులు

ఈనాడు, అమరావతి: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా దగదర్తి, చిత్తూరు జిల్లా కుప్పంలలో విమానాశ్రయాలను పీపీపీ విధానంలో నిర్మించేందుకు రాష్ట్ర విమానాశ్రయాల అభివృద్ధి సంస్థ (ఏపీఏడీసీఎల్)కు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రైట్స్ సంస్థ రూపొందించిన టెక్నో ఎకనమిక్ ఫీజిబులిటీ రిపోర్ట్ ఆధారంగా తయారుచేసిన ముసాయిదా ఆర్ఎఫ్‌పీని ఆమోదించింది. విమానాశ్రయాల నిర్మాణానికి అవసరమైన అనుమతులు తీసుకోవాలని ఆదేశించింది. వీటి నిర్మాణానికి హడ్కో నుంచి రుణాన్ని తీసుకుని భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించాలని ఉత్తర్వుల్లో తెలిపింది. ఈ మేరకు ఏపీఏడీసీఎల్ ఎండీ తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

తిరుపతిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతాం

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



క్రీడాజ్యోతితో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్, నారా రోహిత్, కూటమి నేతలు

తిరుపతి (క్రీడలు), న్యూస్‌టుడే: తిరుపతిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతామని, అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా సదుపాయాలు కల్పిస్తామని క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ నెల 29న హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఆధ్వర్యంలో తిరుపతి వేదికగా 'అమరావతి ఛాంపియన్' రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబుతోనే క్రీడాభివృద్ధి సాధ్యమని, ప్రభుత్వం చేపట్టే ప్రతి ఉద్యోగ నియామకాల్లో క్రీడాకారులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన నారా రోహిత్ మాట్లాడుతూ.. తన నాన్న స్ఫూర్తితో క్రీడలకు తన వంతు కృషిచేస్తానని తెలిపారు. శాప్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని శాప్ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు. గెలుపొందిన జట్లకు ఈ నెల 29న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నగదు బహుమతి, పతకాల ప్రదానం ఉంటుందన్నారు. శాప్ ఎండీ గిరీష, శాప్ డైరెక్టర్ రజినీ, కలెక్టర్ వెంకటేశ్వర్, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, హస్తకళల అభివృద్ధి సంస్థ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్‌లు డాక్టర్ హరిప్రసాద్ రెడ్డి, నరసింహయాదవ్, నగరపాలిక ఉపమేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐఏటీవో వార్షిక సదస్సుకు ప్రభుత్వ ఆతిథ్యం

వచ్చే ఏడాది విశాఖలో నిర్వహణ

ఈనాడు, అమరావతి: వచ్చే ఏడాది విశాఖలో నిర్వహించే భారత్ టూర్ ఆపరేటర్ల అసోసియేషన్ (ఐఏటీవో) 41వ వార్షిక సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తుందని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ప్రకటించారు. ఆదివారం ఒడిశాలోని పూరీలో నిర్వహించిన 40వ ఐఏటీవో వార్షిక సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న పలు చర్యలు, కొత్త పర్యాటక విధానం ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలు తదితర విషయాలను అజయ్‌జైన్ వివరించారు. పర్యాటక రంగం అభివృద్ధిలో టూర్ ఆపరేటర్ల పాత్ర ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు.

నేడు కోనసీమలో మాధవ్ పర్యటన

ఈనాడు, అమరావతి: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈ నెల 25న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, 26న కాకినాడ జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.


సీతారామపురం సమీపంలో కొండ వద్ద సొరంగం తవ్వకం పనులు

భారతమాలలో పొడవైన సొరంగ మార్గం

నెల్లూరు జిల్లాలో చురుగ్గా పనులు

సీతారామపురం, న్యూస్‌టుడే: భారతమాల పరియోజన రెండో దశలో భాగంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల నడుమ పొడవైన సొరంగ మార్గం ఏర్పాటవుతోంది. 518 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తున్న విజయవాడ- బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వేలో భాగంగా ఈ టన్నెల్ తవ్వుతున్నారు. నెల్లూరు జిల్లా సీతారామపురం సమీపంలో ప్రారంభమయ్యే సొరంగం.. మరోవైపు వైఎస్సార్ కడప జిల్లాలో తెరుచుకుంటుంది. ఆరు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా, వాహనాలు వెళ్లేందుకు, వచ్చేందుకు వేర్వేరుగా సొరంగ మార్గాలు నిర్మిస్తున్నారు. ఒక్కోటి 16.7 మీటర్ల వెడల్పు, 9.8 మీటర్ల ఎత్తుతో 3.68 కి.మీ. పొడవు ఉంటాయి. ఇటీవల ఒక సొరంగ మార్గానికి రెండు వైపులా తవ్వకం పనులు ప్రారంభమయ్యాయి. మ్యాక్స్ ఇన్‌ఫ్రా కంపెనీ రూ. 857.75 కోట్ల వ్యయ అంచనాలతో ఈ పనులు చేస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభం కాగా, 2027 ఫిబ్రవరి ఆరో తేదీలోపు పూర్తి చేయాల్సి ఉంది. అనంతరం 15 ఏళ్ల పాటు అదే కంపెనీ నిర్వహణ బాధ్యతలు చూస్తుంది. ఈ సొరంగం అందుబాటులోకి వస్తే, రాష్ట్రంలోని హైవేల పైనున్న టన్నెల్స్‌లో ఇదే పొడవైనదిగా రికార్డులకెక్కుతుందని జాతీయ రహదారి సంస్థ అధికారులు తెలిపారు.

నిల్వ నీరు రోగ కారకం!

- పురపాలకశాఖ హెచ్చరిక
- ఎక్కువమంది 5 రోజుల పాటు ఉంచుకుని తాగుతున్నారు
- రాష్ట్రవ్యాప్త సర్వేతో వెలుగులోకి
- ట్యాంకుల శుభ్రతా అంతంతమాత్రమే
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

ఈనాడు-అమరావతి: నీరు ప్రాణాధారం. తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే అదే నీరు అనారోగ్యాన్ని తెచ్చి పెడుతుంది. చాలామంది ఇళ్లలో నీరు ఎక్కువ రోజులు నిల్వ చేసి తాగడం, బిందెలు, డ్రమ్ములపై మూతలు సరిగా పెట్టకపోవడం, ట్యాంకులు శుభ్రం చేయకపోవడం వంటివి గుర్తించిన పురపాలక శాఖ అధికారులు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సర్వేలో విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, కాకినాడ, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడపలలో పేదలు నివసించే ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. విరేచనాలు, వాంతులు, జ్వరం ఇతర అనారోగ్య సమస్యలకు ఇవే ప్రధాన కారణాలని పేర్కొంది. నగరాలు, పట్టణాల్లో అనారోగ్య సమస్యలు ఎక్కువగా తలెత్తడంపై పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో 1.75 లక్షల కుటుంబాలపై మున్సిపల్ సిబ్బంది గత నెలలో సర్వే చేశారు. 17 నగర పాలక సంస్థల్లో లక్ష కుటుంబాలు, 115 పురపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో మరో 75 వేల కుటుంబాలు తాగునీరు వినియోగిస్తున్న తీరును, తీసుకుంటున్న జాగ్రత్తలు పరిశీలించారు. అత్యధికులు నీరు ఎక్కువ రోజులు నిల్వ చేసి తాగుతున్నట్లు గుర్తించారు.



- ◆ 1 నుంచి 5 రోజుల వరకు ఒకే నీరు వాడుతున్న కుటుంబాలు: 82,245
- ◆ 1 నుంచి 3 రోజుల వరకు వినియోగిస్తున్నవి: 51,912
- ◆ నీళ్ల ట్యాంక్‌లు సరిగా శుభ్రం చేసుకోని కుటుంబాలు: 40,843

ఆర్వో ప్లాంట్లపైనే నమ్మకం

మున్సిపల్ సిబ్బంది సర్వే చేసిన 1.75 లక్షల కుటుంబాల్లో 1.19 లక్షల మంది (68%) తాగునీటి అవసరాలకు ఆర్వో ప్లాంట్లలో నీటినే వినియోగిస్తున్నట్లు వెల్లడైంది. ఇళ్లకు మున్సిపల్ కుళాయి కనెక్షన్ ఉన్న వారు సైతం ప్రైవేట్ ఆర్వో ప్లాంట్ల నుంచి నీటిని కొని తెచ్చుకుంటున్నారు. వాటిలో సరైన ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా? అనేకంటే మున్సిపల్ నీటి కంటే ఆర్వో ప్లాంట్లలో నీరు రుచిగా ఉంటోందని ఎక్కువ మంది చెప్పడం గమనార్హం.

ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి

- ◆ నిల్వ చేసిన నీరు 2, 3 రోజులకు మించకుండా వాడాలి.
- ◆ మూత పెట్టిన పాత్రల్లోనే నిల్వ చేయాలి.
- ◆ బిందెలు, సీసాలు, డ్రమ్ములు, ట్యాంక్‌లను తరచూ శుభ్రం చేయాలి.
- ◆ నీరు మరిగించి తాగాలి. ఫిల్టర్ చేసైనా వాడాలి.
- ◆ అవకాశం ఉంటే నీటిలో క్లోరిన్ టాబ్లెట్లు వేయాలి.
- ◆ ప్లాస్టిక్ డబ్బాల్లో ఎక్కువ కాలం నీరు ఉంచితే మైక్రో ప్లాస్టిక్స్ అందులోకి చేరతాయి.

నిల్వ చేసిన నీరు తాగడంతో అనర్థాలు అనేకం

- ◆ పరిశుభ్రత లేని నీటిలోకి బ్యాక్టీరియా చేరుతుంది. అలాంటి నీరు తాగడం మంచిదికాదు. కడుపు ఉబ్బరం, వాంతులు, అతిసార, టైఫాయిడ్, పచ్చకామెర్లు, జ్వరం, అలసట వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి.
- ◆ నీటిని ఎక్కువ కాలం నిల్వ ఉంచితే అందులో ఆక్సిజన్ తగ్గి నీరు పాడై దుర్వాసన వస్తుంది.
- ◆ పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు నిల్వ చేసిన నీరు తాగితే త్వరగా అనారోగ్యానికి గురవుతారు.
- ◆ దీర్ఘకాలంలో జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుంది. కాలేయం, మూత్రపిండాల సమస్య, రక్తహీనత వంటివి తలెత్తుతాయి.

దశావతార ఏకదంతుడు!



వినాయక విగ్రహాల తయారీలో ఎవరి సృజనాత్మకత వారిదే. చిత్రంలో కనిపిస్తున్న దశావతారాల గణపయ్య విగ్రహాలు విజయనగరంలోని కుమ్మరి వీధిలో కళాకారులు తయారుచేశారు. తుదిరూపు దాల్చిన ప్రతిమలను తరలించేందుకు వీలుగా రెండు భాగాలుగా చేసి ఉంచారు. మండపానికి తీసుకెళ్లాక ఈ రెండింటినీ ఒక్కటిగా చేసి పూజించనున్నారు. కుమ్మరి వీధిలో కనిపించిన ఇవి ఆ దారినపోయే వారిని చూపుతిప్పుకోనివ్వడం లేదు. - ఈనాడు, విజయనగరం

రాజ్యాంగమే ప్రమాదంలో చిక్కుకుంది

- కాపాడేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉప రాష్ట్రపతిగా గెలవాలి
- తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న స్టాలిన్. చిత్రంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, 'ఇండియా' కూటమి నేతలు తదితరులు

చెన్నై, న్యూస్‌టుడే: ప్రస్తుతం భారత రాజ్యాంగమే ప్రమాదంలో చిక్కుకుందని, ఇలాంటి పరిస్థితుల్లో దానిని కాపాడేందుకు ఉప రాష్ట్రపతిగా ప్రతిపక్షాల కూటమి అభ్యర్థి గెలవాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ అన్నారు. 'ఇండియా' కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఆదివారం చెన్నైలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో స్టాలిన్ మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని పరిరక్షించే సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉప రాష్ట్రపతి పదవికి అర్హులని అన్నారు. ఆయన న్యాయమూర్తిగా పనిచేసిన సమయంలో నిజాయతీగా, స్వతంత్రంగా వ్యవహరించి ప్రజల హక్కులను, సామాజిక న్యాయం విలువల్ని పెంచారని, రాజ్యాంగ విలువల్ని పరిరక్షించారని పేర్కొన్నారు. ప్రస్తుతం రాజకీయ ప్రత్యర్థులపై కక్షసాధించడానికి దర్యాప్తు సంస్థలను భాజపా ఉపయోగిస్తోందని, స్వతంత్రంగా ఉండాల్సిన దర్యాప్తు సంస్థలు ఆ పార్టీ అనుబంధ సంస్థలుగా మారుతున్నాయని, రాజ్యాంగమే ప్రమాదంలో చిక్కుకుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితుల్లో భారత మౌలిక సిద్ధాంతాలైన లౌకికవాదం, సమాఖ్యపాలన, సామాజిక న్యాయం, భిన్నత్వంలో ఏకత్వం వంటివాటిపై నమ్మకం కలిగిన ఒకరు తమకు లభించారని తెలిపారు. భారత ప్రజాస్వామ్యాన్ని, పార్లమెంట్ విలువల్ని, ప్రజాపాలన తత్వాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉప రాష్ట్రపతిగా గెలవాలని ఆకాంక్షించారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బాధ్యతారాహిత్యంగా మాట్లాడి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిపై నిందలు వేశారని విమర్శించారు. చెన్నై పర్యటనలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వెంట తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఉన్నారు.



ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

మధుమేహం రాత్రికి రాత్రే వచ్చేది కాదు. నిర్ధారణ కావడానికి కొన్నేళ్ల ముందు నుంచే అది నిశ్శబ్దంగా పెరుగుతూ ఉంటుంది. కొన్ని లక్షణాల ద్వారా మధుమేహాన్ని చాలా ముందుగా గుర్తించొచ్చు. అవేంటంటే-

- ◆ తరచూ అలసటగా అనిపించడం
- ◆ భోజనానంతరం మెదడు చురుగ్గా పనిచేయకపోవడం
- ◆ తీపి ఎక్కువగా తినాలనిపించడం
- ◆ గాయాలు త్వరగా మానకపోవడం
- ◆ దాహం పెరగడం లేదా తరచూ మూత్రవిసర్జనకు వెళ్లడం
- ◆ ఎప్పుడూ ఆకలిగా అనిపించడం
- ◆ చూపు కొంత మందగించడం

- క్రిస్ వాపెల్, వైద్యుడు

5జి, ఏఐతో అనుసంధానించి ఆధునిక వైద్యం

- వైద్యులొకచోట.. రోబోతో శస్త్రచికిత్సలు మరోచోట
- డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ పోతినేని రమేష్‌బాబు


మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు, పక్కన మధుస్మిత, డాక్టర్ సోమశేఖర్, ఎం.ఎస్.రామ్మోహనరావు

ఈనాడు, అమరావతి: విజయవాడ, గుంటూరు, ఒంగోలులోని ఆస్టర్ రమేష్ ఆసుపత్రుల్లో కార్డియో అంకాలజీ, అవయవ మార్పిడి, రోబోటిక్ శస్త్రచికిత్సలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆస్టర్ ఇండియా మెడికల్ ఎక్స్‌పర్ట్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ సోమశేఖర్, ఆసుపత్రి ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు వెల్లడించారు. విజయవాడలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వైద్యనిపుణులు వేరే నగరంలో ఉండి 5జి, ఏఐ సాంకేతికత ద్వారా రోబోతో అనుసంధానమై.. ఇక్కడి శస్త్రచికిత్సలు చేసే ఆధునిక వైద్య పరిజ్ఞానాన్ని కూడా త్వరలో ఆరంభిస్తున్నామన్నారు. ఆసుపత్రిలో ఏర్పాటుచేస్తున్న కార్డియో అంకాలజీ విభాగం ద్వారా క్యాన్సర్ చికిత్స సమయంలో గుండె సంబంధిత సమస్యలకూ చికిత్స చేయడానికి వీలవుతుందని తెలిపారు. క్యాన్సర్, గుండె, నరాలు, ప్రసూతి, ఉదరకోశ, ఊపిరితిత్తుల సంబంధించిన ఆధునిక రోబోటిక్ సేవలను ఆరంభిస్తున్నామన్నారు. ఇప్పటికే ఆస్టర్ రమేష్‌లో కార్నియా, మూత్రపిండాల మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయన్నారు. త్వరలో గుండె, ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్సలు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డయాగ్నోస్టిక్స్ కూడా ఉన్నాయని డాక్టర్ సోమశేఖర్ తెలిపారు. ఈ వైద్యసేవల కోసం ఇతర మెట్రో నగరాలకు రోగులు వెళుతున్నారని, ఇక నుంచి ఇక్కడే అందుబాటులో ఉంటాయన్నారు. అంతర్జాతీయ స్థాయి క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను గుంటూరులో త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి ఛైర్మన్ ఎం.ఎస్.రామ్మోహనరావు, డైరెక్టర్ మధుస్మిత తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నేతల సవాళ్లపై ప్రజలు నవ్వుతున్నారు

మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎద్దేవా



ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తిచేయకుండా, రివర్స్ టెండరింగ్‌తో డయాఫ్రం వాల్ కొట్టుకుపోవడానికి కారణమైన వైకాపా నేతలు.. నేడు కూటమి ప్రభుత్వానికి సవాళ్లు విసరడంపై ప్రజలు నవ్వుకుంటున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎద్దేవా చేశారు. పోలవరం తనకు అర్థం కావడం లేదని, ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో కూడా చెప్పలేనని జలవనరుల శాఖ మంత్రిగా అంబటి రాంబాబు గతంలో చేసిన వ్యాఖ్యల్ని ఆయన గుర్తుచేశారు. చంద్రబాబు చర్చకు రావాలంటున్న అంబటి.. అసలు రాష్ట్రంలో ఏ ప్రాజెక్టును వైకాపా హయాంలో నిర్మించారో చెప్పాలని ఆదివారం ఓ ప్రకటనలో నిలదీశారు. పోలవరం గురించి మాట్లాడే అర్హత, నైతికత వైకాపా వాళ్లకు లేదని దుయ్యబట్టారు.

సమర్థ సేవలతో రెవెన్యూ శాఖకు స్కోచ్ అవార్డులు

- ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్


మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు. పక్కన సంఘ నేతలు

విజయవాడ (ఎన్టీఆర్ కలెక్టరేట్), న్యూస్‌టుడే: ఆన్‌లైన్ కోర్టు మేనేజ్‌మెంట్ విధానం, రీ-సర్వే 2.0 ప్రాజెక్టుల సమర్థ నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలకు గాను రెవెన్యూ శాఖ.. జాతీయ స్థాయిలో రెండు స్కోచ్ అవార్డులు సాధించడంపై ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అభినందనలు తెలియజేసింది. విజయవాడలో ఆదివారం ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రెవెన్యూ శాఖను సమర్థంగా నడిపిస్తున్న ఆ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జాతీయ స్థాయి అవార్డులు వచ్చేలా ప్రోత్సహించిన సీసీఎల్ఏ, ప్రత్యేక సీఎస్ జయలక్ష్మికి కార్యవర్గం ధన్యవాదాలు తెలిపింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉద్యోగులు, అధికారులు ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలకు అనుగుణంగా పని చేస్తూ శాఖ ప్రతిష్ఠను ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులకు తగిన నిధుల విడుదల, మౌలిక సదుపాయాల కల్పన, రెవెన్యూ అకాడమీ ఏర్పాటు తదితర అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతపురంలో నవంబరు 7, 8, 9 తేదీల్లో ఏడో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటరాజేష్, సహాధ్యక్షుడు పితాని త్రినాథరావు, ఉపాధ్యక్షులు జీవన్ చంద్రశేఖర్, ఎన్.శ్రీనివాస్, గొట్టాపు శ్రీరామమూర్తి, అల్లంపాటి పెంచలరెడ్డి, సుదురుమాటి శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్ల జాబితా విడుదల

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో కన్వీనర్ కోటా మొదటి విడత ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు జాబితాను విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదివారం ప్రకటించింది. విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో జాబితా ఉంచింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 25 మధ్యాహ్నం 3 గంటల తర్వాత విశ్వవిద్యాలయం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.10,600 చెల్లించి కేటాయింపు పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని వర్సిటీ అధికారులు తెలిపారు. సీట్లు వచ్చినవారంతా ఈ నెల 29 సాయంత్రం 4 గంటల్లోగా ఆయా వైద్య కళాశాలల్లో తమ ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలతో రిపోర్టు చేయాలని చెప్పారు. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ ఉత్తర్వుల మేరకు సెప్టెంబరు 5 నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి పేర్కొన్నారు.

ఉద్యానాల వైభోగసముద్రం!



2015లో భోగసముద్రం చెరువు వద్ద మొక్కలు పెంపకానికి ఏర్పాట్లు ◆ ప్రస్తుతం అదే ప్రాంతంలో ఇలా ఆహ్లాదం పంచుతోంది

ఒకప్పుడు పల్లేర్లు మొలవని భూమి నేడు పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఓ ఉపాధ్యాయుడి చొరవతో గ్రామస్థులంతా ఏకమై రాళ్లతో నిండిన ఆ ప్రదేశాన్ని ఉద్యానంగా తీర్చిదిద్దుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో 2011-12లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. ఈ పరిస్థితి స్థానికుడైన ఉపాధ్యాయుడు గిరిసుబ్రహ్మణ్యాన్ని కలచివేసింది. రాళ్ల గుట్టల మధ్య ఉన్న స్థానిక భోగసముద్రం చెరువులో పూడిక తీసి, మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు 'భోగసముద్రం జల, వన పరిరక్షణ సమితి' పేరిట సంఘం ఏర్పాటు చేసి స్థానికులను ఒకతాటిపైకి తెచ్చి పూడిక తొలగించారు. అప్పటి ప్రభుత్వం 'నీరు-చెట్టు' కార్యక్రమంతో చెరువు రూపురేఖలు మార్చారు. సొసైటీ ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు చేపట్టారు. చెరువు గట్టుపై 50 అడుగుల శివుడి విగ్రహం ఏర్పాటు చేయించారు. చుట్టూ ఉద్యానాన్ని తీర్చిదిద్దారు. పుట్టిన రోజు వంటి ప్రత్యేక రోజుల్లో పట్టణవాసులు ఎవరైనా రూ. వెయ్యి ఇస్తే వారి పేరిట ఓ మొక్క గట్టుపై నాటుతామని ప్రకటించారు. అలా వచ్చిన నగదుతో అభివృద్ధి పనులు చేస్తూ వచ్చారు. మరోవైపు గట్టున అమర జవాన్ల స్మృతివనం ఏర్పాటు చేశారు. ఇలా వివిధ సందర్భాల్లో నాటి మొక్కలు ఇప్పుడు వృక్షాలై భోగసముద్రం చెరువును ఆహ్లాదానికి చిరునామాగా మార్చాయి.


చెరువుగట్టుపై తీర్చిదిద్దిన యోగేశ్వరమూర్తి విగ్రహం, పార్కు

- ఈనాడు, పుట్టపర్తి

జాతీయ సమైక్యత కోరుతూ.. పవిత్ర ధామాలకు పాదయాత్ర


గుంటూరు పెదకాకాని సమీపంలో రాణాసంగ్రామ్‌సింగ్

జాతీయ సమైక్యత పెంపొందాలని.. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలని కోరుకుంటూ ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూకు చెందిన రాణాసంగ్రామ్‌సింగ్ దేశంలోని పవిత్ర ధామాలను కాలినడకన సందర్శిస్తున్నారు. ఈయన 2023 సెప్టెంబరు 6న గుజరాత్‌లోని ద్వారక నుంచి తన యాత్ర మొదలుపెట్టారు. నాగేశ్వర్ జ్యోతిర్లింగం, సోమనాథ్, ఉజ్జయిని మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, ఘృష్ణేశ్వర్, త్రయంబకేశ్వర్, రామేశ్వరం, శ్రీశైలం వరకు 8 జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు. పూరి వెళుతూ గుంటూరు జాతీయ రహదారిపై కనిపించారు. చేతిలో భారతదేశ చిత్రం ఉన్న జెండాతో కాలినడకన వెళుతున్నారు. ఇప్పటికి ఐదు వేల కిలోమీటర్ల మేర పూర్తి చేశానని, రెండేళ్లలో మరో 4,500 కి.మీ. ప్రయాణించి కేదార్‌నాథ్ చేరుకుని యాత్ర ముగిస్తానని సంగ్రామ్‌సింగ్ చెప్పారు. - ఈనాడు గుంటూరు

గర్భంతో ఉన్న భార్య దారుణ హత్య

- గొంతు కోసి చంపి.. కాళ్లు, చేతులు, తల వేరుచేసి మూసీలో విసిరివేత
- హైదరాబాద్‌లో ఘాతుకం


భార్య స్వాతితో నిందితుడు మహేందర్

ఈనాడు, హైదరాబాద్- ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: ప్రేమించి పెళ్లిచేసుకున్న భార్యను గర్భిణి అని కూడా చూడకుండా గొంతు కోసి అత్యంత కిరాతకంగా చంపేశాడు ఓ రాక్షసుడు. మృతదేహాన్ని మాయం చేసేందుకు రంపంతో కాళ్లు, చేతులు, తల వేరుచేసి మూసీ నదిలో విసిరేశాడు. హైదరాబాద్‌లోని మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ దారుణం జరిగింది. మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణితో కలిసి డీసీపీ పద్మజారెడ్డి ఆదివారం విలేకర్లకు కేసు వివరాలు వెల్లడించారు.

పెళ్లాడిన నెల రోజుల నుంచే..

వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడ గ్రామానికి చెందిన సామల మహేందర్‌రెడ్డి(27).. అదే గ్రామానికి చెందిన బొటుకు స్వాతి(22) వేర్వేరు సామాజిక వర్గాలకు చెందిన వారు. మహేందర్‌రెడ్డి ఇంటర్ చదివి ఖాళీగా ఉండేవాడు. స్వాతి డిగ్రీ చదివింది. ఒకే గ్రామానికి చెందిన వీరు ప్రేమించుకున్నారు. ఈ విషయం రెండు కుటుంబాలకు తెలియడం, వేర్వేరు కులాలు కావడంతో గొడవలు జరిగాయి. తర్వాత స్వాతి కుటుంబ సభ్యుల సమక్షంలో గతేడాది జనవరి 20న ఆర్యసమాజ్‌లో పెళ్లి జరిగింది. ప్రస్తుతం బోడుప్పల్‌లో ఉంటున్నారు. భర్త బైక్ ట్యాక్సీ నడుపుతుండగా.. భార్య కూకట్‌పల్లిలోని కాల్‌సెంటర్‌లో పనిచేసేది. పెళ్లైన నెలరోజుల తర్వాత గొడవలు మొదలయ్యాయి. ఆ సమయంలో స్వాతికి ఒకసారి గర్భస్రావం కూడా చేయించాడు. కొన్ని నెలల క్రితం అతడికి భార్యపై అనుమానం మొదలైంది. కాల్‌సెంటర్ ఉద్యోగమూ మాన్పించాడు. ప్రస్తుతం ఐదో నెల గర్భంతో ఉన్న ఆమె ఈ నెల 27న వికారాబాద్‌లో వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉందని.. పూర్తయ్యాక తల్లిదండ్రుల దగ్గర ఉండిపోతానని శుక్రవారం నాడు చెప్పింది. అంగీకరించని మహేందర్‌రెడ్డి ఆ రోజు అర్ధరాత్రి వరకూ గొడవపడ్డాడు.

రంపంతో ముక్కలు చేసి..

శనివారం సాయంత్రం హ్యాక్సా బ్లేడు(రంపం)తో ఇంటికొచ్చిన అతడు వచ్చీరాగానే భార్య మీద దాడిచేసి గొంతు కోసి చంపేశాడు. మృతదేహం నుంచి చేతులు, కాళ్లు, తలభాగాన్ని వేరు చేశాడు. ప్లాస్టిక్ కవర్‌లో వాటిని కుక్కి మూడు దఫాలుగా నగర శివారు ప్రతాపసింగారం దగ్గర మూసీ నదిలో పడేశాడు. ఆ తర్వాత మొండేన్ని తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఈ క్రమంలోనే తన సోదరికి ఫోన్ చేసి.. భార్య కనిపించడం లేదంటూ చెప్పాడు. ఆమె తన బంధువు గోవర్ధన్‌రెడ్డికి సమాచారం ఇచ్చింది. అతడు బోడుప్పల్‌కు వచ్చినా.. ఇంటికి తీసుకెళ్లకుండా.. స్వాతి ఎటో వెళ్లిపోయిందని నిందితుడు చెప్పాడు. శనివారం రాత్రి వారిద్దరూ ఉప్పల్ ఠాణాకు వెళ్లగా.. పోలీసులు తమ పరిధికాదని మేడిపల్లికి పంపించారు. పోలీసులు ఫిర్యాదు తీసుకునే సమయంలో మహేందర్ ప్రవర్తించిన తీరుతో అనుమానించారు. ఇంటికెళ్లి పరిశీలించగా.. మొండెం కనిపించింది. వెంటనే అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించగా.. హత్య చేసినట్లు అంగీకరించాడు. మృతదేహం భాగాల కోసం పోలీసులు ప్రతాపసింగారం దగ్గర మూసీ నదిలో విస్తృతంగా గాలించినా ఆచూకీ చిక్కలేదు. 'ఇది దారుణమైన నేరం. అన్ని రకాల ఆధారాలు సేకరిస్తున్నాం. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారణ చేయిస్తాం' అని మల్కాజిగిరి డీసీపీ పద్మజారెడ్డి వివరించారు. మహేందర్‌రెడ్డి తన కూతుర్ని చిత్రహింసలు పెట్టాడని.. చివరకు ప్రాణాలు తీశాడంటూ స్వాతి తల్లి స్వరూప మీడియాతో మాట్లాడుతూ కన్నీరుమున్నీరుగా విలపించింది.

గిరిజన బాలికపై సామూహిక అత్యాచారం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దారుణం

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: అభం, శుభం తెలియని అమాయక గిరిజన బాలికపై కామాంధులు అత్యాచారానికి పాల్పడటం కలకలం రేపింది. శీతలపానీయంలో మత్తు మందు కలిపి అత్యాచారం చేసి బాలికను తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని జగన్నాథపురం గుడి వద్ద వదిలేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కథనం ప్రకారం..ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఓ గొత్తికోయ బాలిక (17) వారం రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని పిన్ని ఇంటికి వెళ్లింది. తిరిగి సొంతూరికి వెళ్లేందుకు శుక్రవారం కుంట బస్టాండ్‌కు వెళ్లగా అప్పటికే బస్సు వెళ్లిపోయింది. దీంతో అటుగా వస్తున్న ఓ ట్రాలీ ఆటోని ఆపింది. ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఆమెను ఎక్కించుకుని ఏపీలోని చింతూరు మండలం చట్టి-ఏడుగురాళ్లపల్లి మధ్యలోని అటవీ ప్రాంతంలో ఆపి బాలికకు మత్తు మందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చారు. ఆమె నిరాకరించడంతో ఏమి కాదు మేమూ తాగుతున్నామని నమ్మించి తాగించారు. ఆమె మత్తులోకి జారడంతో అత్యాచారానికి పాల్పడ్డారు. స్పృహ తప్పిన ఆమెను అదేరోజు రాత్రి పాల్వంచ మండలం జగన్నాథపురం పెద్దమ్మతల్లి గుడి వద్ద వదిలేశారు. శరీరంపై పంటి, గోర్ల గాట్ల గాయాలతో బిక్కుబిక్కుమంటూ చూస్తున్న బాలిక పరిస్థితిని గమనించిన స్థానికులు దగ్గర్లోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. చికిత్స చేసిన వైద్యులు చైల్డ్‌లైన్‌కు సమాచారమిచ్చి..ఆమెను కొత్తగూడెంలోని శక్తి సదన్‌లో చేర్చారు. ఆదివారం కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో ప్రసన్నకుమారి ఫిర్యాదు మేరకు పట్టణ ఠాణాలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, చింతూరు ఠాణాకు బదిలీ చేసినట్లు సమాచారం. బాధితురాలిని కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు పోలీసులు, చైల్డ్‌లైన్ సిబ్బంది పేర్కొన్నారు.

ఏపీలోని వివిధ ప్రాంతాలకు తెలంగాణ ఆర్టీసీ టికెట్ ధరల్లో రాయితీ

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు ప్రయాణించేవారికి తెలంగాణ ఆర్టీసీ టికెట్ ధరల్లో రాయితీలు ప్రకటించింది. హైదరాబాద్ నుంచి తిరుపతి, కడప, అనంతపురం, ఒంగోలు, కందుకూరు, నెల్లూరు, విశాఖ, అమలాపురం, కాకినాడ, గుంటూరు, తెనాలి, ఆదోని, చీరాల, ఏలూరు, గుడివాడ, కర్నూలు, మాచర్ల, మచిలీపట్నం, మార్కాపురం, పామూరు, ఉదయగిరి, వింజమూరు, ధర్మవరం, తాడిపత్రి, రాజమహేంద్రవరం (వయా ఖమ్మం), చెన్నై మార్గాల్లో లహరి నాన్-ఏసీ, సూపర్ లగ్జరీ బస్సుల్లో టికెట్ ధరల్లో 15 శాతం, లహరి ఏసీ, రాజధాని ఏసీ బస్సుల్లో 10 శాతం తగ్గించనుంది.

EENADU Vol: 52, Issue: 16 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు సినిమా

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బాలకృష్ణ



భారతీయ సినిమా రంగంలో 50ఏళ్ల అసాధారణ ప్రయాణాన్ని పురస్కరించుకుని అగ్ర కథానాయకుడు బాలకృష్ణకు అరుదైన గౌరవం దక్కింది. లండన్‌కి చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (డబ్ల్యు.బి.ఆర్) గోల్డ్ ఎడిషన్‌లో ఆయనకి చోటు దక్కింది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఈ గౌరవాన్ని పొందిన తొలి నటుడు ఆయనే. ఈ ఘనతని పురస్కరించుకుని ఈ నెల 30న హైదరాబాద్‌లో బాలకృష్ణను సత్కరించనుంది వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్. ఈ సందర్భంగా ఆ సంస్థ సీఈవో సంతోశ్ శుక్లా స్పందిస్తూ... నటుడిగా బాలకృష్ణ ఘనమైన వారసత్వాన్ని, హిందూపురం శాసనసభ్యుడిగా, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్‌గా ప్రజలకు అందించిన సేవల్ని ప్రశంసించారు. బాలకృష్ణ గొప్పతనం వెండితెరని మించి విస్తరించిందని, ఆయన అంకిత భావం, సామాజిక సేవ స్ఫూర్తిదాయకం అన్నారు. అరుదైన ఈ గౌరవాన్ని పురస్కరించుకుని బాలకృష్ణకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో పాటు పలువురు ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. బాలకృష్ణ సినీ రంగానికి చేసిన సేవలకుగానూ భారత ప్రభుత్వం కొన్ని నెలల కిందే పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రదానం చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం బాలకృష్ణ 'అఖండ 2' చిత్రంలో నటిస్తున్నారు.

మాఫియా కథతో.. 'మకుటం'


విశాల్

విశాల్ కథానాయకుడిగా రవి అరసు దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. ఆర్బీ చౌదరి నిర్మాత. దుషార విజయన్ కథానాయిక. అంజలి, తంబి రామయ్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి 'మకుటం' అనే పేరును ఖరారు చేశారు. ఈ మేరకు ఆదివారం టైటిల్ టీజర్ విడుదల చేశారు. ఆ ప్రచార చిత్రాన్ని బట్టి.. ఇది సముద్రం నేపథ్యంగా సాగే మాఫియా చిత్రమని అర్థమవుతోంది. విశాల్ ఇందులో సరికొత్త లుక్‌తో కనిపించనున్నట్లు తెలుస్తోంది. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాకి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, ఛాయాగ్రహణం: రిచర్డ్ ఎం.నాథన్.

వినాయక చవితికి.. సువ్వి సువ్వి!


పవన్ కల్యాణ్, ప్రియాంక మోహన్

కథానాయకుడు పవన్ కల్యాణ్ 'ఓజీ'తో థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన.. ప్రియాంక అరుల్ మోహన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని సుజీత్ తెరకెక్కించారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మించింది. ఇమ్రాన్ హాష్మీ ప్రతినాయకుడిగా నటించారు. ఈ సినిమా సెప్టెంబరు 25న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా దీంట్లోని ''సువ్వి సువ్వి'' అనే గీతాన్ని విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం ప్రకటిస్తూ.. ఓ కొత్త పోస్టర్‌ను పంచుకుంది చిత్రబృందం. అందులో పవన్, ప్రియాంక జంటగా నీటిలో దీపాల్ని వదులుతూ కనిపించారు. ఇది ముంబయి నేపథ్యంగా సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామా కథతో రూపొందింది. పవన్ ఇందులో ఓజాస్ గంభీర అనే శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ చిత్రానికి తమన్ సంగీతమందిస్తున్నారు.


నితిన్, బి.వి.ఎస్.రవి, ప్రశాంత్, వర్ష బొల్లమ్మ, సాయికృష్ణ, సాయిబాబా

వరుస విజయాల వినోదోత్సవం

ETV WIN

అందరికీ నచ్చే కథలు... అందరినీ మెప్పించే వినోదంతో ఈటీవీ విన్ సినీ ప్రియులకు ఎంతగానో చేరువైంది. వరుస విజయాలతో దూసుకెళుతున్న ఈ వేదిక మరెన్నో కొత్త రకమైన కథలకి కేరాఫ్ కానుంది. 'అనగనగా', 'ఏ.ఐ.ఆర్ (ఆల్ ఇండియా ర్యాంకర్స్)', 'కానిస్టేబుల్ కనకం'.. వరుసగా వచ్చిన ఈ సినిమాలు, సిరీస్‌ల విజయాల్ని పురస్కరించుకుని ఇటీవల హైదరాబాద్‌లో తెలుగు వినోదోత్సవం పేరుతో ఓ ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈనెల 29న ప్రపంచ తెలుగు దినోత్సవాన్ని పురస్కరించుకుని తీసుకొచ్చిన రూ. 29కే ఈటీవీ విన్ సభ్యత్వాన్ని ఈ వేదికపై పరిచయం చేశారు. ఆగస్టు 23 నుంచి 29 వరకూ ఈ సభ్యత్వాన్ని పొందే అవకాశం ఉంటుంది. తెలుగు వినోదోత్సవం వేడుకలో ఆయా సినిమాలు, సిరీస్‌ల బృందాలు పాల్గొని సందడి చేశారు. కథానాయిక వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ ''కానిస్టేబుల్ కనకం' సిరీస్‌తో ఈటీవీ విన్‌లో భాగం కావడం ఆనందంగా ఉంది. నిజమైన నాయికా ప్రధానమైన కథ ఇది. దీనికి కొనసాగింపుగా రెండో భాగం కూడా రానుంది'' అన్నారు. ఈటీవీ బిజినెస్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ ''హ్యాట్రిక్ విజయాల సంబరాన్ని చేసుకోవడం ఆనందంగా ఉంది. ప్రపంచ తెలుగు దినోత్సవం సంబరాలకి ఈటీవీ విన్ శ్రీకారం చుట్టింది. రూ. 29కే ఈటీవీ విన్ సభ్యత్వం అందులో భాగమే'' అన్నారు. ''ఈటీవీ విన్‌లో మనందరికీ నచ్చే మన కథలు ఉంటాయి. అవి ఉన్నంతకాలం ఇలాంటి వేడుకలు జరుగుతూనే ఉంటాయి'' అన్నారు ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి. దర్శకుడు బి.వి.ఎస్.రవి మాట్లాడుతూ ''ఈటీవీ విన్ అంటే తెలుగు చిత్ర పరిశ్రమలో అందరికీ ఓ ప్రత్యేకమైన గౌరవం. ఈటీవీ ప్రమాణాలకి తగ్గట్టుగా అద్భుతమైన సినిమాలు ఈ వేదికపై వస్తున్నాయి'' అన్నారు. ఈ కార్యక్రమంలో కథానాయకుడు చైతన్యరావు, నటులు సమీర్, హర్ష, దర్శకులు ప్రశాంత్ కుమార్ దిమ్మల, సందీప్‌రాజ్, జోసెఫ్ క్లింటన్, సన్నీ, నిర్మాత సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నీలాగే ఇతరులనూ ప్రేమించు


శివ కార్తికేయన్, రుక్మిణీ వసంత్

'అమరన్' విజయం తర్వాత హీరో శివ కార్తికేయన్ నుంచి వస్తున్న కొత్త చిత్రం 'మదరాసి'. ఆయన.. రుక్మిణీ వసంత్ జంటగా నటించిన ఈ సినిమాని ఏఆర్ మురుగదాస్ తెరకెక్కించారు. శ్రీలక్ష్మీ మూవీస్ సంస్థ నిర్మించింది. విద్యుత్ జమ్వాల్, బిజు మేనన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం సెప్టెంబరు 5న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ''నీలాగే ఇతరుల్ని ప్రేమించు. అందరూ నీ కుటుంబమే అనుకో. అదే అన్ని మతాలు.. అందరు దేవుళ్లు చెప్పేది'' అంటూ రుక్మిణి చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం యాక్షన్ కోణంలో ఆసక్తికరంగా సాగింది. ఇది ఆయుధాల అక్రమ తయారీ మాఫియా నేపథ్యంలో సాగే కథగా ఉండనున్నట్లు ప్రచార చిత్రాన్ని బట్టి అర్థమవుతోంది. శివ కార్తికేయన్ పూర్తిగా మాస్ యాక్షన్ పాత్రలో కనువిందు చేయనున్నారు. ''గన్ ఎవరి చేతిలో ఉన్నా.. విలన్ నేనేరా'', ''ఇది నా ఊరు సర్. నేను వదలను'' అంటూ ట్రైలర్‌లో వినిపించిన డైలాగ్స్ ఆకర్షణగా నిలిచాయి. ఈ సినిమాకి అనిరుధ్ సంగీతమందించారు.

అందర్నీ ఆశ్చర్యపరిచే చిత్రమిది


కుశేందర్ రమేశ్

''పొలిమేర', 'రజాకార్' కథలు విన్నప్పుడు ఎలాంటి అనుభూతి కలిగిందో.. 'త్రిబాణధారి బార్బరిక్' కథ విన్నప్పుడు అదే ఫీల్ కలిగింది. ఇందులో ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది. క్లైమాక్స్‌ను ఎవరూ ఊహించలేరు'' అన్నారు ఛాయాగ్రాహకుడు కుశేందర్ రమేశ్ రెడ్డి. సత్యరాజ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమాని మోహన్ శ్రీవత్స తెరకెక్కించారు. దర్శకుడు మారుతి సమర్పణలో విజయ్‌పాల్ రెడ్డి అడిదెల నిర్మించారు. ఇది ఈ నెల 29న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్ర ఛాయాగ్రాహకుడు మాట్లాడుతూ.. ''ఈ సినిమాకి ప్రధాన బలం కథే. దీంట్లోని ప్రతి పాత్రకు ఓ ప్రత్యేకత ఉంటుంది. అందుకే ప్రతి పాత్రకు విభిన్నమైన కలర్ గ్రేడింగ్ వాడాము. ఇది 'తుంబాడ్', '2018' చిత్రాలకు ఏమాత్రం తగ్గకుండా సహజంగా కనిపిస్తుంది. ఇది అందర్నీ ఆశ్చర్యపరిచే చిత్రమవుతుంది. దీనికి క్లైమాక్స్ అద్భుతంగా కుదిరింది'' అన్నారు.

'సు ఫ్రమ్ సో' దర్శకుడితో అజయ్?


అజయ్ దేవగణ్

కంటెంట్ బలంగా ఉంటే చాలు అంటూ.. భాషతో సంబంధం లేకుండా కొత్త కొత్త కాంబినేషన్‌లు ప్రేక్షకుల్ని అలరించడానికి చకచకా ముస్తాబవుతున్నాయి. ఈ బాటలోనే మరో కొత్త కలయిక తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఇటీవలే 'సు ఫ్రమ్ సో' చిత్రంతో సినీప్రియుల్లో నవ్వులు పూయించారు కన్నడ దర్శకుడు జె.పి తుమినాడ్. ఇప్పుడీయనతో ఓ ప్రాజెక్ట్ కోసం బాలీవుడ్ అగ్ర హీరో అజయ్ దేవగణ్ చేతులు కలిపినట్లు తెలుస్తోంది. ''దర్శకుడు చెప్పిన ఆలోచనను ఇష్టపడ్డారు అజయ్. ప్రస్తుతం ఈ సినిమా చర్చల దశలో ఉంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే కేవీఎన్ నిర్మాణంలో వచ్చే ఏడాది పట్టాలెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు. హారర్ కామెడీ థ్రిల్లర్‌గా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దనున్నార''ని అజయ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.


తమన్నా

భయపెట్టేందుకు వస్తోన్న తమన్నా

'ఓదెల 2'తో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించింది కథానాయిక తమన్నా. ప్రస్తుతం వరుస సినిమాలతో తీరిక లేకుండా గడుపుతున్న ఆమె.. తన రాబోయే ప్రాజెక్టుతో ప్రేక్షకుల్ని భయపెట్టేందుకు సిద్ధమవుతోంది. కుర్రకారుని విశేషంగా అలరించిన చిత్రం 'రాగిణి ఎమ్ఎమ్ఎస్'. ఇప్పుడీ ఫ్రాంఛైజీలో మూడో భాగం రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇందులో కథానాయికగా తమన్నాను ఎంపిక చేసిందట చిత్రబృందం. ''మునుటి చిత్రాలకు పూర్తి భిన్నంగా 'రాగిణి ఎమ్ఎమ్ఎస్ 3' ప్రాజెక్టును తీర్చిదిద్దడానికి సన్నాహాలు చేస్తున్నారు నిర్మాత ఏక్తా కపూర్. ఈ ఫ్రాంఛైజీని హారర్ కామెడీగా మార్చుతున్నారు. ఈ కొత్త శైలికి సరిగ్గా సరిపోయే స్క్రిప్ట్‌ను ఇప్పటికే పూర్తి చేసింది చిత్ర బృందం. ప్రస్తుతం చర్చల దశల్లో ఉన్న ఈ ప్రాజెక్టులో నటించడానికి తమన్నా చాలా ఉత్సాహంగా ఉంద''ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

"నీలి నీలి ఆకాశం" పాటకు సీక్వెల్ గీతమిది


రోషిణి, మొయిన్, యష్ణ

'30రోజుల్లో ప్రేమించటం ఎలా' చిత్రం తర్వాత దర్శకుడు మున్నా ధులిపూడి నుంచి వస్తున్న కొత్త సినిమా 'బ్యాడ్ గాళ్స్'. అంచల్ గౌడ్, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, రోహన్ సూర్య, మొయిన్ ప్రధాన పాత్రలు పోషించారు. శశిధర్ నల్ల, ఇమ్మడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ సంయుక్తంగా నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం త్వరలో థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ సినిమాలోని ''ఇలా చూసుకుంటానే'' అనే గీతాన్ని నటుడు రానా దగ్గుబాటి ఆదివారం విడుదల చేశారు. ఈ పాటకు అనూప్ రూబెన్స్ స్వరాలు సమకూర్చగా.. చంద్రబోస్ సాహిత్యమందించారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. ''ఈ పాట 'నీలి నీలి ఆకాశం' గీతానికి సీక్వెల్‌గా అంతకంటే గొప్పగా ఉంటుంది. దీన్ని జమ్మూ - కశ్మీర్, మలేషియాలోని ప్రకృతి అందాల్లో చిత్రీకరించాం. ఈ సినిమా ఆద్యంతం వినోదాత్మకంగా యువతకు, కుటుంబ ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం'' అని చిత్ర వర్గాలు తెలిపాయి.

ఈ సినిమాలో నటించడం మంచి అనుభవం


రెజీనా

నటి రెజీనా తన రాబోయే చిత్రం 'ది వైవ్స్' మొదటి షెడ్యూల్‌ను ముంబయిలో పూర్తిచేసినట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్టుని పంచుకుంది. ''ఈ చిత్రంలో పనిచేయడం ఒక మంచి అనుభవమిది. విజయవంతంగా మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేశాం. దర్శకుడు ఈ కథను ఎన్నో అద్భుతమైన పాత్రలతో తీర్చిదిద్దుతున్నారు. నేను చెన్నైలో 'మూకుతి అమ్మన్ 2' షూటింగ్ కూడా చేస్తున్నాను. ఇలా రెండు నగరాల సినీపరిశ్రమల మధ్య ప్రయాణిస్తూ నటించే అనుభవాన్ని ఇష్టపడుతున్నాను. ఇది ఒక ప్రత్యేకమైన సవాలు. కానీ నన్ను స్ఫూర్తిగా, శక్తిమంతం చేస్తుంది'' అని పేర్కొంది. మధుర్ భండార్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న మిస్టరీ థ్రిల్లర్ 'ది వైవ్స్'. ఈ సినిమాలో మౌనిరాయ్, సౌరభ్ సచ్‌దేవా, సోనాలి కులకర్ణి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నేను మలయాళీ కాదు.. కానీ!


జాన్వీ కపూర్

అగ్ర తారల సరసన వరుస అవకాశాలను అందుకుంటూ జోరు మీదుంది బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్. ఆమె, సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'పరమ్ సుందరి'. తుషార్ జలోటా దర్శకత్వం వహించారు. ఇందులో కేరళకు చెందిన యువతిగా కనిపించనుంది జాన్వీ. ఇందులో ఉత్తరాదికి చెందిన ఆమెను మలయాళ యువతిగా చూపించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న జాన్వీ ఈ విషయంపై స్పందిస్తూ... ''అవును నేను మలయాళ అమ్మాయిని కాదు. మా అమ్మ కూడా మలయాళీ కాదు. కానీ కేరళ సంస్కృతి పట్ల నేనెప్పుడూ ఆసక్తి చూపిస్తా. ముఖ్యంగా మలయాళ సినిమాకు నేను పెద్ద అభిమానిని. 'పరమ్ సుందరి'లో కేరళ అమ్మాయిగానే కాదు తమిళ అమ్మాయిగానూ కనిపిస్తా. ఇది ఒక వినోదాత్మక కథ'' అని చెప్పుకొచ్చింది. ఈ సినిమా ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు రానుంది.

గామా వేడుకలు... ఈసారి మరింత సందడిగా!


దక్ష నాగర్కర్, బి.గోపాల్, కోదండరామిరెడ్డి, ఫరియా, మానస, సౌరభ్ కేసరి

పురస్కారాలు ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహాన్ని అందిస్తాయన్నారు సీనియర్ దర్శకుడు ఎ.కోదండరామిరెడ్డి. దుబాయ్‌లో ఏటా జరుగుతున్న గామా (గల్ఫ్ అకాడమీ మూవీ అవార్డ్) పురస్కార వేడుకలు తెలుగు ప్రేక్షకుల్ని ఎంతగానో అలరిస్తున్నాయని, ఈసారీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆదివారం హైదరాబాద్‌లో గామా అవార్డ్స్ - 5వ ఎడిషన్ వేడుకలకు సంబంధించిన సన్నాహక సమావేశం జరిగింది. ఈ వేడుకలకు జ్యూరీ సభ్యులుగా వ్యవహరిస్తున్న దర్శకులు ఎ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్‌తోపాటు కథానాయికలు ఫరియా అబ్దుల్లా, మానస వారణాసి, దక్ష నాగర్కర్, నటుడు వైవా హర్ష తదితరులు హాజరయ్యారు. ఈ నెల 29, 30వ తేదీల్లో దుబాయ్‌లోని షార్జా ఎక్స్‌పో సెంటర్‌లో గామా - 5వ ఎడిషన్ వేడుకలు జరగనున్నాయి. సన్నాహక సమావేశాన్ని ఉద్దేశించి గామా సీఈఓ సౌరభ్ కేసరి మాట్లాడుతూ ''కళలు, కళాకారులపై ఉన్న అభిమానంతో మొదలైన వేడుకలు ఇవి. భవిష్యత్తులో ఇతర దేశాల్లోనూ ఈ వేడుకని నిర్వహించే ప్రణాళికలు ఉన్నాయి. జ్యూరీ సభ్యుల సహకారంతో ప్రతిభావంతులకి పురస్కారాల్ని అందజేస్తున్నాం. ఈసారి మరింత సందడిగా సాగే ఈ వేడుకలకు పలువురు కథానాయకులు, దర్శకులు, సంగీత దర్శకులు, గాయకులతోపాటు ఇతర విభాగాలకు చెందిన సినీ ప్రముఖులు హాజరవుతున్నార''ని చెప్పారు.

ఎక్కువ పని గంటలతో ఆరోగ్య ముప్పు



ముంబయి: అదనపు ప్రయోజనాలు, సౌలభ్యం లేకుండా పని గంటలు పొడిగించడాన్ని ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారని హెచ్‌ఆర్ సొల్యూషన్స్ సేవలు అందించే జీనియస్ హెచ్‌ఆర్ టెక్ (గతంలో జీనియస్ కన్సల్టెంట్స్) నివేదిక వెల్లడించింది. వ్యక్తిగత సమయం, ఆరోగ్యం, పని-జీవన సమతుల్యతపై ప్రభావం చూపుతుందని 44 శాతం మంది వెల్లడించారని తెలిపింది. తగిన పరిహారం అందిస్తే అదనపు పని గంటలకు అంగీకరిస్తామని 40 శాతం మంది తెలిపారని నివేదిక వివరించింది. కేవలం 16 శాతం మంది మాత్రమే అదనపు పని గంటలకు సిద్ధంగా ఉన్నారని తెలిపింది. జులై 1-31 తేదీల మధ్య వివిధ రంగాల్లో పని చేస్తున్న 2,076 మంది ఉద్యోగులను సర్వే చేసి జీనియస్ హెచ్‌ఆర్‌టెక్ ఈ నివేదికను రూపొందించింది.

ఎఫ్‌ఎంసీజీలో మహిళా నియామకాలు తక్కువే



ముంబయి: భారతదేశంలో ఎఫ్‌ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్) రంగం గత రెండేళ్లలో 30 శాతం నియామక వృద్ధిని నమోదు చేసినప్పటికీ, మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని సీఐఈఎల్ హెచ్‌ఆర్ రూపొందించిన 'ఎఫ్‌ఎంసీజీ రంగం: టాలెంట్ ట్రెండ్స్ అండ్ ఇన్‌సైట్స్' నివేదిక వెల్లడించింది. ఈ రంగంలో 9 శాతం మంది మహిళలు మాత్రమే పని చేస్తున్నారని పేర్కొంది. 2023 మే నుంచి 2025 మే మధ్య భారత ఎఫ్‌ఎంసీజీ రంగంలో నియామకాలు స్థిరంగా 30 శాతం సమ్మిళిత వృద్ధి నమోదైందని నివేదిక తెలిపింది. దేశ ఎఫ్‌ఎంసీజీ రంగంలో పని చేస్తున్న లక్ష మంది ఎగ్జిక్యూటివ్‌లు, ఎఫ్‌ఎంసీజీ కంపెనీల కెరీర్ విభాగాల నుంచి డేటా సేకరించి ఈ నివేదికను సీఐఈఎల్ హెచ్‌ఆర్ తయారుచేసింది.

ఇ20 పెట్రోల్‌తో ఇంధన సామర్థ్యం తగ్గొచ్చు



దిల్లీ: పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలిపి (బ్లెండెడ్ పెట్రోల్) వాహనాల్లో వినియోగించడంతో ఇంధన సామర్థ్యం 2-5 శాతం మేర తగ్గిపోవచ్చని వాహన పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు. కార్ల వేరియంట్ల ఆధారంగా ఇందులో కొద్దిగా తేడాలు ఉండొచ్చని భావిస్తున్నారు. ఇ20 ఇంధనం వాడకంతో వాహనాలపై ఎలాంటి ప్రభావం పడుతుందోనని సామాజిక మాధ్యమాల్లో చర్చ నడుస్తుండగా, వాహన రంగంలోని ప్రధాన కంపెనీల్లో పని చేస్తున్న నిపుణులు కొంత మంది స్పందించారు. ఇ20 రకానికి చెందని పాత వాహనాల్లో ఈ పెట్రోల్ వాడకంతో దీర్ఘకాలంలో గ్యాస్కెట్లు, ఇంధన రబ్బరు గొట్టాలు, పైపులు కోతకు గురవుతాయని వారు వెల్లడించారు. తక్షణం ఎలాంటి ప్రభావం ఉండదని తెలిపారు.

ఎగుమతిదార్లకు రూ.25,000 కోట్ల మద్దతు



దిల్లీ: ఎగుమతి ప్రోత్సాహక మిషన్ (ఈపీఎం) కింద ఎగుమతిదార్లకు సుమారు రూ.25,000 కోట్ల మద్దతు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోబోతున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 2025-26 బడ్జెట్‌లో ప్రకటించిన రూ.25,000 కోట్ల ఈపీఎం ప్రకారం, 2025-31 మధ్య 6 ఆర్థిక సంవత్సరాల్లో ఈ ప్రోత్సాహకాలు అందించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఎగుమతి రుణాల సులభతరం, అందుబాటు వడ్డీకి రుణాలు అందించడంపై దృష్టి సారించనున్నట్లు సమాచారం. వాణిజ్య మంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదనను ఆర్థిక మంత్రిత్వ శాఖలోని వ్యయ ఆర్థిక కమిటీ (ఈఎఫ్‌సీ)కి పంపింది. ఇది ఆమోదం పొందితే, ట్రంప్ సుంకాల వల్ల తలెత్తే ప్రపంచ వాణిజ్య అనిశ్చితుల నుంచి దేశీయ ఎగుమతిదార్లకు రక్షణ లభించేందుకు అవకాశం లభిస్తుంది. ఈ నెల 27 నుంచి భారతీయ వస్తువులపై అమెరికా 50 శాతం భారీ సుంకాలు విధించనున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఇవి 25 శాతంగా ఉన్నాయి.

లెదర్ నిపుణులకో ఉద్యోగ పోర్టల్!

కోల్‌కతా: తోళ్ల(లెదర్) పరిశ్రమకు చెందిన గ్రాడ్యుయేట్లు, వృత్తి నిపుణుల కోసం ఒక ఉద్యోగ పోర్టల్‌ను ఆవిష్కరించనున్నట్లు భారతీయ తోలు సాంకేతిక నిపుణుల సంఘం(ఐఎల్‌టీఏ) పేర్కొంది. నిపుణులు, పరిశ్రమ అవసరాల మధ్య ఈ పోర్టల్ వారధిగా నిలవనున్నట్లు ఐఎల్‌టీఏ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ రంగంలో నైపుణ్యం ఉన్న మానవ వనరులకు పెరుగుతున్న గిరాకీని చేరుకోవడానికి ఈ పోర్టల్ సహాయపడుతుందని అందులో తెలిపింది.

ఈనాడు బిజినెస్

ఆర్థిక సేవల్లోకి 'డ్రీమ్ 11'

దిల్లీ: ఫాంటసీ గేమింగ్ ప్లాట్‌ఫామ్ డ్రీమ్11కు చెందిన మాతృసంస్థ డ్రీమ్ స్పోర్ట్స్ ఆర్థిక సేవల రంగంలోకి అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం కొత్త యాప్ 'డ్రీమ్ మనీ'ని అందుబాటులోకి తేనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ యాప్ ప్రయోగాత్మక దశలో ఉంది. దేశంలోని రియల్ మనీ గేమింగ్ సంస్థల్లో ప్రధానమైనదిగా డ్రీమ్ స్పోర్ట్స్ ఉండేది. అయితే అన్ని రకాల ఆన్‌లైన్ మనీ గేమింగ్‌లపై ప్రభుత్వం నిషేధం విధించడంతో డబ్బులతో ఆడే ఆన్‌లైన్ గేమ్‌లను ఈ సంస్థ నిలిపేసింది. గూగుల్ ప్లే స్టోర్ వద్ద లభ్యమవుతున్న సమాచారం ప్రకారం పసిడి కొనుగోలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ సేవలను డ్రీమ్ మనీ యాప్ అందివ్వనుంది. రోజుకు రూ.10 నుంచి పసిడి కొనుగోలు, రూ.1000 నుంచి డిపాజిట్ చేసేందుకు వీలు కల్పించనుంది.

స్థిరాస్తి విక్రయ బుకింగ్‌లు రూ.52,842 కోట్లు

- ఏప్రిల్-జూన్‌లో 28 నమోదిత సంస్థలకొచ్చాయ్
- ప్రెస్టీజ్ ఎస్టేట్స్‌కు అత్యధికం



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో దేశంలోని 28 నమోదిత స్థిరాస్తి కంపెనీలు మొత్తంగా రూ.52,842 కోట్ల విలువైన స్థిరాస్తులను విక్రయించాయి. ప్రెస్టీజ్ ఎస్టేట్స్ అత్యధిక విక్రయ బుకింగ్‌లను సాధించింది. స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఈ కంపెనీలు వెల్లడించిన వివరాల ఆధారంగా పై విషయం వెల్లడైంది.

- ఏప్రిల్-జూన్‌లో బెంగళూరుకు చెందిన ప్రెస్టీజ్ ఎస్టేట్స్‌కు రూ.12,126.40 కోట్ల విలువైన స్థిరాస్తుల విక్రయాలకు బుకింగ్‌లు వచ్చాయి.
- మార్కెట్ విలువపరంగా దేశంలోనే దిగ్గజ స్థిరాస్తి సంస్థ డీఎల్ఎఫ్ రూ.11,425 కోట్ల బుకింగ్‌లతో రెండో స్థానంలో నిలిచింది. ప్రధానంగా గురుగ్రామ్ విలాసవంత గృహాల విపణి సంస్థకు తోడ్పడింది.
- ముంబయికి చెందిన గోద్రేజ్ ప్రాపర్టీస్‌కు రూ.7,082 కోట్లు; లోధా డెవలపర్స్‌కు రూ.4,450 కోట్లు, దిల్లీ-ఎన్‌సీఆర్‌కు చెందిన సిగ్నేచర్ గ్లోబల్‌కు రూ.2,640 కోట్లు చొప్పున విక్రయ బుకింగ్‌లు వచ్చాయి. తద్వారా అత్యధిక బుకింగ్‌లు సాధించిన తొలి ఐదు సంస్థల్లో ఇవి నిలిచాయి.
- ఏప్రిల్-జూన్‌లో మొత్తంగా 28 నమోదిత సంస్థలకు వచ్చిన విక్రయ బుకింగ్‌ల విలువలో ఈ ఐదు సంస్థల వాటానే 71 శాతంగా ఉండటం గమనార్హం.
- మొత్తం విక్రయ బుకింగ్‌ల్లో అత్యధికంగా నివాస సముదాయాల కోసమే వచ్చాయి. కొవిడ్-19 పరిణామాల తర్వాత వీటికి గిరాకీ పెరిగిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా దిగ్గజ స్థిరాస్తి సంస్థలు దీని వల్ల ఎక్కువగా ప్రయోజనం పొందాయి. భారత గృహ రంగ విపణిలో అమ్మకాల సంఖ్య, విలువపరంగా బలమైన వృద్ధిని ఈ సంస్థలు నమోదుచేశాయి.

బుకింగ్‌ల్లో తొలి 5 స్థానాల్లోని సంస్థలు మినహా మిగతావి ఇలా...

సంస్థ	బుకింగ్ విలువ (రూ.కోట్లలో)
శోభా లిమిటెడ్	2,079
ఒమాక్సే	2,001
ఒబెరాయ్ రియాల్టీ	1,639
కల్పతరు	1,249
పూర్వాంకర	1,124
బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్	1,118
కీస్టోన్ రియల్టర్స్	1,068

రూ.1,000 కోట్ల లోపు బుకింగ్‌లు వచ్చిన కంపెనీలివీ..

సన్‌టెక్ రియాల్టీ (రూ.657 కోట్లు), కోల్టే పాటిల్ డెవలపర్స్ (రూ.616 కోట్లు), మహీంద్రా లైఫ్‌స్పేస్ (రూ.449 కోట్లు), శ్రీరామ్ ప్రోపర్టీస్ (రూ.441 కోట్లు), ఆషియానా హౌసింగ్ (రూ.430.97 కోట్లు), ఆదిత్య బిర్లా రియల్ ఎస్టేట్ (రూ.422.50 కోట్లు), రేమండ్ రియాల్టీ (రూ.306 కోట్లు) టీఏఆర్‌సీ (రూ.225 కోట్లు), ఎల్డెకో హౌసింగ్ అండ్ ఇండస్ట్రీస్ (రూ.221.11 కోట్లు), మ్యాక్స్ ఎస్టేట్స్ (రూ.220 కోట్లు), ఎంబసీ డెవలప్‌మెంట్స్ (రూ.198 కోట్లు), అరవింద్ స్మార్ట్‌స్పేసెస్ (రూ.175 కోట్లు), అరిహంత్ సూపర్‌స్ట్రక్చర్స్ (రూ.150.60 కోట్లు), ఆర్కేడ్ డెవలపర్స్ (రూ.142 కోట్లు), అజ్మేరా రియాల్టీ (రూ.108 కోట్లు), సూరజ్ ఎస్టేట్ డెవలపర్స్ (రూ.81 కోట్లు)

ప్రాజెక్టులు పూర్తయ్యాకే.. ఆదాయంపై స్పష్టత

- విక్రయ బుకింగ్‌లను స్థిరాస్తి కంపెనీల పనితీరుకు ప్రామాణికంగా భావిస్తారు. అయితే మరికొన్ని నమోదిత స్థిరాస్తి కంపెనీలు తమ విక్రయ బుకింగ్‌ల వివరాలను వెల్లడించలేదు. అవి కూడా వచ్చి ఉంటే మొత్తం విక్రయ బుకింగ్‌ల విలువ ఇంకా పెరిగేదే.
- పైవి కేవలం బుకింగ్‌ల విలువ మాత్రమే. స్థిరాస్తి ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయ్యాకే స్థిరాస్తి సంస్థలకు ఈ విక్రయాలపై ఎంత మేర ఆదాయం వచ్చిందనే విషయంపై స్పష్టత వస్తుంది.
- గత ఆర్థిక సంవత్సరంలో దేశంలోని 26 దిగ్గజ నమోదిత స్థిరాస్తి సంస్థలు రూ.1.62 లక్షల కోట్ల విలువైన స్థిరాస్తులను విక్రయించాయి. అత్యధికంగా రూ.30,000 కోట్ల విక్రయాలతో బుకింగ్‌ల పరంగా గోద్రేజ్ ప్రాపర్టీస్ అగ్రస్థానంలో నిలిచింది.

ఆర్‌కామ్ రుణ ఖాతా మోసపూరితమే: బీఓఐ

దిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) బాటలోనే బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) కూడా రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణ ఖాతాను 'మోసపూరితం'గా వర్గీకరించింది. 2016లో బీఓఐ నుంచి తీసుకున్న రుణాలను అనుమతి లేని వాటి కోసం ఆర్‌కామ్ వాడుకుందనే ఆరోపణలు ఇందుకు నేపథ్యం. ఈ వ్యవహారంలో సంస్థ ప్రమోటరు, మాజీ డైరెక్టరు అనిల్ అంబానీ, మరో మాజీ డైరెక్టరు మంజరి అశోక్ కాకర్ పేర్లను కూడా 'మోసపూరితం' కిందకు చేర్చింది. ఈ మేరకు బీఓఐ నుంచి ఆగస్టు 8వ తేదీతో ఒక లేఖ తమకు ఆగస్టు 22న అందిందని ఎక్స్ఛేంజీలకు ఆర్‌కామ్ తెలియజేసింది. మూలధనం, నిర్వహణ వ్యయాలు, రుణాల చెల్లింపు నిమిత్తం 2016 ఆగస్టులో రూ.700 కోట్ల రుణాన్ని ఆర్‌కామ్‌కు బ్యాంక్ ఆఫ్ ఇండియా మంజూరు చేసింది. అయితే ఈ రుణంలో సగాన్ని రుణ షరతులకు విరుద్ధంగా 2016 అక్టోబరులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు ఆ లేఖలో బీఓఐ పేర్కొంది. అలాగే 2017 జూన్ 30 నాటికి ఆర్‌కామ్ నుంచి రావాల్సిన బకాయిల విలువ రూ.724.78 కోట్లుగా ఉందని తెలిపింది. సహజ న్యాయ సూత్రాలను పాటించకుండానే ఆర్‌కామ్ రుణ ఖాతాను 'మోసపూరితం'గా బ్యాంక్ ఆఫ్ ఇండియా వర్గీకరించిందని అనిల్ అంబానీకి చెందిన అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

అమెరికా విపణిలోకి విన్‌జో

దిల్లీ: దేశీయ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్ విన్‌జో అమెరికా విపణిలోకి అడుగుపెట్టింది. దీంతో ప్రపంచంలోని నాలుగు దిగ్గజ మొబైల్ గేమింగ్ విపణుల్లో.. మూడింటిలో (భారత్, బ్రెజిల్, అమెరికా) తాము కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు అయిందని కంపెనీ తెలిపింది. అలాగే కొత్త షార్ట్ వీడియో ప్లాట్‌ఫామ్ 'జో టీవీ'ని భారత్, యూఎస్ విపణుల్లో అందుబాటులోకి తెచ్చింది. ఇది విడిగా కాకుండా విన్‌జో యాప్‌లో అంతర్భాగంగానే ఉండనుంది. కాగా.. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించడంతో భారత్‌లో రియల్-మనీ గేమింగ్ సేవలను విన్‌జో నిలిపేసింది. ఇది జరిగిన రోజుల వ్యవధిలోనే పై పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. విన్‌జోకు చెందిన ప్లగ్ అండ్ లాంచ్ డిస్ట్రిబ్యూషన్ విధానం ద్వారా అమెరికా గేమింగ్ విపణి సేవలను భారత గేమింగ్ డెవలపర్లు ఉపయోగించుకునే వీలుంటుందని కంపెనీ తెలిపింది. 'అంతర్జాతీయ వినియోగదార్లకు సేవలను అందించేలా భారత గేమింగ్ డెవలపర్లకు తోడ్పడాలన్నదే మా ఉద్దేశం. ప్రపంచంలో అతిపెద్ద గేమింగ్ విపణి అయిన అమెరికా విపణిలో అడుగుపెట్టడం కూడా ఇందులో భాగమే. జో టీవీని తీసుకొని రావడం పైనా ఇంతే సంతోషంగా ఉన్నాం. వినోదపరంగా అంతర్జాతీయంగా విన్‌జో స్థానం మరింత బలోపేతం అయ్యేందుకూ తోడ్పడుతుంద'ని సంస్థ సహ వ్యవస్థాపకులు సౌమ్య సింగ్ రాథోడ్, పవన్ నందా తెలిపారు.

ఇంగ్లిష్ అంటే భయం

అందుకే లాస్ట్ బెంచ్‌లో కూర్చొనే వాడిని: విజయ్ శర్మ

ఇంటర్నెట్ డెస్క్: పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇంగ్లిష్ రాకపోవడం వల్ల ఎదుర్కొన్న ఇబ్బందులను ఇటీవల జరిగిన ఒక టీవీ షోలో గుర్తుచేసుకున్నారు. పేటీఎం విజయగాథ వెనుక విద్యార్థి దశలో ఎదురైన కఠినమైన పరిస్థితులు కూడా ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో టాపర్ అని, ఎప్పుడూ ఫస్ట్ బెంచ్‌లో కూర్చొనే వాడినని తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీగఢ్ సమీపంలోని చిన్న గ్రామం నుంచి వచ్చిన తనకు ఆంగ్లం అంటే భయమని, దీంతో కాలేజీలో లాస్ట్ బెంచ్‌కి వెళ్లాల్సి వచ్చిందన్నారు.


కోడి గుడ్డు — 25న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	495	గోదావరి	535
వరంగల్	497	విశాఖపట్నం	535
విజయవాడ	540	చిత్తూరు	558

రాగి దిద్దుబాటు!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



పసిడి అక్టోబరు కాంట్రాక్టు ఈవారం రూ.99,226 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే.. రూ.1,01,194 వరకు పెరిగే అవకాశం ఉంది. ఒకవేళ రూ.99,226 కంటే దిగువకు వస్తే.. రూ.1,01,054 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకొని షార్ట్ సెల్ పొజిషన్లను తీసుకోవడం మంచి వ్యూహం అవుతుంది.

వెండి



వెండి సెప్టెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.1,13,951 కంటే దిగువన చలిస్తే రూ.1,10,205 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. ఒకవేళ సానుకూల ధోరణిలో చలిస్తే రూ.1,18,309 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,20,385; రూ.1,24,399 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

ప్రాథమిక లోహాలు



- **రాగి** సెప్టెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.895 కంటే ఎగువన చలించకుంటే దిద్దుబాటు కొనసాగొచ్చు. రూ.876 వరకు పడే అవకాశం ఉంది.
- **సీసం** సెప్టెంబరు కాంట్రాక్టుకు ఈవారం కూడా ప్రతికూల ధోరణి కొనసాగొచ్చు. అయితే రూ.179.45 వద్ద మద్దతు లభించే అవకాశం ఉంది. ఈ స్థాయిని కూడా కోల్పోతే రూ.178.25; రూ.177.55 వరకు దిగివస్తుందని అనుకోవచ్చు. ఒకవేళ రూ.181.90 కంటే పైన చలిస్తే రూ.183 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.
- **జింక్** సెప్టెంబరు కాంట్రాక్టుకు ఈవారం రూ.267.60 ఎగువన లాంగ్ పొజిషన్లు తీసుకోవడం మంచిదే. రూ.268.60 దిగువకు వస్తేనే షార్ట్ సెల్ పొజిషన్ల వైపు మొగ్గు చూపాలి.
- **అల్యూమినియం** సెప్టెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.255.65 కంటే పైన కదలాడకుంటే రూ.251.35 వరకు దిగివస్తుందని అనుకోవచ్చు. ఒకవేళ రూ.255.30 ఎగువకు వెళ్తే.. రూ.257.10; రూ.259.90 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

ఇంధన రంగం



- **ముడి చమురు** సెప్టెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.5,445 కంటే కిందకు వస్తే.. రూ.5,324; రూ.5,245 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.5,645 ఎగువన కదలాడితే రూ.5,724; రూ.5,845 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.
- **సహజవాయువు** సెప్టెంబరు కాంట్రాక్టు ఈవారం సానుకూల ధోరణిలో చలిస్తే రూ.258.30 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.272; రూ.278.90 వరకు వెళ్లొచ్చు. ఒకవేళ రూ.237.70 కంటే కిందకు వస్తే రూ.230.80; రూ.217.10 వరకు దిద్దుబాటు అవుతుందని అనుకోవచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



- **పసుపు** అక్టోబరు కాంట్రాక్టు ఈవారం దిద్దుబాటు అయ్యే అవకాశం ఉన్నప్పటికీ.. ధర తగ్గినప్పుడల్లా లాంగ్ పొజిషన్లను జత చేసుకునే వ్యూహంతో ముందుకెళ్లడం మంచిది.
- **జీలకర్ర** సెప్టెంబరు కాంట్రాక్టు ఈవారం రూ.19,076 కంటే కిందకు వస్తే... రూ.18,448; రూ.18,061 వరకు దిగిరావచ్చు. అదే విధంగా రూ.20,091 కంటే పైన కదలాడితే రూ.20,478; రూ.21,106 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

- ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి (శాతంలో)
పసిడి (అక్టోబరు)	99,960	1,00,391	0.43
వెండి (సెప్టెంబరు)	1,13,951	1,16,234	2.00
రాగి (సెప్టెంబరు)	893	888	(0.56)
సీసం (సెప్టెంబరు)	180.75	180.60	(0.08)
జింక్ (సెప్టెంబరు)	269.55	269.15	(0.15)
అల్యూమినియం (సెప్టెంబరు)	253.80	253.10	(0.28)
ముడి చమురు (సెప్టెంబరు)	5,496	5,566	1.27
సహజ వాయువు (సెప్టెంబరు)	260.30	244.60	(6.03)
పసుపు (అక్టోబరు)	12,500	13,372	6.98
జీలకర్ర (సెప్టెంబరు)	18,895	19,705	4.29

టారిఫ్‌ల ముందు అప్రమత్తత

- జీఎస్‌టీ సంస్కరణలపై ఆశలతో సానుకూల సెంటిమెంటు
- ఐటీ, ఫార్మా షేర్లు రాణించొచ్చు
- నిఫ్టీ బ్యాంక్‌కు ప్రతికూలతలు
- విశ్లేషకుల అంచనాలు

స్టాక్ మార్కెట్ ఈ వారం



మదుపర్లు ఈ వారం అప్రమత్తతతో వ్యవహరించే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అమెరికా అధిక టారిఫ్‌ల అమలు బుధవారం ఉండడం ఇందుకు నేపథ్యం. నిఫ్టీ-50 నెలవారీ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు తీరనుండడంతో ఒక శ్రేణిలోనే సూచీలు కదలాడవచ్చని చెబుతున్నారు. జీఎస్‌టీ సంస్కరణలపై ఉన్న ఆశాభావంతో సానుకూల సెంటిమెంటుకు అవకాశం ఉంది. దీపావళి కల్లా తదుపరి తరం సంస్కరణలను ప్రవేశపెడతామన్న మోదీ వ్యాఖ్యలు మార్కెట్‌లో జోష్‌ను నింపాయని వారంటున్నారు. నిఫ్టీ-50కి 25,160-25,225 మధ్య నిరోధం; 24,850-24,670 వద్ద మద్దతు కనిపిస్తోందని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

- నిఫ్టీ బ్యాంక్ ఈ వారం ప్రతికూలంగా చలించవచ్చు. అయితే భవిష్యత్‌లో పరపతి విధానం విషయంలో అంత కఠినంగా ఉండదల్చుకోలేదన్న ఫెడ్ ఛైర్మన్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యలు మద్దతుగా నిలవవచ్చు. నిఫ్టీ బ్యాంక్ 54,900 స్థాయిని కోల్పోతే 54,500-54,200కు పడిపోవచ్చు. ఒక వేళ 55,700 స్థాయి ఎగువకు చేరితే 56,800 దిశగా పయనించొచ్చు.
- అంతర్జాతీయ ముడి చమురు ధరల నుంచి దేశీయ చమురు కంపెనీలు సంకేతాలు అందుకోవచ్చు. సమీప కాలంలో చమురు రిఫైనింగ్ షేర్లకు దేశీయ గిరాకీ సానుకూలతలను తీసుకురావొచ్చు. అప్‌స్ట్రీమ్ కంపెనీలపై మాత్రం స్తబ్దుగా ఉన్న ముడి చమురు ధరల ప్రభావం కనిపించొచ్చు.
- అమెరికా, ఇతర దేశాల నుంచి పెరుగుతున్న ఎగుమతి గిరాకీ నేపథ్యంలో ఫార్మా షేర్లు తమ సానుకూలతలను కొనసాగించవచ్చు. టారిఫ్‌ల నుంచి ప్రస్తుతానికి మినహాయింపు లభించొచ్చన్న అంచనాలు కలిసిరావొచ్చు. అయితే 60% కంటే తక్కువ జీవితకాలం ఉన్న ఏ ఉత్పత్తినీ ఎగుమతి చేయరాదన్న కొత్త నిబంధనలు దేశీయ కంపెనీలపై ప్రభావం చూపొచ్చు.
- వాహన కంపెనీల షేర్లను సమీప కాలంలో పడ్డప్పుడల్లా కొనుగోలు చేయవచ్చు. జీఎస్‌టీ రేట్ల మార్పుల వల్ల ఈ కంపెనీలు ఎక్కువ ప్రయోజనం పొందనుండడం ఇందుకు నేపథ్యం. అమెరికా టారిఫ్ అమలు వల్ల మార్కెట్‌పై ప్రభావం పడితే ఈ షేర్లు ప్రతికూలంగా చలించొచ్చు.
- యంత్రపరికరాల షేర్లు చాలా తక్కువ శ్రేణిలో చలించొచ్చు. ఈ రంగంపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చు. చాలా వరకు ఈ రంగ కంపెనీల ఎగుమతులు అమెరికాకు వాటి మొత్తం విక్రయాల్లో 2% లోపే ఉండడం ఇందుకు కారణం.
- ఐటీ షేర్లు రాణించొచ్చు. అమెరికా ఫెడ్ రిజర్వ్ సెప్టెంబరు సమావేశంలో వడ్డీ రేట్ల కోత విషయంలో ఏవైనా సానుకూల సంకేతాలు కనిపిస్తే మరింత ముందుకెళ్లవచ్చు. సమీప కాలంలో నిఫ్టీ ఐటీకి 34,500 వద్ద మద్దతు; 36,700 వద్ద నిరోధం కనిపించొచ్చు.
- సిమెంటు కంపెనీల షేర్లు చాలా తక్కువ శ్రేణికి పరిమితమై కదలాడవచ్చు. ప్రభుత్వ మూలధన వ్యయాలు, మౌలిక వసతుల కార్యకలాపాలు పుంజుకోవచ్చన్న భావనల మధ్య మధ్యకాలానికి మాత్రం విశ్లేషకులు ఈ రంగంపై సానుకూలంగా ఉన్నారు.
- ఎఫ్‌ఎంసీజీ షేర్లు ఈ వారం కూడా ఒక శ్రేణిలోనే చలించొచ్చు. రక్షణాత్మక రంగం కావడంతో రాబోయే కొద్ది వారాలపాటు మదుపర్లు ఈ షేర్లపై దృష్టి సారించే అవకాశం ఉంది. ప్రతిపాదిత జీఎస్‌టీ రేట్ల శ్లాబులు ఈ రంగ మార్జిన్లను, గిరాకీని మెరుగుపరచవచ్చు.
- టెలికాం షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. ఎటువంటి ప్రధాన వార్తలూ లేనందున మార్కెట్‌ను బట్టే ఈ రంగమూ కదలాడవచ్చు. భారతీ ఎయిర్‌టెల్ షేరు రూ.1900-1980 మధ్య చలించొచ్చు.
- ఉక్కు కంపెనీల షేర్లు స్థిరీకరణకు లోనుకావొచ్చు. అల్యూమినియం ధరలు పెరిగినందున నాన్-ఫెర్రో కంపెనీ స్క్రిప్‌లలో దిద్దుబాటు ఉండొచ్చు. టారిఫ్ అమలుకు ముందు ఈ రంగంలో పెద్దగా ఊగిసలాటలు కనిపించకపోవచ్చు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	131.20	133.40	128.50
బజాజ్ ఆటో	8679.50	8792.50	8524.50
ఐషర్ మోటార్స్	5924.50	5996.50	5877.50
హీరో మోటోకార్ప్	4997.90	5175.70	4893.10
ఎం అండ్ ఎం	3403.00	3444.10	3354.90
మారుతీ	14349.00	14456.30	14176.30
టాటా మోటార్స్	680.30	696.40	670.60
టీవీఎస్ మోటార్	3294.60	3322.50	3259.50

ఎఫ్‌ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5545.50	5721.50	5437.50
కోల్గేట్ పామోలివ్	2299.30	2383.50	2251.90
డాబర్ ఇండియా	515.95	522.10	511.50
ఇమామీ	611.95	632.00	598.40
హిందుస్థాన్ యునిలీవర్	2629.90	2675.30	2596.30
ఐటీసీ	398.30	409.80	391.80
మారికో	730.70	749.90	715.00

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	218.59	221.20	215.70
సీజీ పవర్	679.85	694.50	666.10
ఎల్ అండ్ టీ	3595.80	3656.60	3551.60
సీమెన్స్	3173.20	3264.80	3112.20
థెర్మాక్స్	3259.00	3305.90	3197.30

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1964.60	2011.50	1933.70
ఐసీఐసీఐ బ్యాంక్	1436.40	1453.90	1420.70
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	69.68	70.80	68.90
ఇండస్‌ఇండ్ బ్యాంక్	760.10	777.80	749.90
కోటక్‌మహీంద్రా బ్యాంక్	1986.60	2033.50	1956.70
పీఎన్‌బీ	105.29	108.60	103.50
ఎస్‌బీఐ	816.25	829.60	809.00

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1050.40	1067.90	1027.70
బయోకాన్	359.50	364.30	354.00
సిప్లా	1592.80	1610.30	1576.30
డాక్టర్ రెడ్డీస్	1277.60	1294.30	1257.30
గ్లెన్‌మార్క్ ఫార్మా	1937.30	1971.80	1912.80
లుపిన్	1974.70	1988.30	1955.70

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	704.20	713.20	697.10
హిందుస్థాన్ జింక్	424.90	433.80	420.00
ఎన్ఎండీసీ	70.16	72.00	69.10
సెయిల్	121.93	124.00	120.40
టాటా స్టీల్	158.55	162.50	156.10
వేదాంతా	444.25	455.00	438.40

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1409.20	1429.00	1398.00
బీపీసీఎల్	316.45	322.80	311.50
హెచ్‌పీసీఎల్	390.75	396.40	384.90
ఐఓసీఎల్	139.95	142.80	138.10
ఓఎన్‌జీసీ	236.29	239.70	234.20
ఆయిల్ ఇండియా	409.40	416.60	403.80

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1466.30	1501.40	1446.40
ఇన్ఫోసిస్	1487.50	1510.80	1474.40
పర్సిస్టెంట్ సిస్టమ్స్	5369.00	5462.70	5283.70
టీసీఎస్	3054.00	3112.30	3020.90
టెక్ మహీంద్రా	1505.00	1541.80	1480.60
విప్రో	248.64	255.10	244.40

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1821.10	1875.80	1790.80
అంబుజా సిమెంట్స్	577.15	595.10	567.10
ఇండియా సిమెంట్స్	376.50	402.80	360.40
శ్రీ సిమెంట్	30005.00	31128.30	29348.30
అల్ట్రాటెక్ సిమెంట్	12589.00	12973.00	12371.00

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,933.30	1963.10	1902.50
ఎంటీఎన్ఎల్	46.09	49.70	43.00
టాటా కమ్యూనికేషన్స్	1604.50	1625.60	1572.20
వొడాఫోన్ ఐడియా	7.07	7.70	6.30

కొలువులకు పోటీ పడొచ్చా?




బీఏ (పొలిటికల్ సైన్స్) 2005లో చేశాను. టైప్ లోయర్ పాసై డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా చేస్తున్నా. వయసు 42 ఏళ్లు. ఇప్పుడు రైల్వే లాంటి ఉద్యోగాలకు పోటీపడవచ్చా? – సురేష్

■ మీ ప్రస్తుత వయసును బట్టి రైల్వే రిక్రూట్‌మెంట్‌కు కానీ, మరే ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు కానీ దరఖాస్తు చేయడానికి అర్హత లేదు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే గ్రూప్ ఉద్యోగాలకు తెలంగాణలో 44 సంవత్సరాలు, ఆంధ్రప్రదేశ్‌లో 42 సంవత్సరాల వయః పరిమితి ఉంది.



ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మరో ఐదేళ్ల పాటు వెసులుబాటు ఉంది. మీకు ప్రభుత్వ ఉద్యోగంపై ఆసక్తి ఉంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు మాత్రమే ప్రయత్నం చేయండి. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు ప్రకటించే కొన్ని వందల ఉద్యోగాల కోసం లక్షలమంది సన్నద్ధమవుతుంటారు. ఇటీవలే డిగ్రీ పూర్తిచేసినవారితోనూ, గత కొన్ని సంవత్సరాలుగా పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న చాలామందితోనూ పోటీ పడాల్సి ఉంటుంది. అంత పోటీ తట్టుకొని ప్రభుత్వ ఉద్యోగం పొందాలంటే చాలా పట్టుదల, కఠోర సాధన అవసరం. ఒకవేళ మీరు ప్రభుత్వ ఉద్యోగం పొందడంలో విఫలమయితే మల్టీమీడియా, యానిమేషన్‌లకు సంబంధించిన నైపుణ్యాలు నేర్చుకొని ప్రైవేటు రంగంలోనే మెరుగైన ఉద్యోగాల కోసం ప్రయత్నించండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్



ప్రభుత్వ రంగంలోని భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఉద్యోగ నియామకాలు చేయబోతోంది. జనరలిస్ట్ విభాగంలో 350 అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఏవో) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. సాధారణ డిగ్రీతోనే వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రాథమిక, ప్రధాన, మౌఖిక పరీక్షలతో నియామకాలు చేపడతారు. ఎంపికైనవారు మొదటి నెల నుంచే రూ.1,26,000 వేతనం అందుకోవచ్చు.

ఎల్ఐసీలో ఆఫీసర్ అవుతారా!

ఇప్పటికే బ్యాంకు, రైల్వే, ఎస్ఎస్‌సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు ఎల్ఐసీ ఏఏవో పోస్టులకు పోటీ పడొచ్చు. ప్రిలిమ్స్, మెయిన్స్ రెండు పరీక్షల్లోనూ రుణాత్మక మార్కులు లేవు. అలాగే ప్రిలిమ్స్, మెయిన్స్ ఆంగ్లంలో అర్హత సాధిస్తే సరిపోతుంది. ఈ విభాగం మార్కులను తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు. ఇవన్నీ అభ్యర్థులకు సానుకూల అంశాలు.

అత్యంత ఆకర్షణీయ వేతనం, తక్కువ పని ఒత్తిడి, పదోన్నతులు, ఇతర ప్రోత్సాహకాలూ.. ఇవన్నీ ఎల్ఐసీ ప్రత్యేకతలు!

ప్రాథమిక పరీక్ష

ఆన్‌లైన్‌లో వంద మార్కులకు నిర్వహిస్తారు. రీజనింగ్ ఎబిలిటీ 35, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35, ఇంగ్లిష్ 30 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. పరీక్ష వ్యవధి గంట. ప్రతి విభాగాన్నీ 20 నిమిషాల్లో పూర్తిచేయాలి. అర్హత కోసం రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ ఒక్కో విభాగం నుంచి 18 మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 16 చొప్పున రావాలి. ఆంగ్లంలో ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు 9, మిగిలినవారు 10 సాధించాలి. అర్హత మార్కులు పొందినవారి జాబితా నుంచి విభాగాలవారీ ఖాళీలకు 20 రెట్ల మందిని ప్రధాన పరీక్షకు ఎంపిక చేస్తారు.

ప్రధాన పరీక్ష

300 మార్కులకు ఆబ్జెక్టివ్, 25 మార్కులకు డిస్క్రిప్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లోనే పరీక్షలు నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ పరీక్షలో మొత్తం 120 ప్రశ్నలు ఉంటాయి. వీటికి 300 మార్కులు. పరీక్ష వ్యవధి 2 గంటలు. రీజనింగ్ 30 ప్రశ్నలకు 90 మార్కులు. 40 నిమిషాల్లో పూర్తిచేయాలి.

ఈ విభాగంలో అర్హతకు 45 మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 40 చాలు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ విభాగంలో 30 ప్రశ్నలకు 60 మార్కులు. 20 నిమిషాల్లో పూర్తిచేయాలి. కనీసం 30 మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 27 తప్పనిసరి. మరో విభాగం డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 30 ప్రశ్నలకు 90 మార్కులు. 40 నిమిషాల్లో పూర్తిచేయాలి. అర్హతకు 45 మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 40 చాలు. ఇన్స్యూరెన్స్ అండ్ ఫైనాన్షియల్ మార్కెట్ అవేర్‌నెస్ నుంచి 30 ప్రశ్నలకు 60 మార్కులు. 20 నిమిషాల్లో పూర్తిచేయాలి. అర్హత మార్కులు 30. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 27 తప్పనిసరి. ఆబ్జెక్టివ్ టెస్టు పూర్తయిన వెంటనే డిస్క్రిప్టివ్ పరీక్ష మొదలవుతుంది. ఇందులో 2 ప్రశ్నలకు 25 మార్కులు. 30 నిమిషాల్లో సమాధానం రాయాలి. ఈ విభాగంలో అర్హతకు కనీసం 10 మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 9 చాలు. మెయిన్స్‌లో అర్హత సాధించినవారి జాబితా నుంచి విభాగాల వారీ ఖాళీలకు మూడు రెట్ల మందిని ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు.

మౌఖిక పరీక్ష

60 మార్కులకు ఉంటుంది. ఇందులో 30 మార్కులు సాధిస్తేనే అర్హులుగా పరిగణిస్తారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 27 మార్కులు సరిపోతాయి. ఇలా అర్హత సాధించిన వారి జాబితాకు ప్రధాన పరీక్షలో పొందిన మార్కులను జతచేసి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం తుది నియామకాలు చేపడతారు. ప్రాథమిక పరీక్ష మార్కులను తుది నియామకాల్లో పరిగణనలోకి తీసుకోరు.

410 పోస్టులకు మరో ప్రకటన

- ఎల్ఐసీ ఏఏఓ స్పెషలిస్ట్ విభాగంలో 410 పోస్టులకు మరో ప్రకటన విడుదల చేసింది. వాటికీ ప్రాథమిక పరీక్ష ఏఏఓ జనరలిస్ట్ మాదిరిగానే ఉంటుంది.
- ప్రభుత్వ అనుబంధ సంస్థ.. ది న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఐఏసీఎల్) 550 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువరించింది.

ఇందులో 193 జనరలిస్ట్ ఉద్యోగాలకు ఏదైనా డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రిలిమినరీ పరీక్ష ఎల్ఐసీ మాదిరిగానే ఉంటుంది. రెండు పరీక్షలనూ ఒకే సన్నద్ధతతో ఎదుర్కోవచ్చు.

దరఖాస్తుకు చివరి తేదీ: 30.08.2025.

వెబ్‌సైట్: https://www.newindia.co.in/

సన్నద్ధత ఇలా..

▼ ప్రాథమిక పరీక్ష పూర్తిగా.. ఐబీపీఎస్, ఎస్‌బీఐ పీవో స్టేజ్-1 మాదిరిగానే ఉంటుంది. ఇప్పటికే బ్యాంకు పీవో పరీక్షలకు సన్నద్ధం అవుతున్నవారు ప్రిలిమ్స్ విషయంలో అదే సన్నద్ధతతో సిద్ధం కావచ్చు. విభాగాలవారీ సమయాన్ని, కనీస మార్కులను నిర్దేశించారు. వ్యవధిలోగా ఎక్కువ ప్రశ్నలు పూర్తిచేయడానికి, కనీస మార్కులు సాధించడానికి ప్రణాళిక రూపొందించుకోవాలి. అనంతరం అదనపు మార్కులకోసం ప్రయత్నించాలి.

▼ ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలోనూ ప్రాధాన్యంగా ఉన్నవి రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ అనాలిసిస్. మార్కుల పరంగా చూసినా.. ప్రాథమిక పరీక్షలో 70, ప్రధాన పరీక్షలో 180 అంటే రెండింటిలోనూ 400కుగానూ కేవలం ఈ విభాగాల నుంచే 250 మార్కులు వస్తున్నాయి. అందువల్ల అధిక ప్రాధాన్యంతో వీటిని చదువుకోవాలి.

▼ ఆంగ్లంతో ఇబ్బందిలేనివాళ్లు ఆ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం లేదు. తెలుగు మీడియం నేపథ్యం వారు కనీస మార్కుల సాధన దిశగా కృషి చేస్తే సరిపోతుంది.

▼ పరీక్షకు ముందు కనీసం 10 మాక్ పరీక్షలు రాయాలి. నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయగలుగుతున్నారా, ఎన్ని మార్కులు సాధిస్తున్నారు గమనించాలి. ఫలితాలు విశ్లేషించుకుని, తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. రీజనింగ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌ల్లో కనీస అర్హత మార్కులు సాధిస్తూ రెండూ కలిపి 60 మార్కులకు తగ్గకుండా వచ్చేసట్లు చూసుకుంటే ప్రధాన పరీక్షకు ఎంపిక వ్వొచ్చు.

▼ జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, ఇన్స్యూరెన్స్, ఫైనాన్షియల్ అవేర్‌నెస్ విభాగాలను ప్రాథమిక పరీక్షల అనంతరం కొంచెం ఎక్కువ సమయం వెచ్చించి చదువుకుంటే సరిపోతుంది.

▼ పరీక్షలో కొన్ని ప్రశ్నలకు జవాబు గుర్తించడం తెలిసినప్పటికీ అందుకు ఎక్కువ వ్యవధి అవసరం అవుతుంది. అలాంటివాటిని సమయం ఉంటే ప్రయత్నించాలి. అలాగే మరికొన్ని ప్రశ్నలు చదవడానికే ఎక్కువ వ్యవధి తీసుకుంటాయి. వీటిని చివరలో సమయం ఉంటేనే ప్రయత్నించాలి. పోటీ పరీక్షల్లో విజయానికి విజ్ఞానంతో పాటు ఏ ప్రశ్నలు ముందు సాధించాలి, వేటిని తర్వాత ప్రయత్నించాలో నిర్ణయించుకోగల నైపుణ్యానికీ ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. వేటిని వదులుకోవాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఇందుకు మాక్ పరీక్షలే మార్గదర్శి.

ముఖ్యమైన అంశాలు

అర్హత: ఏదైనా డిగ్రీ **వయసు:** 01.08.2025 నాటికి 21-30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు గరిష్ఠ వయసులో మినహాయింపులుంటాయి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 08.09.2025 **దరఖాస్తు రుసుం:** ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.85. మిగిలిన అందరికీ రూ.700. **ప్రిలిమ్స్ పరీక్ష తేదీ:** 03.10.2025 **మెయిన్స్ తేదీ:** 08.11.2025 **వెబ్‌సైట్:** https://licindia.in/en/web/guest/careers

జనరేటివ్.. ఏజెంటిక్ ఇవీ భేదాలు

ఏఐ, జనరేటివ్ ఏఐ, ఏజెంటిక్ ఏఐ అనే పదాలు తరచుగా వినిపిస్తున్నాయి. వాటి మధ్య తేడా ఏమిటో సరళంగా తెలుసుకుందాం.


ఏఐ సజెస్ట్ చేస్తుంది. జన్ ఏఐ కొత్త కంటెంట్ సృష్టిస్తుంది. ఏజెంటిక్ ఏఐ పూర్తి ఎగ్జిక్యూషన్ చేస్తుంది.

ఏఐ: జొమాటో యాప్ మీ గత ఆర్డర్లు చూసి.. 'హైదరాబాదీ బిర్యానీ మళ్లీ కావాలా?' అంటూ సజెస్ట్ చేస్తుంది. ఇది డేటా ఆధారంగా అంచనా వేయడం.

జనరేటివ్ ఏఐ: మీరు 'హెల్దీ బిర్యానీ కావాలి' అంటే కొత్త ఐడియాలు ఇస్తుంది.

ఏజెంటిక్ ఏఐ: 'రాత్రి 8కి బిర్యానీ రావాలి, కూపన్ వాడండి, తక్కువ స్పైసీగా ఉండాలి'. ఇది స్వయంగా రెస్టారెంట్ ఎంచి, ఆర్డర్ చేసి, ట్రాక్ చేసి, డెలివరీ చేస్తుంది.

ఎల్ఎల్ఎం (లార్జ్ లాంగ్వేజ్ మోడల్).. భాష అర్థం చేసుకునే మెదడు లాంటిది. చాట్ జీపీటీ, జెమినీ లాంటివి దీని ఆధారంగా పనిచేస్తాయి. మీరు చెప్పిన 'తక్కువ మసాలా బిర్యానీ' అంటే మైల్డ్ స్పైస్ అని అర్థం చేసుకుంటుంది. ఇక ఎంసీపీ (మోడల్ కాంటెక్స్ట్ ప్రోటోకాల్) వారధి లాంటిది. ఏఐని జొమాటో, జీమెయిల్, మ్యాప్స్, పేమెంట్స్ లాంటి బాహ్య యాప్స్‌కు అనుసంధానిస్తుంది.



ఏ రంగంలో ఎలా?

కృత్రిమ మేధ (ఏఐ) అనేది మల్టీ డిసిప్లినరీ. అన్ని రంగాల్లోకీ ప్రవేశిస్తోంది. ఇది ఏ రంగంలోనైనా ఉపయోగపడుతుంది.

ఎంబీఏ/ బిజినెస్: మార్కెట్ అనలిటిక్స్, కస్టమర్ సెగ్మెంటేషన్.

లైఫ్ సైన్సెస్: డ్రగ్ డిస్కవరీ, మెడికల్ ఇమేజింగ్.

కామర్స్: ఫ్రాడ్ డిటెక్షన్, రిస్క్ మోడలింగ్.

ఆర్ట్స్ అండ్ మీడియా: కంటెంట్ క్రియేషన్, డిజిటల్ స్టోరీ టెల్లింగ్.

అందుకే ఏఐపై అవగాహన తప్పనిసరి. ఏఐ నేర్చుకోవడానికి బేసిక్స్ ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్, లీనియర్ ఆల్జీబ్రాల పరిజ్ఞానం సరిపోతుంది. బేసిక్ పైతాన్/ ఎస్క్యూఎల్ తప్పనిసరి. లో-కోడ్ టూల్స్ కూడా వాడొచ్చు.

ఏఐని మాస్టర్ చేయడానికి రోడ్ మ్యాప్

ఫౌండేషన్స్: పైతాన్, ఎస్క్యూఎల్, ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్, లీనియర్ ఆల్జీబ్రా.

ఏఐ కోర్ స్కిల్స్: మెషిన్ లెర్నింగ్ (రిగ్రెషన్, క్లాసిఫికేషన్, క్లస్టరింగ్), డీప్ లెర్నింగ్.

జనరేటివ్ ఏఐ: ఎల్ఎల్ఎంలు (చాట్ జీపీటీ, జెమినీ), ప్రాంప్ట్ ఇంజినీరింగ్, హగ్గింగ్‌ఫేస్ లైబ్రరీస్.

ఏజెంటిక్ ఏఐ: లాంగ్‌చెయిన్, లామా ఇండెక్స్, ఎంసీపీ.

ప్రాజెక్టులు: రెజ్యూమె స్క్రీనర్, చాట్‌బాట్, ఏఐ ఫుడ్ రికమండేషన్ యాప్ లాంటి చిన్న ప్రాజెక్టులు.

కనీస ల్యాప్‌టాప్ అవసరాలు

ప్రాసెసర్: ఐ5 (11వ జన్ లేదా రైజెన్ 5) లేదా ఎక్కువ.

ర్యామ్: 16 జీబీ (8 జీబీ బేసిక్స్‌కి సరిపోతుంది)

స్టోరేజ్: 512 జీబీ ఎస్ఎస్‌డీ

జీపీయూ (ఆప్షనల్): ఎన్వీడియా జీటీఎక్స్ 1650/ ఆర్‌టీఎక్స్ 3050 (కుడ సపోర్ట్)

జీపీయూ లేకున్నా గూగుల్ కొలాబ్, కాగుల్, అజూర్ ఫ్రీ క్రెడిట్స్ వాడవచ్చు.


ఏఐ నేర్చుకోవడం ఖరీదేమీ కాదు. ఫ్రీ రిసోర్సెస్, క్లౌడ్ జీపీయూస్ వాడితే ఖర్చు తక్కువవుతుంది.

1. **ఫ్రీ రిసోర్సెస్:** యూట్యూబ్, కాగుల్, గూగుల్ కొలాబ్, హగ్గింగ్‌ఫేస్ డాక్స్.
2. **లో-కాస్ట్ పెయిడ్ ఆప్షన్స్:** కోర్సెరా, యుడెమి (రూ.500-రూ.2000).
3. **హై-కాస్ట్ మిత్:** ఎక్కువ రేటు జీపీయూలు అవసరం లేదు. ఫ్రీ క్లౌడ్ జీపీయూలు వాడొచ్చు.

ల్యాప్‌టాప్ లేకపోయినా కాలేజ్ ల్యాబ్స్, మొబైల్ యాప్స్, క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్ వాడుకోవచ్చు. మొబైల్ యాప్స్ (పైడ్రాయిడ్, మిమొ, జునో). క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్ (కొలాబ్, కాగుల్). స్టడీ గ్రూప్స్/ కోడింగ్ క్లబ్స్ సాయం కూడా తీసుకోవచ్చు.

ఏఐ జాబ్స్ ఎవరికి?

ఇంజినీరింగ్‌లో డెవలపర్స్, ఎంబీఏలో ప్రొడక్ట్ మేనేజర్స్, లైఫ్ సైన్సెస్‌లో బయోఇన్ఫర్మాటిక్స్, కామర్స్‌లో ఫిన్‌టెక్, ఆర్ట్స్‌లో ఏఐ కంటెంట్ క్రియేటర్స్ ఉద్యోగాలు లభిస్తున్నాయి.



– మధు వడ్లమాని ఏఐ మేనేజర్, అడ్వైజర్

నోటీస్ బోర్డు

అప్రెంటిస్

వెస్ట్ సెంట్రల్ రైల్వేలో 2865 ఖాళీలు

వెస్ట్ సెంట్రల్ రైల్వే జబల్‌పూర్ వివిధ డివిజన్లలో 2865 అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- జేబీపీ డివిజన్: 1136 ● బీపీఎల్ డివిజన్: 558 ● కోటా డివిజన్: 865 ● సీఆర్‌డబ్ల్యూఎస్ బీపీఎల్ డివిజన్: 136
- డబ్ల్యూఆర్ఎస్ కోటా డివిజన్: 151
- హెచ్‌క్యూ/జేబీపీ: 19

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఇంటర్, ఐటీఐ. **వయసు:** 2025 ఆగస్టు 20 నాటికి 15 - 24 ఏళ్లు. **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ:** 30.08.2025. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 29.09.2025 **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.141. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, మహిళలకు రూ.41. **ఎంపిక:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌తో. **వెబ్‌సైట్:** https://wcr.indianrailways.gov.in/

వాక్ఇన్

బెల్‌లో మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ, నవరత్న హోదా కలిగిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) హైదరాబాద్ ఒప్పంద ప్రాతిపదికన 4 మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

అర్హత: పోస్టును అనుసరించి సీఎంఏ ఇంటర్/సీఏ ఇంటర్. **వయసు:** 2025 ఆగస్టు 1వ తేదీ నాటికి 25 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. **స్టైపెండ్:** నెలకు రూ.25,000- రూ.30,000.

ఎంపిక: ఇంటర్వ్యూతో

ఇంటర్వ్యూ తేదీ: 29.08.2025

వేదిక: ఎం/ఎస్.భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఐఈ.నాచారం, హైదరాబాద్-500076.

వెబ్‌సైట్: https://bel-india.in/job-notifications/

ఉద్యోగాలు

యురేనియం కార్పొరేషన్‌లో...

ఝార్ఖండ్‌లోని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసీఐఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 95 ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మేనేజ్ మెంట్ ట్రెయినీ: 13 ● గ్రాడ్యుయేట్ ఆపరేషనల్ ట్రెయినీ: 20 ● డిప్లొమా ట్రెయినీ: 62

అర్హత: పోస్టును అనుసరించి బీటెక్, డిగ్రీ, డిప్లొమా.

వయసు: మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టులకు 28 ఏళ్లు, మిగతా పోస్టులకు 30 ఏళ్లు. **స్టైపెండ్:** నెలకు మేనేజ్‌మెంట్ ట్రెయినీకి రూ.40,000, డిప్లొమా, గ్రాడ్యుయేట్ ఆపరేషనల్ ట్రెయినీకి రూ.29,990.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ: 30.08.2025.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 29.09.2025

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.

ఎంపిక: రాత పరీక్ష/ పర్సనల్ ఇంటర్వ్యూలతో.

వెబ్‌సైట్: https://www.ucil.gov.in/job.html

తెలంగాణ వైద్యశాఖలో 1623 పోస్టులు

తెలంగాణలోని మెడికల్ హెల్త్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వైద్య శాఖలో 1623 స్పెషలిస్ట్ డాక్టర్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ/డిప్లొమా/డీఎన్‌బీతో పాటు పని అనుభవం.

వయసు: 2025 జులై 1వ తేదీ నాటికి 18 - 46 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌కు 5 ఏళ్లు, పీహెచ్‌లకు 10 ఏళ్లు సడలింపు ఉంటుంది.

వేతన శ్రేణి: నెలకు రూ.58,850 - రూ.1,37,050.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22.09.2025

ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌తో.

వెబ్‌సైట్: https://mhsrb.telangana.gov.in/MHSRB/home.htm

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో..

ఛత్తీస్‌గఢ్‌లోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీస్ ఒప్పంద ప్రాతిపదికన 8 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఫ్యాకల్టీ: 02 ● ఆఫీస్ అసిస్టెంట్: 03
- అటెండర్: 02 ● గార్డ్: 01

అర్హత: పోస్టును అనుసరించి బీఏ, బీకామ్, బీఈడీ, బీఎస్సీ, టెన్త్, బీఎస్‌డబ్ల్యూ, ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, 7వ తరగతి.

వయసు: 22 నుంచి 40 ఏళ్లు.

దరఖాస్తు: పోస్టు ద్వారా పంపాలి.

చిరునామా: ప్రాంతీయ అధికారి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజినల్ ఆఫీస్, అంబికాపుర్, ధన్‌జల్ కాంప్లెక్స్, ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజ్, సుర్గుజా జిల్లా, ఛత్తీస్‌గఢ్-479001.

దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: 04.09.2025.

ఎంపిక: ఇంటర్వ్యూతో.

వెబ్‌సైట్: https://centralbankofindia.co.in/en/recruitments

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

హెచ్‌ఆర్ జనరలిస్ట్

సంస్థ: నెక్స్ట్‌జాబ్ నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ రాయడం, లింక్డ్ఇన్ మార్కెటింగ్, టైమ్ మేనేజ్‌మెంట్

స్టైపెండ్: రూ.2,000

దరఖాస్తు గడువు: సెప్టెంబరు 19

☛ https://shorturl.at/hKW1O

ఆర్కిటెక్చర్

సంస్థ: జిగ్యాస్ బోర

నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, ఆటోక్యాడ్, గూగుల్‌స్కెచ్

స్టైపెండ్: రూ.5,500-10,500

☛ https://shorturl.at/miESn

ఐప్యాడ్ ఆర్టిస్ట్/ ఇలస్ట్రేటర్ ఫ్రమ్ నిఫ్ట్

సంస్థ: లాటెక్

నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఫొటోషాప్ లైట్‌రూమ్ సీసీ, ప్రీమియర్ ప్రో, కోరల్‌డ్రా

స్టైపెండ్: రూ.6,000-8,000

☛ https://shorturl.at/kMraR

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 10

టెలికాలింగ్

సంస్థ: లీడ్ మైన్స్ మీడియా

నైపుణ్యాలు: మార్కెటింగ్, సేల్స్, ఇంగ్లిష్, హిందీ, కన్నడ మాట్లాడటం, రాయడం, మలయాళం మాట్లాడటం లేదా రాయడం,

స్టైపెండ్: రూ.8,000

☛ https://shorturl.at/10pQd

ఇన్‌సైడ్ సేల్స్

సంస్థ: విగ్నం ల్యాబ్స్ ప్రై.లి.

నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, సేల్స్ స్టైపెండ్: రూ.10,000

☛ https://shorturl.at/miESn

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 13

చిరాకుతో మూడ్ మారిపోతోందా?

ప్రతికూల ఆలోచనలు.. అనుకున్నది జరగకపోవడం.. ఇతరుల వ్యాఖ్యలు.. ఈ కారణాలతో సాధారణంగా మూడ్ పాడైపోతుంటుంది. దాంతో కొందరు విద్యార్థులు తరచూ ఇబ్బందిపడుతుంటారు. దీన్నుంచి బయటపడటం సాధ్యమే.



అనుకున్న మార్కులు సాధించలేకపోతే సాధారణంగా కొందరి మూడ్ మారిపోతుంటుంది. అలాంటప్పుడు దాన్నే తలుచుకుని బాధపడకూడదు. పరీక్ష సరిగ్గా రాయలేకపోవడానికి గల కారణాలను విశ్లేషించుకోవాలి. పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకోవాలి.

- భావోద్వేగాల మీద నియంత్రణ కోల్పోయినప్పుడూ మూడ్ చెడిపోతుంది. ఉదాహరణకు స్నేహితులందరూ కలిసి సరదాగా మాట్లాడుకుంటున్నారు అనుకోండి. అందులో ఒకరు చేసిన వ్యాఖ్య మీకు కోపాన్ని తెప్పించొచ్చు. దాని గురించి ఎక్కువగా ఆలోచించడం వల్ల మరింత బాధపడే అవకాశం ఉంటుంది. ఇలాంటప్పుడు ఆ వ్యాఖ్యను మర్యాదగానే ఖండించవచ్చు. అలా చేయడం ఇష్టంలేకపోతే అక్కడి నుంచి వెళ్లిపోవచ్చు.
- మానసికంగా కలత చెందిన సందర్భాల్లో దీర్ఘశ్వాస తీసుకుని నెమ్మదిగా వదలాలి. ఇలా చేయడం ద్వారా మానసిక ప్రశాంతతను తిరిగి పొందవచ్చు.
- కొన్ని సందర్భాల్లో చిరాగ్గా, విసుగ్గా అనిపిస్తుంది. అలాగని అక్కడి నుంచి దూరంగానూ వెళ్లలేరు. ఇలాంటప్పుడు మనసులో పది అంకెలను చివరి నుంచి లెక్కపెట్టొచ్చు. దీంతో దృష్టి మరల్చడమేకాదు.. ప్రశాంతతనూ సాధించవచ్చు.
- ఏదో ఒక సంఘటన వల్ల ఆందోళన, కోపం, విసుగు కలగొచ్చు. ఇలాంటప్పుడు వాటిని మనసులోనే పెట్టుకుని ఇబ్బందిపడకుండా స్నేహితులతో పంచుకోవచ్చు. వాళ్లు అందుబాటులో లేకపోతే ఫోన్‌లోనూ విషయాలు చెప్పుకోవచ్చు. దీనివల్ల బాధ పలచనవుతుంది. మనసు తేలికపడుతుంది.
- కోల్పోయిన మానసిక ప్రశాంతతను పొందడానికి ఒక్కొక్కరికి ఒక్కో పద్ధతి ఉండొచ్చు. ఆరుబయట కాసేపు నడవడం, స్నేహితులతో మాట్లాడటం, నచ్చిన పాటలు వినడం, పుస్తకం చదవడం.. లాంటివి చేయొచ్చు.
- ఒక్కోసారి బాగా ఆకలిగా అనిపించినప్పుడూ మూడ్ పాడవుతుంది. ఎక్కువసేపు ఇదే స్థితిలో ఉండి ఇబ్బందిపడకుండా అందుబాటులో ఉన్న వాటిని ఆరగించాలి.
- ఒకేసారి ఎక్కువ పనులు చేయాలనుకున్నా విపరీతమైన ఒత్తిడికి గురవుతారు. దాంతోనూ మూడ్ పాడవుతుందని గ్రహించాలి.
- తగినంత నిద్రలేకపోయినా చిరాగ్గా అనిపిస్తుంది. సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చూస్తూ అర్ధరాత్రి వరకూ మేల్కొని ఉండటం వల్ల మర్నాడు అసౌకర్యంతో ఇబ్బందిపడతారు. ఇది రోజంతా మూడ్‌ను పాడుచేస్తుంది. కాబట్టి సరిపడినంత నిద్ర ఎంతో అవసరం.
- రోజూ వ్యాయామం, యోగా, ధ్యానం చేయడం, పోషకాహారం తీసుకోవడం.. వీటన్నిటి వల్లా ప్రతికూల పరిస్థితుల్లోనూ మూడ్ చక్కగా ఉంటుంది. రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండగలుగుతారు.

చదువు

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా:
చదువు, ఈనాడు కార్యాలయం,
అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం,
రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in

పైపులు - తొట్టెలు

ముఖ్యాంశాలు

- ఒక పైపు, ఒక తొట్టెను x గంటల్లో నింపగలిగితే ఆ పైపు సామర్థ్యం లేదా ఆ పైపు ఒక గంటలో నింపగలిగే తొట్టెలో భాగం $= \frac{1}{x}$
- ఒక తొట్టెను ఒక పైపు x గంటల్లో నింపగలిగి, మరో పైపు y గంటల్లో ఖాళీ చేస్తే $(x < y)$, రెండింటినీ ఒకేసారి తెరిచినప్పుడు 1 గంటలో తొట్టెలో నింపగల భాగం $= \left(\frac{1}{x} - \frac{1}{y}\right)$
- ఒక తొట్టెను ఒక పైపు x గంటల్లో నింపగలిగి, మరో పైపు y గంటల్లో ఖాళీ చేస్తే $(y < x)$, రెండింటినీ ఒకేసారి తెరిచినప్పుడు 1 గంటలో తొట్టెలో ఖాళీ అయిన భాగం $= \left(\frac{1}{y} - \frac{1}{x}\right)$



తొట్టెను నింపడానికి ఎంత సమయం పడుతుంది?

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

అరిథ్‌మెటిక్

1. P, Q అనే రెండు పైపులు ఒక తొట్టెను వరుసగా 12, 18 గంటల్లో నింపగలవు. రెండు పైపులను ఒకేసారి తెరచి 5 గంటల తర్వాత P ని మూసివేశారు. మిగతా భాగాన్ని Q మాత్రమే ఎంత సమయంలో నింపగలదు?

1) $5\frac{1}{4}$ గంటలు 2) $5\frac{1}{3}$ గంటలు

3) $5\frac{1}{2}$ గంటలు 4) $5\frac{2}{3}$ గంటలు

సాధన: 12, 18ల క.సా.గు = 36

తొట్టెను 36 భాగాలుగా తీసుకుందాం.

1 గంటలో P తొట్టెలోని 3 భాగాలను, Q తొట్టెలోని 2 భాగాలను నింపుతాయి.

1 గంటలో P + Q తొట్టెలో = 5 భాగాలను నింపుతాయి.

5 గంటల్లో P + Q తొట్టెలో నింపగలిగే భాగాలు $= 5 \times 5 = 25$

మిగిలిన భాగాలు $= 36 - 25 = 11$

మిగతా భాగాన్ని Q మాత్రమే నింపే సమయం $= \frac{11}{2} = 5\frac{1}{2}$

సమాధానం: 3

2. తొట్టెను ఒక పైపుతో నీటిని నింపడానికి $3\frac{2}{3}$ గంటల సమయం పడుతుంది. తొట్టెకు రంధ్రం ఉండటంతో అది నిండటానికి $4\frac{1}{5}$ గంటలు పట్టింది. ఎంత సమయంలో ఆ రంధ్రం తొట్టెలోని 40% నీటిని ఖాళీ చేస్తుంది?

1) $11\frac{11}{20}$ గంటలు 2) $11\frac{13}{20}$ గంటలు

3) $11\frac{17}{20}$ గంటలు 4) $11\frac{19}{20}$ గంటలు

సాధన: $x = 3\frac{2}{3} = \frac{11}{3}$, $y = 4\frac{1}{5} = \frac{21}{5}$

రంధ్రం తొట్టె మొత్తాన్ని ఖాళీ చేసే సమయం $= \left(\frac{xy}{y-x}\right)$ గంటలు

రంధ్రం ఆ తొట్టెలో 40% ఖాళీ చేయడానికి పట్టే సమయం

$$= \left(\frac{xy}{y-x}\right) \times \frac{40}{100}$$

$$= \left(\frac{\frac{11}{3} \times \frac{21}{5}}{\frac{21}{5} - \frac{11}{3}}\right) \times \frac{2}{5} = \frac{11 \times 21}{8} \times \frac{2}{5} = \frac{231}{20}$$

$= 11\frac{11}{20}$ గంటలు

సమాధానం: 1

3. P, Q పైపులు కలిసి ఒక తొట్టెను $6\frac{3}{7}$ గంటల్లో నింపగలవు. వాటిని విడివిడిగా తెరిస్తే P కంటే 8 గంటలు ముందుగా Q తొట్టెను నింపుతుంది. P మాత్రమే ఆ తొట్టెని ఎన్ని గంటల్లో నింపుతుంది?

1) 14 2) 10 3) 15 4) 18

సాధన: తొట్టెను నింపేందుకు Qకి x గంటలు పడుతుంది అనుకుంటే.. Pకి (x + 8) గంటలు పడుతుంది.

లెక్కప్రకారం, తొట్టె నింపేందుకు (P + Q) పట్టేకాలం $= 6\frac{3}{7}$ గం

$$\Rightarrow \frac{x \times (x+8)}{x + (x+8)} = \frac{45}{7} \Rightarrow \frac{x^2 + 8x}{2x + 8} = \frac{45}{7}$$

$\Rightarrow 7x^2 - 34x - 360 = 0$

$\Rightarrow 7x^2 - 70x + 36x + 360 = 0$

$\Rightarrow (7x + 36)(x - 10) = 0 \Rightarrow x = 10$

$x + 8 = 10 + 8 = 18$

సమాధానం: 4

4. A, B అనే పైపులు ఒక తొట్టెను వరుసగా 15, 25 నిమిషాల్లో నింపగలవు. మరో పైపు C పూర్తిగా నిండిన తొట్టెను 60 నిమిషాల్లో ఖాళీ చేయగలదు. మూడు పైపులను ఒకేసారి తెరచి 6 నిమిషాల తర్వాత C పైపును మూసివేస్తే, తొట్టెలో మిగిలిన భాగం నింపడానికి ఎంత సమయం పడుతుంది? (నిమిషాల్లో)

1) $5\frac{5}{16}$ 2) $4\frac{5}{16}$ 3) $4\frac{11}{16}$ 4) $4\frac{3}{16}$

సాధన: 15, 25, 60 ల క.సా.గు = 300 (తొట్టెను 300 భాగాలుగా విభజిస్తే)

పైపు A నిమిషంలో తొట్టెలో నింపే భాగాల సంఖ్య = 20

పైపు B నిమిషంలో తొట్టెలో నింపే భాగాల సంఖ్య = 12

పైపు C నిమిషంలో తొట్టెను ఖాళీ చేసే భాగాల సంఖ్య = 5

A, B, C లు ఒకేసారి తెరిస్తే 6 ని.లో తొట్టెలో నింపే భాగాల సంఖ్య

$= (20 \times 6) + (12 \times 6) - (5 \times 6) = 120 + 72 - 30 = 162$

తొట్టెలో మిగిలిన భాగం $= 300 - 162 = 138$ భాగాలు

తొట్టె నింపేందుకు A, Bలకు పట్టే సమయం $= \frac{138}{20 + 12}$

$= \frac{138}{32} = \frac{69}{16} = 4\frac{5}{16}$ నిమిషాలు

సమాధానం: 2

5. A, B అనే రెండు పైపులు ఒక తొట్టెను వరుసగా 27, 36 నిమిషాల్లో నింపగలవు. ఈ రెండు పైపులతోపాటు తొట్టెను ఖాళీ చేసే పైపు Cని ఒకేసారి తెరిస్తే ఆ తొట్టె 54 నిమిషాల్లో నిండుతుంది. అయితే పైపు C మాత్రమే పూర్తిగా నిండిన తొట్టెను ఎన్ని నిమిషాల్లో ఖాళీ చేస్తుంది?

1) $21\frac{3}{5}$ 2) $21\frac{1}{5}$ 3) $21\frac{4}{5}$ 4) $21\frac{2}{5}$

సాధన: పైపు C తొట్టెను x నిమిషాల్లో ఖాళీ చేస్తుందని అనుకుంటే తొట్టెను (27, 36, x ల కసాగు) 108x భాగాలుగా విభజించొచ్చు.

A, B, C పైపులు తొట్టెను నిమిషంలో నింపే భాగాల సంఖ్య

A సామర్థ్యం = 4x;

B సామర్థ్యం = 3x;

C సామర్థ్యం = – 108

A + B + C లు 54 ని.లలో 108x భాగాలను నింపుతుంది.

$54(4x + 3x - 108) = 108x$

$= 7x - 108 = 2x$

$5x = 108 = x = \frac{108}{5} = 21\frac{3}{5}$

సమాధానం: 1



రచయిత

డా. వంగల శ్రీనివాస్

అసిస్టెంట్ ప్రొఫెసర్

752 Word of the Day

Obtrusive

Telugu meaning: అసహ్యకరమైన, చండాలమైన

English meaning: The word obtrusive (అబ్ట్రూసివ్) is an adjective that describes something or someone that is noticeable in an unpleasant or annoying way.

Synonyms: Invasive, Pushy

Antonyms: Subtle, Modest

Usage: 1. Her obtrusive behaviour at the meeting made everyone uncomfortable.

2. The new billboard is too obtrusive and ruins the scenic view of the countryside.

కరెంట్ అఫైర్స్



ఆదాయపు పన్ను చట్టం-2025కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 2025, ఆగస్టు 22న ఆమోదం తెలిపారు. ఇది ఆదాయపు పన్ను చట్టం-1961ని భర్తీ చేయనుంది. ఈ చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఇది పన్ను చట్టాలను మరింత సులభతరం చేయనుంది.



భారత క్రికెట్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అజిత్ అగార్కర్ పదవీ కాలాన్ని బీసీసీఐ మరో ఏడాది పొడిగించింది. 2026, జూన్ వరకు ఛైర్మన్‌గా అతడే కొనసాగనున్నాడు. భారత క్రికెట్లో సంధి దశను విజయవంతంగా అధిగమించడంతో పాటు భారత జట్టుకు కీలక విజయాలు సాధించేలా జట్లను ఎంపిక చేసినందుకు బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది.




యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో సారా ఎరానీ-ఆండ్రియా వావసోరి (ఇటలీ) జంట విజేతగా నిలిచింది. 2025, ఆగస్టు 21న న్యూయార్క్‌లో జరిగిన ఫైనల్లో ఎరాని ద్వయం 6-3, 5-7, 10-6తో ఇగా స్వైటెక్ (పోలండ్)-కాస్పర్ రూడ్ (నార్వే) జోడీని ఓడించింది.

విదేశీ డిజిటల్ సర్వీసులపై ఆధారపడకుండా సొంత డిజిటల్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనతో వాట్సప్‌కు ప్రత్యామ్నాయంగా రష్యా సొంత యాప్‌ను రూపొందించింది. ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్, టాబ్లెట్‌లలో ప్రీ-ఇన్‌స్టాల్ యాప్‌గా 'మ్యాక్స్'ను ఉంచాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

మైకెల్ ఫారడే

శాస్త్రవేత్తలు విశేషాలు



మైకెల్ ఫారడే.. బ్రిటన్ దేశానికి చెందిన భౌతిక, రసాయన శాస్త్రవేత్త. ఈయన 1791, సెప్టెంబరు 22న లండన్ సమీపంలోని న్యూవింగ్టన్ బట్స్ అనే గ్రామంలో జన్మించారు. పేదరికం కారణంగా ప్రాథమిక విద్యాభ్యాసంతోనే చదువు ముగించాల్సి వచ్చింది. అయినప్పటికీ ఆయనకు చదువుకోవాలనే కోరిక మాత్రం బలంగా ఉండేది. ఇందుకోసమే ఫారడే తన 14 ఏళ్ల వయసులో బుక్ బైండింగ్, పుస్తకాలు అమ్మే షాపులో పనిలో చేరారు. ఖాళీసమయాల్లో అక్కడ అనేక రకాల పుస్తకాలు ముఖ్యంగా సైన్స్‌కు సంబంధించినవి చదివారు. 'ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా' సంపుటాలతోపాటు జేన్ మార్సెట్ రాసిన 'కన్వర్జేషన్స్ ఆన్ కెమిస్ట్రీ', ఐజాక్ వాట్స్ రచించిన 'ది ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ ది మైండ్' లాంటి పుస్తకాలు ఆ జాబితాలో ఉన్నాయి. కేవలం చదివి వదిలేయకుండా అందులోని విషయాలను, సూత్రాలను నిజ జీవితంలో వర్తింపజేసేవారు. ఆ జ్ఞానమే ఆయనలో ఆలోచనా శక్తిని రేకెత్తించింది. కొత్త ఆవిష్కరణలు చేసేలా ప్రేరేపించింది. అంతటి గొప్ప శాస్త్రవేత్త 1867, ఆగస్టు 25న మరణించారు.

ఫారడే జీవితంలోని ముఖ్య సంఘటనల గురించి తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

వైరస్‌లు

వైరస్ అనే పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. దీని అర్థం 'విషం' లేదా 'వీనమ్'. వీటిని జీవ రసాయనికంగా వ్యాధిని కలిగించే న్యూక్లియోప్రోటీన్లుగా పేర్కొంటారు. వైరస్‌ల గురించి అధ్యయనం చేసే జీవ శాస్త్ర శాఖను 'వైరాలజీ' అంటారు. ఇవి సాధారణంగా జీవకణాల్లో ఉండే అవికల్ప పరాన్నజీవులుగా మాత్రమే జీవిస్తాయి. ఇవి స్వేచ్ఛగా జీవి లక్షణాలను ప్రదర్శిస్తూ జీవించలేవు. ఇవి అతిథేయి లేదా హోస్ట్ సమక్షంలో మాత్రమే ప్రత్యుత్పత్తి జరుపుకుంటాయి.



వైరస్‌లలో కణవ్యవస్థ లోపించి ఉంటుంది. అందుకే వీటిని అకణజీవులుగా పేర్కొంటారు.

- పరిపూర్ణంగా ఉండే వైరస్‌ను 'విరియాన్'గా పిలుస్తారు.

లక్షణాలు

వైరస్‌లలో జన్యుపదార్థంగా RNA లేదా DNA ఏదో ఒకటి మాత్రమే వ్యవస్థితమవుతుంది. సందర్భానుసారం వైరస్‌లు నిర్జీవ, సజీవ లక్షణాలు ప్రదర్శిస్తాయి. నిర్జీవులకు, సజీవులకు మధ్య సంధానసేతువులుగా వైరస్‌లను పేర్కొంటారు.

హానికర వైరస్‌లు

కొన్ని వైరస్‌లు కొంత పరిమాణంలో ఎంజైమ్‌లను కలిగి ఉంటాయి.

ఉదా: i) బ్యాక్టీరియో ఫేజ్‌లో లైసోజైమ్‌లు ఉంటాయి.

ii) రిట్రోవైరస్‌లలో రివర్స్ ట్రాన్స్‌క్రిప్టేజ్‌లు ఉంటాయి.

వైరస్‌ల వ్యాప్తి

కలుషితమైన గాలి, నీరు ఆహారం ద్వారా; ఈగలు, దోమలు లాంటి వాహకాల ద్వారా మనుషుల్లో వైరస్ వ్యాపిస్తుంది.

ఆకారాలు, జన్యుపదార్థాలు - రకాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Apprentice Posts

Eastern Railway Kolkata (Eastern Railway) is inviting applications to recruit Apprentice posts in various departments. The total no. of posts is 3,115. The application fee is Rs.100. The last date for receipt of online applications is 13 September 2025.

Local Bank Officer Posts

Punjab & Sind Bank has released a notification for the recruitment of Local Bank Officer posts in various states of the country. The total no. of posts is 750. The application fee is Rs.850. Eligible candidates can apply online before 4 September 2025.

Executive Trainee Posts

NTPC Limited is inviting applications for the filling of Executive Trainee posts. The total no. of posts is 15. The application fee is Rs.500. The last date for online applications is 9 September 2025.

Did You Apply..?

Today (August 25) is the last date for the following Jobs

- 250 Wealth Manager Posts in Union Bank. **Eligibility:** MBA/PGDM, PGDBM, PGDBA, PGDM.
- 33 Medical Consultant Jobs in SCCL. **Eligibility:** ABBS, BDS/MDS.
- 16 Professor posts at VNIT. **Eligibility:** PhD.

For more information and other notifications - scan QR code

SSC Exams English

Misspelled Words

Directions (Qs. 1 - 15): *Select the INCORRECTLY spelt word.*

1. A) Definately B) Reconciliation C) Maintenance D) Proficient

2. A) Benevolent B) Connoisseur C) Detrimental D) Intreprid

3. A) Curriculum B) Priviledge C) Criterion D) Ascertain

4. A) Immaculate B) Perseverance C) Equillibrium D) Hierarchy

5. A) Calander B) Camouflage C) Criticism D) Sophisticated

6. A) Magnificent B) Irresistible C) Acheivement D) Desperate

7. A) Recommend B) Accomodation C) Bureaucracy D) Psychology

8. A) Entrepreneur B) Mischievous C) Supersede D) Enviroment

9. A) Vacuum B) Exhilirate C) Millennium D) Anonymous

10. A) Knowledgeable B) Consensus C) Collaegue D) Conscience

11. A) Facsimile B) Pseudonym C) Repercussion D) Exageration

12. A) Occurence B) Ambiguous C) Mischievous D) Fascinating

13. A) Mischievous B) Supersede C) Bureaucracy D) Pronounciation

14. A) Commission B) Dilemma C) Irresistable D) Perilous

15. A) Perceive B) Guarrantee C) Separate D) Conceive

Directions (Qs. 16 - 29): *Identify the INCORRECTLY spelt word in the following sentences.*

16. The archaeologist discovered ancient manuscripts that revealed the philosphy of a forgotten civilization.
A) Archaeologist B) Manuscripts C) Philosphy D) Civilization

17. The committee emphasized the neccessity of maintaining discipline in all administrative procedures.
A) Emphasized B) Neccessity C) Discipline D) Administrative

18. Her benevolence and sincerety earned her great respect in the academic community.
A) Sincerety B) Benevolence C) Academic D) Community

19. The renowned scientist published a book on climatology, addressing global enviroment issues.
A) Renowned B) Climatology C) Published D) Enviroment

20. The manager showed remarkable perseverence in handling the crisis with limited resources.
A) Remarkable B) Perseverence C) Handling D) Resources

21. The artist's portrait captured the magnificence of the landscape with striking accurasy.
A) Accurasy B) Magnificence C) Landscape D) Portrait

22. During the seminar, the economist explained the intricacies of the financial beurocracy.
A) Economist B) Intricacies C) Financial D) Beurocracy

23. The young entrepreneur displayed remarkable initiative and innovasion in his startup.
A) Entrepreneur B) Initiative C) Innovasion D) Startup

24. The professor insisted on regular attendance and punctuality for academic profficiency.
A) Profficiency B) Punctuality C) Academic D) Attendance

25. The speaker's eloquence and articulacy left a lasting impression on the audiance.
A) Eloquence B) Articulacy C) Impression D) Audiance

26. The documentary highlighted the detrimental effects of deforrestation on biodiversity.
A) Documentary B) Deforrestation C) Detrimental D) Biodiversity

27. The activist advocated for the abolision of outdated laws that restricted freedom.
A) Activist B) Advocated C) Abolision D) Restricted

28. The conference provided a platform for interdisiplinary discussions among scholars.
A) Interdisiplinary B) Platform C) Conference D) Scholars

29. Despite his intelligence, the student made an unneccessary mistake in the examination.
A) Intelligence B) Unneccessary C) Student D) Examination

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

మాదిరి ప్రశ్నలు

కరెంట్ అఫైర్స్



◆ 2025, సిన్సినాటి ఓపెన్ టెన్నిస్ టోర్నీ పురుషుల విజేత ఎవరు?

జ: కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్)

◆ 97 తేజస్ మార్క్ 1ఏ యుద్ధ విమానాల కొనుగోలుకు కేంద్రం ఆమోదం తెలిపింది. అయితే ఈ యుద్ధ విమానాలను తయారుచేసేది ఎవరు?

జ: హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్

◆ క్రీడా బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎప్పుడు ఆమోద ముద్ర వేశారు?

జ: 2025, ఆగస్టు 19

◆ ఇటీవల లండన్‌లో జరిగిన వేలంపాటలో ఏ మరాఠా యోధుడి ఖడ్గాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం చేజిక్కించుకుంది?

జ: మొదటి రఘుజీ భోంస్లే

◆ ఉపరాష్ట్రపతి పోటీలో ఎన్డీయే అభ్యర్థిగా నియమితులైన సీపీ రాధాకృష్ణన్ ఏ రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేశారు?

జ: ఝార్ఖండ్, మహారాష్ట్ర, తెలంగాణ, పుదుచ్చేరి (అదనపు బాధ్యతలు)

మరింత సమాచారం

◆ ఏ రాష్ట్రంలో 2026 నాటికి బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించడానికి రెండో విడత నిజుత్ మొయినా ప్రారంభించారు?

జ: అస్సాం

దరఖాస్తు చేశారా?



☛ ఎస్‌బీఐలో జూనియర్ అసోసియేట్స్ పోస్టులు (6,589)
చివరి తేదీ: 2025, ఆగస్టు 26

☛ బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్ ఉద్యోగాలు (417)
చివరి తేదీ: 2025, ఆగస్టు 26

స్థిరత్వం గెలుపు సూత్రం!

స్టడీ స్కిల్స్



ఏదైనా మొదలుపెడితే వెంటనే సాధించాలనుకుంటారు. యువతలో ఉన్న సహజ లక్షణమిది. కానీ ఒక్కోసారి ఎంత వేగంతో పరుగెడుతున్నారు అనేదాని కంటే, ఒకే వేగంతో నిరంతరాయంగా శ్రమిస్తున్నారా లేదా అనేది గెలుపును నిర్ణయిస్తుంది. ముఖ్యంగా విద్యార్థులకు, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండే అభ్యర్థులకు కచ్చితంగా ఉండాల్సిన లక్షణం **స్థిరత్వం (కన్సిస్టెన్సీ).** అనుకున్న పనిలో రోజూ ఎంతోకొంత ప్రగతి సాధించడం ఇందులో ప్రధానం. ఈ లక్షణం లక్ష్యానికి చేరువ చేయడంతోపాటు మంచి అలవాట్లను నేర్పుతుంది. నమ్మకం, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఈ స్థిరత్వాన్ని ఎలా అలవరచుకోవాలో, ఎలాంటి మెలకువలను పాటించాలో వివరంగా తెలుసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

తయారీ రంగానికి వృద్ధి చోదకాలు!

జనరల్ స్టడీస్ – ఏపీ ఎకానమీ

పారిశ్రామిక ప్రగతిని ప్రేరేపించే లక్ష్యంతో నిర్దిష్ట ప్రాంతంలో అవసరమైన సౌకర్యాలన్నింటినీ ఒక ప్యాకేజీగా కల్పించే ప్రాజెక్టులే పారిశ్రామిక నడవాలు. మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తాయి. తయారీ రంగం బలోపేతానికి, ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు, భారీగా పెట్టుబడులను ఆకర్షించి ఉపాధి అవకాశాలను పెంచేందుకు మేకిన్ ఇండియా లక్ష్యసాధనకు దోహదపడతాయి. స్థూలంగా భారత ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసే ఈ ప్రాజెక్టులు, అందులో ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్యం గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. రాష్ట్రంలో పారిశ్రామిక నడవాల స్వరూపం, విస్తరించిన ప్రాంతాలు, రూపురేఖలు మారనున్న ప్రాంతాలు, కలిగే లాభాలతోపాటు దేశ ప్రయోజనాల పరిరక్షణలో వీటికి ఉన్న ప్రాధాన్యాన్ని తెలుసుకోవాలి.



ఆంధ్రప్రదేశ్‌లోని పారిశ్రామిక నడవాలు

భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనలో శిఖరాగ్ర కార్యక్రమాలుగా పారిశ్రామిక నడవాల (ఇండస్ట్రియల్ కారిడార్ల)ను అభివృద్ధి చేస్తోంది. వీటికి అనుబంధంగా స్మార్ట్ సిటీల అభివృద్ధి, ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, ఓడరేవులతో అనుసంధానం, రైల్వే లైన్ల వ్యవస్థ ఆధునికీకరణ, శీతలీకరణ గిడ్డంగుల ఏర్పాటు తదితర సదుపాయాలను కల్పిస్తోంది.

దేశంలో మొదటిసారిగా 2006-07లో దిల్లీ-ముంబయి ఇండస్ట్రియల్ కారిడార్‌ను నిర్మించి, దానిని పశ్చిమ సరకు రవాణా కారిడార్‌గా అభివృద్ధి చేశారు. ఏపీలో సముద్రతీరాన్ని ఆధారంగా చేసుకుని 'విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్' అభివృద్ధి చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 11 కారిడార్లను నిర్మిస్తుండగా, ఇందులో ఏపీలో మూడు కారిడార్లు అభివృద్ధి చేస్తున్నారు.

విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ (వీసీఐసీ)

ఇది దేశంలోనే మొదటి కోస్టల్ కారిడార్. తూర్పు ఆర్థిక కారిడార్‌లో కీలకమైంది. ప్రధాన నగరాలను కలిపే 'స్వర్ణ చతుర్భుజి' రహదారి ప్రాజెక్టులో వీసీఐసీ కలుస్తుంది. 'భారతదేశ యాక్ట్ ఈస్ట్ పాలసీ', 'మేక్ ఇన్ ఇండియా' ప్రాజెక్టును ముందుకు నడిపించడంలో వీసీఐసీ ముఖ్య పాత్ర పోషిస్తోంది. 800 కి.మీ. పొడవైన ఈ కారిడార్ ద్వారా దేశాన్ని 'అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్ట్ నేషన్స్ (ఆసియాన్)', తూర్పు ఆసియా ఆర్థిక వ్యవస్థలతో కలుపుతుంది. వీసీఐసీ పరిధి శ్రీకాకుళం జిల్లాలోని పైడిభీమవరం నుంచి చెన్నై వరకు సుమారు 1,10,000 చ. కి. మీ. పరిధిలో విస్తరించింది. ఇది దేశ విస్తీర్ణంలో 3.5%.

భారత ప్రభుత్వం వీసీఐసీ అభివృద్ధికి ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ)ను ముఖ్య భాగస్వామిగా ఎంపిక చేసింది. 2016, సెప్టెంబరు 20న వీసీఐసీ ప్రణాళికను ఏడీబీ కూడా ఆమోదించింది. ఈ కారిడార్‌లోకి రూ.లక్ష కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలన్నది లక్ష్యం. భవిష్యత్తులో జీడీపీలో 5% వాటా వీసీఐసీ కలిగి ఉంటుందని, సుమారు 110 లక్షల మందికి ఉపాధి కల్పిస్తుందని నిపుణులు అంచనా వేశారు.

విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్

నోడ్	క్లస్టర్	ఆర్థిక సాయం చేసే సంస్థ
విశాఖపట్నం	నక్కపల్లి	ఏడీబీ, ఎన్ఐసీడీసీ
	రాంబిల్లి	ఏడీబీ
చిత్తూరు	శ్రీకాళహస్తి-యేర్పేడు	ఏడీబీ, ఎన్ఐసీడీసీ
కొప్పర్తి	కొప్పర్తి (కడప)	ఎన్ఐసీడీసీ

ఈ కారిడార్‌లో లోహ, అలోహ పరిశ్రమలు; రసాయనాలు, పెట్రోకెమికల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆగ్రో ప్రాసెసింగ్, ఆటోమొబైల్స్, రెన్యూవబుల్ ఎనర్జీ, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలను కీలక పారిశ్రామిక రంగాలుగా గుర్తించారు. వీసీఐసీని మూడు విభాగాలు (నోడ్)గా ప్రతిపాదించి అభివృద్ధి చేస్తున్నారు.

విశాఖపట్నం నోడ్: ఈ ప్రాంతంలో ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీఐఐసీ) ద్వారా 2 క్లస్టర్లు అభివృద్ధి చేస్తారు. ఎ) అచ్యుతాపురం-రాంబిల్లి క్లస్టర్, బి) నక్కపల్లి క్లస్టర్. ఈ నోడ్‌కు ఏడీబీ, జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ ఫండింగ్ ఏజెన్సీలు.

చిత్తూరు నోడ్: ఈ ప్రాంతంలో యేర్పేడు-శ్రీకాళహస్తి క్లస్టర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. దీనికి ఫండింగ్ ఏజెన్సీ ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు.



కొప్పర్తి నోడ్: కడప జిల్లాలో అభివృద్ధి చేస్తున్నారు. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ (ఎన్ఐసీడీసీ) ఫండింగ్ ఏజెన్సీ.

ప్రయోజనాలు: ✦ దీని ద్వారా 2035 నాటికి తయారీ పరిశ్రమల ఉత్పత్తుల విలువ రూ.4.2 ట్రిలియన్లకు పెరుగుతుంది. ✦ తయారీపరిశ్రమల్లో ఉద్యోగినుల వాటా 33%కు చేరుతుంది. సగటున ఒక శ్రామికుడి వార్షిక ఉత్పాదకత సామర్థ్యం రూ.2.6 మిలియన్లకు చేరతుంది.

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి సంస్థ (ఏపీఐసీడీఏ)

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి చట్టం-2017 ప్రకారం పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి కోసం ఈ సంస్థను నెలకొల్పారు. పారిశ్రామిక నడవాల్లో అభివృద్ధి చేయడానికి గుర్తించిన నోడ్స్ ప్రణాళికా రచన, అభివృద్ధి నిర్వహణ, నియంత్రణలను పర్యవేక్షిస్తుంది. ఏపీఐసీడీఏకు పాలక మండలిని ఏర్పాటుచేసి, ఒక కమిషనర్‌ని నియమించారు. ఈయన నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తూ ఏపీఐసీడీఏ పనులు, విధులను పర్యవేక్షిస్తారు. ఈ సంస్థ ప్రధానంగా విశాఖపట్నం-చెన్నై కారిడార్ (వీసీఐసీ), చెన్నై-బెంగళూరు కారిడార్ల అభివృద్ధిని పర్యవేక్షిస్తుంది. కారిడార్లలోని నోడ్స్‌కు అవసరమైన భూమిని సేకరించి, వాటి అభివృద్ధికి బృహత్ ప్రణాళికలను రూపొందించి, వాటికి కావాల్సిన పెట్టుబడి సౌకర్యాలను కల్పిస్తుంది.

హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (హెచ్‌బీఐసీ)

భౌగోళికంగా దక్షిణ భారతదేశ మధ్యభాగంలో ఈ కారిడార్ నిర్మిస్తున్నారు. దీని పరిధిలో ఏపీలో గుర్తించిన నోడ్ 'ఓర్వకల్లు నోడ్'.

ఓర్వకల్లు నోడ్: కర్నూలు జిల్లాలోని ఈ నోడ్‌ను నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) ఆర్థిక సాయంతో అభివృద్ధి చేస్తున్నారు. ◆ ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్‌లను అభివృద్ధి చేసే బాధ్యతను రాష్ట్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ కారిడార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు బదలాయించింది.

హైదరాబాద్ - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్

నోడ్	జిల్లా	ఆర్థిక సాయం చేసే సంస్థ
ఓర్వకల్లు	కర్నూలు	ఎన్ఐసీడీసీ

చెన్నై - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీఐసీ)

ఈ కారిడార్ ఆంధ్రప్రదేశ్ నుంచి వెళుతోంది. జీడీపీలో ఉత్పత్తిరంగం వాటా పెంచడం ఈ ప్రాజెక్టు ప్రధానోద్దేశం. ఇందులో భాగంగా సాధారణ ఉత్పత్తి రంగం, ఆటోమొబైల్స్, వాహన సహకార, వ్యవసాయ, ఆహార ప్రాసెసింగ్, లోహాలు, మిశ్రమ లోహ ఉత్పత్తులు, బయోటెక్, సేవారంగాలు లాంటి పరిశ్రమలను అభివృద్ధి చేస్తున్నారు. జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజెన్సీ (జైకా)..సీబీఐసీకి సహకారం అందిస్తోంది. దిల్లీ-ముంబయి ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (డీఎంఐసీడీసీ).. సీబీఐసీ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తుంది. దీనిలో భాగంగా ఏపీలో కృష్ణపట్నం నోడ్‌ను గుర్తించారు.

కృష్ణపట్నం నోడ్: నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని ఈ నోడ్ అభివృద్ధికి 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ)' ఆర్థిక సహకారం అందిస్తోంది. కృష్ణపట్నం ప్రాంతాన్ని పారిశ్రామిక టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేస్తున్నారు.

NICDC
NATIONAL INDUSTRIAL CORRIDOR DEVELOPMENT CORPORATION
India Reimagined

చెన్నై - బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్

నోడ్	జిల్లా	ఆర్థిక సాయం చేసే సంస్థ
కృష్ణపట్నం	నెల్లూరు, చిత్తూరు	ఎన్ఐసీడీసీ

ఇండస్ట్రియల్ పార్కులు: జాతీయ పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 2024లో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఆరు పారిశ్రామిక కారిడార్లకు అనుసంధానంగా 10 రాష్ట్రాల్లో 12 పారిశ్రామిక పార్కులను ప్రకటించింది. ఇందుకోసం కేంద్రం రూ.28,600 కోట్లు పెట్టుబడి పెడుతుంది. ★ వీటి ద్వారా తయారీరంగ పరిశ్రమలను ప్రోత్సహించి, అంతర్జాతీయ స్థాయి నాణ్యత, పోటీతో అభివృద్ధి చేస్తారు. 10 లక్షల మందికి ప్రత్యక్షంగా, 30 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి సృష్టించవచ్చని అంచనా. తెలంగాణ నుంచి జహీరాబాద్, ఏపీ నుంచి ఓర్వకల్లు, కొప్పర్తి ఇందుకు ఎంపికయ్యాయి. ★ వీటికి అనుసంధానంగా అంతర్జాతీయ స్థాయి గ్రీన్‌ఫీల్డ్ పారిశ్రామిక స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేస్తారు. 'ప్లగ్ అండ్ ప్లే', 'వాక్ టు వర్క్' భావనతో వీటిని పర్యావరణహితంగా అభివృద్ధి చేస్తారు.



ఇండోస్పేస్ ఇండస్ట్రియల్ పార్కు: ప్రపంచ బ్యాంకు గుర్తింపు పొందిన సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం, మునిమడుగు గ్రామంలో 'ఇండోస్పేస్ ప్రాజెక్టు' నెలకొల్పారు. ఇందులోనే బెర్జర్ పెయింట్స్, పేజ్ ఇండస్ట్రీస్, భారత్ ఎలక్ట్రానిక్స్, కియా మోటార్స్ సంస్థలు పరిశ్రమలను నెలకొల్పాయి.


రచయిత: పి.వి.సుబ్బిరెడ్డి

వైపరీత్యాలను ఎదుర్కోవడానికి ముందే సిద్ధమైతే..!

విపత్తులు ఎక్కువగా సంభవిస్తున్న దేశం భారత్. సహజ, మానవకారక వైపరీత్యాలు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడటం, ఆస్తి నష్టాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావాలను విపత్తు నిర్వహణ ద్వారా నియంత్రించవచ్చు. ఇందులోని ప్రాథమిక అంశాల గురించి పోటీ పరీక్షార్థులు విధిగా తెలుసుకోవాలి. రోడ్డు ప్రమాదం నుంచి అణుబాంబు విస్ఫోటం వరకు వివిధ రకాల విపత్తులు, వాటి స్వభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహావిపత్తులు వచ్చిన సంవత్సరాలు, అవి మిగిల్చిన నష్టాలతో పాటు భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా విపత్తు కారక పరిస్థితులు, వాటిని ఎదుర్కోవడానికి ఉన్న సంస్థాగత వ్యవస్థలపై అవగాహన కలిగి ఉండాలి.


సిదర్ తుపానుతో అతలాకుతలమైన బంగ్లాదేశ్ (2007)

విపత్తు నిర్వహణ

(ప్రాథమిక అంశాలు)

1. 2007, నవంబరు 15న బంగ్లాదేశ్‌లో కొన్ని వేలమంది మృతికి కారణమైన తుపాను?
 1) సిదర్ 2) రీతా
 3) కత్రినా 4) నైనా
2. 2004, డిసెంబరు 26న హిందూ మహాసముద్రంలో సంభవించిన సునామీ కారణంగా సుమారు ఎంత మంది చనిపోయారు?
 1) 1,00,000 2) 2,00,000
 3) 3,00,000 4) 4,00,000
3. విపత్తు సంభవించిన వెంటనే దాని ప్రభావాలను తగ్గించడానికి చేపట్టే చర్యలను ఏమంటారు?
 1) ఉపశమన చర్యలు 2) సహాయక చర్యలు
 3) విపత్తు నిర్వహణ 4) ఏదీకాదు
4. విపత్తులు సంభవించినప్పుడు ఆధునిక శాస్త్ర, సాంకేతిక, సమాచార రంగాలను ఉపయోగించుకుని వాటి తీవ్రతను తగ్గించుకోవడాన్ని ఏమంటారు?
 1) స్ట్రాటజీ 2) ఉపశమన చర్యలు
 3) విపత్తు నిర్వహణ 4) వైపరీత్య నిర్వహణ
5. భారతదేశంలో మానవ ప్రేరేపిత కల్లోలాలు ఏ మంత్రిత్వ శాఖ కిందకు వస్తాయి?
 1) గ్రామీణాభివృద్ధి శాఖ 2) శాస్త్ర, సాంకేతిక శాఖ
 3) పర్యావరణ శాఖ 4) హోంశాఖ
6. ప్రాణ, ఆస్తి నష్టాలు; జీవనోపాధి, పర్యావరణ విధ్వంసానికి కారణమయ్యే ప్రకృతి లేదా మానవ ప్రేరేపిత ప్రమాదకర ఘటనను ఏమంటారు?
 1) విపత్తు 2) వైపరీత్యం
 3) ఆపద 4) అపాయం
7. ప్రమాదకర సంఘటన జరిగిన ప్రాంతం ఎంతవరకు దుష్ప్రభావం చెందింది అనేదాన్ని ఏమంటారు?
 1) విపత్తు 2) సంసిద్ధత
 3) వైపరీత్యం 4) దుర్బలత్వం
8. వైపరీత్యాల ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవడానికి వైపరీత్య ఘటనకు ముందే చేపట్టే కార్యకలాపాలు, చర్యలను ఏమంటారు?
 1) సంసిద్ధత 2) నివారణ
 3) వ్యూహం 4) కార్యచట్రం
9. భారత్‌లో విపత్తు నిర్వహణ చట్టం ఏ సంవత్సరంలో చేశారు?
 1) 2004 2) 2006
 3) 2008 4) 2007
10. గ్రీకు, లాటిన్ భాషల్లో డిజాస్టర్ అంటే?
 1) విపత్తు నక్షత్రం 2) వైపరీత్య నక్షత్రం
 3) దుష్ట నక్షత్రం 4) రాక్షస నక్షత్రం

డిజాస్టర్ మేనేజ్‌మెంట్

11. ప్రకృతిసిద్ధంగా లేదా మానవ కల్పితాల కారణంగా లేదా నిర్లక్ష్యం మూలంగా పెద్దఎత్తున ప్రాణ, ఆస్తి, పర్యావరణ నష్టాలకు, విధ్వంసానికి కారణమయ్యే ఉపద్రవాన్ని ఏమంటారు?
 1) విపత్తు 2) వైపరీత్యం
 3) ఆపద 4) అపాయం
12. 2004, డిసెంబరు 26న ఏ సముద్రంలో సునామీ సంభవించింది?
 1) పసిఫిక్ మహాసముద్రం
 2) దక్షిణ మహాసముద్రం
 3) అట్లాంటిక్ మహాసముద్రం
 4) హిందూ మహాసముద్రం
13. విపత్తులతోపాటు దేశ సామాజిక, ఆర్థిక జీవనం, జీడీపీ వృద్ధి ప్రభావం లాంటి అంశాల సమాచారాన్ని సేకరించే సంస్థ?
 1) జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ
 2) ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్సూరెన్స్ రిస్క్ మేనేజ్‌మెంట్
 3) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్
 4) సెంటర్ ఫర్ రిసెర్చ్ ఆన్ ది ఎపిడమిక్ ఆన్ డిజాస్టర్
14. భూకంపం, సునామీ, అగ్నిపర్వత విస్ఫోటాన్ని ఏ రకమైన వైపరీత్యాలు అంటారు?
 1) సహజ వైపరీత్యాలు
 2) మానవ ప్రేరేపిత వైపరీత్యాలు
 3) సామాజిక వైపరీత్యాలు
 4) ప్రమాద సంబంధ వైపరీత్యాలు
15. సామాజిక–సహజ వైపరీత్యాలని వేటిని అంటారు?
 1) వరదలు 2) భూపాతాలు
 3) కరవు 4) పైవన్నీ
16. వైపరీత్యాలను ఎన్ని రకాలుగా వర్గీకరించవచ్చు?
 1) 2 2) 3 3) 4 4) 5
17. పారిశ్రామిక ప్రమాదాలు, రైలు, రోడ్డు, విమాన ప్రమాదాలు; ఉగ్రవాదుల దాడులు మొదలైన ప్రమాదాలను ఏ రకమైన వైపరీత్యాలు అంటారు?
 1) సహజ వైపరీత్యాలు
 2) మానవ ప్రేరేపిత వైపరీత్యాలు
 3) సామాజిక వైపరీత్యాలు
 4) ప్రమాద సంబంధ వైపరీత్యాలు
18. అంతర్జాతీయ వాతావరణ సంస్థ కేంద్రం ఎక్కడ ఉంది?
 1) జొహన్నెస్ బర్గ్
 2) లండన్
 3) హోనలులు
 4) జెనీవా



19. ప్రకృతి వల్ల ఏర్పడే ప్రమాదాలు ఏవి?
 1) భూకంపం 2) భూతాపం
 3) తుపాను 4) పైవన్నీ
20. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి విపత్తు డేటాను స్వీకరించే సంస్థ ఏది?
 1) సెంటర్ ఫర్ రిసెర్చ్ ఆన్ ది ఎపిడెమాలజీ అండ్ డిజాస్టర్
 2) వరల్డ్ మెటీరియలాజికల్ ఆర్గనైజేషన్
 3) 1, 2
 4) ఇంటర్నేషనల్ స్ట్రాటజీ ఫర్ డిజాస్టర్ రిడక్షన్
21. చైనాలో అత్యధిక ప్రాణనష్టం కలిగించిన షాంగ్జి ప్రావిన్స్ భూకంపం ఎప్పుడు వచ్చింది?
 1) 1556, జనవరి 22 2) 1556, జనవరి 23
 3) 1556, జనవరి 24 4) 1556, జనవరి 25
22. 'జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా' సంస్థ ఎక్కడ ఉంది?
 1) బెంగళూరు 2) హైదరాబాద్
 3) దిల్లీ 4) కోల్‌కతా
23. విపత్తు నిర్వహణలోని అంతర్భాగాలు ఏవి?
 1) పునర్నిర్మాణం 2) పునరావాసం
 3) అత్యవసర పరిస్థితి స్పందన
 4) పైవన్నీ
24. ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమ సహకారంతో ఏ రాష్ట్ర ప్రభుత్వం 'డిజాస్టర్ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం' ఎక్కడ ప్రారంభించింది?
 1) ఆంధ్రప్రదేశ్ 2) కర్ణాటక
 3) తమిళనాడు 4) మహారాష్ట్ర
25. ప్రపంచ బ్యాంకు అధ్యయనం ప్రకారం భారత దేశంలో విపత్తుల కారణంగా సంభవించే ఆర్థిక నష్టం జీడీపీలో ఎంత శాతం ఉంటుంది?
 1) 4% 2) 3% 3) 2% 4) 1%
26. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ ఎక్కడ ఉంది?
 1) హైదరాబాద్ 2) కోల్‌కతా
 3) దిల్లీ 4) బెంగళూరు
27. భారతదేశంలో ఏ సంవత్సరంలో సంభవించిన తుపాను వల్ల 3 లక్షల మందికి పైగా మరణించారు?
 1) 1839, నవంబరు 25
 2) 1849, నవంబరు 25
 3) 1859, నవంబరు 25
 4) 1869, నవంబరు 25
28. భారత భూవైశాల్యంలో ఎంత శాతం భూభాగంలో వరదలు రావడానికి అవకాశం ఉంది?
 1) 18% 2) 16% 3) 14% 4) 12%
29. భారత్‌లో ఏ తీరప్రాంతం సునామీలకు అనువుగా ఉంది?
 1) పశ్చిమ తీరం 2) కథియావర్ తీరం
 3) తూర్పు తీరం 4) కొంకణ్ తీరం
30. హిరోషిమా నగరంపై జారవిడిచిన అణుబాంబు పేరు?
 1) ఎనోలాగ్
 2) ఫ్యాట్ మ్యాన్
 3) లిటిల్ బాయ్
 4) ఏదీకాదు



31. హైడ్రోజన్ బాంబులో జరిగే చర్య ఏది?
 1) కేంద్రక విచ్ఛిత్తి చర్య
 2) కేంద్రక పరివర్తన చర్య
 3) కేంద్రక సంకరీకరణ చర్య
 4) కేంద్రక సంలీన చర్య
32. అంతర్జాతీయ సునామీ సమాచార కేంద్రం ఎక్కడ ఉంది?
 1) హోనలులు 2) ఫిలిప్పీన్స్
 3) జపాన్ 4) జెనీవా
33. సౌత్ ఏషియన్ డిజాస్టర్ నాలెడ్జ్ వర్క్ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
 1) జెనీవా 2) దిల్లీ
 3) జొహన్నెస్ బర్గ్ 4) లండన్
34. భారత భూ వైశాల్యంలో ఎంత శాతం భూభాగంలో తుపాన్లకు గురయ్యే ప్రమాదం ఉంది?
 1) 6% 2) 8%
 3) 10% 4) 12%
35. రసాయనిక వైపరీత్యాలు ఏవిధంగా సంభవిస్తాయి?
 1) ప్రకృతి వైపరీత్యాలు
 2) మానవకారక వైపరీత్యాలు
 3) 1, 2 4) ఏదీకాదు
36. అణుబాంబులో జరిగే చర్య ఏది?
 1) కేంద్రక విచ్ఛిత్తి 2) కేంద్రక పరివర్తన
 3) కేంద్రక సంలీనం 4) కేంద్రక సంకరీకరణం
37. హిరోషిమా నగరంపై అణుబాంబు దాడి ఎప్పుడు జరిగింది?
 1) 1945, ఆగస్టు 3 2) 1944, ఆగస్టు 3
 3) 1934, ఆగస్టు 6 4) 1944, ఆగస్టు 6
38. హిరోషిమాపై అణుబాంబు వేసిన బి–29 లాంజర్ విమానం?
 1) ఎనోలాగ్ 2) ఫ్యాట్ మ్యాన్
 3) లిటిల్ బాయ్ 4) ఏదీకాదు
39. మానవకారక విపత్తులు ఎన్ని రకాలు?
 1) 5 2) 4
 3) 3 4) 2
40. అణుధార్మికతను వేటిలో లెక్కగడతారు?
 1) బారెల్ 2) మైక్రాన్
 3) టన్స్ 4) సీవర్
41. అణుప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలు ఏవి?
 1) పేలుడు వైపు చూడకూడదు
 2) నీరు, ఆహార పదార్థాలను కప్పి ఉంచాలి
 3) కిటికీలు, తలుపులు వేసి ఇంట్లోనే ఉండాలి
 4) పైవన్నీ
42. రేడియోధార్మిక పేలుడు పదార్థాలను ఏమంటారు?
 1) డర్టీ బాంబ్/బ్యాక్‌ప్యాక్ బాంబ్
 2) వయొలెంట్ బాంబ్
 3) పొల్యూట్ బాంబ్
 4) డిస్ట్రక్టివ్ బాంబ్

సమాధానాలు

1-1; 2-2; 3-2; 4-3; 5-4; 6-2; 7-4; 8-1; 9-2; 10-3; 11-1; 12-4; 13-3; 14-1; 15-4; 16-2; 17-2; 18-4; 19-4; 20-1; 21-2; 22-4; 23-4; 24-3; 25-3; 26-3; 27-1; 28-4; 29-3; 30-3; 31-4; 32-1; 33-2; 34-2; 35-2; 36-1; 37-3; 38-1; 39-4; 40-4; 41-4; 42-1.

3 కేసుల్లో సుప్రీంకోర్టుకు సంకట స్థితి!

- జస్టిస్ పార్దీవాలా నేతృత్వంలో ఇచ్చిన తీర్పుల్లో సీజేఐ జోక్యం చేసుకునే వరకూ పరిస్థితి



జస్టిస్ బి.ఆర్.గవాయ్

దిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు.. నెల రోజుల్లోనే 3 కేసుల్లో సంకట స్థితిని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ 3 కేసుల్లోనూ తీర్పులిచ్చింది జస్టిస్ జంశెద్ బుర్జోర్ పార్దీవాలా (జె.బి.పార్దీవాలా) నేతృత్వంలోని ధర్మాసనమే కావడం గమనార్హం. చివరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ వాటిలో జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. తీర్పులను సవరించాల్సిన పరిస్థితి తలెత్తింది.

1. అలహాబాద్ హైకోర్టుపై..

2028 మేలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి రెండేళ్లపాటు కొనసాగనున్న జస్టిస్ జె.బి.పార్దీవాలా.. అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ తీరును తప్పుబడుతూ ఈ నెల 4వ తేదీన తీర్పు చెప్పారు. సివిల్ కేసులో క్రిమినల్ ప్రొసీడింగ్స్‌కు ఆయన అనుమతి ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. అంతేకాకుండా పదవీ విరమణ చేసే వరకూ జస్టిస్ ప్రశాంత్ కుమార్‌కు ఎటువంటి క్రిమినల్ కేసుల విచారణ బాధ్యతలను అప్పగించవద్దని ఆదేశించారు. ఈ ధర్మాసనంలో మరో న్యాయమూర్తి జస్టిస్ ఆర్.మహదేవన్. ఈ తీర్పుపై అలహాబాద్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు సంపూర్ణ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి ఈ తీర్పును సమీక్షించాలని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్‌కు 13 మంది న్యాయమూర్తులు విజ్ఞప్తి చేశారు. దీంతో తీర్పును సమీక్షించుకోవాలని జస్టిస్ పార్దీవాలాకు సీజేఐ సూచించారు. ఈ నేపథ్యంలో జస్టిస్ ప్రశాంత్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలను నెల 8వ తేదీన జస్టిస్ పార్దీవాలా తొలగించారు. తన ఉద్దేశం జస్టిస్ ప్రశాంత్ కుమార్‌ను ఇబ్బందిపెట్టడం కాదని వివరణ ఇచ్చారు.



2. వీధి కుక్కలపై..

దిల్లీలో వీధి కుక్కలపై జస్టిస్ పార్దీవాలా నేతృత్వంలోని ధర్మాసనం ఈ నెల 11వ తేదీన ఇచ్చిన తీర్పు మరో సంకట స్థితిని కల్పించింది. నగరంలో వీధి కుక్కలు కరవడం వల్ల పలువురు రేబిస్ వ్యాధి బారిన పడుతున్నారని, చిన్న పిల్లలకు ఇవి అత్యంత ప్రమాదకరంగా మారాయని దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం.. వాటిని 8 వారాల్లోగా షెల్టర్లకు తరలించాలని ఆదేశించింది. ఈ తీర్పును జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విమర్శించారు. ఒత్తిడి తీవ్రం కావడంతో సీజేఐ జస్టిస్ గవాయ్ జోక్యం చేసుకుని.. కేసును జస్టిస్ విక్రం నాథ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి బదిలీ చేయాల్సి వచ్చింది. ఈ నెల 13వ తేదీన ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో 22వ తేదీన విచారణ జరిపిన ధర్మాసనం.. తీర్పును సవరిస్తూ వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ చేయాలని, టీకాలు వేసి వదిలేయాలని, పిచ్చి కుక్కలనే షెల్టర్లకు తరలించాలని ఆదేశాలిచ్చింది.

3. హిమాచల్ ప్రదేశ్‌పై..

పర్యావరణ అసమతుల్యత కారణంగా హిమాచల్ ప్రదేశ్ దేశ మ్యాప్ నుంచి త్వరలో అదృశ్యం అవుతుందని జస్టిస్ పార్దీవాలా నేతృత్వంలోని ధర్మాసనం.. జులై 28వ తేదీన ఇచ్చిన తీర్పులో ఆందోళన వ్యక్తం చేసింది. పర్యావరణాన్ని పణంగా పెట్టి ఆదాయం సంపాదించడం ఎంత మాత్రం సమంజసం కాదని స్పష్టం చేసింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే హిమాచల్ ప్రదేశ్ అదృశ్యానికి ఎంతో కాలం పట్టదని పేర్కొంది. ఈ తీర్పుపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆందోళన వ్యక్తమైంది. దీంతో ఈ కేసును జస్టిస్ విక్రం నాథ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనానికి సీజేఐ బదిలీ చేశారు.

డిప్యూటీ ఎన్ఎస్ఏగా అనీశ్ దయాళ్ నియామకం



దిల్లీ: డిప్యూటీ జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ)గా సీఆర్పీఎఫ్ మాజీ డైరెక్టర్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ అనీశ్ దయాళ్ సింగ్ నియమితులయ్యారు. ఈశాన్య రాష్ట్రాల్లో వేర్పాటువాదం, నక్సల్స్ సమస్య, జమ్మూకశ్మీర్ వ్యవహారాలు సహా దేశ అంతర్గత భద్రతా సంబంధించిన విషయాలను అనీశ్ పర్యవేక్షిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. మణిపుర్ కేడర్‌కు చెందిన 1998 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన అనీశ్ గతేడాది డిసెంబరులో పదవీ విరమణ చేశారు. సీఆర్పీఎఫ్‌కు డైరెక్టర్‌గా పనిచేయడానికి, ఐటీబీపీకి నాయకత్వం వహించడానికి ముందు ఆయన ఇంటెలిజెన్స్ బ్యూరోలో దాదాపు 30 ఏళ్లు పనిచేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలు, జమ్మూకశ్మీర్‌లో జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికల సమయంలో భద్రతను నిర్వహించడంలో సీఆర్పీఎఫ్ పాత్రను ఆయన పర్యవేక్షించారు. ప్రస్తుతం రా మాజీ చీఫ్ రాజేందర్ ఖన్నా అదనపు ఎన్ఎస్ఏగా, ఐపీఎస్ అధికారి టి.వి.రవిచంద్రన్, ఐఎఫ్ఎస్ మాజీ అధికారి పవన్ కపూర్‌లు డిప్యూటీ ఎన్ఎస్ఏలుగా సేవలందిస్తున్నారు.

2 నెలల్లో మాగాణి సరిహద్దులను గుర్తించండి

- రాష్ట్రాలకు సుప్రీం కోర్టు ఆదేశం
- సర్వే విభాగాలు నత్తను తలపిస్తున్నాయని అసంతృప్తి

దిల్లీ: రాష్ట్రాల మాగాణి సర్వే విభాగాలు నత్తను తలపిస్తున్నాయని సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. వేగం పెంచి 2 నెలల్లోగా సరిహద్దులను గుర్తించాలని ఆదేశించింది. సర్వే విభాగాల పనితీరు దయనీయంగా ఉందని, ఆదేశిస్తున్నా సత్వర ఫలితాలు రావడం లేదని వ్యాఖ్యానించింది. 'ఎట్టి పరిస్థితుల్లోనూ 2 నెలల్లోగా సరిహద్దుల గుర్తింపును పూర్తి చేయాలని ఆదేశిస్తున్నాం. ఈ విషయంలో ఏమైనా జాప్యం జరిగితే రాష్ట్రాల పర్యావరణ, జీవావరణ కార్యదర్శులు.. తదుపరి జరిగే విచారణ రోజున వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుంది' అని ధర్మాసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను అక్టోబరు 7న తేదీకి వాయిదా వేసింది.

దిల్లీ విమానాశ్రయంలో రూ.25 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

దిల్లీ: బ్యాంకాక్ నుంచి దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఓ ప్రయాణికుడి వద్ద రూ.25 కోట్ల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ విభాగం ఆదివారం తెలిపింది. ఈ నెల 21న బ్యాంకాక్ నుంచి సింగపూర్ మీదుగా దిల్లీకి చేరుకున్న ఓ భారతీయుడిని అధికారులు అడ్డుకొని అతడి లగేజీని తనిఖీ చేశారు. అందులో ఆకుపచ్చ రంగు మాదకద్రవ్యమున్న 25 పాలిథిన్ ప్యాకెట్లను గుర్తించారు. మొత్తం రూ.25 కోట్ల విలువ చేసే 24,814 గ్రాముల గంజాయిని జప్తు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎక్స్ లో పేర్కొన్నారు.



బిహార్‌లోని పూర్ణియా జిల్లాలో కొనసాగుతున్న ఓటర్ అధికార్ యాత్రలో భాగంగా ఆదివారం ఓ చాయ్‌వాలాతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ


గృహ నిర్బంధంలో చంపయీ సోరెన్

రాంచీ: ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, భాజపా నేత చంపయీ సోరెన్‌ను ఆదివారం గృహ నిర్బంధంలో ఉంచారు. "ప్రభుత్వ అధీనంలోని బహుళవైద్య ఆరోగ్య సంస్థ భూసేకరణకు వ్యతిరేకంగా గిరిజన సంఘాలు నిరసనలు చేపట్టాయి. ఈ ఆందోళనలకు భాజపా నేత చంపాయీ సోరెన్ మద్దతు ఇస్తున్నారు. ఆయన కూడా ఈ నిరసనల్లో పాల్గొనే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని శాంతి భద్రతల సమస్యలను నివారించడానికి సోరెన్‌ను గృహ నిర్బంధంలో ఉంచాం" అని రాంచీ డీఎస్పీ కె.వి రామన్ తెలిపారు. ఆయన కుమారుడు బాబులాల్ సోరెన్‌తో పాటు పలువురు అనుచరులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆత్మనిర్భర ప్రస్థానంలో గగన్‌యాన్ ఓ అధ్యాయం

- రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్య

దిల్లీ: భారత్ చేపట్టబోయే మానవసహిత అంతరిక్ష యాత్ర గగన్‌యాన్.. 'ఆత్మనిర్భర్ భారత్' సాధన దిశగా చేపడుతున్న ప్రయాణంలో కొత్త అధ్యాయమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆ యాత్ర కోసం ఎంపికైన శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములను దేశ ఆణిముత్యాలుగా, మార్గదర్శకులుగా అభివర్ణించారు. ఆదివారం ఇక్కడ వైమానిక దళం ఆధ్వర్యంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన నలుగురు వ్యోమగాములను సత్కరించారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా శుక్లా.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) విజయవంతంగా వెళ్లి వచ్చిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. "అంతరిక్షాన్ని పరిశోధన రంగంగానే కాకుండా ఆర్థిక వ్యవస్థ, భద్రత, ఇంధనం, మానవాళి భవితగా కూడా చూస్తున్నాం" అని పేర్కొన్నారు. చంద్రుడి నుంచి అంగారకుడి వరకూ భారత ఉనికిని చాటామన్నారు. గగన్‌యాన్ వంటి మిషన్లకు దేశం పూర్తి సన్నద్ధతతో ఉందని చెప్పారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి రోదసి శక్తుల సరసన మన దేశం నిలుస్తుందన్నారు. వ్యోమగాముల శిక్షణలో బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ సంస్థ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. రెండున్నరేళ్ల శిక్షణను రెండున్నర నెలల్లోనే శుక్లా పూర్తి చేసుకున్నారని, ఇది భారతీయుల అంకితభావం, పట్టుదలకు నిదర్శనమన్నారు. మన దేశం నుంచి అంతరిక్షంలోకి వెళ్లి.. పెసలు, మెంతులు వంటి వాటిని పండిస్తారని తానెప్పుడూ ఊహించలేదని చెప్పారు. వ్యవసాయ ఆధారిత దేశమైన భారత్‌కు చెందిన శుభాంశు అంతరిక్షంలో రైతుగా మారారని అన్నారు.



దిల్లీలో జరిగిన కార్యక్రమంలో వ్యోమగామి శుభాంశు శుక్లాను సత్కరిస్తున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ✦ గగన్‌యాత్రికుల సత్కార కార్యక్రమం సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తున్న శుభాంశు శుక్లా

2027లో చేపట్టబోయే గగన్‌యాన్ కింద ముగ్గురు వ్యోమగాములను 400 కిలోమీటర్ల ఎత్తులోని కక్ష్యలోకి భారత్ పంపబోతోంది. దీనికోసం శుక్లా, ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అజీత్ కృష్ణన్, అంగద్ ప్రతాప్‌లు ఎంపికైన సంగతి తెలిసిందే.

ఇదిగో హైదరాబాద్..

భారత వాయుసేన నేర్పిన మెలకువల వల్లే తాను అంతరిక్ష యాత్రకు వెళ్లగలిగానని ఈ కార్యక్రమంలో శుభాంశు శుక్లా పేర్కొన్నారు. తన జీవితంలో ముఖ్యమైన గురువులు ఐఏఎఫ్, కాక్‌పిట్ మాత్రమేనన్నారు. భారత్ చేపట్టనున్న గగన్‌యాన్ ప్రాజెక్టుపై ప్రపంచం మొత్తం ఆసక్తి కనబరుస్తోందని.. చాలామంది శాస్త్రవేత్తలు ఇందులో భాగం కావడానికి ఆసక్తి చూపిస్తున్నారన్నారు. అంతరిక్షం నుంచి భారత్ అందంగా కనిపించిందని గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలోని ప్రత్యేక స్థానంలో, విశిష్ట ఆకారంలో ఉన్నందువల్లే మన దేశం అలా కనిపించి ఉండొచ్చని తెలిపారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోని ఏ వ్యోమగామిని అడిగినా ఈ విషయాన్నే చెబుతారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకించి రాత్రి సమయంలో హిందు మహాసముద్ర మార్గంలో దక్షిణ దిశ నుంచి ఉత్తర దిశకు ఐఎస్ఎస్ వెళ్లేటప్పుడు, భారత్ చాలా అద్భుతంగా కనిపిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన.. రోదసిలో తాను రికార్డు చేసిన వీడియోను ప్రదర్శించారు. వెలుగులు చిమ్ముతున్న రెండు ప్రాంతాలను చూపుతూ.. వాటిని హైదరాబాద్, బెంగళూరు నగరాలని తెలిపారు. కక్ష్యలో ఉన్నప్పుడు రోజుకు 16సార్లు సూర్యోదయాలు, సూర్యాస్తమయాలను చూడొచ్చని చెప్పారు. అయినా ఒక్కసారి కూడా బోర్ కొట్టదన్నారు. తాను చిన్నతనంలో సిగ్గరినని, ఇతరులతో అంటీముట్టనట్లుగా ఉండేవాడినని చెప్పారు. భారత తొలి వ్యోమగామి రాకేశ్ శర్మ అంతరిక్ష యాత్ర గురించి వింటూ పెరిగానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించారు.



యాంటీ ఎయిర్ క్రాఫ్ట్ క్షిపణుల పరీక్షలను పరిశీలిస్తున్న ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్

క్షిపణి పరీక్షలు నిర్వహించిన ఉత్తర కొరియా

సియోల్: దక్షిణ కొరియా, అమెరికా సంయుక్తంగా సైనిక విన్యాసాలు చేపడుతున్న వేళ.. ఉత్తర కొరియా రెండు గగనతల రక్షణ క్షిపణి పరీక్షలను శనివారం నిర్వహించింది. ఈ విషయాన్ని ఆ దేశ అధికారిక వార్తా సంస్థ కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. డ్రోన్లు, క్రూజ్ క్షిపణులను ఈ నూతన వ్యవస్థలు సమర్థంగా అడ్డుకోగలవని నిరూపితమైందని తెలిపింది. ఎక్కడ పరీక్షించారన్న విషయాన్ని వెల్లడించలేదు. అయితే ఈ క్షిపణుల్లో ప్రత్యేక సాంకేతికతను వాడినట్లు తెలిపింది. ఉత్తర కొరియాకు రష్యా సాంకేతిక సహకారం అందిస్తోందని అమెరికా, దక్షిణ కొరియాలు ఆరోపిస్తున్న వేళ వీటిని ప్రయోగించడం గమనార్హం. ఈ ప్రయోగాన్ని ఆ దేశ అధినేత కిమ్ జోంగ్ ఉన్ దగ్గరుండి పర్యవేక్షించారు.

అమెరికా డిమాండ్లకు తలొగ్గం: ఖమేనీ

ఇంటర్నెట్ డెస్క్: అమెరికాపై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరోసారి మండిపడ్డారు. తమను లొంగదీసుకోవడానికి అమెరికా ప్రయత్నాలు చేస్తోందని, దీనిని ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా పోరాడదామని భాగస్వామ్య పక్షాలకు పిలుపునిచ్చారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అమెరికాకు తలొగ్గే ప్రసక్తే లేదని అయతొల్లా స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి అధికారిక వెబ్‌సైట్‌లో ఓ ప్రకటన చేశారు. జూన్‌లో తమ అణు కేంద్రాలు లక్ష్యంగా ఇజ్రాయెల్, అమెరికాలు దాడి చేయడం ప్రతీకార చర్యను ప్రేరేపించిందన్నారు. టెహ్రాన్‌ను అస్థిరపరిచేందుకే అమెరికా ప్రణాళిక రూపొందించిందని ఖమేనీ ఆరోపించారు. ఇటీవల యుద్ధం ప్రారంభంలో.. ఇజ్రాయెల్ దాడి చేసిన మరుసటి రోజు అమెరికన్ ఏజెంట్లు యూరప్‌లో భేటీ అయ్యారని, ఇరాన్‌ను తదుపరి ఏ ప్రభుత్వం పాలించాలి అనే విషయంపై చర్చించారని అన్నారు. అంతిమంగా ఇరాన్ విధేయతగా ఉండాలని అమెరికా కోరుకుంటోందని చెప్పారు. ఇజ్రాయెల్ దాడిని ప్రస్తావించిన ఆయన.. ప్రభుత్వం సహా ఇరాన్ మొత్తం తమ సైన్యానికి అండగా నిలబడిందన్నారు. ఈ క్రమంలో శత్రువులను దెబ్బతీశామన్నారు. అంతర్గత విభేదాలపై హెచ్చరించిన ఆయన.. విదేశీ శక్తులు రెచ్చగొడుతున్నాయన్నారు.

దుస్తుల బజార్ షెహన్‌షా

- ఆసియాలోనే అతిపెద్దదిగా దిల్లీ 'గాంధీనగర్ రెడీమేడ్ వస్త్ర మార్కెట్'
- 15 వేల దుకాణాల్లో రోజూ రూ.50 కోట్ల విక్రయాలు
- దేశ, విదేశాల నుంచి భారీ ఆర్డర్లు

దిల్లీ: ఆసియా ఖండంలోని అతిపెద్ద రెడీమేడ్ దుస్తుల మార్కెట్ మన దేశంలోనే ఉంది. ఇక్కడ నుంచి నిత్యం వివిధ ఆసియా, ఐరోపా దేశాలకు దుస్తులు ఎగుమతి అవుతుంటాయి. ప్రత్యేకించి శీతాకాలం, వేసవి కాలంలో ధరించే దుస్తుల కోసం ఈ బజార్‌లోని 15 వేలకు పైగా దుకాణాలకు పెద్దఎత్తున విదేశాల నుంచి ఆర్డర్లు వస్తుంటాయి. ఇక భారత్‌లోని వివిధ రాష్ట్రాల వ్యాపారులు వచ్చి ఇక్కడ పెద్దఎత్తున వస్త్ర ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంటారు. హోల్‌సేల్, రిటైల్‌లో ప్రతిరోజు రూ.50 కోట్లకుపైగా విక్రయాలు జరుగుతుంటాయి. అదే దేశ రాజధాని దిల్లీలోని 'గాంధీనగర్ హోల్‌సేల్, రిటైల్ రెడీమేడ్ దుస్తుల మార్కెట్'. ఇది ఏర్పాటై 55 ఏళ్లు గడిచిపోయాయి. ఈ మార్కెట్‌లోని వ్యాపారులు ఏర్పాటు చేసిన మొదటి మార్కెట్ అసోసియేషన్ కూడా ఈ నెల 22న (శుక్రవారం) 50 సంవత్సరాలను పూర్తి చేసుకుంది. ఇంతకీ గాంధీనగర్ మార్కెట్ ఎలా ప్రారంభమైంది ? ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్‌గా ఎలా విస్తరించింది ? ఈ కథనంలో తెలుసుకుందాం.

1970లో ఇలా మొదలైంది!

దిల్లీలోని గాంధీనగర్ ఏరియాకు చెందిన చాలా కుటుంబాలు కుట్టుపని, ఎంబ్రాయిడరీ వర్క్‌ను తరతరాలుగా చేస్తున్నాయి. అయితే ఇందుకు నాంది పడింది మాత్రం 1970 సంవత్సరంలోనే. ఆ ఏడాది గాంధీనగర్ ఏరియాలోని ఇళ్లలో కుట్టుపని చేయడం, ఎంబ్రాయిడరీ వర్క్ చేయడం గణనీయంగా పెరిగింది. దేశ విభజన సమయంలో పాకిస్థాన్ నుంచి భారత్‌కు వచ్చేసిన చాలా మంది పంజాబీలు, సిక్కు వర్గీయులు దిల్లీలోని గాంధీనగర్ ఏరియాలోనే స్థిరపడ్డారు. వారంతా పాక్‌లో ఉండగా రెడీమేడ్ దుస్తుల తయారీ కంపెనీల్లో, వస్త్ర కర్మాగారాల్లో పనిచేసేవారు. గాంధీనగర్ ఏరియాలోనూ వారు రెడీమేడ్ దుస్తుల తయారీ పనినే చేయసాగారు. కాలక్రమంలో గుజరాత్ వంటి వస్త్ర కేంద్రం నుంచి కూడా తయారీ నిపుణులు ఇచ్చి గాంధీనగర్ దుస్తుల మార్కెట్‌లో చోటును సంపాదించుకున్నారు.

ఫుట్‌పాత్‌పై నుంచి షోరూంల స్థాయికి

1970వ దశకం తొలినాళ్లలో గాంధీనగర్ ప్రజలు తాము తయారు చేసే దుస్తులను ఫుట్‌పాత్‌పై, ఇళ్ల ఎదుట ఉంచి విక్రయించేవారు. క్రమంగా అమ్మకాలు పెరిగాయి. దీంతో వారు చిన్నపాటి కుట్టు యంత్రాలను కొనుగోలు చేసి.. ఇళ్లలోనే దుస్తుల తయారీని పెంచారు. విక్రయాలు మరింతగా పెరగడంతో, 1985 సంవత్సరం తొలినాళ్లలో దిల్లీలోని వివిధ ప్రదేశాల్లో దుకాణాలను ఏర్పాటు చేయడం మొదలుపెట్టారు. ఆ తర్వాత వివిధ రాష్ట్రాల వ్యాపారులు భారీగా ఆర్డర్లు ఇస్తుండడంతో గాంధీనగర్ మార్కెట్ వ్యాపారుల దశ తిరిగింది. విదేశాల నుంచి కూడా ఇక్కడి వ్యాపారులకు ఆర్డర్లు మొదలయ్యాయి. ఫలితంగా అప్పటివరకు అశోక్ గల్లీ (అశోక్ బజార్)కే పరిమితమైన గాంధీనగర్ మార్కెట్ విస్తరించింది. ఆర్య సమాజ్ గల్లీ, జనతా గల్లీ, నెహ్రూ గల్లీ, దుర్గా మందిర్ వాలీ గల్లీ, ముఖర్జీ గల్లీ, మహావీర్ గల్లీ, గురు నానక్ గల్లీ, దుర్గా గల్లీలలోనూ రెడీమేడ్ దుస్తుల తయారీ కర్మాగారాలతో పాటు విక్రయ కేంద్రాలు వెలిశాయి. కాలక్రమంలో ఈ ఏరియాల్లోని పెద్ద దుకాణాలు షోరూంలుగా రూపాంతరం చెందాయి. రాంనగర్ మార్కెట్, సుభాష్ రోడ్‌లోని మార్కెట్‌లోనూ దుకాణాల సంఖ్య బాగా పెరిగింది.



ఏయే వెరైటీల దుస్తులు లభిస్తాయి ?

గాంధీనగర్ మార్కెట్‌లో తయారయ్యే దుస్తులు ఐరోపా దేశాల్లోనూ బాగా అమ్ముడవుతాయి. నాణ్యంగా ఉండటంతో పాటు ధర తక్కువ కావడంతో వాటిని ఐరోపా దేశాల్లో ఉండే దిగువ మధ్య తరగతి వర్గం ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. ఫ్యాన్సీ, డిజైనర్, ఫార్మల్ నుంచి మొదలుకొని అన్ని రకాల ఎంబ్రాయిడరీ దుస్తులను తయారు చేసే యూనిట్లు ఈ మార్కెట్ పరిధిలో ఉన్నాయి. జీన్స్, టీ షర్టులు, షర్టులు, పిల్లల దుస్తులు వివిధ వెరైటీల్లో ఇక్కడ లభిస్తాయి.

పాఠశాలలో అగ్నిప్రమాదం.. 8 ఏళ్ల విద్యార్థి మృతి

- అరుణాచల్‌ప్రదేశ్‌లో ఘటన

ఈటానగర్: అరుణాచల్‌ప్రదేశ్‌లోని శి-యోమీ జిల్లాలోని ఓ పాఠశాలలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో మూడో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి సజీవదహనం అయ్యాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. పాపిక్రుంగ్ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలోని బాలుర వసతిగృహంలో ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకున్నారు. మృతుడు చాంగో గ్రామానికి చెందిన తాశీ జెంపన్(8)గా గుర్తించారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రికి తరలించినట్లుగా పోలీసులు తెలిపారు.



సీఐఎస్ఎఫ్‌లో తొలి మహిళా కమాండోల బృందం

దిల్లీ: ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాల నిర్వహణకు ప్రత్యేకంగా మహిళా కమాండోల బృందాన్ని ఏర్పాటు చేయాలని 'కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం' (సీఐఎస్ఎఫ్) నిర్ణయించింది. 'విమానయాన భద్రత బృందం' (ఏఎస్‌జీ) నుంచి 100 మంది మహిళలను తొలివిడతగా శిక్షణకు ఎంపిక చేశారు. మధ్యప్రదేశ్‌లోని బర్వాహాలో వీరికి శిక్షణ మొదలైంది. ఎనిమిది వారాలపాటు ఇచ్చే శిక్షణతో వీరు 'సత్వర ప్రతిస్పందన బృందం' (క్యూఆర్‌టీ), ప్రత్యేక కార్యదళం (ఎస్‌టీఎఫ్)లో సేవలకు సన్నద్ధమవుతారు. దేహదారుఢ్యం మెరుగుపరచుకోవడం, ఆయుధాల వాడకం, ఒత్తిడితో కూడిన వాతావరణంలో పనిచేయడం, అడ్డంకుల్ని అధిగమించడం, అడవుల్లో కూడా సేవలు అందించగలడం వంటి అంశాలతో పాటు ప్రతికూల పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకోవడం గురించి వీరికి శిక్షణ ఉంటుంది. సీఐఎస్ఎఫ్‌లో 12,491 మంది మహిళలు ఉన్నారు.


జరిమానాలు సిద్ధం.. జాగ్రత్త బ్రో!

- పర్యాటకులు నిబంధనలు పాటించాలంటున్న ఇటలీ
- లేదంటే భారీ వడ్డింపులు తప్పవంటూ హెచ్చరిక
- స్థానికుల ఫిర్యాదుతో తాజా నిర్ణయం

వెనీస్: తమ దేశంలో విహారయాత్రకు వచ్చే పర్యాటకులు నిబంధనల పక్కా పాటించాలని ఇటలీ తాజాగా స్పష్టం చేసింది. లేదంటే భారీ మొత్తంలో జరిమానాలు ఎదుర్కోవలసి వస్తుందని పేర్కొంటోంది. ప్రపంచంలో పర్యాటకులు ఎక్కువగా వెళ్లే దేశాల్లో ఇటలీ ఒక్కటి. ముఖ్యంగా అక్కడి వెనీస్ నగరాన్ని చూసేందుకు ఆసక్తి చూపుతుంటారు. అయితే, చెత్తా, చెదారం ఎక్కడపడితే అక్కడ పడేసే..విచ్చలవిడిగా ప్రవర్తించే పర్యాటకుల తీరుపై స్థానిక ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉంటున్నారు. అధికారులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులూ చేశారు. దీంతో స్థానిక ప్రభుత్వ అధికారులు కఠిన నిర్ణయం తీసుకున్నారు. పర్యాటకులు నిబంధనలు ఉల్లంఘిస్తే దాదాపు రూ.35వేల వరకు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. ఆ వివరాలు..

✦ పర్యాటక ప్రాంతాల్లో నేలపై కూర్చొని తినడం, తాగడం చేస్తే 100-200 యూరోలు (రూ.10వేల నుంచి రూ.20వేల వరకు)

✦ నగరంలోని కాలువల్లో స్నానం, డైవింగ్, స్విమ్మింగ్ చేస్తే 350 యూరోలు (సుమారు రూ. 35వేలు)



✦ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, ఉమ్మివేయడం చేస్తే 350 యూరోలు (సుమారు రూ. 35వేలు)

✦ బహిరంగ ప్రదేశాల్లో చొక్కా/టాప్ విప్పేసి తిరగడం, స్విమ్ సూట్ ధరించడం చేస్తే 250 యూరోలు (సుమారు రూ.25వేలు) జరిమానా విధించనున్నట్లు వెనీస్ అధికారులు తెలిపారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ.. స్థానికులను ఇబ్బంది పెట్టకుండా ప్రవర్తించాలని పర్యాటకులను స్థానిక ప్రభుత్వం కోరుతోంది.

పోర్చుగల్, స్పెయిన్‌లో రూ.లక్షల్లో..

ఇటలీలోనే కాదు.. పోర్చుగల్, స్పెయిన్ దేశాలు కూడా నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.లక్షల్లో జరిమానా విధిస్తున్నాయి. పోర్చుగల్‌లోని అల్బుఫీరా నగరంలో బీచ్‌లో కాకుండా బయట స్విమ్‌సూట్‌లో కనిపిస్తే రూ. 1.50లక్షలకు పైగా జరిమానా విధిస్తోంది. స్పెయిన్‌లోని బలియరిక్ ఐలాండ్స్‌లో బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవిస్తే రూ. 3 లక్షలకుపైగా జరిమానా పడుతుంది.

భారత్ జలాల్లోకి పాక్ జాలర్లు

భుజ్ (గుజరాత్): భారత సరిహద్దు జలాల్లోకి అక్రమంగా చొరబడిన 15 మంది పాకిస్థాన్ జాలర్లను గుజరాత్‌లోని కచ్ జిల్లాలో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అదుపులోకి తీసుకుంది. వారు ప్రయాణిస్తున్న పడవను స్వాధీనం చేసుకున్నట్లు బీఎస్ఎఫ్ అధికారులు ఆదివారం తెలిపారు. మత్స్యకారులు పాక్‌లోని సింధ్ ప్రావిన్స్‌కు చెందిన వారిగా గుర్తించామన్నారు.

పాకిస్థాన్‌లో కుండపోత.. 11 మంది మృతి

పెషావర్: పాకిస్థాన్‌లోని ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రావిన్సులో భారీ వర్షాల కారణంగా ఆదివారం 11 మంది ప్రాణాలు కోల్పోయారు. 47 మంది గాయపడ్డారు. మరోవైపు పంజాబ్ ప్రావిన్సులో 24 గంటలుగా కురుస్తున్న కుండపోత వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. సింధు, చీనాబ్, రావి తదితర నదులు ఉప్పొంగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నదుల సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న సుమారు 20 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

బిగ్‌క్యాట్ అలయెన్స్‌లో చేరిన నేపాల్

కాఠ్‌మాండూ: భారత్ నేతృత్వంలో ఏర్పాటైన 'అంతర్జాతీయ వ్యాఘ్ర కూటమి' (ఐబీసీఏ)లో నేపాల్ అధికారికంగా చేరింది. పులి, సింహం, చిరుత, మంచు చిరుత, చీతా, జాగ్వార్, ప్యూమా (చారలు, మచ్చల్లేని పులి) లాంటి ఏడు రకాల పెద్ద పులుల సంరక్షణ కోసం భారత్ కృషి చేస్తుంది. నేపాల్ ఇందులో చేరడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా పెద్ద పులుల సంరక్షణకు సహకారం అందుతుందని ఐబీసీఏ శనివారం ప్రకటించింది.

జుట్టు పట్టి కొట్టి.. నిప్పుపెట్టి చంపారు

- అదనపు కట్నం కోసం భార్యపై భర్త, అత్తల ఘాతుకం
- కస్టడీ నుంచి పారిపోతున్న నిందితుడిపై పోలీసుల కాల్పులు



నిందితుణ్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నొయిడా: అదనపు కట్నం కోసం నిక్కీ అనే ఓ మహిళను ఆమె భర్త, అత్తామామలు చిత్రహింసలకు గురిచేసి నిప్పంటించారు. దీంతో తీవ్రగాయాలపాలైన బాధితురాలు ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయింది. గ్రేటర్ నోయిడాలో గురువారం జరిగిన ఈ దారుణ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిక్కీ భర్త, అత్త ఆమెను జుట్టు పట్టి లాగి కొడుతూ.. నిప్పంటించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి చూపరులను కలచివేస్తున్నాయి. నిక్కీ భర్త విపిన్, అత్త దయాను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. అయితే సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం విపిన్‌ను ఘటనా స్థలికి తీసుకెళ్తుండగా పారిపోవడానికి ప్రయత్నించడంతో పోలీసులు అతడి కాళ్లపై తుపాకీతో కాల్చి పట్టుకున్నారు.

2016లో నిక్కీ, ఆమె అక్క కంచన్‌ను సిర్సా ప్రాంతానికి చెందిన అన్నదమ్ములకు ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో కారు, విలువైన వస్తువులు ఇచ్చినప్పటికీ.. మరో రూ.36 లక్షలు అదనపు కట్నం ఇవ్వాలని అత్తామామలు తమను తరచూ వేధింపులకు గురిచేసేవారని మృతురాలి సోదరి పేర్కొంది. అమ్మను నాన్న, నానమ్మ తన ముందే కొట్టి నిప్పుపెట్టారని మృతురాలి ఆరేళ్ల కుమారుడు రోదిస్తూ చెప్పడం చూపరులను కంటతడి పెట్టించింది.